Dwaraka

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: శుద్ధ షష్ఠి మ. 12.35 వరకు, అనంతరం సప్తమి; నక్షత్రం: రేవతి తె. 5.00 వరకు, అనంతరం అశ్వని; అమృతకాలం: రా.2.35 నుండి 4.10 వరకు; వర్జ్యం: సా. 5.00 నుండి 6.36 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు;

ఆంధ్రప్రభ

Estd 1938

www prabhanews com

Journalism first!

సంపుటి:56 • సంచిక:282 • మంగళవారం 23 జనవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ఓట్ల పంట పండాలంటే అన్నదాతే దిక్కు



- వచ్చే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి వరాలు
- గిట్టుబాటు ధరల కోసం సరికొత్త పథకం అమలు
- ఎన్నికలు ముంచుకొస్తున్న రాష్ట్రాల్లో గ్రామీణ ఓటర్లే అధికం

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి ఒకటవ తేదీన పార్లమెంట్‌కు సమర్పించనున్న కేంద్ర బడ్జెట్ భారత్‌లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి కేంద్రీకరించనుంది. రానున్న బడ్జెట్ మోడీ ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైనది. ఎందుకంటే అది 2019 ఎన్నికల్లో ఆయనకు ఊపునివ్వడానికి, ప్రపంచంలో భారత్‌ను బలమైన శక్తిగా అవతరింపజేయడానికి మోడీ వేసుకున్న ప్రణాళికలకు ఊతమివ్వాల్సి ఉంది. దానిని సాధించే క్రమంలో కనెక్ట్ ఇండియా కోసం అరుణ్ జైట్లీ భారీ ప్రకటనలు చేసే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా మౌలిక 2వ పేజీలో...

- కొండగట్టు యాత్రకు విజయోస్తు!



పవన్ కల్యాణ్ నుదుట తిలకం దిద్దుతున్న సతీమణి

- రెండు రాష్ట్రాల్లో జనసేన పోటీ
- ప్రజాసమస్యలు అధ్యయనం చేస్తున్నాం
- ఆ తర్వాతే రాష్ట్ర సర్కార్‌కి సలహాలిస్తా
- ఘర్షణ రాజకీయాల జోలికెళ్లను
- కరీంనగర్‌లో పవన్

కష్టజీవి కేసీఆర్ స్మార్ట్ సీఎం

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా సుపరిపాలన

ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పవన్ ప్రశంసల జల్లు

- కొండగట్టు ఆంజనేయునికి పూజలు!



కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో: జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం ప్రజాయాత్ర తొలి రోజు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్మార్ట్ సీఎం అని అభివర్ణించారు. అంతే కాదు కష్టపడి పనిచేసే సీఎం అంటూ ప్రశంసించారు. ప్రజల ఆకాంక్షలకు దీటుగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. సోమవారం కొండగట్టు అంజన్నస్వామిని దర్శించుకున్న అనంతరం 3వ పేజీలో...

తెలంగాణ ప్రగతి ప్రపంచానికి చాటండి మీరే... మా రాయబారులు

జురిచ్‌లో తెలంగాణ ఎన్నారైలతో మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : బంగారు తెలంగాణ కల సాకారంలో ప్రవాస తెలంగాణ వాసులు కలిసి రావాలని రాష్ట్ర మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పాటు నాటి అయోమయ పరిస్థితి నుంచి ప్రభుత్వం అద్భుతమైన ప్రగతి దిశగా రాష్ట్రాన్ని తీసుకుపోతుందని ఆయన చెప్పారు. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ నగరంలో తెలంగాణ ఎన్ఐఆర్‌లు ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో సోమవారం మంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర విభజన నాటి పరిస్థితులు, ప్రస్తుతం రాష్ట్ర ప్రగతి, రాజకీయ స్థితిగతులు తదితర అంశాలపై మంత్రి సుదీర్ఘంగా ప్రసంగించారు.

15 ఏళ్ళ క్రితం ఏర్పాటైన రాష్ట్రాలు ఇంకా పూర్తిగా కుదురుకోలేని పరిస్థితుల్లో ఉంటే, తెలంగాణ మాత్రం మూడున్నరేళ్ళలోనే అనేక రంగాల్లో దేశానికి ఆదర్శవంతమైన విధానాలతో ముందుకు సాగుతోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షించిన లక్ష్యసాధన దిశగా ప్రయాణం మొదలైందని, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో బంగారు తెలంగాణ సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు వ్యతిరేకించిన వారే ఇప్పుడు అభినందనలు తెలుపుతున్నారని అన్నారు. పక్క రాష్ట్రంలో కూడా పార్టీ ఏర్పాటు చేయాలని అక్కడి నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయంటే ఇక్కడ పరిపాలన జనరంజకంగా సాగుతుందో అర్థమవుతోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాజకీయాలను ప్రస్తావిస్తూ, రాష్ట్రం విడిపోతే విద్యుత్ సమస్యలు వస్తాయని ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారని, కానీ ఇప్పుడు నిరంతర విద్యుత్ ఇచ్చే రాష్ట్రాల్లో తెలంగాణ నిలిచిందన్నారు. రైతాంగానికి 24 గంటల విద్యుత్ ఇస్తుంటే కూడా ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ పరిపాలనలో ప్రజల కనీస అవసరాలకు అదే విధంగా ప్రాధాన్యత ఇస్తున్నామని, హైదరాబాద్ నగరంలో ప్రజల కనీస అవసరాలు, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచే అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామని కేటీఆర్ చెప్పారు. మూడేళ్ళరేళ్ళలో సాధించిన ప్రగతిని దశదిశలా చాటేందుకు తెలంగాణ ఎన్ఆర్ఐలు కలిసి రావాలని కోరారు. ప్రతి తెలంగాణ ప్రవాస భారతీయులు రాష్ట్రానికి ఒక గుడ్‌విల్ అంబాసిడర్‌లాగా, బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండాలని ఆయన సూచించారు. రాష్ట్రాన్ని విదేశాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు పరిచయం చేసేందుకు ఆసక్తిగల పారిశ్రామికవేత్తలను ప్రభుత్వంతో అనుసంధానం 2వ పేజీలో...



దావోస్: స్విస్ అధ్యక్షుడు ఎలెన్ బర్సెట్‌తో ప్రధాని మోడీ దౌత్య భేటీ

11

దావోస్‌లో భారతీయం

- జురిచ్‌లో ప్రధాని మోడీకి ఘనస్వాగతం
- భారత దౌత్య కార్యాలయంలో 300మంది సీఈవోలకు మోడీ విందు
- ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు హాజరు
- తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్, ఏపీ సీఎం చంద్రబాబు కూడా దావోస్‌లోనే

ఉప ఎన్నికలకు రెడీ

పిటిషన్లు కొట్టివేస్తే ఎన్నికలకు సై

హైకోర్టులో పిటిషన్ ఉపసంహరణ

అవసరమైతే సుప్రీంకు వెళతాం: కేజ్రీవాల్



11

భారత్ లాడెన్ అరెస్ట్

గుజరాత్ పేలుళ్ల సూత్రధారి

పదేళ్లపాటు అజ్ఞాతవాసంలో ఖురేషి

సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ నుంచి ఉగ్రవాదిగా



11

షట్ డౌన్ ఎత్తివేత?

డెమొక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య కుదిరిన ఒప్పందం

- ఇమిగ్రేషన్‌పై చర్చకు అంగీకారం
- 81-18 ఓట్లతో వినిమయ బిల్లు ఆమోదం




11

కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా 10 మందికి పదోన్నతి

కేడర్‌కు అనువుగా అధికారుల పెంపు

7



ధనమంతా ఒక్కచోటే!



73% సంపద 1% గుప్పిట

- భారత్‌లో నానాటికీ పెరుగుతున్న అసమానతలు
- పేదలు మరింత పేదలుగా మారిపోతున్నారు
- ప్రపంచవ్యాప్తంగా ఇంచుమించు ఇదే పరిస్థితి
- 2017 సంపద సృష్టిపై ఆక్స్‌ఫామ్ సర్వే నివేదిక

దావోస్: భారత్‌లో పేదలు, ధనికుల మధ్య అంతరం నానాటికీ పెరుగుతోంది. పేదలు నిరుపేదలవుతుంటే, ధనికులు మరింత సంపన్నులుగా అవతరిస్తున్నారు అని ఆక్స్‌ఫామ్ ఇండియా సర్వే నివేదిక స్పష్టం చేసింది. భారత్‌లో సంపద ఎక్కువ భాగం అత్యంత ధనవంతులైన కొద్ది మంది వద్దే కేంద్రీకృతమై ఉందని ఆక్స్‌ఫామ్ వెల్లడించింది. గత ఏడాది భారత్‌లో జరిగిన సంపద సృష్టిలో 73శాతం కేవలం ఒక్క శాతం మంది వద్దే ఉందని తెలిపింది. ఈ మొత్తం రూ.20 లక్షల 91 వేల కోట్లు. అంటే ఇది దాదాపు మన జాతీయ బడ్జెట్‌కు సమానం. ఇదిలావుండగా, దాదాపు 67కోట్ల మంది భారతీయుల సంపదలో పెరుగుదల కేవలం ఒక్కశాతమే కావడం ఆందోళన కలిగించే విషయం. ప్రపంచవ్యాప్తంగా సర్వే ఫలితాల విశ్లేషణ మరింత ఆందోళన కరంగా ఉంది. మొత్తం సంపదలో 82శాతం ధనవంతులైన కేవలం ఒక్క శాతం మంది వద్దకు చేరిందని సర్వే తెలిపింది. ఒకవైపు సంపన్నుల ఆస్తులు అంతకంత పెరుగుతుంటే, కోట్లాది మంది పేదరికంలో మగ్గిపోతూనే ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంపన్నుల ఆస్తులు వృద్ధి చెందుతుంటే, నేటికీ 3.7బిలియన్ల మంది ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పులు రాలేదు. వారి సంపాదనలో ఏమాత్రం వృద్ధి కనిపించలేదు అని సర్వే తేల్చిచెప్పింది. రివార్డ్ వర్క్, నాట్ వెల్త్ పేరుతో 2017 ఏడాదిలో సంపద సృష్టిపై ఈ సంస్థ అధ్యయనం చేపట్టింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరమ్ సదస్సు నేపథ్యంలో సర్వే వివరాలను వెల్లడించింది. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థికవేత్తల సదస్సులో ఆక్స్‌ఫామ్ 3వ పేజీలో...

హోదా ఇస్తే బీజేపీతో దోస్తీ..!

- వైఎస్ జగన్ స్పష్టీకరణ
- చంద్రబాబు అబద్ధాల రారాజు
- ప్రాజెక్టులు నిర్మించే సత్తా లేదు
- అమరావతి ఓ పెద్ద భూస్కామ్
- యువతకు చేసిందేమీ లేదు

10





వివిధ పార్టీల నేతలకు కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న పీసీసీచీఫ్ ఉత్తమ్

ఫిబ్రవరిలో బస్సుయాత్ర

- ఇప్పుడు ఎన్నికలొచ్చినా కాంగ్రెస్‌కు 70సీట్లు
- మాతో చాలామంది టచ్‌లో ఉన్నారు
- పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం
- జూన్ 2న హైదరాబాద్‌లో బహిరంగ సభ
- పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

9 లో

ఓట్ల పంట పండాలంటే
అన్నదాతే దిక్కు



(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలను అభివృద్ధి చేయాలనే సంకేతాలను గత ఏడాదిలోనే ఇచ్చారు.

గ్రామీణ భారతానికి ఇంటర్నెట్.. భారత్ నెట్ ప్రాజెక్ట్

2018 బడ్జెట్‌లో టెలికమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్‌కు(డీవోటీ) సంబంధించి భారత్‌నెట్ ప్రాజెక్ట్‌పై ప్రకటనలు చేయవచ్చు. ఈ ప్రాజెక్ట్ భారత్ అంతటా పలు గ్రామాలకు బ్రాండ్ బాండ్ ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వడానికి ఉద్దేశించింది. వాస్తవానికి తొలి దశలో డిసెంబర్ 31 నాటికి హైస్పీడ్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌తో ఒక లక్షకు పైగా గ్రామపంచాయతీలను అనుసంధానం చేయడం జరిగింది. 2019, మార్చి నాటికి 2,50,000కు పైగా గ్రామపంచాయతీలను ఇంటర్నెట్‌తో అనుసంధానం చేయడం సదరు ప్రాజెక్ట్ లక్ష్యం. అయితే డీవోటీ అధికారులు చెప్పినదాన్ని బట్టి దీనికి సంబంధించిన నిధులను ఆర్థిక మంత్రిత్వ శాఖ పక్కన పెట్టింది. అలాగే వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత వచ్చే బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు అరుణ్ జైట్లీ ఎంత కేటాయిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

పౌర విమానయాన సేవలు కీలకం

పౌర విమానయాన మంత్రిత్వశాఖ గ్రామీణ ప్రాంతాలకు విమాన సేవలను విస్తరించాలని ఆశిస్తున్నది. ఇది వచ్చే బడ్జెట్‌లో కీలకం కానుంది. ప్రాంతీయ అనుసంధాన పథకం(ఆర్‌సీఎస్) కింద సేవలందిస్తున్న మరియు సేవలందించని విమానాశ్రయాలను అనుసంధానించే కార్యక్రమంతో మంత్రిత్వ శాఖ ముందుకు సాగవచ్చు. ఈ పథకం తొలి విడతలో భాగంగా ఎయిర్‌లైన్స్‌కు దాదాపు 128 రూట్లను కేటాయించారు. అయితే ఈ ఏడాది చివరకు వాటిలో కేవలం సగం రూట్లకు మాత్రమే విమానాశ్రయాల నుంచి విమాన సేవలు అందుబాటులోకి రానున్నాయి. విమానాశ్రయాల వద్ద మౌలిక సదుపాయల లేమి దీనికి దారి తీసిన ప్రధాన కారణాల్లో ఒకటి. ఇదే పథకం రెండవ విడతలో భాగంగా ఈశాన్య భారతం,జమ్మూ కాశ్మీర్‌లో మారుమూల మరియు వ్యూహాత్మక ప్రాంతాలను విమాన సేవలతో అనుసంధానించాలనే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది.

అన్నదాతకు పంగనామం ఇ-నామ్



ప్రభుత్వం 2015లో అత్యంత ఆర్భాటంగా ఎలక్ట్రానిక్ మార్కెట్ పోర్టల్‌ను ప్రారంభించింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని వాగ్దానం చేసింది. కానీ ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేక పోయింది. మార్కెట్‌లో ప్రత్యక్షంగా లావాదేవీలకు పాల్పడుతున్న వ్యాపారులకు వత్తాసు పలుకుతున్న రాష్ట్రాలు.. రైతులను మాత్రం ఆన్‌లైన్‌లో వారి పంటను విక్రయించడానికి అనుమతించడంలేదు. దేశంలో మొత్తంగా ఏపీఎంసీ అనే 2,477 నియంత్రణ మార్కెట్లు అవినీతిలో మునిగి తేలుతున్నాయి. ఈ మార్కెట్లలో అధికారులు ఎంతగా బరితెగిస్తున్నారంటే ప్రత్యక్షంగా జరిగిన వ్యాపార లావాదేవీలను ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా విజయవంతమైనవిగా ఇ-నామ్ పోర్టల్‌లో డేటాను ఫీడ్ చేస్తున్నారు. ఇ-నామ్‌ను ప్రారంభించిన సందర్భంగా 2017 మార్చి నాటికి 400 మార్కెట్లను, 2018 మార్చి నాటికి మరో 185 మార్కెట్లను అనుసంధానం చేయాలనే పథక రచన ప్రభుత్వం చేసింది. కానీ ఇ-నామ్ వెబ్‌సైట్ ప్రకారం ఇప్పటిదాకా కేవలం 470 మార్కెట్లు మాత్రమే అనుసంధానమయ్యాయి. వ్యాపారులు ఇ-నామ్ పట్ల ఆసక్తి చూపడంలేదు. ఎందుకంటే ధరల నిర్ణయించే ప్రక్రియలో పాల్గొనే అవకాశాన్ని వారు రైతులకు ఇవ్వాలనుకోవడం లేదు అని నీతి అయోగ్ వ్యవసాయసలహాదారు జె.పి.మిశ్రా తెలిపారు.

భారత్ మాలకు భారీగా కేటాయింపులు



భారత్ మాల పథకం కింద దేశంలో ఢిల్లీ, లక్నో, బెంగళూరు, రాంచీ, పాట్నా, శ్రీనగర్, ఉదయ్‌పూర్ లాంటి 28 ప్రధాన నగరాల్లో రింగ్ రోడ్లను నిర్మించాలనే ప్రణాళికలను మోడీ ప్రభుత్వం చేసింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు రూ.36,290 కోట్లు. కనుక వచ్చే బడ్జెట్‌లో రహదారుల అభివృద్ధికి భారీగా కేటాయింపులు జరపవచ్చు.

ఈసారీ అన్నదాతను ఊరిస్తే కష్టమే

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017-18 బడ్జెట్‌ను సమర్పిస్తున్న సందర్భంగా రైతుల గురించి ఎంతగానో మాట్లాడారు. ఆయన కడకు వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులను సైతం పెంచారు. మీడియా సైతం ఆ మాయలో పడిపోయి ఇది గ్రామీణ భారత బడ్జెట్ శీర్షికన పుంఖానుపుంఖాలుగా కథనాలు వండి వడ్డించింది. అతి కొద్దికాలంలోనే పదాడంబరం నేలను అంటింది. వాస్తవం వెలుగులోకి వచ్చింది. వ్యవసాయానికి బడ్జెట్‌ను కేవలం రూ.3,053 కోట్ల పెంపుదలతో రూ.51,026 కోట్లకు చేర్చారు. మొత్తం స్థూల దేశీయ ఉత్పత్తి(జీడీపీ)లో కేవలం 0.30 శాతాన్ని వ్యవసాయానికి కేటాయించారు. కాలక్రమంలో, క్షేత్రస్థాయిలో దాని ప్రభావం ప్రస్తుతం కనిపిస్తున్నది. గడచిన నాలుగు సంవత్సరాల్లో కనిష్టం అన్నట్టుగా సగటు వ్యవసాయ వృద్ధి 1.9 శాతంగా నమోదైంది. 1991 సంవత్సరంలో భారత్ ఆర్థిక సంస్కరణల బాట పట్టిన నాటి నుంచి వ్యవసాయ రంగం వృద్ధి కనిష్టానికి చేరుకుంది. అప్పట్నుంచి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు దేశాన్ని పాలించాయి. కానీ వ్యవసాయం చతికిలపడిపోయింది. జాతీయ నేర రికార్డు బ్యూరో(ఎన్‌సిఆర్‌బి) డేటా ప్రకారం 2015లో ప్రతి అరగంటకు ఒక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు.

2019లో సాధారణ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో గ్రామీణ భారత వృద్ధికి ఊతమివ్వడానికి ప్రస్తుత ప్రభుత్వం ముంగిట మిగిలిన ఏకైక బడ్జెట్ ఇదే.

గడచిన నాలుగు సంవత్సరాల్లో వ్యవసాయ రంగ సగటు వృద్ధి 1.9 శాతం ఉండగా, అదే కాలానికి జీడీపీ వృద్ధి 7.2 శాతానికి పైగా ఉంది. ఇది గతితప్పిన వృద్ధి. యూపీఏ హయాంలో 2004-2009 మరియు 2009-2014 మధ్య కాలంలో వ్యవసాయ వృద్ధి వరుసగా 3.8, 3.7 శాతం ఉంది. అటల్ బిహారీ వాజ్‌పేయి పాలనలో 1998 మరియు 2004 మధ్యకాలంలో అది 2.9 శాతంగా నమోదైంది. పి.వి.నరసింహారావు హయాంలో దేశ జీడీపీ వృద్ధి రేటు 5.2 శాతం ఉండగా దానిలో దాదాపు సగం అన్నట్టుగా వ్యవసాయ వృద్ధి రేటు 2.4 శాతంగా నమోదైంది.

సాగు సంక్షోభంతో గుజరాత్ నమూనా గోవిందా!

వ్యవసాయ రంగంలో మందగమన ప్రభావం ఇటీవల ముగిసిన గుజరాత్ ఎన్నికలపై స్పష్టంగా కనిపించింది. సాగు సంక్షోభంపై గ్రామీణ గుజరాత్ నిరసనలకు దిగింది. గొప్పగా చెప్పుకున్న గుజరాత్ నమూనా ఎన్నికల్లో విఫలమైంది.

ఎన్నికల వేళ.. రైతుకు ప్రోత్సాహాల వల

రైతు సంఘాలతో బడ్జెట్‌కు ముందు సంప్రదింపులు జరిపినప్పుడు వ్యవసాయంపై పూర్తిగా ఆధారపడిన గ్రామీణ భారతానికి ప్రోత్సాహం ఇవ్వాలనే ప్రణాళికలో ప్రభుత్వం ఉన్నట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. కర్నాటక, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీలకు ఎన్నికలు ముంచుకొస్తుండటమే సాగు సంక్షోభంపై ప్రభుత్వం దృష్టి పెట్టడానికి ప్రధాన కారణం. కర్నాటకను మినహాయిస్తే బీజేపీ పాలనలో ఉన్న మిగిలిన మూడు రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల ఆధిక్యత ఉంది.

ధర పడిపోతే ఆదుకునే పథకం

వచ్చే కేంద్ర బడ్జెట్‌లో పంటకు సరైన ధర రాక రైతులు పొందుతున్న నష్టాలను భర్తీ చేసేలా ఒక పథకాన్ని ప్రారంభించాలనే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. ధరలు కుప్పకూలిపోయినప్పుడు వ్యవసాయ మార్కెట్లలో ప్రభుత్వం జోక్యం చేసుకునేలా ఒక పథకాన్ని కేంద్రం ప్రారంభించనుందని నీతి అయోగ్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం ప్రణాళిక దశలో ఆ పథకం కేంద్రంపై అంతగా ఆధారపడకుండానే నిధులను వినియోగించుకునే అవకాశాన్ని రాష్ట్రాలకు ఇస్తుందని సదరు అధికారి చెప్పుకొచ్చారు. కానీ ఇప్పటికే అమలవుతున్న పథకాలకు కేంద్రం నుంచి నిధులు రాకపోవడంతో రాష్ట్రాలు ఆ పథకాలను పట్టించుకోవడం మానేశాయి.

పనికిరాని ఆ రెండు పథకాలు

కానీ ఇప్పటికే ధరల స్థిరీకరణ నిధి(పీఎస్ఎఫ్), మార్కెట్ ప్రమేయ పథకం(ఎంఐఎస్) లేదా పంటలకు మద్దతు ధర పథకం లాంటి పథకాలు రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయాయి.

రైతు ఉత్పాదకదారుల సంస్థలకు చేయూత

ఈ బడ్జెట్‌లో రైతు ఉత్పాదకదారుల సంస్థలకు(ఎఫ్‌పీవోలు) మంచి చేయూత లభిస్తుందని ఒక అంచనా. ఎఫ్‌పీవోలకు సంబంధించి మహారాష్ట్ర, దక్షిణాది రాష్ట్రాలు బ్రహ్మాండంగా రాణిస్తున్నాయి. పంట దిగుబడి చేర్పు, మార్కెటింగ్‌లో ఎఫ్‌పీవోలు తలమునకలై ఉంటాయి.

షేర్ మార్కెట్‌పై పన్ను మాటేమిటి?



షేర్ మార్కెట్‌లో ఊర్ధ్వగమనంలో సాగుతున్నది కాబట్టి స్వల్ప కాలిక మూలనిధి రాబడులపై పన్ను కాల వ్యవధిని ఏడాది నుంచి మూడేళ్ళకు పెంచడాన్ని మోడీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవచ్చు. ప్రభుత్వ రంగ సంస్థల్లో(పీఎస్‌యూ) ఆఫ్ షేర్ల విక్రయం ద్వారా మూలనిధిని సైతం పొందవచ్చు. కానీ పెట్టుబడుల ఉపసంహరణ విషయానికి వచ్చేసరికి ఒక పీఎస్‌యూ మరో పీఎస్‌యూ వాటాల కొనుగోలుకు మొగ్గు చూపాల్సి ఉంటుంది. ఇది కేవలం పద్దుల బదలీతోనే ఫలితాలను ఇస్తుంది. కానీ వాస్తవానికి ఎలాంటి కొనుగోలు లేదు సరికదా ఆదాయమూ రావడంలేదు.

ఇప్పటికీ నెరవేరని అప్పటి ఎన్నికల వాగ్దానాలు

ముందుగా అనుకున్నట్టుగా 2019 ఎన్నికలు ముంచుకొస్తున్నాయి కాబట్టి గ్రామీణ ఓటర్లు, రైతులను ఆకట్టుకునేందుకు మోడీ ప్రభుత్వం గత సాధారణ ఎన్నికల సందర్భంగా వారిపై వాగ్దానాల వర్షం కురిపించింది. ఒకవేళ వాటిని ఇప్పుడు యుద్ధప్రాతిపదికన తీరుద్దామనుకుంటే నిధులు ఎక్కడి నుంచి తీసుకురావాలి? మోడీ హామీలను ఒకసారి గుర్తు చేసుకుందాం..

మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆదాయ పన్ను రేట్లు తగ్గిస్తామని అన్నది. కానీ కేంద్ర ప్రభుత్వ ఖజానా ప్రస్తుత పరిస్థితి పరిగణనలోకి తీసుకున్నప్పుడు అది సుదూర స్వప్నంగా కనిపిస్తున్నది.

కలత చెందుతున్న రైతన్న

రికార్డు స్థాయిలో తృణధాన్యాలు, ఉద్యానవన పంటల దిగుబడిని సాధించినప్పటికీ రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మోడీ సర్కారు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రధానమంత్రి క్రిషి సంచాయి యోజన(పీఎంకేఎస్‌వై) ఇప్పటికీ ఆరంభం కానట్టుగానే మిగిలిపోయింది. ఆ పథకానికి కేటాయించిన బడ్జెట్‌ను 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఒకప్పటి 99 చిన్న, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణకు మళ్లించారు. వాటి పునరుద్ధరణ ఎంతవరకు వచ్చిందనేదానిపై ఇప్పటిదాకా ఎలాంటి సమాచారం లేదు. దీనికితోడు కరవులు, వరదలు లాంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులను ఆదుకునే ఏకైక పథకం పంట బీమా పథకానికి బడ్జెట్ తగ్గించారు.

బ్యాంకులకు రికవరీ సాధ్యమా?

ప్రభుత్వ రంగ బ్యాంకుల విషయానికి వస్తే.. అవి పీకల్లోతు అప్పుల్లో ఉన్నాయి. ప్రభుత్వం సమకూర్చిన నిధులతో బ్యాంకులు తిరిగి మూలధనాన్ని పొందాయి. కానీ పోగొట్టుకున్న మొత్తం నగదును బ్యాంకులు రికవరీ చేసుకోగలవా అనేది అతి పెద్ద ప్రశ్నగా మారింది. రానున్న రోజుల్లో అసలు విలువ కంటే మరింత చవక రేట్లకు ఆస్తుల విక్రయానికి సంబంధించిన వార్తలను మీరు వినగలరు. బ్యాంకింగ్ వ్యవస్థను మెరుగుపరిచి, ప్రైవేట్ పెట్టుబడులను పెంచేందుకు ప్రభుత్వం కొన్ని కీలకమైన చర్యలు తీసుకోవచ్చు.

వచ్చే బడ్జెట్ సామాన్యుడి కంట సంతృప్తిని చూపిస్తుందా?

ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల ఒక జాతీయ టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వచ్చే బడ్జెట్‌కు అభివృద్ధియే అజెండా అని అన్నారు. అంతేకాకుండా సామాన్యుడి కంట సంతృప్తిని చూసినప్పుడు అది తనకు బలాన్ని ఇస్తుందని ఆయన అన్నారు. అదే సమయంలో నోట్ల రద్దు, జీఎస్టీ లాంటి సంస్కరణాత్మక నిర్ణయాలు తీసుకున్న తనను ఆ కోణంలో అంచనా వేయవద్దని భారత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరలాంటప్పుడు వచ్చే ఎన్నికల్లో వీటి ప్రభావం మరుగున పడాలంటే మోడీ, జైట్లీ బృందం రానున్న బడ్జెట్‌లో వ్యవసాయరంగం, ఉత్పాదక రంగం సహా అనేక రంగాలకు పెద్ద ఎత్తున కేటాయింపులు జరపాలి. ఉపశమన చర్యలు ప్రకటించాలి. అప్పుడే అవి మోడీ సర్కారుకు వచ్చే ఎన్నికల్లో ఓట్ల పంట పండిస్తాయి.



మోడీ సర్కారుకు మూడే ఆప్షన్లు

2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇదే ఆఖరి బడ్జెట్ కాబట్టి మోడీ ప్రభుత్వం ముంగిట మూడంటే మూడు ఐచ్ఛికాలు ఉన్నాయి. అవి 1.సురక్షిత బడ్జెట్ 2.విప్లవాత్మక బడ్జెట్ 3.ప్రజాకర్షణ బడ్జెట్ ఈ మూడింటిలో ఏది వచ్చే బడ్జెట్ ఏదో తెలుసుకోవాలంటే ఫిబ్రవరి ఒకటవ తేదీ దాకా ఆగాల్సిందే.

తెలంగాణలో కొరియా పెట్టుబడులు



- ముందుకొచ్చిన పలు సంస్థలు
- మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పందాలు
- అవకాశాలు వివరించిన ఐటీ మంత్రి
- అధ్యయనం తర్వాత మరిన్ని సంస్థలు
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్, కొరియా సంస్థలు ఆసక్తి కనబరిచాయని ప్రభుత్వ సలహాదారుడు జి.వివేక్ చెప్పారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారని, రాష్ట్రానికి రప్పించేందుకు పరిశ్రమలశాఖ కేటీ రామారావు చేసిన ప్రయత్నానికి సానుకూల స్పందన వచ్చిందని ఆయన చెప్పారు. జపాన్, కొరియాలోని కేసీఆర్ నేతృత్వంలో వెళ్ళిన ప్రతినిధి బృందం ఆయా దేశాల పారిశ్రామికవేత్తలు, జైకా ప్రతినిధులతో జరిపిన సంప్రదింపులతో పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివేక్ చెప్పారు. ఈ సమావేశంలో దక్షిణ కొరియా కాన్సులేట్ గౌరవ చాన్సలర్ రమేష్ చుక్కపల్లి, మెట్రోరైల్ ఎండి ఎన్‌వీఎస్ రెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉన్న పెట్టుబడులకు అనుకూల పరిస్థితులు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపై మంత్రి కేటీ రామారావు ప్రతినిధి బృందం వివరించడంతో అనేక సంస్థలు ఆసక్తి కనబరిచాయని వివేక్ చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు ఎందుకు పెట్టాలన్న దానిపై ఆ దేశ పారిశ్రామికవేత్తలు అడిగిన పలు ప్రశ్నలకు కేటీఆర్ సంతృప్తికరమైన సమాధానాలు ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో సమృద్ధిగా నీరు, విద్యుత్ ఉందని, భూమి ఉన్న కంపెనీ దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే అనుమతి మంజూరు చేసే విధానం గురించి వివరిస్తే వారు ఎంతో సానుకూలంగా స్పందించారని వివేక్ చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన స్కిల్ డెవెలప్‌మెంట్, సబ్సిడీలను ఆ కంపెనీలకు ఇచ్చే అంశాన్ని చెప్పామన్నారు.

హైదరాబాద్‌లో ఎగ్ ఫుడ్స్ కంపెనీ కోళ్ళకు బర్డ్‌ఫ్ల్యూ రాకుండా సహకారం అందించేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు. అలాగే ఎగ్‌ఫుడ్స్ కంపెనీ ఏర్పాటు చేసేందుకుత ఎంవోయూ కూడా కుదుర్చుకుందని వివేక్ తెలిపారు. రాష్ట్రంలోని పట్టణాల నుంచి వెలువడే ఘన వ్యర్థాలను నిర్వహించేందుకు క్లీన్ ఎనర్జీలో అవగాహన కుదుర్చుకున్నట్లు చెప్పారు. సుజుకీ చైర్మన్ టకోమో మినీబా కేటీఆర్‌తో ప్రత్యేకంగా చర్చించారని ఆయన చెప్పారు. జపాన్‌లో కూడా ఇన్నోవేషన్ టెక్నాలజీని అభివృద్ధి చేయనున్నారని, టి.బ్రిడ్జితో ఈ మేరకు ఆ దేశం ఒక ఎంవోయూ కుదుర్చుకుందని వివేక్ తెలిపారు.

కొరియాలో విద్యార్థులు రెండు దేశాల యూనివర్సిటీల్లో ఉన్నత విద్య, పరిశోధన చేసుకునేందుకు అవగాహనకు వచ్చామని రమేష్ చుక్కపల్లి చెప్పారు. యూనివర్సిటీలు సంయుక్తంగా రిసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సంయుక్త పరిశోధనలు నిర్వహించేందుకు త్వరలో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లు రమేష్ తెలిపారు. కొరియాలో ప్రసిద్ధిగాంచిన ఆటోమొబైల్ కంపెనీ హుండాయ్ యాజమాన్యం త్వరలో రాష్ట్రంలో పర్యటించనుందని తెలిపారు. కొరియాలో ఫార్మా రంగంలో పెట్టుబడులకు భారీ ప్రాజెక్టులు ఎంచుకుంటున్నారని, ఇందులో భాగంగా హైదరాబాద్ ఫార్మాసిటీ గురించి కేటీఆర్ వివరించారని తెలిపారు. యానిమేషన్, గేమింగ్‌లో ఎంవోయూ కుదుర్చుకున్నామని, వరంగల్‌లో ఏవియేషన్ అకాడమీ ఏర్పాటుకు కొరియా సంస్థ ముందుకు వచ్చిందని చెప్పారు. హైదరాబాద్‌లో త్వరలో కొరియా కాన్సులేట్ కార్యాలయం ప్రారంభించనున్నట్లు రమేష్ చుక్కపల్లి తెలిపారు. మెట్రోరైల్ రెండోదశ ప్రాజెక్టుకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు జైకా సంసిద్ధత వ్యక్తంచేసిందని ఎన్‌వీఎస్ రెడ్డి చెప్పారు. జెట్రో సాఫ్ట్ బ్యాంకు, సిజువోకా బ్యాంకులతో ఆర్థిక సాయంపై చర్చలు జరిపామని తెలిపారు. మెట్రో రెండోదశపై డీపీఆర్ సమర్పించి ఆ తర్వాత ఆర్థిక సాయానికి సంప్రదింపులు జరుపుతామని ఆయన చెప్పారు. స్మార్ట్‌సిటీపై సిజువోకాతో చర్చించామని, పూర్తిస్థాయిలో డిపిఆర్ సమర్పిస్తే చర్చలు జరిపేందుకు అవకాశం ఉంటుందని ఎన్‌వీఎస్ రెడ్డి చెప్పారు. జపాన్ ఇన్‌ఫ్రా, ఫార్మా రంగంలో పెట్టుబడులకు లక్షల కోట్ల నిధుల సామర్థ్యంతో ఉందని, వాటిలో కొంతమేరకు రాష్ట్రానికి రప్పించే ప్రయత్నాలు సానుకూల ఫలితాలు ఇచ్చే దిశలో జరిగాయని ఆయన చెప్పారు. మెట్రో మొదటి దశ నవంబర్, 2019 నాటికి పూర్తవుతుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టాల్సిందిగా జపాన్ సంస్థలను కోరినట్టు ఆయన తెలిపారు. జపాన్, కొరియా దేశాల పారిశ్రామికవేత్తలతో జరిపిన అనేక సమావేశాల్లో సానుకూలత కనిపించిందని, అయితే ఆ దేశం నుంచి ప్రతినిధి బృందాలు వచ్చి ఇక్కడి పరిస్థితులు అధ్యయనం చేసుకున్న తర్వాతే పెట్టుబడులపై తుదినిర్ణయం తీసుకుంటారని ఎన్‌వీఆర్ రెడ్డి చెప్పారు. పెట్టుబడులు రాబట్టి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్న లక్ష్యంతోనే కేటీఆర్ ప్రతినిధి బృందం పర్యటన సాగిందని, ఇది మంచి ఫలితాలు ఇస్తుందని అన్నారు.

మీరే మా రాయబారులు

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు ఎన్‌ఆర్‌ఐ మిత్రులు కలిసి రావాలని కేటీఆర్ కోరారు. ఎన్‌ఆర్‌ఐలు తెలంగాణలో ధైర్యంగా భూములు కొనుగోలు చేయవచ్చునని, భూ రికార్డులను ప్రక్షాళన చేసి ఆన్‌లైన్‌లో పెడుతున్నామని చెప్పారు. చెరువుల ప్రక్షాళన, హైదరాబాద్ నగరంలో మెరుగైన శాంతిభద్రతలు, వాతావరణ కాలుష్యం, క్రీడల అభివృద్ధి తదితర అంశాలపై ఎన్‌ఆర్‌ఐలు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ ముఖాముఖిలో నగర మేయర్ బొంతు రామ్మోహన్ కూడా పాల్గొన్నారు.

జలాశయాల్లో జలక్రీడలు

- ప్రోత్సహించేందుకు సర్కారు ప్రణాళిక
- ఇకపై ఏం జరిగినా నిర్వాహకులదే బాధ్యత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జలక్రీడలను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల్లోని రిజర్వాయర్లు, మినీట్యాంక్‌బండ్ లాంటి చిన్న నీటి వనరుల్లో జలక్రీడలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే జిల్లాకలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటుచేయగా, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎస్‌కె జోషి ఉత్తర్వులు జారీచేశారు. జలక్రీడలను ప్రోత్సహించే అంశంపై వికారాబాద్ కలెక్టర్ నుండి మొదట ప్రతిపాదనలు అందాయి. తర్వాత దీనిపై ఇతర జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వం నుండి స్పష్టత కోరారు. ఈ క్రమంలో కలెక్టర్ల నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులిచ్చారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా ఉండే కమిటీలో సభ్యులుగా జిల్లా ఎస్పీ లేదా ఆయన తరుపున ప్రతినిధి, తెలంగాణ టూరిజం కార్పోరేషన్ సభ్యుడు, నీటిపారుదల శాఖ నుండి ఒకరు సభ్యులుగా ఉంటారు.



పనులు చేసేదిలా..

రిజర్వాయర్లలో ఎక్కడైనా టిఎస్‌టిడిసి క్రీడాసౌకర్యాలను సమకూర్చేందుకు ముందుకు వస్తే వారికి ఆ పనులు అప్పగించాలని నిర్ణయించారు. టిఎస్‌టిడిసి ముందుకు రానిచోట ప్రైవేట్ సంస్థలు ముందుకు వస్తే బిడ్ల ద్వారా పారదర్శకంగా వారికి పనులు అప్పగించాలని ఉత్తర్వుల్లో సూచించారు. తాగునీరు, మత్స్యసంపద పెంపకానికి ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని, బోటింగ్ సహా ఎలాంటి చర్యలు చేపట్టినా ప్రాజెక్టుల స్వచ్ఛతను కాపాడాలని ఉత్తర్వుల్లో సూచించారు. వాటర్ స్పోర్ట్స్ జరిగే రిజర్వాయర్లలో నీటిపారుదల శాఖ అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే తనిఖీచేసే అధికారం ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చారు.

జలక్రీడలు నిర్వహించేజలాశయాల్లో భద్రతా చర్యలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఏదైనా.. ప్రమాదం జరిగినా నష్టం వాటిల్లినా దానికి నీటిపారుదలశాఖ బాధ్యత వహించదని ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నారు. నిర్వాహకులే ఇందుకు బాధ్యత వహించాలన్నారు. జలక్రీడల నిర్వహణకు తాజాగా ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం .. కలెక్టర్ల నుండి వచ్చిన అనేక ప్రతిపాదనలు పరిశీలిస్తోంది. విజయవాడ ప్రమాదం తర్వాత.. జలాశయాల్లో జరిగే పర్యాటక కార్యకలాపాలపై.. ఆచితూచి జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఆదిలాబాద్, వికారాబాద్, వరంగల్ తదితర జిల్లాల నుండి వీటికి సంబంధించి పలు ప్రతిపాదనలు అందినట్లు సమాచారం. రానున్న రోజుల్లో జలక్రీడల ద్వారా పర్యాటకుల సంఖ్య, పర్యాటక ఆదాయం పెంచుకునే వ్యూహాలపై కసరత్తులు జరుగుతున్నాయి.

బాలిక వైద్యానికి మంత్రి సాయం

- ట్విట్టర్‌లో బాలిక తండ్రి విజ్ఞప్తి
- స్పందించిన మంత్రి కేటీఆర్
- సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆస్పత్రి ఖర్చుల చెల్లింపు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ బాలికను మంత్రి కేటీఆర్ ఆదుకొని మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. తన బిడ్డ వింత వ్యాధితో బాధపడుతుందని ఆపదలో ఉన్నామని, ఆదుకోవాలని ఓ చిన్నారి తండ్రి చేసిన ట్వీట్‌కు మంత్రి కేటీఆర్ స్పందించారు. విదేశీ పర్యటనలో బిజీగా ఉన్న ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ వెంటనే స్పందించి సిరిసిల్లలోనే తన కార్యాలయంలో స్పందించాలని ట్విట్ చేశారు. అనంతరం అధికారులు వైద్యానికి అయ్యే ఖర్చును సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.50 లక్షల మంజూరు చేస్తున్నట్టు అనుమతి పత్రాలను దవాఖానకు అందజేశారు. వేములవాడ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన అడెపు శ్రీధర్ కూతురు వర్నిక వింత వ్యాధితో బాధపడుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో శ్రీధర్ తన స్నేహితుల వద్ద ఆర్థిక స్థితిగతుల గురించి వివరించడంతో వారు కేటీఆర్ ట్విట్ ద్వారా వారి పరిస్థితిని వివరించారు. దీనికి విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ స్పందించి వర్నిక ఆరోగ్యం గురించి తగిన సహకారం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1.50 లక్షలను ఆ బాలికకు మంజూరు చేయించారు. దీంతో వర్నిక తండ్రి మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్విట్జర్లాండ్‌లో టీఆర్ఎస్ నూతన శాఖ

- మంత్రి కేటీఆర్ సమక్షంలో పలువురు చేరిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న మంత్రి కెటిఆర్ సమక్షంలో పలువురు ఎన్‌ఆర్‌ఐలు టిఆర్ఎస్‌లో చేరారు.జ్యూరిచ్ నగరంలో జరిగిన పార్టీ ఆవిర్భావ సమావేశంలో మంత్రి వారికి కండువాలు కప్పారు. టిఆర్ఎస్ ఇప్పటికే దేశవిదేశాల్లో శాఖలు కలిగి ఉన్నదని, తాజాగా స్విట్జర్లాండ్‌లో శాఖ ఏర్పాటు ద్వారా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రపంచానికి తెలిసే అవకాశం ఏర్పడిందని మంత్రి కెటిఆర్ అన్నారు.

ఈ సందర్భంగా పదిమందితో టిఆర్ఎస్ అడ్‌హాక్ కమిటీ ఏర్పాటుచేశారు. శ్రీధర్ గందే, కిషోర్ తాటికొండ, అనిల్ జాల, అల్లుకృష్ణారెడ్డి, పద్మజారెడ్డి, పవన్, పాండురంగారెడ్డి తదితరులు కమిటీలో ఉండగా, కార్యక్రమంలో టిఆర్ఎస్ ఎన్‌ఆర్‌ఐ విభాగ నేతలు మహేష్ బిగాల, శ్యామ్ ఆకుల, అనిల్ కుర్మాచలం, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కష్టజీవి కేసీఆర్ స్మార్ట్ సీఎం

(మొదటిపేజీ తరువాయి)

సాయంత్రం కరీంనగర్‌లోని శ్వేతా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత ఓట్లు చీల్చడానికే తాను తెలంగాణలో పర్యటిస్తున్నానని అనడం సమంజసం కాదన్నారు. ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభకాంక్షలు తెలపడానికే కలిశానని, సీఎంను కలవడం తప్పుకానేకాదని పవన్ అన్నారు. దశాబ్దాల పోరాట ఫలితంగా తెలంగాణ వచ్చిందని, కేసీఆర్ ఉద్యమం వల్లే తెలంగాణ వచ్చిందని, అందుకే ప్రజలు పట్టం కట్టారని పవన్ కల్యాణ్ చెప్పారు. కేసీఆర్‌తో వైరం పెట్టుకోవాలనే ఉద్దేశం తనకు లేదని, ఘర్షణాత్మక రాజకీయాలకు తాను దూరంగా ఉంటానని, గొడవలు పెట్టుకునే ఉద్దేశం తనకు లేదని, నిర్మాణాత్మక రాజకీయాలు మాత్రమే చేస్తానని స్పష్టం చేశారు. మంగళ, బుధవారాల్లో తెలంగాణ జిల్లాలలో కార్యకర్తలను కలసి వారి అభిప్రాయాలు స్వీకరిస్తానని, సమస్యలపై అధ్యయనం చేసిన తరువాతే వాటిపై కార్యాచరణ ప్రకటిస్తామని అంటూ, తొందరపడి అడుగులు వేయనన్నారు. ప్రస్తుతం తనకు సినిమాలపై దృష్టిలేదని, పూర్తి స్థాయి రాజకీయాలపైనే దృష్టిసారిస్తానని, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి జనసేన పోటీ చేస్తుందని, కార్యకర్తలతో సమీక్షించి పోటీకి దిగుతామని జనసేన నేత పవన్ కళ్యాణ్ అన్నారు. తెలంగాణ అంశం సున్నితమైందని, ఇక్కడి ప్రజల సమస్యలపై అధ్యయనం చేసి, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలిస్తానని చెప్పారు. విమర్శలు చేసుకుంటూ వెళితేనే రాజకీయాలు కావన్నారు. 2009 ఎన్నికల ప్రచారానికి వచ్చినపుడు విద్యుత్ తీగ తగిలి ప్రమాదం జరిగిందని, అంజనేయస్వామి దయవల్ల అప్పుడు బయటపడ్డానని చెప్పారు. 2009లో ప్రచారాన్ని కూడ ఇక్కడి నుంచే ప్రారంభించానని గుర్తు చేసుకుంటూ సంపూర్ణ రాజకీయ జీవితంలోకి రావాలనుకున్నపుడు అంజనేయస్వామిని దర్శించుకోవాలని అనుకున్నానని, అందులో భాగంగానే ఆయన ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చానని అన్నారు. స్వామిని నమ్మితే అసాధ్యాలు కూడా సుసాధ్యాలు అవుతాయన్న నమ్మకం తనకు ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడా అంజన్న కృపతోనే వచ్చిందని అంటూ కార్యకర్తలతో ఆలోచించి ఏయే సమస్యలపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై చర్చిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తన స్థాయి ఎంత అనేది నిర్ణయించుకుని, దాన్ని బట్టి ఎన్ని సీట్లలో పోటీ చేయాలన్న దానిపై ఒక అవగాహనకు వస్తానన్నారు. తెలంగాణ కార్యాలయం హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, కరవు జిల్లా అనంతపురంలో ఈ నెల 27 నుంచి ప్రజాయాత్ర చేయనున్నట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలో మూడు రోజుల పాటు యాత్ర ఉంటుందని, ఆ తరువాత ఒంగోలులోని ఫ్లోరోసిస్, కిడ్నీ బాధితులను కలుస్తానని, అనంతరం విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లోనూ, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తానని చెప్పారు. అనంతపురం జిల్లా పర్యటన తరువాత రాష్ట్రాల వారిగా ఆయా జిల్లాల పర్యటనలకు సంబంధించిన తేదీలను ఖరారు చేస్తానని చెప్పారు. జనసేన ఎన్నికల బరిలో ఉంటుందని మొదటి నుంచీ చెబుతూనే ఉన్నానన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తనకు ఫోన్ చేసి ప్రాంతీయ పార్టీ ఎందుకు? బీజేపీలోకి రండి అంటూ ఆహ్వానించినపుడు సున్నితంగా తిరస్కరించానని పేర్కొన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సామాజిక తెలంగాణ, సామాజిక ఆంధ్రప్రదేశ్, సామాజిక భారతదేశం లక్ష్యంగా పార్టీ ముందుకు వెళుతుందని, వనరులు అన్ని వర్గాల వారికి సమానంగా అందాలన్నదే తమ ఉద్దేశం తప్ప ప్రభుత్వాలతో గొడవలకు దిగి అగ్రెసివ్ పాలిటిక్స్ చేసే ఉద్దేశం తనకు లేదన్నారు. ప్రభుత్వాలను గౌరవించాల్సిన అవసరం ఉందని, రాజకీయ అస్థిరత్వం కోసం తానెప్పుడూ మాట్లాడనని, సునిశితంగా ఆలోచిస్తానని చెబుతూ, గొడవలు పరిష్కారం కాదన్నారు. ప్రస్తుతం పార్టీ సంస్థాగతంగా నిర్మాణ దశలో ఉందని, ప్రజల సమస్యలపై అధ్యయనం చేసి, మేధావుల సలహాలు తీసుకొని కార్యాచరణతో ముందుకు పోతామన్నారు. నిర్మాణాత్మక రాజకీయాలతో ముందుకు వెళ్లేందుకు రిటైర్డ్ అధికారులు, సీనియర్ పాత్రికేయ మిత్రుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నానని తెలిపారు. ఇతర పార్టీల నాయకులు, మిత్రులు అందరూ తనను కలుస్తున్నారన్నారు. వారివారి అభిప్రాయాలను షేర్ చేసుకుంటున్నానన్నారు. సోదరుడు చిరంజీవిని అడిగి, తాను పార్టీ పెట్టలేదని, అలాగే మద్దతు అడగలేదని, అడగనని కూడా స్పష్టం చేశారు.





అట్టహాసంగా పవన్ రాజకీయ యాత్ర ప్రారంభం

- హారతి ఇచ్చి సాగనంపిన సతీమణి లెజినోవా
- కొండగట్టుకు దారిపొడవునా అభిమానుల నీరాజనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం నుంచి రాజకీయ శంఖారావం పూరించారు. తన నివాసంలో ఉదయం తన సతీమణి రష్యాకు చెందిన అన్నా లెజినోవా హిందూ సాంప్రదాయంలో చీర కట్టుకుని ఆయనకు ఎదురొచ్చి తిలకందిద్ది, హారతి ఇచ్చి పవన్ కళ్యాణ్‌ను రాజకీయ ఉద్యమంలోకి సాగనంపారు. ఉదయం నుంచే పవన్ నివాసం, జనసేన పార్టీ కార్యాలయం వద్ద అభిమానుల కోలాహలం ప్రారంభమైంది. ప్రశాసన్‌నగర్ లోని పార్టీ కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించగా, మత పెద్దలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన సోషల్ మీడియాకు సంబంధిచి వీరమహిళ పేరుతో ఏర్పాటైన విభాగాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, జనసేన సోషల్ మీడియా బృందంలో క్రియాశీలక సభ్యులుగా పనిచేసేందుకు ముందుకు వచ్చిన వారికి ఆయన స్వాగతం పలికారు. జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తెచ్చే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ప్రజా శ్రేయస్సుకు అవిరళ కృషి చేద్దామని, దేశ అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఉదయం 9 గంటలకు అభిమానుల నినాదాలు, కేరింతల మధ్య పవన్ కొండగట్టుకు బయలుదేరారు.

హైదరాబాద్ నుంచి రోడ్‌షో నిర్వహిస్తూ బయలుదేరిన పవన్‌కు మార్గమధ్యంలో అభిమానులు, జనసేన కార్యకర్తల పలకరింపులు, విజయం చేకూర్చాలంటూ ఆకాంక్షిస్తూ మిన్నంటేలా నినాదాలు చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కొండగట్టుకు చేరుకుని ఆంజనేయస్వామి దర్శనం చేసుకున్న పవన్‌కు దేవస్థాన పూజరులు ఆయనకు తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దేవస్థానం అభివృద్ధికి పవన్ కళ్యాణ్ రూ.11 లక్షల విరాళం ప్రకటించారు. పవన్ కోసం భారీగా తరలివచ్చిన అభిమానులను ఆదుపు చేసేందుకు బౌన్సర్లు ఎంత కష్టపడాల్సి వచ్చింది. మంగళవారం ఉమ్మడి కరీంనగర్, నిజాబాద్, ఆది లాబాద్ జిల్లాలకు చెందిన జనసేన కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి కొత్తగూడెంలో బసచేసి 24న ఉదయం అక్కడి నుంచి ఖమ్మంకు ర్యాలీగా బయలుదేరుతారు. మధ్యాహ్నం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లా జనసేన కార్యకర్తలతో సమా వేశమవుతారు.



పవన్‌కల్యాణ్‌ది భజనపార్టీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పవన్‌కల్యాణ్‌ది భజన పార్టీ అని, ఆ పార్టీకీ కార్యకర్తలు లేరు....సరైన డైరెక్షన్ లేదు... కేవలం అభిమానులతో నే ఆయన కేవలం హడావిడి చేస్తున్నారని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జనసేన సినిమా విడుదల కాకముందే ఫెయిల్ అయిందని విమర్శించారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణసాగర్‌రావు మాట్లాడుతూ, పవన్‌కల్యాణ్‌పై, ఆయన స్థాపించిన జనసేన పార్టీపై విరుచుక పడ్డారు. కేవలం సినిమాహీరోకు ఉన్న క్రేజీతోనే పవన్ రెండు రాష్ట్రా ల్లో హడావిడి చేస్తున్నారన్నారు. ఏపీ సిఎం చంద్రబా బునాయుడు, తెలంగాణలో సిఎం కేసీఆర్‌ను పొగడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. జనసేన కేవలం ప్యాకేజీల పార్టీగా మాత్రమే కనబడుతోందని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో పెరియార్ స్ఫూర్తితో వస్తున్నామని చెబుతున్న పవన్‌కల్యాణ్‌ది పూర్తి అవకాశవాద రాజకీయాలు అని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో అధికార పార్టీ వ్యతిరేక ఓటును చీల్చడానికే తెరాస ప్రయోగిస్తున్న అస్త్రంగా తాము భావిస్తున్నామన్నారు, ఏపీలో పెరుగన్నం తిని, తెలంగాణలో బిర్యానీ తినడం కాదు రాజకీయం అంటే అని కృష్ణసాగర్‌రావు తెలిపారు. దేశంలోనే తెలంగాణలో అత్యధిక రైతు ఆత్మహత్యలు జరిగితే....పవన్‌కల్యాణ్ ఇప్పటి వరకు స్పం దించలేదు.. కేసీఆర్‌ను ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. జనసేన పార్టీకి కార్యవర్గం లేదు...సరైన డైరెక్షన్‌కూడా లేదన్నారు.



2019లో అధికారం మాదే!

హన్మకొండ, ప్రభన్యూస్ : దేశ వ్యాప్తంగా బీజేపీ పవనాలు వీస్తున్నాయని అదే తరహాలో తెలంగాణాలో 2019లో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కోవా లక్ష్మణ్ అన్నారు. హన్మకొండలోని బీజేపీ అర్బన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడారం జాతర పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని జాతరకు అవసరమైన కనీస సౌకర్యాలను భక్తులకు అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు 7 రాష్ట్రాల నుంచి ప్రజలు అమ్మవార్ల దర్శనానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారని భక్తులకుఅవసరమైన కనీస సౌకర్యాలను వైద్య, ఆహార, మంచినీటి సౌకర్యం కల్పించేలా బీజేపీ కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశామని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం వరంగల్ నగర అభివృద్ధి కోసంస్మార్ట్ సిటీ హెరిటేజ్, హృదయ్ పథకాల ద్వారా సుమారు 500 కోట్లు కేటాయించగా అందులో భాగంగా భద్రకాళి బండ్, వేయి స్థంబాల దేవాలయ ఆధునికరణ, లక్నవరం, రామప్ప, పర్యాటక ప్రాంతాలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన టెక్స్‌టైల్స్ పార్కు ఇప్పటి వరకు కనీసం ప్రారంభించలేదని ఎన్నికల సమయంలో సంవత్సరానికి రూ. 300 కోట్ల చొప్పున వరంగల్ అభివృద్ధికి కేటాయిస్తున్నామని చెప్పి ఇప్పటి వరకు ఎలాంటి నిధులను ప్రజపయోగ కార్యక్రమాలకు వినియోగించలేదని రాష్ట్రప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. నిధులు, నీళ్ల, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చి ఆ నినాదాన్ని మరిచి కుటుంబ పాలన కొనసాగించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజా క్షేత్రంలో పోరాటం చేస్తామని అందులోభాగంగా 27 నుంచి జహీరాబాద్ నుంచి పాద యాత్రను ప్రారం భిస్తున్నా మన్నారు.



గవర్నర్ తీరు మారాలి

- తెలుగు రాష్ట్రాల సీఎంల మధ్య చీకటి ఒప్పందాలు : పొంగులేటి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ తీరు రాజకీయ విమర్శలకు తావిచ్చేలా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. గతంలో ఏ గవర్నరూ చేయని విధంగా నరసింహన్ ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించినందుకు తమకు అభ్యంతరం లేదని, అయితే రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలను ఆయన పట్టించుకోకపోవడమే ఆశ్చర్యంగా ఉందని వ్యాఖ్యానించారు. నేరెళ్ల ఘటన, నయీం ఎన్‌కౌంటర్, మియాపూర్ భూ దందా, ఇసుక కుంభకోణాలు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీ వంటి ఏ అంశాన్నీ ఆయన పట్టించుకోలేదని ఆరోపించారు. రాజ్యాంగ ప్రతినిధిగా ఉండాల్సిన గవర్నర్ అన్ని అంశాలపైనా దృష్టి సారించాలని పొంగులేటి అన్నారు. గతంలో గవర్నర్లు హుందాగా వ్యవహరించేవారని పేర్కొన్నారు.

మరోవైపు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులపైనా పొంగులేటి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఇతరం అంశాల విషయంలో ఇద్దరు ముఖ్యమంత్రులు చీకటి ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. విభజన చట్టంలో పొందుపరిచిన హామీలేవీ అమలు చేయకుండా రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇద్దరు ముఖ్యమంత్రులూ ఎవరికి వారే తామే గొప్ప అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. కానీ రెండు రాష్ట్రాల్లోనూ అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని ఆరోపించారు. 6 అంశాలపై ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని చెప్పిన కేసీఆర్, ఇంతవరకు ఒక్క ప్రయత్నం కూడా చేయలేదని పొంగులేటి విమర్శించారు. తాము ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అభివృద్ధి నిరోధకులంటూ ఎదురుదాడి చేస్తున్నారని పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు.



ప్రజా సమస్యలు గుర్తించి.. ప్రభుత్వం దృష్టికి తెస్తే పరిశీలిస్తాం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పవన్‌కల్యాణ్ తన యాత్ర సందర్భంగా ఏవైనా సమస్యలు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తెస్తే వాటిని పరిశీలించి పరిష్క రించడానికి ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందిలేదని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. సోమవారం టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగా ణలో ఎలాంటి రాజకీయ పరిణామాల ప్రభావం టిఆర్ఎస్‌పై ఉండబోదన్నారు. పవన్ సీజన్ పొలిటీషియన్ అని.. ఒకసారి రాజకీయాల్లో, మరోసారి సినిమాల్లో కనిపిస్తారన్నారు. ఇటీవల సిఎం కెసిఆర్ పవన్‌కల్యాణ్ భేటీ వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదన్నారు. తన సినిమాకు సంబంధించిన అంశంపై మాట్లాడితే, సంబంధిత మంత్రిని కలవాలని సిఎం సూచించారరన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న టిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉన్నారన్నారు.

గవర్నర్‌పై నీచరాజకీయం

తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధంగా నిర్వహిస్తూ గవర్నర్ పదవికే వన్నెతెస్తున్న నరసింహన్‌పై కాంగ్రెస్ పార్టీ నీచరాజకీయాలు చేస్తున్నదని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. అసత్య ఆరోపణలు చేసినందుకు కాంగ్రెస్ నాయకులు గవర్నర్ నరసింహన్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు.



ధనమంతా ఒక్క చోటే!



(మొదటిపేజీ తరువాయి)

సర్వేను నిశితంగా పరిశీలించనున్నారు. ప్రపంచాధి నేతలు తమ చర్చల్లో ఆర్థిక, లింగ అసమానతల గురించి ప్రధానంగా మాట్లాడనున్నారు.

- గత ఏడాది సర్వే ప్రకారం, దేశంలోని సంపదలో 58 శాతం ఒక్క శాతం మంది ధనికుల వద్ద ఉన్నట్లు తేలింది.ఇది ప్రపంచ సగటు కంటే అధికం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంపదలోని 50శాతం సంపద కొందరి వద్దే పోగుపడినట్లు వెల్లడైంది. తాజాసర్వే మేరకు, ఇండియాలోని ఒక్కశాతం ధనికుల సంపద 2017లో రూ.20.9లక్షల కోట్లు వృద్ధి చెం దింది. పెరిగింది. ఇది మనదేశ 2017-18 వార్షిక బడ్జెట్‌తో సమానం. అదేవిధంగా, మనదేశంలో లక్షాధికారుల సంఖ్య గణనీయంగా పెరిగింది.
- 2010 నుంచి గమనిస్తే, భారత్‌లో బిలియనీర్ల సంపద ఏడాదికి సగటున 13శాతం పెరిగింది. సాధారణ ఉద్యోగి సందపతో పోలిస్తే ఇది ఆరు రెట్లు ఎక్కువ. సాధారణ పౌరుల సంపద వృద్ధి గరిష్టంగా 2శాతానికి మించడం లేదు.
- గతేడాది ఇండియాలో కొత్తగా 17 మంది బిలియనీర్ల జాబితాలో చేరారు. ఈ సంఖ్య ఇప్పుడు 101కి చేరింది. బిలియనీర్ల ప్రస్తుత సంపద విలువ రూ. 20.7 లక్షల కోట్లు. గతేడాది ఇదే సమయంలో వారి సంపద 4.89 లక్షల కోట్లుగా ఉంది. సంపన్నుల డబ్బుతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విద్య, వైద్య బడ్జెట్‌ను భర్తీచేయవచ్చు. టాప్ 10శాతం మంది ప్రజలు 73శాతం సంపదను కలిగివున్నారు. 37శాతం ఇండియన్ బిలియనీర్లు కుటుంబ వారసత్వంగా సంపదను కూడబెట్టారు. దేశంలోని 51శాతం సంపద బిలియనీర్ల చేతుల్లో ఉంది. ఇక సంపన్నుల్లోనూ లింగ భేదం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి 10 మంది బిలి యనీర్లలో 9 మంది పురుషులే ఉన్నారు. మహిళా సాధికారిత అట్టడుగు స్థాయి ల్లోనే ఉంది. బిలియనీర్ల జాబితాలో కేవలం నలుగురు మహిళలు మాత్రమే ఉన్నారు. వారసత్వ సంపద చలవతోనే ఈ గుర్తింపైనా దక్కింది. భారత్‌లో ఓ ప్రముఖ కంపెనీలో అధిక వేతనం తీసుకునే ఎగ్జిక్యూటివ్ ఏడాదిపాటు సంపాదించిన మొత్తం గ్రామీణ ప్రాంతంలో కనీస వేతనం తీసుకునే ఓచిన్న ఉద్యోగి సంపాదించడానికి దాదాపు 941 ఏళ్లు పడుతుందని సర్వే తెలిపింది. ఇదే అమెరికాలో అయి తే ఓ ప్రముఖ కంపెనీ సీఈఓ ఒక్క రోజు తీసుకునే వేతనాన్ని, సాధారణ ఉద్యోగి చేరుకోవాలంటే ఏడాది కాలం శ్రమించాల్సిందే. భారత్ లోని ప్రఖ్యాత గార్మెంట్ పరిశ్రమలో గరిష్ట వేతనం పొందే సీఈవో 17.5 రోజుల సంపాదనను చేరుకునేందుకు గ్రామీణ ప్రాంత కూలీకి 50 ఏళ్లు పడుతుంది. బాగా డబ్బున్న ఆ ఒక్క శాతం మందికి పెద్ద మొత్తంలో పన్నులు వేయా లని మెజార్టీ ప్రజలు అభి ప్రా యపడ్డారు. పేద-ధనిక వర్గాల మధ్య పెరుగుతున్న అంతరంపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని 73 శాతం మంది స్పష్టంచేశారు. ప్రపంచవ్యాప్తంగా పది దేశాల్లోని లక్షా 20 వేల మంది అభిప్రాయాలను ఈ సర్వే సేకరించింది.



అందరి కోసం పనిచేయండి: ప్రభుత్వానికి ఆక్స్‌ఫామ్ సూచన

దేశ ఆర్థిక వ్యవస్థ అందరికి కోసం పనిచేయాలని, కొద్ది మందికి మాత్రమే పరిమితం కావొద్దని భారత ప్రభుత్వానికి ఆక్స్‌ఫామ్ ఇండియా సీఈవో నిషా అగర్వాల్ సూచించారు. దావోస్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటున్న నేపథ్యంలో ఈమేరకు అభిప్రాయపడింది. కార్మికులు, శ్రామికులను ప్రోత్సహించేలా చర్యలు ఉండాలి. సమ్మిళిత వృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయి వాళ్లకు చేరాలి. ఎక్కువ ఉద్యోగాలు సృష్టించడం ద్వారా ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు కృషిచేయాలి. వ్యవసాయ రంగంలో పెట్టుబడులను పెంచాలి. ప్రస్తుతం అమలులో ఉన్న సామాజిక భద్రత పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేయాలి. పన్ను ఎగవేత దారులను మూసివేయాలి. అలాంటి వారిపై కఠిన చర్యలకు విధానాలు రూపొందించాలి. కార్పొరేట్ ట్యాక్స్ పరిధిని తొలగించి, అత్యంత సంపన్నులకు ఎక్కువ పన్నులు విధించాలని భారత ప్రభుత్వానికి సూచనలు

అందరికోసం పనిచేయండి ఆక్స్‌ఫామ్

చేసింది. సీఈవోల వేతనాల్లో 60శాతం కోత విధించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. కార్మికుల వేతనాలు, పరిస్థితులకు విరుద్ధంగా వాటా దారులు, కార్పొరేట్ బాసులకు రివార్డులకు అనుకూలంగా చర్యలు అసంబద్ధమని వ్యాఖ్యానించింది. కార్మికుల హక్కుల్లో కోత విధించాలన్న ఆక్స్‌ఫామ్, ప్రభుత్వ విధాన నిర్ణయాలపై పారిశ్రామిక దిగ్గజాల ప్రభావాన్ని నియంత్రించాలని సూచించింది. గరిష్ట ప్రయోజనాల కోసం, వ్యయాలను కనీస స్థాయికి కార్పొరేట్ సంస్థలు తగ్గించుకుంటున్నాయని తెలిపింది.

"బిలియనీర్ల సంపద వృద్ధిచెందడం ఆర్థికాభివృద్ధికి సంకేతం కానేకాదు. ఒకరకంగా ఇది విఫల ఆర్థిక వ్యవస్థకు సంకేతం. దేశానికి ఆహారం అందించేందుకు, మౌలికరంగ నిర్మాణానికి, పారిశ్రామిక వృద్ధి కోసం ఫ్యాక్టరీల్లో ఎంతో శ్రమిస్తున్న పనిచేస్తున్న మెజార్టీ ప్రజలు తమ కుటుంబ సభ్యులకు రెండు పూటల తిండి కూడా ఇవ్వలేక పోతున్నారు. పిల్లలకు సరైన విద్య, వైద్యం అందించలేని దుస్థితిలో ఉన్నారు. అభివృద్ధి విభజన ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేస్తుంది. దీనిమూలంగా పెట్టుబడి దారీతత్వం, అవినీతి పెచ్చుమీరుతుంది" -

నిషా అగర్వాల్ (ఆక్స్‌ఫామ్ ఈవో)

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 23 జనవరి 2018

ఏది లాభదాయకమైన పదవి?

ఢిల్లీలో ఇరవై మంది ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శి పదవుల్లో కొనసాగడం ద్వారా లాభదాయక పదవులను అనుభవించారన్న ఆరోపణను పురస్కరించుకుని వారి సభ్యత్వాలను రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రపతికి సిఫార్సు చేయడం,ఆయన వెంటనే ఆమోదించడంతో ఈ వ్యవహారం రాజకీయ మలుపు తీసుకుంది. పార్లమెంటరీ కార్యదర్శులను నియమించడం రాజ్యాంగ విరుద్ధమని వివిధ హైకోర్టులు గతంలో ఇచ్చిన తీర్పుల్లో వెల్లడైంది. శాసనసభ్యులను పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించడం అనేది తెలుగు రాష్ట్రాల్లో కూడా జరిగింది. మద్రాసు నుంచి ఆంధ్రరాష్ట్రం విడిపోయిన తర్వాత తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారి కేబినెట్ లో రాజమహేంద్రవరానికి చెందిన స్వాతంత్ర్యయోధుడు క్రొవ్విడి లింగరాజు పార్లమెంటరీ కార్యదర్శిగా వ్యవహరించారు.అలాగే, అవిభక్త ఆంధ్రప్రదేశ్ లో నలభై ఏళ్ళ క్రితం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో రాజమహేంద్రవరం ఎమ్మెల్యే తటవర్తి సత్యవతితో సహా పలువురు పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమితులయ్యారు. అయితే,అప్పట్లో అభ్యంతరాలేవీ రాకపోవడం వల్ల వారు ఆయా పదవుల్లో కొనసాగారు. పార్లమెంటరీ కార్యదర్శి నియామకం రాజ్యాంగం లోని164(1ఎ)కి విరుద్ధమని కోల్‌కతా హైకోర్టుతో సహా వివిధ హైకోర్టులు తీర్పు ఇచ్చాయి.2015లో బెంగాల్‌లో 24మంది పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాన్ని కోల్‌కతా హైకోర్టు కొట్టివేసింది.అదే సమయంలో తెలంగాణలో పార్లమెంటరీ కార్యదర్శుల నియామకంపై ఉమ్మడి హైకోర్టు స్టే ఇచ్చింది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆప్ సారథి కేజ్రీవాల్ ప్రమాణం చేసిన తర్వాత మంత్రి పదవుల సంతర్పణ పెద్ద సమస్యగా పరిణమించింది. మొత్తం 70 మంది సభ్యులు గల అసెంబ్లీలో రాజ్యాంగం239ఎఎ అధికరణం కింద ఆయన మొత్తం సభ్యుల్లో పదోవంతు మందికి అంటే ఏడుగురికి మాత్రమే మంత్రిపదవులు ఇవ్వగలిగారు.ఆయన పార్టీ తరఫున 67 మంది గెలుపొందడంతో మంత్రి పదవుల కోసం ఒత్తిడి పెరగడంతో, ఆశావహులను సంతృప్తి పర్చేందుకు ఆయన పార్లమెంటరీ కార్యదర్శులుగా తనకు సన్నిహితులైన వారిని ఇరవై మంది వరకూ నియమించారు. రాజ్యాంగం ప్రకారం ముఖ్యమంత్రికి సహాయంగా ఒక్క పార్లమెంటరీ కార్యదర్శిని మాత్రమే నియమించడానికి వీలుంది. పార్లమెంటరీ కార్యదర్శి పదవి లాభదాయకమైన పదవా? కాదా అన్న అంశంపై సరికొత్త పరిణామాల నేపథ్యంలో ఢిల్లీలో చర్చ జరుగుతోంది.పార్లమెంటరీ కార్యదర్శులు వేతనాలు, భత్యాలు తీసుకోరు కనుక, ఆ పదవి లాభదాయకమైన పదవి కాదన్నది కేజ్రీవాల్ వాదన. ఆయన ఆదాయం పన్ను జాయింట్ కమిషనర్ పదవిని గతంలో నిర్వహించడం వల్ల చట్టాల లోతుపాతులు, పన్ను పరిధిలోకి వచ్చే అంశాల గురించి సమగ్రమైన అవగాహన కలిగి ఉన్నారు. అయితే,ఆదాయం పన్ను చట్టాలకూ,ప్రజాప్రాతినిధ్య చట్టాలకూ సంబంధంలేదనీ, పార్లమెంటరీ కార్యదర్శి లాభదాయకమైనదేనని ఆయన ప్రత్యర్థులు వాదిస్తున్నారు. తాను మొదటి నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోడీ విధానాలను వ్యతిరేకిస్తున్నందువల్ల ప్రభుత్వం తనపై కక్ష కట్టిందని కేజ్రీవాల్ ఆరోపిస్తున్నారు. దేశంలో పలు రాష్ట్రాల్లో పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాలు జరిగినా, ఆయా పదవులను నిర్వహించిన ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయకుండా, తమ పార్టీ ఎమ్మెల్యేలనే అనర్హులుగా ప్రకటించడాన్ని ఆయన కక్ష సాధింపు చర్యకు ఉదాహరణగా పేర్కొంటున్నారు. ఆయన ఆరోపణ అలా ఉంచితే, పార్లమెంటరీ కార్యదర్శులనియామకం అనేది రాజ్యాంగ విరుద్ధమనేది వివిధ హైకోర్టులు ఇచ్చిన తీర్పులను బట్టి స్పష్టం అవుతోంది. లాభదాయకమైన పదవి అనే అంశంపై రాజ్యాంగంలో స్పష్టత లేకపోవడం వల్లే ఈ వివాదం పదే పదే తెరమీదికి వస్తోంది. జీతాలు, అలవెన్సులు తీసుకోక పోయినా, ప్రభుత్వ సౌకర్యాలన్నింటినీ పార్లమెంటరీ కార్యదర్శులు వినియోగించుకుంటున్నారు కనుక,అది లాభదాయకమైనదేనని ప్రత్యర్థులు వాదిస్తున్నారు. జాతీయ స్థాయిలో ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ఆప్ ఎమ్మెల్యేల పై వేటు కు కేంద్ర ఎన్నికల సంఘం సిఫార్సు చేయడానికి ముందు,దీనిపై అన్ని స్థాయిల్లో అందరినీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సంప్రదించడం కోసమే ఇంత సమయం తీసుకున్నట్టు ప్రభుత్వం ఇచ్చిన వివరణ సహేతుకంగానే కనిపిస్తోంది. అయితే,చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పదవీ విరమణ చేయడానికి మూడు రోజుల ముందు రాష్ట్రపతికి సిఫార్సు చేయడం,ఆయన వెంటనే ఆమోదించడం వంటి తతంగాలన్నీ చకచకా జరిగి పోవడాన్ని బిజేపీయేతర పార్టీలన్నీ రాజకీయ కోణం నుంచే చూస్తున్నాయి.పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి,తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ కేజ్రీవాల్‌కి మద్దతు ప్రకటించారు.ఈ వివాదంపై సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేసేందుకు కేజ్రీవాల్ తన అంతరంగికులతో సంప్రదింపులు జరుపుతున్నారు. లాభదాయకమైన పదవిపై రాజ్యాంగంలో స్పష్టమైన నిర్వచనంఇచ్చి ఉంటే ఇంత గందరగోళం జరిగి ఉండేదికాదు.

మంచి మాట

అందరూ తనలాగే ధూర్తులు అనుకుని అందర్నీ ద్వేషించేవాడే నిరాశావాది.

● జార్జ్ బెర్నార్డ్ షా

కాంగ్రెస్.. బీజేపీ భవిత ఏమిటి?



పెంటపాటి పుల్లారావు
రాజకీయ విశ్లేషకులు, న్యూఢిల్లీ
ppr193@gmail.com

గుజరాత్ ఎన్నికల ఫలితాలు వెలువడగానే, తాను పునరుజ్జీవన మార్గంలో ఉన్నాననీ, అధికారంలోకి వస్తాననీ కాంగ్రెస్ పార్టీ ప్రకటించుకుంది. కేంద్రంలో గానీ, వివిధ రాష్ట్రాలలో గానీ ఆ పార్టీ 70 సంవత్సరాల పాటు అధికారాన్ని చెలాయించింది. కేంద్రంలో అధికారంలో లేని సమయంలో సైతం కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలకు నాయకత్వం వహించింది. ప్రస్తుతం పంజాబ్, కర్ణాటకలలో మాత్రమే రాజ్యమేలు తోంది. 15 రాష్ట్రాలలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. ఆ పార్టీకి విశ్వసనీయత ఉందనడానికి ఇది చాలు. 2014లో 542మంది సభ్యులున్న లోక్‌సభలో కేవలం 44 సీట్లను గెలుచుకోగలిగింది. ఇది ఆ పార్టీకి తీరని దెబ్బ. అయినప్పటికీ తాను కోలుకుంటానని చెబుతోంది. తనకు రాహుల్ గాంధీ రూపంలో కొత్త అధ్యక్షుడు దొరికాడని సంబరపడుతోంది. ఏది ఎలా ఉన్నా భవిష్యత్తును అంచనా వేయడం చాలా కష్టం. భవిష్యత్తు అంచనా వేయలేనంత ఊహించలేనిదని 200 ఏళ్ళ క్రితం ప్రౌఢన్ అనే ఫ్రెంచ్ ఆర్థికవేత్త అన్న మాటలు ఈ సందర్భంగా గుర్తుతెచ్చుకోవాలి. 2014 ఫిబ్రవరిలో కాదు.. మేలో కూడా నరేంద్ర మోడీ ఇంత భారీ ఆధిక్యతతో అధికారంలోకి వస్తారని ఎవరు ఊహించారు?

కాంగ్రెస్ పార్టీకి లాభాలు

కాంగ్రెస్ పార్టీకి ఎన్నో ఆస్థులున్నాయి. వాటితో పాటు బలమైన నాయకులున్నారు. దేశవ్యాప్తంగా వీరు వ్యాపించి ఉన్నారు. 70ఏళ్ళు పైగా అధికారంలో ఉండడం వల్ల వేలాదిమంది మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకులు పార్టీ సొంతం. పాత్రికేయ నిపుణులు, పాత్రికేయులు, న్యాయవాదులు, వాణిజ్యవేత్తలు, అధికారులు కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా అనుకూలంగా మెలిగారు. ఇప్పుడు పార్టీ అధికారంలో లేదు కాబట్టి, వారంతా దూరంగా జరిగి ఉండవచ్చు, పార్టీ అధికారంలోకి వస్తుందని చిన్నపాటి సూచన కనిపించినా వీరంతా మళ్ళీ చురుగ్గా వ్యవహరించడం ప్రారంభిస్తారు. చేయాల్సిందల్లా తాను అధికారంలోకి రాగలనన్న నమ్మకాన్ని కలిగించడమే. ఈ రకమైన ప్రచారాన్ని చేయించుకోవడంలో ఆయన తెలివిగా వ్యవహరించగలగాలి.

మునిగిపోయే ఓడలోకి గానీ, దగ్గరగా గానీ ఎవరూ వెళ్ళరు. ఇది మానవ నైజం. పార్టీ విషయం అలా కాదు. అధికారంలోకి వచ్చే అవకాశముందని కొద్దిపాటి సూచనలు కనిపించినా కార్యకర్తలు పనిచేయడం ప్రారంభిస్తారు. విరాళాలిస్తారు. భవిష్యత్తులో లాభాల కోసం పెట్టుబడులూ పెడతారు. గుజరాత్ ఎన్నికలలో కాంగ్రెస్ చేసిందిదే. నెలకొన్న గట్టి పోటీ మిగిలిన ప్రతిపక్షాలనూ ఆలోచింపచేసింది. 2019లో మోడీ లేదా బీజేపీ ఓడిపోతారనేదే ఆ సందేహం. ఇదే ప్రతి ఒక్కరి మదిలోనూ మెదిలింది. అందుకే కాంగ్రెస్ ఇప్పుడు మరో అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి సిద్ధమవుతోంది. కర్ణాటక, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌ఘర్ రాష్ట్రాలలో రెండు కీలకమైన రాష్ట్రాలలో కాంగ్రెస్ బీజేపీ మాత్రమే ముఖాముఖి తలపడుతున్నాయి. ఇది కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశం. కాంగ్రెస్‌కు కర్ణాటకలో గెలిస్తే చాలు, బీజేపీ మాత్రం మిగిలిన మూడు రాష్ట్రాలు అంటే రాజస్థాన్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌ఘర్‌లలో తప్పని సరిగా విజయకేతనం ఎగరేయాల్సుంది. భారతీయ జనతా పార్టీకి ఇది అతి పెద్ద సవాలు.

పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘర్, గుజరాత్, అసోం, మధ్య ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఒక పార్టీయే ప్రత్యర్థిగా ఉండడం కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశం. మహారాష్ట్ర, కర్ణాటకలలో కాంగ్రెస్ మిత్రపక్షాలు బీజేపీతో తలపడుతున్నాయి. కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీకి స్థానమే లేదు. ఈ రెండు రాష్ట్రాలలోని 62 ఎంపీ స్థానాలలో బీజేపీ వ్యతిరేక పార్టీలే 60కి పైగా స్థానాలను గెలుచుకున్నాయి. అంటే ఇక్కడి ప్రజలకు ప్రత్యామ్నాయమేదీ కనిపించడం లేదు. బీజేపీకి లేదా కాంగ్రెస్‌కీ మాత్రమే వారు ఓటు వేయగలరు. అనేక రాష్ట్రాలలో బీజేపీ వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలలో గెలుపు గుర్రంపై ఎక్కడం బీజేపీకి చాలా కష్టం.

జాతీయ మీడియాలోని ఒకవర్గం కాంగ్రెస్ పార్టీకి కొమ్ము కాస్తోంది. ఇందుకు కారణాలు అనేకమున్నాయి. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాలు మీడియాతో సంబంధాలను నెరపడంలో అలసత్వాన్ని ప్రదర్శించడం ఇందులో ఒకటి. ఈ మీడియా కాంగ్రెస్‌నూ, రాహుల్ గాంధీనీ ముందుకు తీసుకెళ్ళడమే



ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నాయి. నిజానికి అది ఫలితాన్ని కూడా ఇచ్చింది. మరోవంక, బీజేపీ సోషల్ మీడియా పద్ధతులను కాంగ్రెస్ మక్కీకి మక్కీగా అనుసరించింది. సామాజిక మాధ్యమంపైనే ఎక్కువ ఖర్చుచేస్తోంది. సామాజిక మాధ్యమంపై బీజేపీకున్న ఆధిపత్యం ఇక పోయినట్టే.

బీజేపీ తప్పిదాలు కాంగ్రెస్ పునరుత్థానానికి తోడ్పడుతున్నాయి. కాంగ్రెస్ తనకోసం తాను ఎంతగా తాపత్రయపడినా కానిది, బీజేపీ తప్పిదాల వల్ల అయ్యింది. మెరుగ్గాలేని పరిపాలన, తప్పులు కాంగ్రెస్‌కు అతి పెద్ద అవకాశాన్ని చేతికి అందించాయి. నోట్ బందీ ద్వారా దిద్దుకోలేని తప్పునకు బీజేపీ పాల్పడింది. బీజేపీకి ఇది మరణశాసనం లాంటిది. ఇలాంటి తప్పునకు బీజేపీ పాల్పడి ఉండకూడదు. ప్రస్తుతం బీజేపీ నాయకులెవరూ జీఎస్టీ లేదా నోట్ బందీ ప్రయోజనాల గురించి మాట్లాడడం లేదు. బలహీనమైన మంత్రులు, సమంజసం కాని అధికారుల నియామకాలూ ప్రభుత్వ ప్రతిష్టను మంటకలిపేశాయి. సొంత ఆర్థిక మంత్రిత్వ శాఖే మోడీని ప్రమాదంలోకి నెట్టేసింది. దీనివల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టమేమీ లేదు.

ఆర్థిక మంత్రి వైఫల్యం: ఏ ప్రభుత్వంలోనైనా ఆర్థిక మంత్రి చాలా కీలమైన వ్యక్తి. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిగా ఉండేవారు. పీవీ ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలను అమలు చేసి, మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారు. ఆ తర్వాత యూపీఏ హయాంలో ప్రధానమంత్రి పదవి చేపట్టి పదేళ్ళ పాటు ఆ పదవిలో కొనసాగారు. వస్తు సేవాపన్ను (జీఎస్‌టి) వ్యవహారంలో అరుణ్ జైట్లీ సమర్థంగా వ్యవహరించలేదు. ఆర్థిక వ్యవస్థ విషయంలోనూ ఆయనపై ఆగ్రహం కలగడానికి అదే కారణం. అరుణ్ జైట్లీ గుజరాత్ నుంచే రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన గుజరాత్ ఎన్నికల ప్రచారంలో ఒక్క రోజున కూడా పాల్గొనలేదు. ఆయన హయాంలో ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతింది. ఉద్యోగాలు పోయాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన ఘోరమైన తప్పిదం ఇది. బలహీన మంత్రివర్గం మృతప్రాయమైనది. విషపూరితమైనది.

మోడీ ప్రభుత్వంలో రాజకీయపరమైన లోటు: పూర్వపు కేంద్ర మంత్రివర్గాల్లో కనీసం 15మంది మాజీ ముఖ్యమంత్రులు, పేరొందిన రాజకీయవేత్తలు ఉండేవారు. నరేంద్రమోడీ ప్రభుత్వంలో ఆయన తప్ప సుదీర్ఘ అనుభవం ఉన్న మాజీ ముఖ్యమంత్రులు ఎవరూ లేరు. హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పదకొండు మాసాల పాటు, విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ రెండు నెలలపాటు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ప్రతిభ గల రాజకీయ వేత్తలెవరూ లేరు. సీనియర్ మంత్రుల్లో చాలామంది బీజేపీ ప్రతినిధులుగానే వ్యవహరిస్తున్నారు. వారెవరికీ రాజకీయంగా బలమైన పునాదులు లేవు. ప్రజా జీవితం నుంచి దాదాపు దూరమైనవారే. ఒక్క మాటలో చెప్పాలంటే వారంతా దూదిపింజల వంటి వారే. దీంతో మోడీ ప్రభుత్వంలో పెద్ద అగాధం ఏర్పడింది.

మోడీ,అమిత్ షా: బీజేపీ ఈనాడు దేశంలో అతి పెద్ద రాజకీయ పార్టీ. ఇంత పెద్ద పార్టీకి ప్రచారకర్తలుగా ఇద్దరే ఉన్నారు. ఒకరు ప్రధాని మోడీ, రెండవ వారు పార్టీ అధ్యక్షుడు అమిత్ షా. బీజేపీ ప్రధాన బలహీనత అదే. ఇలాంటి పరిస్థితుల్లో నగరాల్లో ఉన్న వారైతే టెలివిజన్ చానల్స్‌లో బాగా మాట్లాడేందుకు అవకాశం ఉంది. బీజేపీలో ఎదగడానికి ప్రస్తుతం ఎటువంటి అర్హత అవసరం లేదు. అదే మాదిరిగా అన్ని రాజకీయ పార్టీల్లో ఇప్పుడు పార్టీ అధికార ప్రతినిధి పదవి కోసం పెనుగులాట ప్రారంభమైంది. టీవీ షోల్లో కనిపించేందుకు వెంపర్లాడుతున్నారు. ఢిల్లీలో బీజేపీ అధికార ప్రతినిధులుగా వ్యవహరించిన వారంతా కేంద్రమంత్రులయ్యారు, వారంతా రాజ్యసభ సభ్యులుగా మంత్రి పదవులను పొందిన వారే. వీరిలో ఏ ఒక్కరికీ ప్రజల్లో బలం లేదు. ఇదేమీ కొత్త ఫార్ములా కాదు. గతంలో కాంగ్రెస్ అనుసరించిందే.

ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థ: మోడీ అధికారంలోకి వచ్చేనాటికి అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర బాగా తక్కువగా ఉంది. ఆ వాతావరణాన్ని అనుకూలంగా మలుచుకోవడంలో మోడీ విఫలమయ్యారు. 2022నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మోడీ పదే పదే చెబుతున్నారు. ఇంతవరకూ చేసిందేమీ లేదు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది. యువత ఉద్యోగాల కోసం వీధుల్లోకి వస్తోంది. నిజానికి ఈ రెండు రంగాల్లో పరిస్థితులు చక్కదిద్దడం పెద్ద కష్టమేమీ కాదు. సమస్య తీవ్రతను అర్థం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. మోడీ ప్రభుత్వ పెద్ద బలహీనత ఇదే.

కాంగ్రెస్ పుంజుకుంటుందా?: 2019లో అధికారాన్ని పొందలేమన్న సంగతి కాంగ్రెస్ నాయకులకు తెలుసు. బీజేపీ 2004 నుంచి 2014వరకూ పదేళ్ళ పాటు ప్రతిపక్షంలో ఉంది. కాంగ్రెస్ తాను తిరిగి పుంజుకోగలనన్న అభిప్రాయాన్ని జనంలో కలిగించాలి. వాణిజ్యవేత్తలు, ఇతర రంగాలకు చెందిన వారి మద్దతు కూడగట్టాలి. తన ఉనికిని కాపాడుకునేందుకు కాంగ్రెస్ మీడియాపై దృష్టిని కేంద్రీకరించింది. ఫొటోలు దిగడానికి రోడ్డుషోలు సులభమైనమార్గం. ప్రజలను తరలించాల్సిన అవసరం లేదు. ఇకపైన కాంగ్రెస్ మరిన్ని రోడ్డు షోలనూ, టీవీ గోష్టుల్లోనూ కనిపించవచ్చు. కొత్త వివాదాలను, సమస్యలను సృష్టించవచ్చు.

బీజేపీకి ప్రత్యామ్నాయం కాగలనని నిరూపించేందుకు కాంగ్రెస్‌కు ఇప్పుడు మిత్రులు కావాలి. మహారాష్ట్రలో మాజీ రక్షణమంత్రి శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), కర్నాటకలో మాజీ ప్రధాని దేవెగౌడ నేతృత్వంలోని జనతాదళ్ (ఎస్), ఒడిషాలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ (బీజేడీ)లను మిత్ర పక్షాలుగా చేర్చుకునేందుకు కాంగ్రెస్ తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ మూడు పార్టీలను తన శిబిరంలోకి ఆకర్షించగలిగితే కాంగ్రెస్ ఇంకేమీ చేయనవసరం లేదు. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీకి చెప్పుకోదగిన బలం లేదు. 2014కి ముందు బీజేపీ ఇతర రాష్ట్రాల నాయకులను దిగుమతి చేసుకునేది. ఇప్పటికీ స్థానిక నాయకుల్లో పేరున్న వారెవరూ లేరు. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి కూడా అంతే, 2014ఎన్నికల తర్వాత ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణల్లో పేరున్న నాయకులెవరూ బీజేపీలో చేరలేదు. ఎన్నికల ముందు చేరిన వారంతా ఇప్పుడు జారుకుంటున్నారు. కర్నాటకలో పరిస్థితి ఇందుకు భిన్నం. అక్కడ బీజేపీలో పదవీ కాంక్ష ఉన్న నాయకులు ఎక్కువమంది ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి యెడ్యూరప్ప, డజన్ల కొద్దీ మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు ఉన్నారు. దీంతో అక్కడ బీజేపీని ఎదుర్కొనడంలో ప్రస్తుత ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిద్దరామయ్య పని సులభమైంది. ఆయన పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మీద కూడా ఆధారపడటం లేదు. పాత ముఖాలు జనానికి రోత పుట్టిస్తున్నాయి. బీజేపీలో పాత నాయకులు తప్పుకునేట్టు చేయడంలో బీజేపీ కేంద్ర నాయకత్వం విఫలమవుతోంది. వీరంతా 1983 నుంచి కొనసాగుతున్న వారే. మహారాష్ట్ర, కర్నాటక, ఒడిషాల్లో కాంగ్రెస్ కొత్త మిత్రులను సంపాదించుకోకుండా చూడటం ప్రస్తుతం బీజేపీ ముందున్న సవాల్. రాజకీయ పరిభాషలో చెప్పాలంటే, శత్రువుని జయించడం కాదు, శత్రువు గెలుపొందకుండా చూడటం ముఖ్యం. బీజేపీ గెలుపొందడానికి లేదా ఎందుకు ఓడిపోతుందో చెప్పడానికి విశ్లేషకులు, రచయితలు చెప్పేందుకు ఎన్నయినా కారణాలు ఉంటాయి. కానీ, చివరికి కొన్ని కారణాలు మాత్రమే కనిపిస్తాయి. కాంగ్రెస్ వివిధ కులాల నాయకులపై కాంగ్రెస్ ఎక్కువగా ఆధారపడుతోంది. వారి వల్ల కాంగ్రెస్‌కి నష్టమే కానీ, లాభం లేదు.

ఈ కింది చర్యలు తీసుకుంటే కాంగ్రెస్‌ని బీజేపీ నిలువరించవచ్చు

ఎ) ఒడిషాలో నవీన్ పట్నాయక్‌తోనూ, కర్నాటకలో దేవెగౌడతోనూ పొత్తు కుదుర్చుకోవాలి. మహారాష్ట్రలో శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని చీల్చాలి. పవార్ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏలో చేరకపోవచ్చు.

బి) ఆర్థికమంత్రి కొత్తగా జనంపై భారం మోపకుండా చూడాలి. కొత్తగా పన్నులు వేయకుండా చూడాలి.

సి) ఎన్నికలు జరగనున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్‌లలో అధికారాన్ని నిలబెట్టుకోవాలి.

డి) చమురు ధరలపై కన్నేసి ఉంచాలి. 2015 తర్వాత మొదటిసారిగా క్రూడ్ ధర బ్యారల్‌కు 80 డాలర్లు దాటింది. చమురు ధర పెరిగితే మోడీ,ఆయన ప్రభుత్వం బలహీన పడుతుంది. కొత్తగా ఉద్యోగాలు సృష్టించలేదు. ధరలను అదుపు చేయలేదు. 2014 తర్వాత ఆర్థిక వ్యవస్థ నిర్వహణ లోపం వల్ల ఎన్నో నష్టాలు వాటిల్లాయి.

ఇ) అమిత్ షా రాజకీయాల నిర్వహణలో ఆరితేరిన వాడు. రాజకీయ నాయకులు ఆయన మాట నిలబెట్టుకుంటారని గౌరవిస్తారు. ఆయనపై ఇప్పటికే భారం పెరిగింది. అన్నింటిపైనా ఆయన దృష్టిని కేంద్రీకరించలేరు.

ఎప్పటికప్పుడు పుట్టుకొచ్చే సమస్యలను పరిష్కరించేందుకు బీజేపీలో కొత్త నాయకులు తయారుకావాలి, మోడీయే ఇప్పటికీ జనాదరణ కలిగిన నాయకుడు. ఆయన ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తడబడుతున్నారు. 2019లో జరిగేవి ఒక ముఖ్యమంత్రికి, ఒక రాష్ట్రానికి సంబంధించిన ఎన్నికలు కావు. ఈరోజుకి కూడా దేశ ప్రజలు మోడీ నాయకత్వాన్నే కోరుకుంటున్నారు. ఆయన విదేశాల్లో మన ప్రతిష్టను బాగా పెంచారు. బ్రిటన్ మాజీ ప్రధాని ఒకరు చెప్పినట్టు రాజకీయాల్లో వారం రోజులు సుదీర్ఘ కాలమే. 2019కి ఇంకా 16మాసాల గడువు ఉంది.

మరణ రహస్యం వీడని మహనీయుడు

జాతి జీవించి ఉండాలంటే, వ్యక్తి మరణించవలసిందే, భారతదేశం స్వాతంత్ర్యం పొందాలంటే నేను మరణించవలసి ఉంటుంది అని చాటిన దేశభక్తుడు - సుభాష్ చంద్రబోస్.

సుభాష్ చంద్రబోస్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. స్వాతంత్ర్య సముపార్జనకు పోరాటమే మార్గమని నమ్మి, ఆచరించాడు. గాంధీ మాటే వేదంగా చెల్లుబాటవుతున్న కాలంలో అహింసావాదంతోనే స్వరాజ్యం లభిస్తుందని భావిస్తున్న తరుణంలో బోస్ గాంధీజీని ధిక్కరించారు. బ్రిటిషర్లను పారద్రోలడానికి మిలిటెంట్ పంథాను ఎంచుకున్నారు.



నేడు జయంతి

బోస్ జనవరి 23, 1897 ఒరిస్సాలోని కటక్‌లో జన్మించాడు. 1920 లో భారతీయ సివిల్ సర్వీసు పరీక్ష రాసి, నాలుగో ర్యాంకు పొందాడు. 1921లో ఇండియన్ సివిల్ సర్వీసు నుండి వైదొలగి భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. కాంగ్రెస్‌లో సహాయ నిరాకరణోద్యమ సమయంలో మహాత్మా గాంధీ బోస్‌ను కలకత్తా పంపాడు. అక్కడ చిత్తరంజన్ దాస్‌తో కలిసి బెంగాల్‌లో ఉద్యమం నిర్వహించాడు. భారత జాతీయ కాంగ్రెస్‌కు హరిపురలో 1938లో, త్రిపురిలో 1939 లలో రెండు సార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. గాంధీజీ అభిరుచికి వ్యతిరేకంగా పట్టాభి సీతారామయ్యను ఓడించి సుభాస్ చంద్రబోస్ అధ్యక్షునిగా ఎన్నికవడం గాంధీజీలో వ్యతిరేక బీజాలు నాటాయి. గాంధీజీతో సిద్ధాంతపరంగా విభేదించి 1939లో కాంగ్రెస్‌కు రాజీనామా చేశాడు. గాంధీ అహింసా వాదంతో స్వాతంత్ర్యం సిద్ధించదని భావించి, పోరాటమే సరియైన మార్గమని భావించి 1939 సంవత్సరంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అనే రాజకీయ పార్టీని స్థాపించాడు. బ్రిటిష్ ప్రభుత్వం ఇండియాను సంప్రదించకుండా యుద్ధం ప్రకటించడంతో బోస్ ఆగ్రహించి, వైస్రాయ్ లార్డ్ లిన్‌లిత్‌గోకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాడు. ప్రభుత్వం అందుకు బోస్‌ను జైలులో పెట్టింది. 7 రోజులు నిరాహారదీక్ష చేయడంతో విడుదల చేసింది కానీ అతని ఇంటిని పర్యవేక్షణలో ఉంచింది. నిర్బంధం అధికమవడంతో 1941 జనవరి 19న కలకత్తాలోని ఎల్జిన్‌రోడ్‌లో గల తన ఇంటినుంచి పఠాన్ లాగా వేషం వేసుకుని, తప్పించుకుని పెషావర్ చేరుకున్నాడు. 1941 జనవరి 26న ఆఫ్ఘనిస్తాన్ వాయవ్య సరిహద్దు ప్రాంతం ద్వారా కాబూల్ ద్వారా ప్రయాణించి సోవియట్ యూనియన్ సరిహద్దుకు చేరుకున్నాడు. బ్రిటన్‌తో రష్యాకు ఉన్న వైరం వల్ల సహాయం లభిస్తుందని భావించగా వారు అతనిని మాస్కోకు పంపి, జర్మనీ రాయబారి షూలెన్ బర్గ్‌కి అప్పగించారు. వారతణ్ణి బెర్లిన్ పంపారు. అక్కడ హిట్లర్ కుడిభుజం అయిన రిబ్బెన్ ట్రాప్ నుండి మరియు విల్‌హెల్మ్ స్ట్రాస్ నుండి మద్దతు లభించింది. ఆఫ్ఘనిస్తాన్, రష్యా, ఇటలీ మీదుగా జర్మనీ చేరుకున్న బోస్ జర్మన్‌ల సహకారంతో ఆజాద్ హింద్ రేడియో మొదలుపెట్టి ప్రసారాలు మొదలుపెట్టాడు. బెర్లిన్‌లో స్వతంత్ర భారత కేంద్రం స్థాపించాడు. ఉత్తర ఆఫ్రికాలో బ్రిటిష్ సైన్యంలో భాగంగా ఉండి, అగ్ర రాజ్యాలను బందీలైన 4500 భారతీయ సైనికులతో ఇండియన్ లెజియన్ ప్రారంభించాడు. ఆశించిన దానికి విరుద్ధంగా హిట్లర్ వ్యవహరించడంతో ఒక జర్మన్ జలాంతర్గామి యు-180 లో గుడ్‌హూప్ అగ్రం మీదుగా ఆగ్నేయ ఆసియాకు బయలుదేరాడు. జపాన్ జలాంతర్గామి ఐ-29 లోకి మారి జపాన్ చేరుకున్నాడు.

జపాను ప్రభుత్వం అందించిన సైనిక, ఆర్థిక, దౌత్య సహకారాలతో ఆజాద్ హిందూ ఫౌజ్‌ను 1942 సెప్టెంబర్ లో సింగపూర్‌లో నెలకొల్పాడు. వారి యుద్ధ నినాదం ఛలో ఢిల్లీగా మారింది. నాటి నుంచే బోస్‌ను నేతాజీగా పిలువసాగారు. బోస్ పిలుపుతో చాలామంది సైన్యంలో చేరి, ఆర్థికసహాయం కూడా అందించారు. జపాన్ ప్రభుత్వం తమ ఆధీనంలోకి వచ్చిన అండమాన్ నికోబార్ దీవులను ఆజాద్ హిందూ ఫౌజ్‌కు దత్తం చేసింది. ఈ సైన్యంలోని దళాలు ఆజాద్ హిందూ ప్రభుత్వాధీనంలో ఉండేవి. ఫౌజ్ 3000 వేల మంది సైనికులతో భారత దేశానికి బయలుదేరి అస్సాంలోని కోహిమాను ఆక్రమించి ప్రభుత్వాన్ని నెలకొల్పింది. తర్వాత ఇంఫాల్ సమీపంలోని మోయిరాంగ్ అనే ప్రాంతాన్ని ఆక్రమించింది. కాలక్రమేణా ప్రకృతి విపత్తుల సంభవించడం వల్ల ఆహారం సక్రమంగా లభించక సైన్యం నిర్వీర్యం కాసాగింది. 1945 నాటికి ఫౌజ్ దళాలను బ్రిటిష్ సైన్యం ఓడించి బర్మాను ఆక్రమించినాయి. ఆజాద్ హింద్ ఫౌజ్ శకం ముగిసింది.

1945 ఆగస్టు 18న తైవాన్ మీదుగా టోక్యోకు ప్రయాణిస్తుండగా విమాన ప్రమాదంలో బోసు మరణించాడని జపాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. కానీ బోస్ శవం మాత్రం కనుగొనలేకపోవడంతో మరణంపై చిక్కుముడి నెలకొంది. బోస్ మరణంపై నెలకొన్న సందిగ్ధతను నిగ్గు తేల్చడానికి భారత ప్రభుత్వం 1956 మే నెలలో షానవాజ్ ఖాన్ కమిటీని జపాన్ పంపించి, విచారించింది కానీ ఫలితం శూన్యం. తరువాత 1999 -2005లో ముఖర్జీ కమిషన్ విచారణ చేపట్టి, బోస్ మరణించలేదని తన నివేదికను నవంబర్ 8, 2005న ప్రభుత్వానికి సమర్పించింది. భారత ప్రభుత్వం మాత్రం ముఖర్జీ కమిషన్ నివేదికను తిరస్కరించింది. ఆ త్యాగ పురుషుని జయంతిని దేశ్ ప్రేమ్ దివస్‌గా నిర్వహిస్తూ, ఉద్యమ వీరగాథను స్మరించుకుంటున్నాం.

● ఎ.శ్యామ్ కుమార్, 9848529035

ఉద్యమోద్యోగులను ఆదుకోరూ!

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో ఉద్యోగుల పాత్ర ఎనలేనిది. తెలంగాణ ఉద్యోగులు ప్రజలతో మమైకమై క్విట్ ఇండియాను తలపించేలా పోరాడారు. అలాంటి ఉద్యోగులకు రాష్ట్రం వచ్చిన తరువాత ఆశించిన మేర ఫలితం అందినట్లు ఏకోశాన కనిపించడం లేదు. తెలంగాణ ఉద్యమం మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలు అనే నినాదాల మీద ప్రారంభమైంది. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువగా సీమాంధ్ర ముఖ్యమంత్రులు పాలనలో ఉంది. తెలంగాణ ప్రాంతానికి ఎక్కువ నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదు. ఇప్పటి తెలంగాణ ప్రాంతంలో కూడా కమలనాథన్ కమిషన్ అమలులో ఉన్న కొన్ని డిపార్టుమెంట్లలో ఆంధ్రకు సంబంధించిన ఆఫీసర్లు, ఉద్యోగులు అలాగే ఉండి ఇప్పుడు ప్రమోషన్స్ కోసం సీనియారిటీ విషయంలో తెలంగాణఉద్యోగులపై కోర్టులలో కేసులు వేస్తున్నారు. ఉదాహరణకు ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్ ఇంజనీరు సూర్యాపేట జిల్లాలో పని చేస్తున్నారు. ఆయన కృష్ణా జిల్లా అయిన బెజవాడకు సంబంధించిన వారు. అతని భార్య పిల్లలు అక్కడనే స్థిరనివాసం ఏర్పరుచుకొని ఉంటున్నారు. మరొకాయన పేరు రామకృష్ణ ఇతను కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇంజనీరు. ఆయన పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ డిపార్టుమెంటులో పనిచేస్తూ ఇక్కడ రాష్ట్రానికి చెందిన వారిపై కేసులు పెట్టి వారిని సతమతం చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి వారిని స్వరాష్ట్రాలకు ఎందుకు పంపడం లేదు? వారి వలన ఇక్కడి ఉద్యోగుల వెతలు ఎందుకు పడాలి? దీనిని ప్రభుత్వం ఎందుకు గమనించడం లేదు? వారు వెళ్ళిపోయినట్లయితే ఇక్కడి వారికి ఉద్యోగాలు లభిస్తాయి కదా! అదే భావన ప్రభుత్వానికి రావాలి. దీనిని ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించి అమలు చేసినట్లయితే మేలు చేకూరుతుంది. సునిశితంగా పరిశీలిస్తే పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్, ప్రజారోగ్య ఇంజనీరింగ్ డిపార్టుమెంట్లలో ఎక్కువ భాగం ఉన్నత స్థానాలలో సీమాంధ్ర వాళ్ళున్న విషయం తెలుస్తుంది. తెలంగాణఉద్యోగులు, అధికారులు కూడా ఇందుకు కారణమని చెప్పుకోవచ్చు. కమల్‌నాథన్ కమిషన్‌కు సంబంధిత సమాచారాన్ని సక్రమంగా ఇవ్వకపోవడమే కారణం. ఇక ఇక్కడ పనిచేసే ఉద్యోగులు వారి సంఘాల విషయానికొస్తే ఉద్యోగుల వెతల్నీ, వారికి అందించాల్సిన సహాయ, సహకారాల్నీ ఏ ఒక్క ఉద్యోగ సంఘమూ పట్టించుకోవడం లేదు. ఉద్యమ సమయంలో పాల్గొన్న ఉద్యోగ, ఉద్యమకార్లు రాజకీయంగా అధికార పక్షంలో చేరిపోయి రాజకీయ అధికారాలను అనుభవిస్తూ ఉద్యోగులను పట్టించుకోకపోవడం కారణంగా కనపడుతోంది, ప్రస్తుతానికి తెలంగాణ రాష్ట్రంలో ఏ దైనా సమస్య వస్తే ఎవరూ పట్టించుకునే పరిస్థితి కనపించడంలేదు. ఒకవేళ పట్టించుకున్నట్లయితే సదరు ఉద్యోగిని ఏమి చేస్తారో.. ఏ ఏ ఇబ్బందులకు లోను చేస్తారోననే భయం పట్టిపీడిస్తుంది. ఇంకొక పక్క ఉద్యోగ భద్రతపై మీన మేషాలు లెక్కించడం అందుకని దిక్కుతోచని అయోమయ పరిస్థితి వీటన్నింటిని ప్రభుత్వంలోనున్న అపెక్స్ ఉద్యోగ ప్రతినిధులు గమనించాలి. ఇప్పుడు రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులు చేసిన పాత్ర కనుమరుగైనట్లు కనపడుతుంది అనగా రాష్ట్రం వచ్చిన తరువాత ప్రభుత్వం ఒక్క తెలంగాణ ఇంక్రిమెంటు అని ఇన్సెంటివ్ ఇంక్రిమెంటు ఇచ్చారు. దానివలన ఉద్యోగులకు తన జీతంలో రూ.1000/-గాని 2000/-వేశారు. ఇది మూల వేతనంలో క్యుమిలేటివ్ యాస్పెక్టు కాదు కాబట్టి దీనివలన ఏమీ లాభముండదు, అదేమాదిరిగా 43 శాతం ఫిట్‌మెంటు ఇచ్చారు. ఇది ఏ మాత్రం సరిపడదు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. కొత్త జిల్లాలు ప్రకటన మూలంగా ఉద్యోగుల కొరత బాగానే ఉంది. కింది నుండి పై పోస్టుల వరకు అన్ని ఇంచార్జీల నియామకాలతోనే నడుస్తోంది. కొత్త పోస్టులు ఇంతవరకు వచ్చిన దాఖలాలు లేవు, పని భారం చాలా ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు ఉద్యోగులు, అధికారులు ఎక్కువమంది పదవీవిరమణ చేస్తున్నారు. వాటి మూలంగా పనిభారం ఇంకా ఎక్కువగా పెరిగింది. రిటైరైన అధికారులను ప్రభుత్వం సూపర్‌న్యూమరి పేరుతో అదే పోస్టులో నియమించుకొని వారినే కొనసాగించడం కొసమెరుపు. ఇలాంటి వ్యవహారం తెలంగాణ ప్రభుత్వపు అన్ని శాఖలలోనూ కనిపిస్తోంది. ఎవరికి రాజకీయ పలుకుబడి ఉంటుందో వారే ఆయా పోస్టులలో చెలామణి అవుతున్నారు. ఈ విషయంలో కోర్టుకు వెళితే ప్రభుత్వానికి నోటీసులందాయి. దీనివల్ల వెనక ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్స్ విషయంలో తీరని అన్యాయం జరుగుతుంది. దీనిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, పరిష్కరించాలి. ముఖ్యంగా రిటైర్ అయిన వారిని అదే పోస్టులలో కొనసాగించే బదులు ప్రభుత్వం అందరి ఉద్యోగులకు అలాంటి సదుపాయం కల్పించినట్లయితే బాగుంటుంది. తెలంగాణ రాష్ట్రంలోనే అక్షరాస్యత తక్కువ.

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల ఉద్యమ సమయంలో చేసిన కష్టం బేరీజు వేసుకొని అన్ని రంగాల ఉద్యోగులకు 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయో పరిమితిని పెంచి వారి సేవలను గుర్తించవలసిందిగా కోరుతున్నాం. వారికి రావలసిన ప్రమోషన్స్ వారికి వచ్చేటట్లుగా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. లేకుంటే తెలంగాణ రాష్ట్రం సాధించిన ఉద్యోగ నాయకుల ఆశలు అడియాశలవుతాయి.



కోదాటి శ్యాంసుందర్
9949505780

పదవీ విరమణ
వయోపరిమితి పెంచండి
ఉద్యోగ పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని పెంచాలని తెలంగాణ ఉద్యోగ పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచాలని జేఏసీ కన్వీనర్ కోదాడి శ్యాంసుందర్, కో కన్వీనర్ మల్లెబోయిన శ్రీశైలం సోమవారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని వారు గుర్తు చేశారు. ఉద్యమ నాయకుడిగా ప్రస్తుత ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు రాష్ట్ర సాధనలో ఉద్యోగుల పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 42 రోజులపాటు చేసిన సకల జనుల సమ్మె, సహాయ నిరాకరణ తదితర వాటిల్లో ఉద్యోగులు ఎలా పాల్గొన్నారో సీఎం కేసీఆర్‌కు తెలుసన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇప్పుడు అనుభవం ఉన్న అధికారులు పదవీ విరమణ చేస్తే ప్రభుత్వ పాలనకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందన్నారు. అందుకే పదవీ విరమణ వయస్సును 58 నుంచి 60కి పెంచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నాయీబ్రాహ్మణులు వృత్తి నైపుణ్య శిక్షణ ఉపయోగించుకోవాలి
బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని నాయిబ్రాహ్మణ యువత ప్రభుత్వం ఇస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణను ఉపయోగించుకోవాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం పిలుపునిచ్చారు. తమ శాఖ తరపున నాయిబ్రాహ్మణ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణను ఆయన సోమవారం దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ అనితా రాజేంద్ర, అదనపు సంచాలకులు కె అలోక్ కువూర్, మల్లయ్యబట్టు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 650 మందికి వృత్తి నైపుణ్య శిక్షణను ఇవ్వాలని నిర్ణయించినట్టు బుర్రా వెంకటేశం తెలిపారు. మొదటి దశలో 160 మందికి ప్రారంభించామన్నారు. యువకులకు హెయిర్ స్టైల్స్‌లోనూ యువతులకు బ్యూటిఫికేషన్ కోర్సుల్లోనూ శిక్షణను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వారికి 15 రోజులపాటు శిక్షణను ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్లు కూడా ప్రదానం చేస్తామన్నారు.

గీతం విద్యార్థిని శివాని
హ్యాట్రిక్ గిన్నిస్ రికార్డు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ యూనివర్సిటీలో బీటెక్(సీఎస్ఈ) రెండో సంవత్సరం చదువుతున్న శివాని హ్యాట్రిక్ గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుంది. హ్యాండ్‌మేడ్ పేపర్‌తో రూపొందించిన 2,111 విభిన్న బొమ్మలను ప్రదర్శనకు ఉంచి మూడోసారి గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుంది. గతంలో హ్యాండ్‌మేడ్‌పేపర్‌తో 1,251 విభిన్న బొమ్మలను కొలువుతీర్చి తొలి గిన్నిస్ రికార్డును సాధించగా... ఆ తరువాత 7,011 విభిన్న కాగితం పువ్వులను ప్రదర్శించి రెండోసారి గిన్నిస్ రికార్డును సాధించింది. మూడు గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకున్న శివాని, ఆమె తల్లిదండ్రులను యూనివర్సిటీ ప్రోవీసీ ప్రొఫెసర్ ఎన్ శివప్రసాద్, రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ, జిహెచ్‌బిఎస్ డీన్ అండ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై లక్ష్మణ్‌కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ పోలీస్
దేశంలో నెంబర్ వన్

- ఒకే పోలీసింగ్‌తో నేరగాళ్ళలో భయం
- నేరం చేస్తే శిక్ష పడుతుందని నమ్మకం కలిగించాం
- ప్రతివ్యక్తికి పారదర్శక సేవలు అందిస్తున్నాం
- టెక్నాలజీ సేవల్లో నల్గొండ భేష్
- విలేకరుల సమావేశంలో డీజీపీ మహేందర్ రెడ్డి

నల్గొండ, ప్రభన్యూస్ బ్యూరో : శాంతిభద్రతలకు నిలయం.. ఫ్రెండ్లీ పోలీసింగ్.. నేరరహిత రాష్ట్రంగా మార్చడం.. టెక్నాలజీ వినియోగంలో టాప్.. అత్యంత నాణ్యతా ప్రమాణాలు కలిగిన వ్యవస్థకు దేశంలోనే తెలంగాణ పోలీస్ నెంబర్‌వన్‌గా నిలిచిందని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించి దేశంలోనే కాదు.. ప్రపంచంలో కూడా మొదటివరుసలో నిలిచేందుకు కష్టపడుతున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ నేరం చేసినా నూరుశాతం దొరికిపోతాం.. శిక్ష పడుతుందనే నమ్మకం నేరగాళ్ళలో కలిగించామన్నారు. యూనిఫాం సర్వీసెస్ డెలివరీ సేవలు అమలు చేయడంతో పాటు ఒకటే తరహా పోలీస్ సర్వీస్ చేస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణలోని 800 పోలీస్ స్టేషన్లలో ఎక్కడకు వెళ్ళినా సామాన్యునికి సైతం తక్షణమే స్పందించి సేవలందిస్తున్నామని, ప్రతివ్యక్తి మెచ్చే, నచ్చే విధంగా క్వాలిటీ సర్వీస్ ఇస్తున్నామని డీజీపీ పేర్కొన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్, టెక్నాలజీ వినియోగించడంతో పాటు పని పద్ధతుల్లో మార్పులు తీసుకువచ్చి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. భద్రతను కట్టుదిట్టం చేసి ఆపదలో ఉన్న ప్రతి వ్యక్తికి పారదర్శకంగా, నిస్పక్షపాతంగా సేవలు అందిస్తూ ప్రతి పౌరునిలో నమ్మకాన్ని నిలుపుకుంటున్నామని చెప్పారు. నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని డీజీపీ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్, ఐటిసెల్ కేంద్రాన్ని ప్రారంభించారు.



నేరస్తుల సర్వే, క్రైం రేటింగ్‌పై నల్గొండ, సూర్యాపేట జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం డీజీపీ మహేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలోని పోలీస్ కమిషనరేట్లతో పాటు అన్ని జిల్లాల పర్యటన నల్గొండతో పూర్తయ్యిందన్నారు. ప్రజల అవసరాలకనుగుణంగా పోలీస్ వ్యవస్థ పని చేస్తుందని అన్నారు. ప్రపంచంలోనే గొప్ప పటిష్టమైన వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణలో శాంతి భద్రతలను గాడిలో పెట్టామని చెప్పారు. తద్వారా రాష్ట్రంలో పెట్టుబడులు వచ్చి పరిశ్రమలు నెలకొల్పి మన పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలిగించే విధంగా మార్పులు తీసుకురావడరం జరిగిందని చెప్పారు. దేశ విదేశాల్లో అత్యంత ప్రతిష్టమైన పోలీస్‌వ్యవస్థ ఉండడంతోనే నిర్భయంగా మన పిల్లలను విదేశాలకు చదువుకోసం పంపిస్తున్నామని చెప్పారు. 2018లో అన్ని పోలీస్ విభాగాలు కలుపుకొని ప్రణాళిక ప్రకారం ముందుకు పోయి మరింత ఫలితాలు సాధిస్తామని పేర్కొన్నారు. తెలంగాణను నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఐజి స్టీఫెన్ రవీంద్ర, నల్గొండ, సూర్యాపేట ఎస్‌పిలు డి.వి.శ్రీనివాసరావు, ప్రకాష్‌జాదవ్ పాల్గొన్నారు.

నేర రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం

తెలంగాణ రాష్ట్రాన్ని నేర రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తున్న తరుణంలో పోలీస్ శాఖ దానికి అనుగుణంగా పని చేస్తుందని డీజీపీ ఎం. మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఎస్పీ కార్యాలయం భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి ఎస్పీ ప్రకాష్ జాదవ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేరం చేసిన వారు వంద శాతం పట్టుబడేవిధంగా పోలీస్ శాఖలో టెక్నాలజీని ఉపయోగించి మార్పులు తీసుకువస్తున్నట్లు తెలిపారు. అంకితభావంతో పోలీసులు విధులు నిర్వహించి ప్రజలకు చేరువలో ఉండాలన్నారు. ఇప్పటికే పోలీస్ వ్యవస్థలో అత్యంత వేగంగా టెక్నాలజీని విరివిగా వాడుతున్నట్లు చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని గౌరవంగా స్వాగతం పలికి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా పోలీస్ వ్యవస్థను పటిష్ట పర్చనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పోలీస్ సేవలను పూర్తి స్థాయిలో అందిస్తామన్నారు.

2018 చివరి నాటికి పోలీస్ ప్లానింగ్‌లో పోలీస్‌ల విధుల్లో నాణ్యతను పెంచనున్నట్లు చెప్పారు. ప్రజల వద్దకు పోలీస్ పాలన తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీస్‌ను పరిశీలిస్తుందన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మించే ఎస్పీ కార్యాలయం అన్ని హంగులతో ఈ సంవత్సరం చివరి నాటికి పూర్తి అయ్యేలా చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక ఎస్పీ డిగ్రీ కళాశాలలో డీజీపీకి కలెక్టర్ సురేంద్రమోహన్, ఎస్పీ ప్రకాష్ జాదవ్‌లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయన వెంట సూర్యాపేట జిల్లా కలెక్టర్ సురేంద్రమోహన్, ఐజీ స్టీఫెన్ రవీంద్ర, ఎస్పీ ప్రకాష్ జాదవ్, ఏఎస్పీ ఇస్మాయిల్, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకతో హైదరాబాద్ సీజీజీ భాగస్వామ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కర్నాటక ప్రభుత్వానికి హైదరాబాద్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) వ్యూహాత్మక భాగస్వామి కానుంది. హైదరాబాద్ సీజీజీ అమలు చేస్తున్న కార్యక్రమాలు, సర్వీసులను కర్నాటకకు చెందిన ఉన్నతస్థాయి అధికారుల బృందం పరిశీలించింది. ఆ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రాజీవ్ చావ్లా నేతృత్వంలోని బృందం హైదరాబాద్ సీజీజీని సందర్శించి కార్యక్రమ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదే తరహా సీజీజీ బెంగళూరులో ఏర్పాటుచేసే అంశంపై హైదరాబాద్ సీజీజీ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జేతో చర్చ జరిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇబ్బందికరంగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఐక్యపోరాట కమిటీ డిమాండ్ చేసింది. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి చివరి వారంలో మండల కేంద్రాల్లో సీపీఎస్ వ్యతిరేక జాతా కార్యక్రమాలను చేపట్టాలని సోమవారం జరిగిన ఐక్య కార్యాచరణ కమిటీ నిర్ణయించింది. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసిందని కమిటీ నాయకులు తెలిపారు. సీపీఎస్ మూలంగా వచ్చే నష్టాలను ఎమ్మెల్యేలకు వివరించి సీపీఎస్ రద్దు కోసం రానున్న బడ్జెట్ సమావేశాల్లో సీపీఎస్‌ను రద్దు చేయించేలా చూడాలని కమిటీ తీర్మానించింది. జూలై 2018 నుంచే 11వ పిఆర్‌సీ వేతనాలను అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. ఎం రఘుశంకర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో టిఎస్ యుటిఎఫ్ నేతలు సిహెచ్ రాములు, చావ రవి, టిపిటిఎఫ్ నేత మనోహరరాజు, సయ్యద్ షౌకత్ అలీ, ఎంఎన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రఘునందన్, ఎస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 22న మండల కేంద్రాల్లో ధర్నా : పిఆర్‌టియు

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ



ఫిబ్రవరి 22న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఒక రోజు ధర్నాలు నిర్వహించాలని పిఆర్‌టియు నిర్ణయించింది. సీపీఎస్ రద్దుతోపాటు ఇతర ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 22న మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని సంఘం కార్యవర్గం నిర్ణయించిందని రాష్ట్ర అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి చెన్నకేశవరెడ్డి తెలిపారు.

ఆర్టీసీలో ఉత్తమ డ్రైవర్లకు ప్రోత్సాహకాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీలో ప్రమాదాల రేటును తగ్గించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రవణారావు తెలియచేశారు. ప్రమాదాల నివారణ కోసం ఆర్టీసీ డ్రైవర్లకు నిరంతరం శిక్షణ ఇస్తున్నామన్నారు. భద్రత పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఈ నెల 24న ప్రమాద రహిత డ్రైవర్లకు ప్రోత్సాహక బహుమతులు ప్రధానం చేయ బోతున్నామని వెల్లడించారు. డిపో, రీజియన్, జోన్‌ల స్థాయిలో ఉత్తమ డ్రైవర్లను ఎంపిక చేసి ప్రోత్సా హకాలను ఇవ్వడం జరుగుతుందని రవణారావు తెలిపారు.

జనసంద్రంగా బాసర క్షేత్రం

బాసర/ముథోల్, ప్రభన్యూస్ : పవిత్ర సరస్వతి అమ్మవారి క్షేత్రం నిర్మల్ జిల్లా, బాసర సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని కిక్కిరిసిపోయింది. బస్టాండ్, రైల్వే స్టేషన్, గోదావరి తీరం, రహదారులు పొడవునా భక్తజనం నిండిపోయారు. సరస్వతీ అమ్మవారి జన్మదినం, మూల నక్షత్రం సందర్భంగా సోమవారం నిర్మల్ జిల్లా, బాసర జ్ఞాన సరస్వతీ క్షేత్రంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ జీతేంధర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం వేకువ జామున నుంచి అక్షరభ్యాస పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ రాష్ట్రాల నుండి సుమారు లక్షమంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో తమ చిన్నారులకు





అక్షరభ్యాసాలు జరిపించారు. చదువుల తల్లీ సరస్వతీ క్షేత్రమైన బాసరలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఏర్పడ్డాక రెండో వసంత పంచమి వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ జీతేంధర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు పట్టు వస్త్రాలు సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారు అందరినీ చల్లగా చూడాలంటూ వేడుకున్నారు. సరస్వతీ నమస్తుభ్యం.. అంటూ భక్తులు పూజలు చేశారు. సోమవారం వేకువ జామున 2 గంటల నుంచే ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వేద మంత్రోత్చరణాల మధ్య పూజలు చేశారు. ఆలయంలో భక్తులు బారులు తీరి కనిపించారు. గోదావరి నదిలో సూర్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న మొదటి ఘాట్లో బాసర వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

మేడారం జాతర ఏర్పాట్లపై సమీక్ష
ముస్తాబవుతున్న గిరిజన మ్యూజియం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మేడారం జాతరకు రవాణా ఏర్పాట్లపైన మంగళవారం మేడారంలో ఉన్నత స్థాయి సమీక్ష జరగనుంది. రవాణా మంత్రి మహేందర్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అజ్మీరా చందులాల్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు తధితరులు సమీక్షలో పాల్గొంటారు. భక్తులకు మేడారంలో అవసరమైన ఏర్పాట్లు, వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులను నడిపించడం తదితర అంశాలు సమీక్షించడం జరుగుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. సుమారు 4 వేల బస్సులను మేడారం జాతరకు తిప్పడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అన్ని డిపోల నుండి మేడారంకు బస్సులను తిప్పే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు. అన్‌లైన్ రిజర్వేషన్ పద్ధతిని అందుబాటులోకి తెచ్చామని, గిరిజన భక్తుల కోసం వారి ఆవాసాల నుండి బస్సులు తిప్పడానికి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

మేడారంలో గిరిజన మ్యూజియం ముస్తాబయింది. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా జనవరి 31న మ్యూజియంను ప్రారంభింపచేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను పదిలపర్చడంతో పాటు భావితరాలకు అందించే లక్ష్యంతో మ్యూజియంను నిర్మించారు. గిరిజన సంక్షేమ శాఖ, సాంస్కృతిక శాఖలు సంయుక్తంగా ఈ మ్యూజియం నిర్మించడం జరిగింది. జోడేఘాట్, భద్రాచలంలో ఇప్పటికే ట్రైబల్ మ్యూజియంలను నిర్మించారు. మేడారంలో గిరిజన మ్యూజియం నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 1.60 కోట్లు విడుదల చేసింది. సుమారు రూ. 2 కోట్లకు పైగా వ్యయంతో మ్యూజియం తుది రూపు దిద్దుకుంది. మ్యూజియం నిర్మాణాలు పూర్తయినందున ఇప్పటికే సేకరించిన ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు, జీవనశైలికి సంబంధించిన వస్తువులను మ్యూజియంలో అమర్చడంలో అధికారులు నిమజ్ఞమయ్యారు. ఆదివాసీల ఆచార వ్యవహారాలతో పాటుగా సమ్మక్క సారలమ్మ జననం నుండి మొదలుకొని వీర మరణం పొందే వరకు జీవిత చరిత్ర పూర్తిగా మ్యూజియంలో ప్రవేశించగానే సందర్శకులు తిలకించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు మ్యూజియం క్యూరేటర్ డి. సత్యనారాయణ తెలిపారు. ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు, జీవన శైలికి సంబందించిన వస్తువులను సేకరించి, మ్యూజియంలో అమర్చడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 30 లక్షలు మంజూరు చేసింది. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించి డోలు, సన్నాయి, బాణాలు, వేటకొడవళ్లు, గొడ్డళ్లు, గుమ్ములు, ఆదివాసీలు నివసించే గుడిసెలు, తదితర వస్తువులను వాజేడు, కన్నాయిగూడెం,



ఏటూరునాగారం,మంగపేట, తాడ్వాయి తదితర ప్రాంతాల నుండి సేకరించడం జరిగింది. మ్యూజియంలో అమర్చడానికి పెద్ద సైజు ఫొటోలను కూడా అధికారులు ఇప్పటికే సేకరించారు. కోయ సంస్కృతికి అద్దం పట్టేలా నిర్మించే పూరిగుడిసెలకు ముగ్గులను కూడా ఆదివాసీ మహిళలతోనే వేయించడం జరుగుతుంది. ఆదివాసీల జీవనశైలి, వీరవనితలైన సమ్మక్క సారలమ్మల జీవిత చరిత్రకు సంబంధించి 20 నిమిషాల నిడివిగల లఘు చిత్రాన్ని రూపొందించారు. మ్యూజియంలోని గ్యాలరీలో సందర్శకులకు ఆడియో వీడియో విజువల్స్ ద్వారా వినడం,చూడటం వంటి ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. మేడారంలోని సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణానికి సుమారు 200ల మీటర్ల దూరంలోనే మ్యూజియం నిర్మించడం జరిగింది. మ్యూజియంలో సుమారు 2000లకు పైగా గిరిజనుల వస్తువులను ప్రదర్శించడం జరుగుతుంది. ఇప్పటి వరకు 1600లకు పైగా వస్తువులను సేకరించారు. ఈ నెల 31 నుండి మ్యూజియం సందర్శకులకు అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

మేడారం జాతరకు జాతీయ హోదాకై కృషి


తెలంగాణ కుంభ మేళగా ప్రసిద్దికెక్కి మేడారం సమ్మక్క సారలమ్మల జాతర విశిష్టతను విశ్వ వ్యాప్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి జాతీయ హోదాకై కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కోవా లక్ష్మన్ అన్నారు. సోమవారం హన్మకొండలోని బీజేపీ అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతర చరిత్రను నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని అంతే కాకుండా కంటితుడుపు చర్యగా జాతరకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి నివేధిక పంపించడం సరైంది కాదని ఆయన అన్నారు.

కోడి పందేలపై మా ఆదేశాలను అపహాస్యం చేశారు

హైదరాబాద్ , ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహిస్తున్న కోడి పందేలను నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని తాము జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయకుండా అపహాస్యం చేశారని ఏపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ లపై హైకోర్టు అసహనాన్ని, అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఇక నుంచి కోడి పందేలను నిర్వహించకుడా చూసే బాధ్యత ఏపీ సర్కారుదేనని తేల్చి చెప్పింది.. సంక్రాంతి పండగ సందర్భంగా అక్రమంగా కోడిపందేలు , జూదం తదితర క్రీడలు జరగకుండా తీసుకున్న చర్యలను వివరిస్తూ కార్యాచరణ నివేదికలను సమర్పించాలని తాము ఈ నెల 4న జారీ చేసిన ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, డీజీపీ మాలకొండయ్యలపై హైకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది.

నివేదికలు సమర్పించడంలో అలసత్వం వహించినందుకు గానూ ఈ నెల 29న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఏపీ సీఎస్, డీజీపీలను ఆదేశించింది. కోడిపందేలు జరిగిన తీరును దేశ, విదేశాల్లోని ప్రజలంతా తిలకించారని వ్యాఖ్యానించింది. ఒకవేళ కుడి పందేలను అడ్డుకునేందుకు చేతకాకపోతే , తమ దృష్టికి తీసుకువస్తే, ఆ వ్యవహారాన్ని తామే చూసుకుంటామని అభిప్రాయపడింది. కోడి పందేల్లో ప్రజాప్రతినిధులు సైతం హాజరైనట్లు తాము టీవీల్లో చూసినట్లు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావు లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ ప్రజాహిత వ్యాజ్యాలపై సోమవారం మరో సారి విచారణ చేపట్టి ఈ మేరకు ఆదేశాలు వెలువరించింది. తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా వేసింది. పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలంలోని వెంప, శ్రీరాంపూర్ గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న కోడిపందేలు, జూదం, గుండాట వంటి క్రీడలు యధేచ్ఛగా నిర్వహిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం తీసుకోవడం లేదని పేర్కొంటూ కె.రామచంద్రరాజు హైకోర్టులో ప్రజాహిత వాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

టీడీపీ మండలాధ్యక్షుడు ఆత్మహత్య



మంచిర్యాల, ప్రభన్యూస్ : మంచిర్యాల జిల్లా, నెన్నెల మండల కేంద్రానికి చెందిన తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు రంగు రామాగౌడ్(45) సోమవారం ప్రజావాణిలో పాల్గొని తనకు తీరని అన్యాయం జరుగుతోందని మనస్తాపానికి గురై కలెక్టర్ ముందే క్రిమి సంహారక మందు సేవించి ఆత్మ హత్యాయత్నానికి ప్రయత్నించగా హుటాహుటిన అధికారులు అతన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నెన్నెల మండల కేంద్రానికి చెందిన రంగు రామాగౌడ్ అదే గ్రామానికి చెందిన పలువురు అధికార పార్టీ నాయకులపై చెరువును ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని, అక్రమంగా ఎస్టీ సర్టిఫికెట్ పొందారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టర్‌ను చాలా సార్లు కలిసినప్పటికీ తనకు న్యాయం జరగకపోగా తనపై కొందరు అధికార పార్టీ నాయకులు స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో దాడి చేయడంతో పాటు అట్రాసిటీ కేసు నమోదు చేశారని వాపోతూ కలెక్టర్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన పెద్ద చెరువులో అదే గ్రామానికి చెందిన పల్లం మహేష్‌తో పాటు మరో నలుగురు అధికార పార్టీకి చెందిన నాయకులు ఐదు ఎకరాల భూమిలో శనగ పంట వేసి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని, అదేవిధంగా పల్లం మహేష్ బోయ కులానికి చెందిన వాడైనప్పటికీ అక్రమంగా వీఆర్ఓ, తహసీల్దార్ మద్దతుతో ఎస్టీ సర్టిఫికెట్ పొందాడని ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తాను ఫిర్యాదు చేసినందుకే కక్షకట్టి స్థానిక టీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతి నిధుల అండతో దాడి చేయడంతో పాటు మహేష్ తనపై అట్రాసిటీ కేసు నమోదు చేయించాడని మనస్తాపానికి గురయ్యాడు. గ్రామంలో, మండలంలో జరుగుతున్న అరచకాలపై రామాగౌడ్ ఫిర్యాదు చేయడంతోనే అతనిపై అక్రమంగా ఎస్టీ సర్టిఫికెట్ పొందిన పల్లం మహేష్‌తో అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో రామాగౌడ్ నెల రోజుల పాటు జైలు జీవితం గడిపాడని, దీంతో మనస్తానికిగురై ఆత్మహత్య చేసుకున్నాడని వారు ఆరోపించారు.

తల్లీబిడ్డల ఆత్మహత్య



స్వాతి ఫైల్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇద్దరు చిన్నారులు ఆరోగ్యం బాగాలేక పోవడంతో కలత చెందిన ఓ గృహిణి తన 9 నెలల చిన్నారితోసహా 5 అంతస్తుల భవనంపై నుండి దూకి అత్మహత్యకు పాల్పడిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పిజెఆర్ ఏన్‌క్లేవ్‌లోని సాయి పర్ల్ అపార్ట్ మెంట్‌లో నివాసం ఉంటున్న ప్రదీప్‌కుమార్, స్వాతి దంపతులకు ఇద్దరు సంతానం. మొదటి కుమారుడు 5 సంవత్సారాలు ఉండగా, మరో చిన్నారికి 9 నెలలు. మొదటి సంతానంనకు సరైన పెరుగుదల లేకపోవడంతో రెండో సంతానానికి సైతం ఆరోగ్యం బాగాలేకపోవడంతో స్వాతి నిత్యం కలత చెందింది. తన చిన్నారులకు ఆరోగ్యం కుదుటపడే అవకాశం లేదని ఆవేదన చెంది సోమవారం అపార్ట్ మెంట్ 5 అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనలో స్వాతితో పాటు 9 నెలల పాప మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు రైతుల బలవన్మరణం

భిక్కనూరు/సిరికొండ ప్రభ న్యూస్ : నిజామాబాద్, కామారెడ్డి జిల్లా లకు చెందిన ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన రాములు(40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అంతకుముందు వ్యవసాయం కోసం అప్పులు చేశాడు. ఆ తర్వాత కూతురి పెళ్లి కోసం కూడా అప్పులు చేశాడు. బతుకుదెరువు కోసం అప్పులు చేసి విదేశాలకు వెళ్లి మరింత అప్పుల్లో కూరుకుపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.నిజామాబాద్ జిల్లా, మైలారం గ్రామానికి చెందిన రైతు ఒకరు సోమవారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. రైతు సల్లా మెహర్ రెడ్డి(43) అప్పుల బాధతో తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం మృతుడిని గమనించి ఆయన భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్ కాల్‌డేటా సమర్పణ

హైదరాబాద్ , ఆంధ్రప్రభ : మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు కు సంబంధించిన కాల్ డేటా రికార్డులను పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ హైకోర్టుకు సమర్పించారు. ఆ సాక్ష్యాధారాల ప్రతిని వాదనలు వినిపించేందుకు గానూ పిటిషనర్ తరపు న్యాయవాదికి అందజేయాలని హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను ఆదేశించింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత పిటిషనర్ ప్రాథమికంగా ఆర్థిక సాయం చేస్తున్నట్లుందని హైకోర్టు అభిప్రాయపడింది.



ఫిక్కీ డైరెక్టర్ జనరల్‌గా దిలీప్ చినోయ్

న్యూఢిల్లీ : ఫిక్కీడైరెక్టర్ జనరల్‌గా దిలీప్ చినోయ్‌ను సోమవారం నియమించారు. కాగా చినోయ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ)కి మేనేజింగ్ డైరెక్టర్‌గా.. అలాగే ఆటోమొబైల్ తయారీరం గానికిచెం దిన సియామ్ డిప్యూటీ జనరల్, సీఐఐ డిప్యూటీ జనరల్‌గా పనిచేస్తు న్నారని ఫిక్కీ ఒక ప్రకటనలో తెలిపింది. చినోయ్‌ను గతంలోని కాంగ్రెస్ నేతృ త్వం లోని యూపీఏప్రభుత్వం (ఎన్ఎస్‌డీసీ)కి మేనేజింగ్ డైరెక్టర్‌గా నియ మిం చింది. అయితే స్కిల్ డెవలప్‌మెంట్ సరిగ్గా పనిచేయడం లేదని ఎన్‌డీఏ ప్రభు త్వం అసంతృప్తి వ్యక్తం చేశారు.2015లో ఎన్ఎస్‌డీసీ పద వికి కి రాజీ నామాచేశారు. మాజీ స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూడీ స్కిల్ డెవలప్‌మెంట్ మానవ వనరులను శిక్షణ ఇవ్వడంలో విఫలమైం దన్నారు.

దావోస్‌లో ధాటిగా నిలుద్దాం!



● సేల్స్‌మెన్ పాత్రకాదు... స్టేట్స్‌మెన్‌గా మెరుద్దాం

● ఇండియన్ సీఈవోల ముక్తకంఠం

దావోస్ : భారత ప్రధానమంత్రి నురేంద్రమోడీ ప్రపంచ ఆర్థిక సదస్సులో భారత్ గురించి ఏం మాట్లాడుతారో అని ప్రపంచ దేశాల నాయకులు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. ప్రధాని దావోస్ పర్యటనలో ప్రపంచంలోని టాప్ సీఈవోలతో భేటీ అవుతారు. దేశీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి భారత్ తరఫున ఒకగట్టి నాయకుడిని ఎంపికచేసుకోవాలని.. భారత్‌కు చెందిన పెద్ద కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు. అదే సందర్భంలో ప్రస్తుతం అమెరికా లాంటి దేశాలు రక్షణాత్మక చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో భారత్ తరఫున వాటిని తిప్పికొట్టడానికి మనకు ఒక బలమైన నాయకుడు కావాలని వీరు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఉదయ్‌కొటక్ : ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కొటక్ గత కొన్ని సంవత్సరాల నుంచి దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులకు హాజరవు తున్నారు. భారత్ గురించి బాగా అవగాహన కలిగిన వ్యక్తి అయి ఉండి సేల్స్, మార్కెటింగ్‌కు మధ్య వ్యత్యాసం తెలిసిన వారై ఉండాలి. ఇక్కడ జరిగే సదస్సులో భారత్‌ను చక్కగా ప్రాజెక్టు చేసే బలమైన నాయక ుడు కావాలని ఆయన అన్నారు. ఉదయ్ కొటక్ మాట్లాడుతూ.. డబ్ల్యుఈఎఫ్ భారత్ తరఫున స్పష్టమైన సందేశం ఇవ్వాలని, భారత్ ఆర్థిక వ్యవస్థ తలుపులు అందరికి తెరిసే ఉన్నాయని సంకేతాలు ఇవ్వాలని, దేశీయ ఇన్వెసర్లతో పాటు గ్లోబల్ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను కాపాడుతామని నమ్మకం కలిగించాలన్నారు. దావోస్‌లో భారత్ తన స్థానాన్ని పదిలపర్చుకోవాలని.. ఇక్కడ మన బలమైన నాయకుడుగా స్థిరపడాలి కానీ.. సేల్స్‌మన్‌గా కాదని ఉదయ్ కొటక్ అన్నారు.ప్రస్తుతం ఇక్కడ సరికొత్త భారత్ గురించి వివరించి చెప్పడానికి మంచి అవకాశం లభించిందని ఆయన అన్నారు. చందా కొచ్చార్ మాట్లాడుతూ.. భారత్ ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరం రెండవ సగభాగంలో జీడీపీ వృద్ధిరేటు 7శాతం సాధిస్తుందని.. అన్నీ రంగాలు గాడినపడ్డాయన్నారు.





అజయ్‌సింగ్ : అజయ్‌సింగ్ నష్టాల్లో ఉన్న స్పైస్‌జెట్‌ను గాడిలోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దావోస్‌లో భారత్ విజయగాథలను వివరించడానికి ప్రధాన మంత్రి నరే ంద్రమోడీ కంటే మరో నాయకుడు అవసరం లేదని అన్నారు.

ఎందుకంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ కూడా ఈ సదస్సుకు రానున్నారని, ఆయన వచ్చీ రావడంతోనే అమెరికాలో తాను కార్పొరేట్ టాక్స్ బాగా తగ్గించానని చెబుతారని.. దీంతో అమెరికా కొర్పొరేట్లు పెద్దెత్తున ఉద్యోగాలు సృష్టించాయని, విదేశాల్లో లాభాలను ఆర్జించి అమెరికాకు తీసుకువచ్చాయని చెబుతున్నారని సీఈవోలు పేర్కొన్నారు. కాగా మోడీ మంగళవారం నాడు డబ్ల్యూఈఎఫ్ ప్లీనరీ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. దావోస్‌కు బయలుదేరే ముందుమోడీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ సమాజంతో భవిష్యత్తులో భారత్ కుదర్చుకోబోతున్న భాగస్వామ్యంపై దావోస్‌లో తన అభిప్రాయాలను చెబుతానన్నారు. గ్లోబల్ ఆర్థిక వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లను గురించి ప్రపంచ నాయకుల దృష్టి తీసుకువస్తానన్నారు. అంతర్జాతీయ వ్యవస్థతో పాటు ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను గ్లోబల్ గవర్నెన్స్‌పై ప్రపంచ నాయకులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వాలు, విధాన కర్తలు, కార్పొరేట్, ప్రభుత్వ ఉన్నతాధికారులు అందరూ దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రధాని ట్వీట్ చేశారు.డబ్ల్యుఈఎఫ్ వ్యవస్థాపకుడు, తన మిత్రుడు ప్రొఫెసర్ క్లాస్‌స్కాబ్ ఆహ్వానం మేరకు తాను దావోస్‌కు వెళుతున్నానని, ఈ ఏడాది దావోస్‌లో 'బీటలు వారిన ప్రపంచంలో భవిష్యత్తులోప్రతి దేశం తన వంతు పాత్ర' గురించి ప్రసంగం చేయను న్నారు. ప్రధాని ప్రసంగంలో చేయబోతున్న వ్యాఖ్యలు ఇక్కడ ప్రాముఖ్యం సంతరించుకోనున్నాయి. పలు ప్రపంచ నాయ కులు ఇక్కడ జరుగుతున్న సదస్సులో ప్రపంచ ఎదు ర్కొంటున్న పలు సవాళ్ల గురించి మాట్లాడే అవకా శాలున్నాయి. దీంతో పాటు ప్రపంచంలోని పలు అగ్రరా జ్యాలు శక్తిమంతమైన దేశాలు కూడా ఆర్థికపరమైన రక్షణా త్మక ధోరణి అవలంబించడంపై కూడా ప్రసంగాలు చేయ నున్నారు. ఈ సదస్సుకు జర్మనీ చాన్సలర్ ఏంజిలినా మెర్కిల్, ఫ్రెంచి అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మ్యాక్రాన్, బ్రిటిష్ ప్రధానమంత్రి థెరిసా మేతో పాటు పలు ప్రపంచ దేశాల నాయకులు హాజరుకానున్నారు. స్పైస్‌జెట్‌కు చెందిన సింగ్ మాట్లాడుతూ 140 కోట్ల మంది ప్రజల తరఫును ప్రాతినిధ్యం వహిస్తున్న మోడీ ఇక్కడ తన ప్రభుత్వం తీసుకొచ్చిన పలు సంస్కరణలను గురించి దీంతో వృద్ధిరేటులో భారత్ దూసుకుపోతున్న వైనం గురించి, దేశంలోని జనాభాలో అత్యధిక శాతం యువతతో పాటు ప్రపంచంలోనే అతి పెద్ద మార్కెట్ కలిగి ఉండటంపై మోడీ తన ప్రసంగంలోప్రపంచ నాయకులకు వివరించి చెప్పాలన్నారు. గతేడాదిన చైనా ప్రీమియర్ జిన్‌పింగ్ దావోస్ పర్యటనకు వచ్చినప్పుడు అందరి దృష్టిచైనాపై ఉండిందని.. ప్రస్తుతం అందరి దృష్టి భారత ప్రధాని నరేంద్రమోడీపై ఉండటం సహజమేనని సింగ్ అన్నారు. సింగ్ మాట్లాడుతూ.. తనతో పాటు భారతీయ సీఈవోకు ఇక్కడ భలే డిమాండ్ ఏర్పడిందని.. ప్రతి ఒక్కరూ తమతో సమావేశం కావాలని కోరుతున్నారని.. ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్న పరిణామాలపై అందరిలోనే ఆసక్తి నెలకొని ఉందని సింగ్ అన్నారు.దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు 48సంవత్సరాల చరిత్రలో గతంలో ఎన్నడూలేని విధంగా భారత్ నుంచి పెద్దమొత్తంలో ప్రతినిధులు హాజరయ్యారు.



చందాకొచ్చార్ : ఐసీఐసీఐ బ్యాంకు సీఈవో చందకొచ్చార్ క ూడా ఇక్కడ జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు తప్పకుండా హాజరవ ుతుంటారు. భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా మెరుగుపడుతోందని, అన్నీ రంగాలు గాడినప డుతున్నా యన్నారు. ప్రస్తుతం వృద్ధిరేటులో భారత్ దూసుక ుపోతోందని.. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియో గించుకోవచ్చునన్నారు. ఇక్కడికి వచ్చిన పలువురు భారత సీఈవోలు గ్లోబల్ లీడర్లు.. చాలా మంది ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏం మాట్లాడుతారో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

స్విస్‌మంచుశిఖరాల రిసార్ట్‌లో జరుగుతున్న ఈ సదస్సులకు భారత్ నుంచి 130 సీఈవోలతో పాటు సుమారు 2,000 మంది వ్యాపారవేత్తలు, పలు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, కళాకారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కాగా ఈ సదస్సు శుక్రవారంతో ముగుస్తుంది.



హెల్త్‌కేర్‌కు జాతీయ హోదా కల్పించండి

● అపోలో హాస్పిటల్స్ ఎండీ సునీతా రెడ్డి



న్యూఢిల్లీ : దేశంలో హెల్త్‌కేర్‌కు జాతీయ హోదాఇవ్వాలనుకుంటే .. దీనికి యూనివర్సల్ హెల్త్ ఇన్స్యూరెన్స్‌తో పాటు కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటే దేశంలో హెల్త్‌కేర్‌ను బలోపేతం చేయవచ్చునని అపోలో హాస్పిటల్స్ సోమవారం నాడు తెలిపింది. బడ్జెట్‌లో హెల్త్‌కేర్ రంగానికి కేటాయింపుల్లో ఎలాంటి రాజీ ఉండరాదని ప్రకటనలో పేర్కొంది. కాగా ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.హెల్త్‌కేర్‌కు జాతీయ హోదా కల్పించాలనుకున్నప్పుడు ప్రభుత్వం ఈ రంగంలోకి పెద్దెత్తున పెట్టుబడులను ఆకర్షించాలని, అది పెట్టుబడుల రూపంతో పాటు మేధోసంపత్తి రూపంలో ఆకర్షించగలగాలని, అపోలో హాస్పిటలర్స్ ఎండీ సునీతా రెడ్డి చెప్పారు.హెల్త్‌కేర్ రంగంలో పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్‌తో పాటు ప్రైవేట్ రంగంలో కొన్ని రాయితీలు ఇచ్చి పెట్టుబడులను ఆకర్షించాలని ఆమె పేర్కొన్నారు. దీంతో పాటు ప్రభుత్వం పెద్దమొత్తంలో పన్ను చెల్లించే వారికి ఆరోగ్యంపై చేసేవ్యయంతో పాటు బీమాచెల్లింపులపై రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. ఆరోగ్య బీమాపై యూనివర్సల్‌రేట్లను అమల్లోకి తేవడంతో మేలని ఆమె అన్నారు. హెల్త్‌కేర్ సర్వీసెస్, హెల్త్‌కేర్ ఇన్స్యూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీని సున్నా శాతానికి తీసుకురావాలని, దీంతో వినియోగదారుడి ప్రయోజనాలను కాపాడినట్లు అవుతుందన్నారు. ప్రజలు నాణ్యమైన ఆరోగ్య సేవలను డిమాండ్ చేస్తుంటారని.. దీనికి పెద్దమొత్తంలో పెట్టుబడుటు అవసరంతో పాటు నిపుణులైన మానవ వనరులు కావాల్సి ఉంటుందని.. ప్రస్తుతం ఈ రెండు వైద్యరంగంలో కొరవడి తల్లడిల్లుతున్నాయని సునీతా రెడ్డి వివరించారు. భాగస్వాములందరూ.. ప్రభుత్వం, ప్రైవేట్‌రంగంతో చేతులు కలిపి సరి కొత్త భాగస్వామ్యంలో ప్రైవేట్ రంగంలో వైద్యసేవారంగాన్ని మరింత బలోపేతం చేయవచ్చునని ఆమె వివరించారు.

ఈ ఏడాది టెల్కోలకు మోక్షం

● తగ్గనున్నపోటీ ● పెరగనున్న టారిఫ్

● ఫిచ్ రేటింగ్ ఏజెన్సీ

న్యూఢిల్లీ : టెలికం రంగంలోకి ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో ఎంట్రీ ఇవ్వడంతోచోటా మోటా పోటీ కంపెనీలతో పాటు దేశంలోని అతి పెద్ద టెలికం ఆపరేటర్ భారతి ఎయిర్‌టెల్ కూడా డీలా పడింది. ఈ ఏడాది చివరి నాటికి దేశంలోని టెల్కోలపై ఒత్తిడి తగ్గుతుందని ఫిచ్ రేటింగ్ అంచనా వేసింది. ఎందుకంటే జియో కూడా పోటీ నుంచి క్రమంగా తప్పుకుంటోందని పేర్కొంది. ఫిచ్ అంచనా ప్రకరం ప్రస్తుతం భారతీయ టెలికం మార్కెట్లో టారిఫ్ అత్యంత కనిష్టంగా ఉందని... ఈస్థాయిలో ఇది దీర్ఘకాలం పాటు కొనసాగలేదని,, ఈ ఏడాది నుంచి టారిఫ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. జియో కూడా కస్టమర్లనుపెద్దెత్తున తన ఖాతాలో వేసుకుని ప్రస్తుతం తమ పెట్టుబడులపై లాభాలను ఆర్జిస్తోంది. భారతితో పాటు ఇతర టెలికం కంపెనీలపై లాభాల ఒత్తిడి క్రమంగా ఈ ఏడాది నుంచి తగ్గముఖం పడతాయని పేర్కొంది. 2016లో టెలికం రంగంలో జియో ఎంట్రీ ఇవ్వడంతో ఈరంగంలో పోటీ తారాస్థాయికి చేరింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి భారతి ఎయిర్‌టెల్ కూడా లాభాల బాట పడుతుందని ఫిచ్ పేర్కొంది. దీనికి కారణం మొబైల్ డేటా వినియోగం క్రమంగా పెరగడమేనని తెలిపింది. టెలికం రంగం భవిష్యత్తు గురించి ప్రస్తావిస్తూ.. క్రమంగా ఈ రంగం గాడినపడుతోందని దీనికి కారణం ఈ రంగంలో పోటీ క్రమంగా సమసిపోవడమే కారణమని ఫిచ్ అంచనా వేసింది.



భారత్‌లో విలీనాలు టేకోవర్ల జోరు

● ఎర్నెస్ట్ అండ్ యంగ్

న్యూఢిల్లీ : ఈ ఏడాది విలీనాలు టేకోవర్‌లు జోరుగా కొనసాగే అవకాశాలున్నాయని ఎర్నెస్ట్‌యంగ్ తాజా నివేదికలో పేర్కొంది. ఎర్నెస్ట్ యంగ్ 17వ గ్లోబల్ క్యాపిటల్ కాన్ఫిడెన్స్ బ్యారోమీటర్ (ఇండియా) నివేదిక ప్రకారం దేశీయ మార్కెట్లు స్థిరపడ్డంతో ప్రస్తుతం డిజిటల్‌రంగంలోకి మారుతుండటంతో.. దీంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడంతో పాటు తేలికగా రుణాలు లభించడంతో కంపెనీలు టేకోవర్‌లు విలీనాలపై వైపు మొగ్గుచూపుతున్నాయి. గ్లోబల్ మార్కెట్లో కాస్తా ఒడిదుడుకులున్నా.. భారత్ కార్పొరేట్లు మాత్రం టేకోవర్‌లవైపు మొగ్గు చూపుతున్నాయని.. భవిష్యత్తులో పెద్దెత్తున టెకోవర్‌లు జరిగే అవకాశాలున్నాయని ఈవై మేనేజింగ్ పార్టనర్ అమిత్ ఖండేల్‌వాల్ చెప్పారు. ఈవై అంచనా ప్రకారం 2017లో రికార్డు స్థాయిలో 1.011 ఒప్పందాలు జరిగాయి. వీటి విలువ 40,961 మిలియన్ డాలర్లుగా తేలింది. కాగా ప్రభుత్వం కూడా పెద్దెత్తున సంస్కరణలు పెద్దపీటవేయడంతో కార్పొరేట్లు కూడా టేకోవర్లకు ఉత్సాహం చూపుతున్నాయి. 55శాతం కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు వచ్చే 12 నెలలకాలంలో టేకోవర్‌లు లేదా విలీనాలు అవుతాయన్న భరోసాతో ఉన్నారు.



పెట్రోల్ లీటరు రూ. 80



ముంబై : సోమవారం నాడు ముంబైలో పెట్రోల్ లీటరు రూ.80 మార్కును దాటిపోయిందని ఇండియన్ ఆయిల్ వెబ్‌సైట్లో ప్రకటించింది. ముంబైలో లీటరుపెట్రోల్ రూ.80.10 పలకగా.. కోలకతాలో రూ.74.94, చెన్నైలో రూ.74.91, దేశరాజధాని ఢిల్లలో రూ.72.23కి విక్రయిస్తున్నారు.పెట్రోల్ ధరలు పెరగడానికి ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడమే కారణమని ఆదివారం నాడు కేంద్ర చమురు శాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరణ ఇచ్చారు. పెట్రోల్‌ధరలు పెరగడానికి రాష్ట్రస్థాయిలో పెట్రోల్‌పై సుంకం విధించడం కూడా ఒక కారణమని ఆయనపేర్కొన్నారు.

తమ మంత్రిత్వ శాఖ పెట్రోల్, డిజిల్, కిరోసిన్‌ను వస్తు సేవల పన్ను (జీఎస్టి) పరిధిలోకి తేవడానకి ప్రయత్నిస్తోందన్నారు. త్వరలోనే జీఎస్టి మండిలి తమ ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతుంద్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా చూస్తే పెట్రోల్ ధరలు ముంబైలోనే ఎక్కువగా ఉన్నాయి.

చైనా, పాక్ దిగువన భారత్ ర్యాంకు!

● ప్రపంచ ఆర్థిక సదస్సు సూచిలో.... ● ఆగ్రస్థానంలో నార్వే



దావోస్ : అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థసూచిలో భారత్ ర్యాంకు 62గా నిలిచింది. సూచిలో చైనా 26, దాయాదీ దేశం పాకిస్తాన్ 47తో పోల్చుకుంటే భారత్ ర్యాంకు చాలా చాలా తక్కువే. నార్వే అగ్రస్థానంలో ఉండగా.. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో లుథియేనియా అగ్రస్థానంలో ఉంది. డబ్ల్యుఈఎఫ్ వార్షిక సదస్సు ప్రారంభించడానికి ముందు ఈ జాబితాను విడుదల చేశారు. ఈ సమావేశానికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీదో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా హాజరవుతారు. ఈ సూచిలో ప్రధానంగా పరిగణనలోకి తీసుకొనే అంశాల విషయానికి వస్తే ... ఆయా దేశాల్లో ప్రజల జీవప ప్రమాణాలు, పర్యావరణ స్థిరత్వం, రాబోయే తరాల వారిని మరింత అప్పుల్లో కూరుకోకుండా కాపాడ్డమని డబ్ల్యుఈఎఫ్ ఒక ప్రకటనలోపేర్కొంది. ప్రపంచ నాయకులందరూ తక్షణమే వృద్ధిరేటు.. అభివృద్ధికి సంబంధించి కొత్త మోడల్‌ను తీసుకురావాలని కోరుతున్నారు. ప్రస్తుతం వృద్ధిరేటును కొలువడానికి వినియోగిస్తున్న జీడీపీ స్వల్పకాలిక ఫలితాలను చూపిస్తున్నాయని.. ఫలాలు అందడంలో అసమానత కనిపిస్తోందని చెబుతున్నారు.అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారత్ ర్యాంకు గత ఏడాది 60 కాగా చైనా 15, పాకిస్తాన్ 52వ స్థానంలో ఉన్నాయి. ఈ ఏడాది 2018 సూచిలో మొత్తం 103 దేశాలను పరిగణలోకి తీసుకున్నారు. వాటిని మూడురకాలు విభజించారు. ఒకటి వృద్ధి,అభివృద్ధి, వృద్ధి ఫలాలు అందరికి దక్కుతున్నాయా, అంతర్గత ఎంత సంపద సృష్టించింది. మొత్తం 103 దేశాలను మళ్లీ రెండుగా విభజించారు. వాటిలో 29 దేశాలను అభివృద్ధి చెందిన దేశాలుగా... 74 దేశాలను అభివృద్ధి చెందుతున్న దేశాలుగా విభజించారు. వీటిలోనే మళ్లీ ఐదు సబ్‌కేటగిరీలుగా విభజించాయి. ఐదు సంవత్సరాల పాటు మొత్తం అభివృద్ధి.. అభివృద్ధి రేటు స్కోర్, వృద్ధిరేటు తగ్గిందా.. క్రమంగా తగ్గింది. స్థిరంగా ఉందా.. క్రమంగా అభివృద్ధి బాటలో పడుతుందా అన్నీ లెక్కలోకి తీసుకుంటాయి. భారత్ ర్యాంకు చాలా తక్కువగా ఉన్నా ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో టాప్ 10లో ఉంది. క్రమంగా వృద్ధిరేటులో దూసుకుపోతోంది. అభివృద్ధి చెందుతున్న రెండు దేశాలు మాత్రమే భారత్‌లా వృద్ధిరేటులో దూసుకుపోతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో నార్వే అగ్రస్థానంలో ఉంటే.. తర్వాత స్థానాలు ఐర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, డెన్మార్కులు టాప్ ఐదులో స్థానం దక్కించుకున్నాయి. చిన్న యూరోపియన్ దేశాలు కూడా సూచిలో అగ్రస్థానాలు దక్కించుకున్నాయి. ఆస్ట్రేలియా (9) ఒక్క టే యూరోపియనేతర దేశం టాప్ 10లో స్థానం దక్కించుకుంది. మిగిలిన జీ7 ఆర్థిక వ్యవస్థల విషయానికి వస్తే జర్మనీ (12), కెనెడా 17, ఫ్రాన్స్ 18, బ్రిటన్ 21, అమెరికా 23, జపాన్ 24, ఇటలీ 27వ స్థానాల్లో ఉన్నాయి. టాప్ ఐదు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల విషయానికి వస్తే లుథువేనియా, హంగేరీ, అజర్‌బైజాన్, లాటివియా, పోలంట్‌లున్నాయి. బ్రిక్స్ దేశాల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. రష్యా ఫెడరేషన్ ర్యాంకింగ్ 19 కాగా తర్వాత స్థానాలు చైనా 26, బ్రెజిల్ 37, ఇండియా 62, దక్షిణాఫ్రికా 69గా నిలిచాయి. మూడు రకాల కొలబద్ద ప్రకారం చూస్తే భారత్ ర్యాకు 72 (ఇంక్లూషన్) అభివృద్ధి..వృద్ధిరేటు 66, అంతర్గతంగా సృష్టించిన సంపద ర్యాంకులో 44ర్యాంకుల్లో ఉంది. భారత్‌కు పొరుగున ఉన్న దేశాల విషయానికి వస్తే శ్రీలంక 40, బంగ్లాదేశ్ 34, నేపాల్ 22, భారత్ కంటే మెరుగైన ర్యాంకు సాధించిన దేశాల విషయానికి వస్తే మాలే, ఉగాండా, రవాండా, బురిండి, ఘానా, ఉక్రెయిన్, సర్బియా, పిలిప్పీన్స్, ఇండోనేషియా, ఇరాన్, మెసిడోనియా, మెక్సికో, థాయిలాండ్, మలేషియాలున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చైనా అగ్రస్థానంలోఉంది. 2012 నుంచి జీడీపీ వృద్ధి 6.8 శాతంతో పాటు తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో ఉంది. అయితే గత కొన్ని సంవత్సరాలనుంచి వృద్ధిరేటు కాస్తా వెనుకబడిపోయింది. అభివృద్ధి ఫలాలు అందరికి దక్కడం లేదు.. సామాజిక సమతుల్యం దెబ్బతింటోంది. అయితే జీడీపీ వృద్ధిరేటు కొలడానికి ప్రస్తుతం పాటిస్తున్న పద్ధతిని తప్పించి దాని స్థానంలో కొత్త పద్ధతిని ప్రధానం దేశ సామాజిక ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకొని.. దేశంలోని ప్రతి గృహస్తుడు ఆదాయం, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత, నాణ్యమైన జీవన ప్రమాణాలను కొలబద్దగా తీసుకోవాలని కోరుతున్నారు.

నియంత్రణ సడలింపులుంటేనే...

స్టార్టప్‌లు ఫాస్ట్‌ట్రాక్



హైదరాబాద్ : స్టార్టప్‌లు శరవేగంగా దూసుకుపోవాలంటే నియంత్రణా సంస్థలు నిబంధనలు సడలించాలని ... ఇతర అంశాలు స్నేహపూరిత వాతావరణంలో ఉండాలని సీనియర్ ఐటి రంగానికి చెందిన నిపుణుడు వి బాలకృష్ణన్ అన్నారు. ఫండింగ్‌తో పాటు నైపుణ్యం కలిగి ఉండి గ్లోబల్ మార్కెట్లతో కనెక్ట్ అయ్యేలా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. గత రెండు సంవత్సరాల నుంచి స్టార్టప్ రంగాల్లో పలుమార్పులు చేర్పులు చోటు చేసుకుంటున్నాయని, ప్రస్తుతం ఈ రంగం కాస్తా స్థిరపడిందని.. ఇక ఈ కంపెనీలకు కావాల్సింది ఫండింగ్ (నిధులు)అనీ, అన్నీ కంపెనీలు పెట్టుబడులను ఆకర్షించలేవన్నారు. బీ2సీ స్టార్టప్లకు నిధులు అతి పెద్ద సవాలుగా మారిందని, ఇప్పుడిప్పుడే వాటిలో పెద్ద కంపెనీలు సొంతంగా నిధులు సమీకరించుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. బీ2బీ మార్కెట్లకు ప్రస్తుతం నిధులు అవసరం చాలా ఉందని.. అదే సమయంలో చాలా కంపెనీలు కూడా బీ2బీకి ఫండింగ్ ఇవ్వడానికి ముందుకొస్తున్నాయని, ఎందుకంటే ఈ కంపెనీలకు మూలధనం చాలా చాలా తక్కువ అవసరం ఉంటుందన్నారు. అలాగే ఈ బీ2బీ నుంచి నిష్క్రమించడం కూడా చాలా సులువేనని ఆయన పేర్కొన్నారు. తన అంచనా ప్రకారం చాలా మటుకు వెంచర్ క్యాపిటల్ సర్కిల్స్ బీ2సీ నుంచి తమ దృష్టిని బీ2బీ వైపు మరల్చుతున్నాయన్నారు. ఈ ప్రస్తుతం స్టార్టప్ కంపెనీలు ప్రధానంగా నియంత్రణా సంస్థల నిబంధనలతో ఎక్కువ ఇబ్బందులు పడుతున్నాయని బాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఆదాయపు పన్ను శాఖ నుంచి స్టార్టప్ కంపెనీలకు నోటీసులు అందుతున్నాయన్నారు. తన అభిప్రాయం ప్రకారం కొన్ని నిబంధనలు స్నేహపూరితంగా ఉండేలా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎందుకంటే స్టార్టప్‌లను ప్రారంభించే కంపెనీలు యువకులైన 25 -30 సంవత్సరాల వయసుగల వారు ఈ రంగంలోకి వస్తున్నారని వారినెత్తిన ఒకటేసారి 30 నుంచి 40 చట్టాలను రుద్దడం భావ్యం కాదన్నారు. స్టార్టప్‌ల నిబంధనలు సరళతరంగా ఉండాలని ఆయన అన్నారు. ఇటీవల ఆదాయపు పన్ను శాఖ అన్నీ స్టార్టప్ కంపెనీలకు నోటీసులు జారీ చేశాయని తెలిపారు. స్టార్టప్ కంపెనీలు తాము సమకూర్చుకున్న మూలధనంపై పన్ను చెల్లించాలనడం భావ్యం కాదని బాలకృష్ణన్ పేర్కొన్నారు. స్టార్టప్ నిబంధనల్లో క ూడా స్పష్టత ఉండాలని, నిబంధనలు సరళతరంగా ఉంటేనే స్టార్టప్‌లకు పెద్దమొత్తంలో మూలధనం సమకూర్చుకుని గాడిన పడతాయని..పెట్టుబడులు వస్తే నైపుణ్యం దానంతట అదే వస్తుందని బాలకృష్ణన్ వివరించారు.

'కవ్వాల్'లో మంత్రి జోగు రామన్న



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఏజెన్సీ ప్రాంతంలోని కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులో అటవీ శాఖ మంత్రి జోగు రామన్న సోమవారం పులులు, వన్య జంతు గణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులతో కలిసి సుమారు ఆరు కిలో మీటర్లు టైగర్ రిజర్వ్ ఫారెస్టులో నడిచారు. ఐదేళ్లకోసారి జరిగే ఈ జంతు గణనలో తొలి రోజు మంత్రి రామన్న బృందం చిరుతపులి, ఎలుగుబంటు, నీలుగాయి, కొండ గొర్రెల కాలు ముద్రలను సేకరించింది. మంత్రి కాలినడకన ముందుకు సాగుతూ అందుకు చెట్లను పరిశీలించారు. అందుకు చెట్లు విరచను కొన్ని రకాల జంతువులు గోళ్లతో గీరడం, కొరుక్కొని తిన డం లాంటి గుర్తులను పసిగట్టారు.

'సర్పంచ్ ఎన్నిక విధానం మార్చొద్దు'

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో గ్రామ సర్పంచ్ ఎన్నిక విధానాన్ని మార్చొద్దని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. సర్పంచ్ ఎన్నిక విధానాన్ని మార్పితే అక్రమాలతోపాటు, దౌర్జన్యాలు పెరిగే ప్రమాదం ఉందని, సర్పంచ్‌ను ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నుకునేలా పాత విధానాన్నే కొనసాగించాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్‌ను సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణసోమవారం విజ్ఞప్తి చేశారు.

బోగీలలో సీసీ కెమెరాలు

●రైల్వే బోర్డు చైర్మన్ డీజీ అఖిల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే ఏడాది నాటికల్లా దేశంలోని అన్ని రైల్వే స్టేషన్లలో వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు, భోగీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని రైల్వే బోర్డు డిజి అఖిల్ అగర్వాల్ వెల్లడించారు. దేశంలో 8 వేల రైల్వే స్టేషన్లలో వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చేందు కు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ (ఐరిసెట్) లో సోమవారం జరిగిన 2015 ప్రొబెషనరీల పాసింగ్ అవుట్ ఫంక్షన్ కార్యక్రమంలో అగర్వాల్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులోకి తీసుకు వచ్చేది కేవలం రైల్వేశాఖనే అని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకు రైల్వే ప్రాధాన్యమిస్తోందని, అందుకోసమే 58 వేల ప్రయాణికుల బోగీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రైల్వే ప్రయాణికుల భద్రత, సమయ పాలనకు ప్రాధాన్యమిస్తోందని టెలికమ్యూనికేషన్ విభాగం అదనపు డైరెక్టర్ హెచ్‌కె అగర్వాల్ అన్నారు. ఐరిసెట్ ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తి అయిందని రైల్వే బోర్డు (సిగ్నలింగ్) అదనపు సభ్యుల కాశీనాథ్ చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐరిసెట్ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని సిబ్బందిలో అవగాహన కల్పిస్తోందన్నారు. ఐరిసెట్ సంచాలకులు ఎల్‌సి సిన్హా స్వాగతోపన్యాసం చేశారు.

తిరుపతి, కాకినాడకు ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్ - తిరుపతి, కాకినాడ - సికింద్రాబాద్ మధ్యన ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే తెలియచేసింది. సికింద్రాబాద్ – తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 25న సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 28న తిరుపతిలో బయలుదేరి మరు సటి రోజు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అదే విధంగా కాకినాడ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు 28న కాకినాడలో బయలుదేరి మరుసటి రోజు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

నెల్లూరు ప్రజా ప్రతినిధులతో ద.మ. రైల్వే జనరల్ మేనేజర్ భేటీ

నెల్లూరు ప్రజా ప్రతినిధులతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్‌యాదవ్ సోమవారం సమావేశమయ్యారు. నెల్లూరు ప్రాంతంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ప్రజా ప్రతినిధులకు వివరించారు. మేట్టుపోయే పనుల గురించి వివరించారు. పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి, కావలి శాసనసభ్యులు ఆర్. ప్రతాప్ కుమార్ రెడ్డి, నెల్లూరు శాసనసభ్యులు పి. అనిల్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

స్థానిక పట్టణ సంస్థల ఏర్పాటు వేగవంతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పదిహేను వేల జనాభా దాటిన గ్రామ పంచాయితీలను కొత్తగా స్థానికపట్టణ సంస్థలుగా రూపాంతరం చెందించాల్సిన ప్రక్రియను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా మున్సిపల్ శాఖలోని పలువురు అధికారులకు స్పెషల్ ఆఫీసర్లుగా కీలక బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం పలు గ్రామ పంచాయితీ పరిధిలో జనాభా అవ్యవస్థగా ఉండడం, పంచాయితీలకు, గ్రామాలకు మధ్య దూరం ఎక్కువగా ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం యాభైకు పైగా నగర పంచాయితీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 15వేల జనాభా దాటిన గ్రామపంచాయితీలను గుర్తించడం, అలాగే 1నుంచి 5 కిలోమీటర్ల దూరంగా ఉన్న గ్రామాలను గుర్తించి కొత్తగా స్థానికపట్టణ సంస్థల పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలియచేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా స్థానిక సంస్థలను రూపొందించే ప్రక్రియను ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. ఇందులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు పలు జిల్లాలకు అధికారులను కేటాయించింది. జీహెచ్ఎంసీ సీసీపీ దేవేందర్‌రెడ్డికి మహబూబ్‌నగర్, జోగులాంబ, వనపర్తి, నగర్‌కర్నూల్ జిల్లాలను అప్పగించారు. అలాగే మున్సిపల్ శాఖ డైరెక్టర్ (ప్లానింగ్) బాలకృష్ణకు, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల బాధ్యతలు అప్పగించారు. డీటీసీపీ అధికారి విద్యాధర్‌కు ఆదిలాబాద్, కొమరంభీం, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలను అప్పగించారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న జిల్లాలను ఏడీఎంఏ అధికారి పి. అనురాధకు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు మెప్మా మిషన్ డైరెక్టర్ ఎల్.వందనకుమార్‌కు, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను ఆర్‌డీఎంఏ వరంగల్ క్యాంసన్, నల్గొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ ఎన్. రవికుమార్‌కు, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ డి. జయరాజ్ కెనడీకి అప్పగించారు. ఇక వరంగల్ (అర్బన్), వరంగల్ (రూరల్), జనగాం, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్‌కు ఆర్‌డీఎంఏ హైదరాబాద్ అధికారి షాహిద్ మసూద్‌కు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టింది.

గ్లోబల్ సీడ్ హబ్‌గా తెలంగాణ

●విత్తన విధానంపై రాష్ట్రానికి వచ్చిన ఈజిప్టు బృందం ●మూడు రోజులు విత్తన క్షేత్రాల పరిశీలన ●ఎగుమతి చేసిన 550 మెట్రిక్ టన్నుల విత్తనాలపై సంతృప్తి

●దేశ అవసరాల్లో 60 శాతం రాష్ట్రానిదే: పార్థసారథి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న తెలంగాణ గ్లోబల్ సీడ్ హబ్‌గా అవతరించింది. ఇక్కడి ప్రభుత్వం అవలంభిస్తున్న సమగ్ర విత్తన విధానంపై అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ ద్వారా మార్కెట్లోకి విడుదలవుతున్న వివిధ రకాల విత్తనాలకు మంచి ఫలితాన్నిస్తున్నాయి. దీంతో పొరుగు రాష్ట్రాలే కాదు, విదేశాలకు చెందిన ప్రతినిధి బృందాలు అధ్యయనం కోసం ఇక్కడికి వస్తున్నాయి. అందులో భాగంగానే ఈజిప్టుదేశానికి చెందిన అధికారులబృందం సోమవారం హైదరాబాద్ వచ్చింది. వారంతా వ్యవసాయశాఖకార్యదర్శి సి.పార్థసారథితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గత ఏడాది తమ దేశానికి 550 మెట్రిక్ టన్నుల అంతర్జాతీయ ధృవీకరణ విత్తనాలను ఎగుమతి చేసేందుకు ఈజిప్టు ప్రభుత్వం తరఫున తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తాము తెలంగాణ నుంచి దిగుమతి చేసుకున్న జొన్న, మొక్కజొన్న విత్తనాలు సత్ఫలితాన్నిచ్చాయని తెలిపారు. రానున్న కాలంలో మరింత పెద్ద మొత్తంలో ఇక్కడి నుంచి విత్తనాలను దిగుమతి చేసుకోవాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

తెలంగాణలోని వ్యవసాయ విధానాలు, పద్ధతులు, నాణ్యమైన విత్తనోత్పత్తి తదితర అంశాలపై అధ్యయనం చేయడానికే ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. ఇన్నాళ్లు ఈజిప్టులోని కొన్ని పేరుగాంచిన కంపెనీలు డిమాండ్ మేరకు వివిధ రకాల విత్తనాలను ఎగుమతి చేస్తుండేవని తెలిపారు. అంతర్జాతీయ ఓఈసీడీ విత్తన ధృవీకరణతో ఈ సమస్యను అధిగమించినట్లు ఆ దేశ ప్రతినిధులంతా సంతోషం వ్యక్తంచేశారు. ఈజిప్టు ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వశాఖ నుండి గమల్ అలజట్, కేంద్ర విత్తన ధృవీకరణ పరిపాలన అధిపతి, ఈజిప్టు ఎగుమతి దిగుమతుల బాధ్యులు నేతృత్వంలోని అధికారుల బృందం భారత దేశంలో విత్తన ధృవీకరణ క్రమాన్ని అధ్యయనం చేయడానికి ఐదు రోజుల పర్యటన కోసం ఇక్కడికి వచ్చింది. ఈ బృందంలోని సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలిసి మూడు రోజులుగాను వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, 1998లో నెలస్థాపన పాటు పత్తి ఉత్పత్తి, సాంకేతికతపై శిక్షణ కోసం ఈజిప్టు దేశం సందర్శించినట్లు తెలిపారు. అక్కడి వ్యవసాయమంతా సాగునీటి ఆధారంగా ఉంటుందని, అక్కడి వారు అత్యుత్తమ రైతులని పేర్కొన్నారు. దేశీయ విత్తన ధృవీకరణతో పాటు దేశంలోని ప్రప్రథమ ఆన్-లైన్ విత్తన ధృవీకరణ క్రమం, అంతర్జాతీయ విత్తన ధృవీకరణ, సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణలపై సంస్థ చేస్తున్న కార్యకలాపాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ అంతర్జాతీయ విత్తన ధృవీకరణలో అతితక్కువ సమయంలో తొమ్మిది రాష్ట్రాలకు లీడింగ్ నోడల్ ధృవీకరణ సంస్థగా అవతరించిందన్నారు. హైదరాబాద్‌లో 400లకుపైగా విత్తన కంపెనీలు ఉన్నాయని, దేశ అవసరాలకు నాణ్యమైన విత్తనం 60 శాతం తెలంగాణ నుండి ఉత్పత్తిచేసి సరఫరా అవుతున్నాయన్నారు.

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆశయమైన తెలంగాణ ప్రపంచ విత్తన భాండాగారం దిశగా ప్రయాణిస్తున్నామన్నారు. ఇందులో ఈజిప్టు అంతర్గత నాణ్యతా పరిపాలన బాధ్యులు డాక్టర్ మార్వా హస్సన్, మహమ్మద్ అలీ, ఈజిప్టు హైటెక్ సీడ్స్ ప్రొడక్షన్ మేనేజర్ మహమ్మద్ ఇబ్రహిం, పేరెంట్ సీడ్ మేనేజర్ ఇబ్రహిం మహమ్మద్, మొయినుద్దీన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇబ్రహిం అబ్దెలహిమ్, విత్తన ధృవీకరణ సంస్థ సీనియర్ అధికారులు జి.సుదర్శన్, భాస్కర్, నర్సింహదాస్ పాల్గొన్నారు. గమల్ అలజట్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఆన్-లైన్ విత్తన ధృవీకరణ క్రమం, అంతర్జాతీయ విత్తన ధృవీకరణ, సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణలపై సంస్థ చేస్తున్న కార్యకలాపాలు అభినందనీయమన్నారు. ఈజిప్టు దేశం నాణ్యమైన విత్తన ఉత్పత్తిలో వెనకబడి ఉందని, తమ దేశంలో నైపుణ్యం పెంపొందించుకొనేందుకు శిక్షణ ఇవ్వాల్సిందిగా కోరారు. తమ దేశం సందర్శించాలని తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ శాఖ కార్యదర్శిని, తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్‌ను ఆహ్వానించారు.

తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధృవీకరణ సంస్థ అధికారి డాక్టర్ కె.కేశవరావులు మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వ సహాయ సహకారాలతో నాణ్యమైన విత్తనోత్పత్తికి కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చుకుని, తగిన సిబ్బందిని నియమించుకున్నామని, సంస్కరణలు ప్రవేశపెడుతూ, అంతర్జాతీయ సంస్థలతో అనుబంధంతో సంస్థను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ఈజిప్టుకు అవసరమైన నైపుణ్యం పెంపొందించుకునేందుకు శిక్షణ ఇచ్చేందుకు, నాణ్యమైన విత్తనాలను సరిపడా మొత్తంలో ధృవీకరించి ఎగుమతి చేసేందుకు తెలంగాణ సిద్దంగా ఉందన్నారు. దేశ విత్తన భాండాగారమైన తెలంగాణ రాష్ట్రం ఈజిప్టు అవసరాల మేరకు కావలసిన మొక్కజొన్న, జొన్న, కూరగాయల నాణ్యమైన విత్తన ఎగుమతులు చేయడానికి సిద్దంగా ఉందన్నారు. ఆరియా ఇండంలోనే మొదటిసారిగా హైదరాబాద్‌లో వచ్చే ఏడాది జూన్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ విత్తన సదస్సులో పాల్గొనాలని ఈజిప్టు ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని పార్థసారథి ఈ సందర్భంగా ఆహ్వానించారు.

కార్మికులకు నూతన పథకాలు

●భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి నిర్ణయం




హైదరాబాద్, ఆంధ్రప్రభ: భవన, నిర్మాణ రంగంలోని కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని భవన, నిర్మాణ కార్మిక సంక్షేమమండలి నిర్ణయించింది. సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి సమావేశం సచివాలయంలో జరిగింది. సభ్యత్వం కలిగి ఉన్న కార్మికులకు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంపై బోర్డు సభ్యులు చర్చించారు. భవిష్యత్తులో నూతన పథకాలను ప్రవేశపెట్టి కార్మికులను మరింత లబ్ది చేకూర్చే విధంగా తగిన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. డైరెక్టర్ నాయిని నర్సింహా రెడ్డి అధ్యక్షత వహించగా, శాఖ ముఖ్య కార్యదర్శి శశాంక్‌గోయల్, కమిషనర్ అహ్మద్ నదీం, బోర్డు కార్యదర్శి, సీఈవో రవీందర్‌రెడ్డి, బోర్డు సభ్యులు ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, పద్మశ్రీ పాల్గొన్నారు.

కార్మికశాఖ పోర్టల్ ఆవిష్కరణ

తెలంగాణ కార్మికశాఖ వెబ్ పోర్టల్ లేబర్ డాట్ తెలంగాణ డాట్ జీవోవి డాట్ ఇన్‌ను మంత్రి నాయిని ఆవిష్కరించారు. కార్మిక శాఖ అందిస్తున్న పారదర్శకమైన, విశిష్టమైన సేవలకు గుర్తింపుగా కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) ఈ అవార్డుకు తమ శాఖను ఎంపిక చేసిందని సోమవారం విలేకరులసమావేశంలో చెప్పారు. ఏ స్థాయిలో కూడా డబ్బులు ఇవ్వకుండా పారదర్శకంగా ప్రభుత్వం నుంచి సేవలు పొందేందుకు ఆన్‌లైన్ ఎంతో దోహదపడుతుందని మంత్రి అన్నారు. కార్మిక చట్టాల అమలు, షాపు, వ్యాపారాల అవసరాలు తీర్చేందుకు ఈ పోర్టల్ రూపొందించినట్లు కార్మికశాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్ తెలిపారు. ఈ పోర్టల్‌ను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అభివృద్ధి చేసిందని వివరించారు. కార్మిక చట్టాలలోని రిజిస్ట్రేషన్స్, రెన్యువల్, సెల్ఫ్ సర్టిఫికేషన్, వెల్ఫేర్ ఫండ్, థర్డ్ పార్టీ వెరిఫికేషన్, తనిఖీ నివేదికలు, నోటీసులు వంటిసేవలు ఈ పోర్టల్ ద్వారా అందిస్తారు. తెలంగాణలో వ్యాపారం చేయాలనుకుంటే ఏ పౌరుడైనా తమ సంస్థకు సంబంధించిన కార్మికశాఖ లైసెన్సులు పొందడానికి ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయవచ్చునని నదీమ్ తెలిపారు. ఈ వెబ్ పోర్టల్ ద్వారా విస్తృతమైన ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నందుకుగాను కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) - నిహిలెంట్ సంస్థలు కార్మిక శాఖకు ఈ-గవర్నెన్స్ అవార్డు, ప్రశంసాపత్రం ఇచ్చాయన్నారు. కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం చేశారని నదీమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశాంక్ గోయల్, కమిషనర్ అహ్మద్ నదీమ్, డిప్యూటీ కమిషనర్ శ్యాం సుందర్ జాజులను మంత్రి సన్మానించారు.

మంద కృష్ణకు చంద్రకుమార్ పరామర్శ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హక్కుల సాధన కోసం శాంతియుత వాతావరణం, ప్రజాస్వామ్య బద్దంగా ఉద్యమం చేస్తున్న మందకృష్ణమాదిగపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ అన్నారు. అరెస్టుకు నిరసనగా ఫిబ్రవరి 4న ఓయూలో చేపట్టనున్న 'కృష్ణ మాదిగ నిర్బంధ వ్యతిరేక సభ'కు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వారు తెలిపారు. ఓయూ జేఏసీ, వివిధ విద్యార్థి సంఘం నాయకులు సోమవారం ఉత్తమ్, రమణలను వేర్వేరుగా కలిశారు. కాగా చంచల్‌గూడ జైల్లో ఉన్న మంద కృష్ణ మాదిగను విశ్రాంతన్యాయమూర్తి చంద్రకుమార్, ఏపీ టీటీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే టి. రామారావు వేర్వేరుగా కలిశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవహారంపై వారు కృష్ణమాదిగతో చర్చించినట్లు వారు విలేకరులకు తెలిపారు.

రాష్ట్రంలో హెచ్ఎస్ఐఎల్ ప్లాంటు

●సంస్థ ఉపాధ్యక్షుడు సందీప్ సోమానీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పారిశ్రామిక రంగాభివృద్ధిలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణలో కొత్తగా ప్లాస్టిక్ పైపుల తయారీ ప్లాంటును నెలకొల్పనున్నట్లు దేశంలో అగ్రగామి శానిటరీ వేర్ కంపెనీ హెచ్ఎస్ఐఎల్ ప్రకటించింది. రూ.160 కోట్ల ప్రారంభపెట్టుబడి అంచనాలతో మెదక్ జిల్లా ఇస్నాపూర్ గ్రామంలో ఈ ప్లాంటును నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామని సంస్థ ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ సోమానీ తెలిపారు. సోమవారం మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో దేశంలోని నాలుగు అగ్రగామి బ్రాండ్లలో ఒకటిగా నిలవాలన్న లక్ష్యంతోనే పెట్టుబడులను విస్తరింపజేస్తున్నామని పేర్కొన్నారు. 2020 నాటికి ఉత్పత్తి సామర్థ్యం 30వేల మెట్రిక్ టన్నులకు పెంచుకునే దిశగా లక్ష్యాన్ని ఎంచుకున్నామన్నారు. సీపీవీసీ, యూపీవీసీ పైపులు, ఫిట్టింగ్ విభాగాలు ఇక్కడ తయారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎస్ఐఎల్ పైపుల విభాగం ఉపాధ్యక్షుడు రాజేష్ పజ్నూ తదితరులు పాల్గొన్నారు.

మార్చిలో కొత్త పంచాయతీలు

●ఒక్కో జిల్లాలో కొత్తగా వెయ్యి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంది. రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటులో పూర్తిగా నిమగ్నమయ్యారు. దాదాపు 500ల జనాభా ఉన్న ఆవాసాన్ని కొత్త గ్రామ పంచాయితీలుగా గుర్తించబోతున్నారు. ఈ ఆవాసాలు ప్రస్తుత గ్రామ పంచాయతీలకు ఒకకిలోమీటరుకిలోమీటర్ల దూరంలో ఉంటే సరిపోతుందని ప్రభుత్వం సూచించడంతో ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణలోని 30 జిల్లాల కలెక్టర్లు కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు పైననే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే సుమారు 3000ల కొత్త గ్రామ పంచాయతీలను ప్రాథమికంగా గుర్తించారు. మరో వెయ్యికి పైగా ఆవాసాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించే అవకాశం ఉంది.

గిరిజన ఆవాసాలు, లంబాడా తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించే అవకాశం అధికంగా కనిపిస్తుంది. ఈ నెల 25 నాటికి కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు పైన ముసాయిదాను ప్రభుత్వానికి అందచేయవలసి ఉంది. ప్రతిపాదనలన్నీ తుది రూపు దిద్దుకుంటున్నాయి. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో సేకరించినసమాచారాన్ని జిల్లాస్థాయి రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల పరిధిలో పరిశీలించడం జరుగుతుంది. జనవరి మాసాంతానికి కొత్త గ్రామ పంచాయతీల జాబితాను సిద్దం చేసుకొని, ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేయవలసి ఉంటుంది. ఈ ముసాయిదా నోటిఫికేషన్‌పైన ప్రజాభిప్రాయం సేకరించడం జరుగుతుంది. ఫిబ్రవరి మాసాంత వారంలోగా ముసాయిదా నోటిఫికేషన్‌పైన ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసుకొని మార్పులు చేర్పులతో తుది నోటిఫికేషన్ జారీ చేయడానికి ప్రభుత్వం సిద్దమైంది. పాత పంచాయతీలతో పాటుగా కొత్త పంచాయతీలకు కూడా ఎన్నికలు జరిపించడానికి ప్రభుత్వం సమాయత్తమైంది. కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసిన వెంటనే రిజర్వేషన్ల ప్రక్రియను ప్రారంభించవలసి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. రిజర్వేషన్లఖరారైతే లేకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి అవకాశం ఉండదు. ఒక్కో జిల్లాలో సుమారు 1000కిపైగా కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటు కావడానికి అవకాశం ఉంది. కలెక్టర్లు ఇప్పటికే వెయ్యి నుండి 1400ల వరకు కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు ప్రతిపాదనలను సిద్దం చేసి రెవెన్యూ అధికారులతో సర్వే నెంబర్లను గుర్తించే విధంగా ఆదేశాలు జారీ చేశారు. సరిహద్దులు గుర్తించడం, సర్వే నెంబర్లను ఖరారు చేయడం, జనాభా వివరాలు సేకరించడంలాంటి ప్రక్రియ జనవరి 25 నాటికి పూర్తి చేయాలని ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొత్త పంచాయతీ చట్టాన్ని ప్రభుత్వం మార్చిలో జరిగే శాసనసభ సమావేశాల్లో సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందే అవకాశం ఉంది. కొత్త చట్టం పరిధిలోనే పాత, కొత్త గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిపించడానికి ప్రభుత్వం కూడా సమాయత్తమవుతుంది.


స్పాన్సర్‌షిప్ అంటే తెలియని వీహెచ్

●వివేక్ ఎద్దేవా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : క్రికెట్ గురించి గానీ, లోధా కమిటీ సిఫారసుల గురించిగానీ తెలియని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు ఉద్దేశపూర్వకంగానే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారుడు జి. వివేక్ దుయ్యబట్టారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ) వ్యవహారంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని సోమవారం మీడియాతో అన్నారు. వీహెచ్‌కు వయోభారం మీద పడిందని, ఈ పరిస్థితుల్లో ఆయన ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. హెచ్‌సిఏపై ఫిర్యాదులు ఉంటే అంబుడ్స్‌మెన్‌కు చెప్పుకోవచ్చునని, ఈనెల 31న తాను కూడా ఆసంస్థకు తన వాదన వినిపిస్తానని వివేక్ చెప్పారు. స్పాన్సర్‌షిప్ అంటే ఏమిటో వీహెచ్ తెలుసుకోవాలని, అది తెలియకుండానే తనపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు.

త్వరలో గ్లోబల్ బిజినెస్

●ప్లానన్ సీఈఓ పియరీ గ్యాలెన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్లానన్ ఇంటిగ్రేటెడ్ మ్యానేజ్ సొల్యూషన్ లిమిటెడ్ త్వరలో గ్లోబల్ బిజినెస్ వైపు అడుగులేయబోతోందని అందులోను విజయం సాధిస్తామని సంస్థ సీఈఓ పియరీ గ్యాలెన్ పేర్కొన్నారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో 10వ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థను మొదటగా ఇండియాలో 2008 సంవత్సరంలో ప్రారంభించామని, ప్రస్తుతం తమ సంస్థ కు 40 దేశాల్లో శాఖలు ఉన్నాయన్నారు. తమ సంస్థలో 130 మంది ఫ్రొఫెషనల్స్ పనిచేస్తున్నారని వీరి వల్లే తమ సంస్థ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. అంతర్జాతీయ మౌలిక వసతులు, ప్రమాణాలతో హైదరాబాద్ కార్యాలయం కొనసాగుతుందన్నారు. అన్ని శాఖల్లో కెల్లా హైదరాబాద్ శాఖ అతి పెద్దదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నెదర్లాండ్ కాన్సులేట్ జనరల్ గయోడ్ టైల్‌మ్యాన్ మాట్లాడుతూ తమ సంస్థ అందిస్తున్న సేవలు బాగున్నాయని ప్రశంసించారు. అందుకే తమ దేశం ఈ సంస్థతో ఒక ఒప్పందం చేసుకుందన్నారు.

ఎన్టీఆర్ భవన్‌లో క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎన్టీఆర్ భవన్‌లో తెలంగాణ పసుపు సైన్యం కేలండర్ -2018ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ, పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సోషల్ మీడియాను దుర్వినియోగ పరచడాన్ని అడ్డుకుని వాస్తవాలను తెలియజేయాలని పసుపు సైన్యానికి పిలుపు నిచ్చారు. దళితులు గత 25 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం ఉద్యమం చేస్తున్నా అరెస్టులు చేయలేదని అన్నారు. కేసీఆర్ నియంతృత్వంతో పోకడలతో ఉద్యమాలను అణచి వేస్తున్నారని విమర్శించారు.

మహాత్మ గోడపత్రిక ఆవిష్కరణ

బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో టీటీ జెండా...ఎజెండా రూపకల్పన మహాత్మ గోడపత్రికను రమణ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు.

కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా 10 మందికి పదోన్నతి

●తీరనున్న ఐఏఎస్ అధికారుల కొరత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అఖిల భారత సర్వీసు అధికారుల కొరత తీరుతోంది. కొంతలో కొంత మేలు కలిగేలా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఊరట నిచ్చింది. నాన్ క్యాడర్(కన్ఫర్డ్) ఐఏఎస్‌ల పదోన్నతుల్లో భాగంగా 10 మందికి ఐఏఎస్ హోదా కల్పిస్తూ డీఓపిటి ఆమోదం తెలిపింది. 2015-1016 ప్యానెల్ ఏడాదుల్లో భాగంగా 10 మందికి పదోన్నతులను కల్పించింది. ఇందులో భాగంగా కొర్రా లక్ష్మి, కెధర్మారెడ్డి, విట్టల్ లక్ష్మి, టీ వినయ్ కృష్ణారెడ్డి, సిహెచ్‌శివలింగయ్య, వి వెంకటేశ్వర్లు, ఎం హన్మంతరావు, డి అమోయ్ కుమార్, కెహైమావతి, ఎం హరితలకు పదోన్నతులను కల్పించింది.

క్యాడర్‌కు అనువుగా అధికారుల పెంపు...

పాలనకు కీలకమైన అఖిల భారత స్థాయి అధికారుల క్యాడర్‌కు అనుగుణంగా కేటాయింపులను పెంచాలని గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతూ వస్తోంది. అయితే కేంద్రం పెద్దగా స్పందించలేదు. దీంతో సొంతంగా రాష్ట్రమే క్యాడర్‌ను అధిగమించేలా ఇంచార్జుల పాలనతో నెట్టుకొస్తోంది. ఈ దిశలో కేంద్రంనుంచి కొత్తగా ఎటువంటి కేటాయింపులకు సానుకూల వాతావరణం కనిపించక పోవడంతో కన్ఫర్డ్ ఐఏఎస్‌ల దిశగా ప్రభుత్వం మార్గదర్శకాలు పరిశీలన చేసింది. తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాల విభజన తర్వాత తీవ్రమైన అధికారుల కొరత నివారణే లక్ష్యంగా ఈ కసరత్తును ముమ్మరం చేసింది.

ఇందుకు రాష్ట్రంలోని రెవెన్యూ, నాన్ రెవెన్యూ అధికారులు కొందరిని కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా పదోన్నతి పర్చేందుకు యూపీఎస్‌సీకి నివేదించింది. ఇందుకుగాను నియామకం కమిటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఏడి పొలిటికల్ ముఖ్య కార్యదర్శులు ఉన్నారు. ఈ కమిటీ సిఫార్సుల మేరకు 8 ఏళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారుల జాబితాను సిద్దం చేస్తున్నారు.

2016లో వివరాలు...

60మంది అధికారులను ఐఏఎస్‌లుగా కన్ఫర్ చేస్తూ ప్రభుత్వం 2016 మార్చి 14న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఉన్న క్యాడర్ ఇలా ఉంది. 1 ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇద్దరు స్పెషల్ సీఎస్‌లు, 16 ముఖ్య కార్యదర్శులు, 18 కార్యదర్శులు, 19 కమిషనర్లు, 10 కలెక్టర్లు (కొత్తగా 21 జిల్లాలు ఏర్పాటు తర్వాత అది 31కి చేరింది), 11 జాయింట్ కలెక్టర్లు, (స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను జేసీలుగా నియమించారు), 21 ప్రాజెక్టు డైరెక్టర్లు, ఐదుగురు ప్రాజెక్టు డైరెక్టర్లు, మూడు జీహెచ్ఎంసీ కమిషనర్లు (తాజాగా ప్రతి కార్పొరేషన్‌కు ఒక ఐఏఎస్), జాగ్రీషన్‌, కామన్ పిరియ డెవలప్‌మెంట్‌కు ముగ్గురు స్పెషల్ కలెక్టర్లు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఒకరు, టీఎస్‌పీఎస్సీకి ఒకరు, డిప్యూటీ చీఫ్ ఎలక్షన్ అధికారి, సీసీఎల్ఏ కార్యదర్శి, వాణిజ్యపన్నులశాఖ జాయింట్ కమిషనర్ వంటి పోస్టులకు ఐఏఎస్‌ల కేటాయింపు ఉంది.

టాస్ లేనట్లే...

తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు ఏర్పాటు చేయాలన్న గ్రూప్-1 అధికారుల వాదన ఫలించేలా లేదు. ఇదివరకే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎంజీ గోపాలకు (గ్రూప్-1 అధికారుల అధ్యయనం బృందం టాస్‌ను కొరుతూ నివేదిక అందించింది. తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో అధికారిక బృందం గతేడాది కేరళ, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లలో పర్యటించి అక్కడి సర్వీస్ వివరాలను అధ్యయనం చేసింది. సొంత అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఉండాలని సర్కార్‌కు నివేదించింది. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 163 ఐఏఎస్, 112 ఐపీఎస్, 65 ఐఎఫ్ఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. పదవీ విరమణలు, ఇతరత్రా ఖాళీలు పోగా ప్రస్తుతం 135 మంది ఐఏఎస్‌లు, 91 మంది ఐపీఎస్‌లు, 52 మంది ఐఎఫ్ఎస్ అధికారులు విధుల్లో ఉన్నారు. ఇందులోనూ 28 మంది ఐఏఎస్‌లు, 12 మంది ఐపీఎస్‌లు 7గురు ఐఎఫ్ఎస్‌లు డిప్యూటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లడంతో తాజాగా రాష్ట్రంలో ఐఏఎస్‌లు 107, ఐపీఎస్‌లు 79, ఐఎఫ్ఎస్‌లు 49 మంది ఉన్నారు.

రిటైల్ ఫార్మసీల కోసం డిజిటల్ ప్రోగ్రాం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రిటైల్ ఫార్మసీల కోసం టార్సియా టెక్నాలజీ సొల్యూషన్స్ తెలుగు రాష్ట్రాల్లో గో - డిజిటల్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. టార్సియా స్మార్ట్ మైల్ వేదిక సాయంతో బ్రిక్ అండ్ మోర్టార్ ఫార్మసీలు డిజిటల్ లావాదేవీలు నిర్వహించేందుకు ఈ టెక్నాలజీ దోహద పడుతుందని టార్సియా సీఈవో సురేష్ సత్యమూర్తి తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న చిన్నపాటి ఫార్మసీలు కూడా అత్యుత్తమ టెక్నాలజీ ఉపయోగించే దిశగా గో - డిజిటల్ ప్రోగ్రామ్ వేదికను అభివృద్ధి చేశామన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. రిటైల్ ఫార్మసీలలో ఒకవేళ ఔషధాలు ప్రత్యామ్నాయంగా ఉన్న మరో ఔషధాన్ని ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా గుర్తించవచ్చునని, ఇది అవసర సమయాల్లో రోగికి ఎంతో దోహద పడుతుందని అన్నారు. 80 శాతం మెడికల్ స్టోర్స్‌కు టెక్నాలజీ లేదని, ఈ ప్లాట్‌ఫాం ద్వారా సరఫరాదారులు, నిల్వలు, సేల్స్ తదితర అంశాలపై పూర్తి సమాచారం క్షణాల్లోనే అందుతుందని సత్యమూర్తి చెప్పారు. కంప్యూటరీకరణ ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో ఉన్నచో సేవలు పొందవచ్చని, ఈ తర్వాత ఆది సవర్షన్ లను అనుసంధానం చేస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ సంస్థ సుమారు 700 మంది రిటైలర్లకు సర్వీసులు అందిస్తోందని చెప్పారు.

నైపుణ్య రాజధానిగా తెలంగాణ



●2024 విద్యా ప్రణాళికను రూపొందించిన ఉన్నత విద్యా మండలి ●ప్రతి యూనివర్సిటీలో ఇంక్యుబేటర్ ●అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా ప్రణాళిక ●సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అభివృద్ధికి పాఠ్యాంశాలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి నైపుణ్య రాజధానిగా మార్చేలా తెలంగాణ ఉన్నత విద్యా మండలి విద్యారంగంలో ప్రణాళికను రూపొందించింది. విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడం, అధ్యాపకులకు విద్యా బోధనలో మెళకువలు నేర్పించడం, విద్యా సంస్థలను జ్ఞాన కేంద్రాలు అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నత విద్యా రంగం అభివృద్ధికి 2024 ప్రణాళికను ఉన్నత విద్యా మండలి తయారు చేసింది. 2020 వరకు స్వల్పకాలిక ప్రణాళికను ఒకదానిని, 2024 వరకు దీర్ఘకాలిక ప్రణాళికను మరోదానిని రూపొందించింది. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలతోపాటు, పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థులందరికీ నాణ్యమైన ఉన్నత విద్యను అందించడానికి ప్రణాళికను రూపొందించింది. పట్టణప్రాంతాల్లోని విద్యార్థులకు ధీటుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను తయారు చేయనున్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేయడంతోపాటు, నూతన ఆవిష్కరణలను చేపట్టడం కోసం ఇంక్యూబేటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. స్వల్పకాలిక అభివృద్ధిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నత విద్యలో తెలంగాణ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్(టిహెచ్‌ఈ-క్యూయుఐపి)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

విద్యార్థులకు.....

టెక్విప్ ప్రధాన ఉద్దేశంతో రాష్ట్రంలో ప్రతి యూనివర్సిటీలోనూ ఇంక్యూబేటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా నూనత ఆవిష్కరణలు చేయడంతోపాటు వర్సిటీలోని అధ్యాపకులకు నైపుణ్య శిక్షణను క్రమం తప్పకుండా ఇవ్వనున్నారు. వాటితోపాటు ఉపాధి అవకాశాలు, ఇతర ఇన్నోవేషన్లను చేయించాలనే ఉద్దేశంతో ఈ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం 5 యూనివర్సిటీల్లో ఇంక్యూబేటర్లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయించారు. ఉస్మానియా, కాకతీయ, జెఎన్‌టియు, జెఎన్‌యుఎఫ్‌ఏ, ఆర్‌జేకేయుటిలో ఇంక్యూబేటర్లను ఐటి శాఖ సహకారంతో ఏర్పాటు చేశారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోనూ ఇంక్యూబేటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భవిష్యత్‌లో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం సబ్జెక్టుల్లో అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలాగా పాఠ్యాంశాలను రూపొందించనున్నారు. ఉన్నత విద్యను పూర్తి చేసిన తరువాత ఉద్యోగాల కోసం ఎదురు చూసే విధంగా కాకుండా ఉద్యోగాలను ఇచ్చేలాగా సిలబస్‌ను తయారు చేయనున్నారు. సీబీసీఎస్‌ను బలోపేతం చేయనున్నారు. పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దనున్నారు.

అధ్యాపకులకు....

అధ్యాపకుల కోసం యూనివర్సిటీల్లో కెపాసిటీ బిల్డింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. యూనివర్సిటీ స్థాయిలో అధ్యాపకులు వారు సాధించిన విజయాలను ఇతరులతో పంచుకోవడం కోసం ప్రత్యేకంగా న్యూస్ లెటర్‌ను తీసుకురానున్నారు. ఈ న్యూస్‌లెటర్‌ను మూడు నెలలకొకసారి తీసుకురావాలని నిర్ణయించారు. యూనివర్సిటీల్లో బోధించే అధ్యాపకులకు సంబంధించి రాష్ట్రస్థాయిలో బెస్ట్ టీచర్స్ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. 10 నుంచి 12 మందికి ఈ అవార్డులను ఇవ్వనున్నారు. యువ పరిశోధకులను ప్రోత్సహించనున్నారు. సంస్కృతిపై పరిశోధనలు, అభివృద్ధికి ఇంజనీరింగ్ విభాగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించనున్నారు. పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఏడాది పరిశోధక మహాసభలను సైతం నిర్వహించేలా చూడనున్నారు.

సంస్థల్లో.....

అఖిలభారత ఉన్నత విద్యారంగం, జాతీయ నైపుణ్యాభివృద్ధి మండలి, నీటి ఆయోగ్‌తోపాటు అంతర్జాతీయంగా వస్తున్న ట్రెండ్స్‌కి అనుగుణంగా విద్యాసంస్థల్లో ప్రణాళికలను రూపొందించనున్నారు. సుస్థిర అభివృద్ధికి ఉన్నత విద్యారంగం ఏ రకంగా తోడ్పడగలదో రోడ్‌మ్యాప్‌ను రూపొందించనుంది. సుస్థిర అభివృద్ధి కోసం ప్రైవేటు సంస్థలను సైతం ప్రోత్సహించాలని ప్రణాళికలో పొందుపరిచారు. విద్యాసంస్థల్లో నాలెడ్జ్ రీసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అన్ని రకాల ప్రణాళికలను దేశాభివృద్ధిలో భాగంగా తయారు చేయనున్నారు. కాలేజీలు, సీట్లు ఉండాల్సిన వాటి కంటే అదనంగా ఉండటంతో ప్రైవేటు కాలేజీల మధ్య అనారోగ్యకరమైన పోటీ నెలకొందని ఉన్నత విద్యా మండలి అభిప్రాయానికి వచ్చింది. రాష్ట్రంలోని 350 నుంచి 400 వరకు కాలేజీల్లో కనీసం 15 శాతం కూడా సీట్లు భర్తీ కాని పరిస్థితి ఉందని, 15 శాతం సీట్లు కూడా భర్తీ కాకపోతే ఆయా కాలేజీలు ఎలా నడుస్తాయనేది ఉన్నత విద్యా మండలి వాదన. ఆయా కాలేజీల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందదనే అభిప్రాయానికి వచ్చిన ఉన్నత విద్యా మండలి ప్రైవేటు కాలేజీలను క్రమబద్ధీకరించడం కోసం ప్రణాళికను రూపొందించింది.

భక్తి శ్రద్ధలతో వసంత పంచమి

●న్యూఢిల్లీలో ఘనంగా తెలుగు పండుగ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: విద్యారంభ దినోత్సవంగా చెప్పుకునే వసంత పంచమి వేడుకలు దేశ రాజధానిలో ఘనంగా జరిగాయి. ఉత్తర భారతదేశంలో విశేషంగా జరుపుకునే ఈ పండుగను మాఘ శుద్ధ పంచమి నాడు తెలుగు మహిళలంతా ఆనందోత్సాహాలతో చేసుకున్నారు. జ్ఞానానికి ఆది దేవత అయిన సరస్వతీ దేవి తమ కుటుంబాలకు కరుణా కటాక్షాలను అందజేయాలని కోరుతూ ఆంధ్ర వనితా మండలి న్యూఢిల్లీ బ్రాంచ్‌లో వసంత పంచమి సంబరాలు జరిపారు. గోల్ మార్కెట్‌లోని మానస సరోవర్ హాల్‌లో మహిళలంతా కలిసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. వీణాపాణికి ప్రీతిపాత్రమైన పసుపు వర్ణం చీరలు, పసుపు రంగు పూలు ధరించి ''సరస్వతీం శుక్లవర్ణాం సుస్మితాం సుమనోహరమ్'' అంటూ శ్లోకాలతో కీర్తిస్తూ జ్ఞానాన్ని, వివేకాన్ని, బుద్ధిని ప్రసాదించాలని వేడుకున్నారు. అనంతరం అమ్మవారి పూజలో ఉంచిన పెన్నులు, పుస్తకాలను అందరికీ పంచారు. అర్చన అనంతరం ఆంధ్ర పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటు చేశారు.

రుతురాజు అయిన వసంతుడికి, కామధేనువుకి మధ్య అవినాభావ సంబంధం ఉందని, వారితో పాటు అనురాగ దేవత రతీదేవిని పూజించడం వల్ల మనుషుల్లో ప్రేమానుబంధాలు పెరుగుతాయని పురాణాల్లో ఉండడం వల్ల ప్రతి ఏడాదీ తమ మహిళా మండలి ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా జరుపుతుంటామని న్యూఢిల్లీ బ్రాంచ్ సెక్రటరీ నిడసనమెట్ల శారద తెలిపారు. ప్రకృతిలో జరిగే మార్పులకు సూచనగా వసంత రుతువు రాకను భారతదేశమంతటా ఉత్సాహంగా జరుపుకుంటారని ఆమె చెప్పారు.

'కొల్లేటి' పరిష్కారానికి కేంద్రం సానుకూలం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కొల్లేరు సరస్సుపై ఆధారపడి జీవ నం సాగిస్తున్న ప్రజల సమస్య పరిష్కారానికి కేంద్రం సానుకూ లంగా స్పందించింది. పర్యావరణానికి, నీటి ప్రవాహానికి ముప్పు వాటిల్లకుండా సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర పర్యావ రణం, అటవీ శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ సానుకూలతను వ్యక్తం చేసినట్టు ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ వెల్లడించారు. కొల్లేటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి సమస్యల పరి ష్కారానికి కామినేని సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌ను కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

విద్యార్థుల ఆశలపై ఎంసీఐ నీళ్లు

●2018-19 సంవత్సరానికి అడ్మిషన్లు డౌటే

●తనిఖీల్లో లోపాలు గుర్తించిన ఎంసీఐ బృందం



సిద్దిపేట / హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రం ఏర్ప డిన తరువాత మొదటగా ఏర్పాటు చేసిన సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు 2018-19 సంవత్సరానికి అనుమతి దొరికే అవకాశాలు కనిపించడం లేదు. మెడికల్ కాలేజీ నిర్వహణకు సంబంధించి సరైన సౌకర్యాలు ఇంకా ఏర్పాటు చేయలేదని ఎంసీఐ జరిపిన తనిఖీల్లో వెల్లడయ్యింది. దీంతో ఈసారి పర్మిషన్ వస్తుందా రాదా అనే సందిగ్ధంలో అధికారులు ఉన్నారు.

ఈసారి ఎలాగైనా మెడికల్ కాలేజీ అడ్మిషన్లను ప్రారంభించాలన్న ఆలోచనతో యంత్రాంగం ఉండగా వారిపై ఆశలపై నీళ్లు చల్లుతూ పలు లోపాలున్నందున ఎంబీబీఎస్ వైద్య విద్య ప్రారంభానికి అనుమతి ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వానికి ఎంసీఐ కార్యనిర్వాహక మండలి సిఫార్సు చేసినట్టు తెలిసింది.సహజంగా కాలేజీ అనుమతి ఇచ్చేటప్పుడు ఎంసీఐనుంచి ఒక బృందం వచ్చి తనిఖీ చేస్తుంది. వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా మెడికల్ కాలేజీ అనుమతి లభిస్తుంది. ఎంసీఐ అనుమతి ఇవ్వాలంటే మెడికల్ కాలేజీలో సౌకర్యాలు, వైద్య సిబ్బంది తదితర వాటి ని పరిశీలిస్తుంది. మొదటిసారి తనిఖీలో అభ్యంతరాలు ఉంటే ఎం సీఐ నెల రోజులు కాలేజీకి సమయం ఇస్తుంది. అనంతరం మరో సారి తనిఖీలో సంతృప్తి చెందితే అనుమతి వస్తుంది.

పెద్దాఆపరేషన్లను ఆస్పత్రిలో ఎందుకు చేయలేదు

సిద్ధిపేట మెడికల్ కాలేజీలో ఎంసీఐ తనిఖీకి వచ్చినప్పుడు పెద్దాఆపరేషన్లను ఆస్పత్రిలో ఎందుకు చేయడం లేదని ఎంసీఐ బృందం ప్రశ్నించగా ఆ సమయంలో అలాంటి ఆపరేషన్లు లేవని అంతకు ముందు చాలా చేశామని వారికి సమాధానం ఇచ్చారు. దీంతోపాటు బిల్డింగ్‌లు ఇంకా నిర్మాణంలో ఉన్నాయి.. ఎందుకు ఇంకా పూర్తి కాలేదని ప్రశ్నించగా త్వరలోనే పూర్తవుతాయని కాలేజీ అధికారులు పేర్కొన్నారు.

13.84 శాతం బోధనా సిబ్బంది కొరత ఉందని అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల గదులు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయని, ప్రసంగ గదులు, కేంద్ర గ్రంథాలయం, విద్యార్థుల వసతిగృహాలు, బోధన, బోధనేతర సిబ్బంది నివాస గృహాలు, తదితర నిర్మా ణాలన్నీ ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొంటూ తనిఖీ బృందం నివేదికను ఎంసీఐ కార్య నిర్వాహక మండలి పరిగణలోకి తీసుకొని ఎంసీఐ అనుమతి నిరాకరించింది. 2018-19 సంవత్సరంలో 150 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం చేసిన వినతిని ఎంసీఐ తోసిపుచ్చింది. అయితే ప్రభుత్వం వైద్య కళాశాల అయినందున కేంద్రానికి మరోసారి దరఖాస్తు చేసుకొని లోపాలను నిర్దేశిత కాలపరిమిత లోపు చక్కదిద్దుతామని తెలంగాణ సర్కారు హామీ పత్రం ఇస్తే 2018-19 సంవత్సరానికి 150 సీట్లను అనుమతి లభించే అవకాశలెక్కువగా ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

కలెక్టర్ సమీక్షిస్తున్నారు



త్వరలోనే మెడికల్ కాలేజీ అడ్మి షన్లకు అనుమతి కచ్చితంగా లభిస్తుంది. ఎంసీఐ సూచించిన అంశాలను త్వరగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశాం. దీనికి అధికా రులు కూడా స్పందించారు. కలెక్టర్ ప్రతి వారం దీనిపై సమీక్ష జరుపుతు న్నారు. కచ్చితంగా 18-19 సంవత్సరానికి విద్యార్థులకు అన్యా యం జరగదు. అవసరమైతే ప్రభుత్వం నుంచి ఎంసీఐకి ఎలాంటి హామీ కావాలన్న మేము సిద్ధంగా ఉన్నాం.

అనుమతి లభిస్తుంది: డీఎంఈ డాక్టర్ రమేష్ రెడ్డి

ఎంసీఐ తనిఖీ వారు లేవనెత్తిన అంశాలు త్వరలోనే పరిష్కా రం అవుతాయి. ఎలాగైనా ఈ సంవత్సరం మెడికల్ కాలేజీకి అను మతి లభిస్తుంది. ఆ దిశగా ఇప్పటికే కార్యాచరణ వేగవంతం చేశాం.

నేడు టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో

నారా లోకేష్ జన్మదిన వేడుకులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తోంది. అలాగే అన్ని నియోజకవర్గాల కేంద్రాలలోని సాంఘిక సంక్షేమ హస్టళ్ళలో, ప్రభుత్వ ఆసుపత్రులలో పండ్ల పంపిణీలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మం చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను.. వెంటనే పరిష్కరించాలి

వనపర్తి ప్రతినిధి, ప్రభన్యూస్ : ప్రజా వాణి ఫిర్యాదులను జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ శ్వేతా మహంతి కోరారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భ ంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజవాణికి వచ్చిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్క రించేలా చొరవ చూపాలని ఆదేశించారు. అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపు తు సాధ్యమైనంత త్వరగా పిర్యాదులను పరిష్కరి ంచాలని ఆదేశించారు. అనం తరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ద్వారా సభ్యత్వాలపై జాయింట్ కలెక్టర్ నిరంజన్ సమీక్షించారు. రెడ్‌క్రాస్‌లో జిల్లాలోని అధికారులందరు వీలైనంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చాలని కోరారు. దీని వల్ల సమాజ సేవ చేసేందుకు అవకాశం ఉందని, ముఖ్యంగా రక్తదాన శిబిరాల నిర్వ హణ వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చనన్నారు. జీవిత కాల సభ్యులు, శాశ్వత సభ్యులు, సభ్యులను ఎక్కువగా చేర్పించిన వారికి రాష్ట్ర గవర్నర్ ద్వారా గోల్డ్ మెడల్ పొందే అవకాశం కూడా ఉందన్నారు. ప్రజావాణికిలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 109మంది తమ ఫిర్యాదులను అందజేశారు.

ఖాకీల రాసలీలలు..!

● రెడ్‌హ్యాండెడ్‌గా పటుబడిన వైనం

● సీఐపై కేసు నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఒకరు అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) లో పని చేస్తున్నారు, మరొకరు శాంతి భద్రతల విభాగంలో విధులను నిర్వహిస్తున్నారు, ఇద్దరూ పోలీసు శాఖలోని ముఖ్యమైన పదవులలో ఉన్నవారే,ఈ ఇద్దరూ కలిసి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడి అబాసు పాలయ్యారు. వీరిద్దరి వివాహేతర సంబంధం పోలీసు శాఖలో తీవ్ర కలకలం రేపింది. మహిళతో కలిసి ఉన్న ఇన్‌స్పెక్టర్‌ను భర్త రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోగా, ఆమె అత్త, తల్లి తదితరులు నడిరోడ్డుపై చెప్పు దెబ్బలు కొట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలీసు శాఖకు కలంకం తెచ్చే ఈ ఘటనపై అధికారులు సీరియస్‌గా ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు సిఐపై కేసును నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఎసిబిలో అదనపు ఎస్పిగా పని చేస్తున్న సునితారెడ్డి, కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మల్లిఖార్జునరెడ్డిలు కెపిహెచ్‌బిలోని ఒక ఇంట్లో ఉన్న సమయంలో సునితారెడ్డి భర్త సురేందర్‌రెడ్డి రెడ్ హ్యాండెడ్‌గాపట్టుకున్నాడు. అనంతరం మల్లిఖార్జునరెడ్డిని ఇంట్లో నుంచి బయటకు లాక్కురాగా సురేందర్‌రెడ్డి తల్లి, సునితారెడ్డి తల్లి ఇద్దరూ చెప్పులతో కొట్టారు. తన బిడ్డను లోబరచుకుని జీవితం నాశనం చేొడంటూ తల్లి ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం సిఐ మల్లిఖార్జునరెడ్డిపై సురేందర్‌రెడ్డి, బంధువులు మాదాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సునితారెడ్డి ఎసిబిలో పని చేస్తుండగా, భర్త అమెరికాలో ఉంటాడు. కొన్నాళ్ళుగా సునితారెడ్డి ప్రవర్తనపై అనుమానాలు రావడంతో మల్లిఖార్జునరెడ్డిని పిలిపించి వార్నింగ్ ఇచ్చారు. కొంత కాలంగా వీరిద్దరూ ఎవరికి వారుగా విధులను నిర్వహించారు. ఇటీవల కాలంలో తిరిగి కలిసి తిరగడం మొదలైంది. ఈ విషయాన్ని గ్రహించిన సురేందర్‌రెడ్డి తల్లి కుమారుడికి విషయాన్ని చెప్పింది. దీంతో ఎలాగైనా వీరిద్దరి గుట్టును రట్టు చేయాలని భావించిన సురేందర్‌రెడ్డి భార్యకు చెప్పకుండా అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చి సునితారెడ్డిపై నిఘాను పెట్టాడు. ఆదివారం రాత్రి మల్లిఖార్దునరెడ్డి, సునితారెడ్డి ఒకే ఇంట్లో కలిసి ఉన్న సమయంలో తల్లితో పాటు అత్తతో కలిసి ఇంట్లో ఉన్న ఎఎస్పీ, సిఐలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో గుట్టు రట్టయింది. ఎసిబిలో పని చేస్తున్న సునితారెడ్డి ఎన్నో సంచలనాత్మకమైన కేసులను దర్యాప్తు చేసి ఎంతో మందిని జైలు పాలు చేశారు. చివరకు అక్రమ సంబంధంతో తన పరువును కూడా తీసుకున్నారు.

ఇద్దరూ ఓటుకు నోటు కేసు దర్యాప్తు అధికారులే

అక్రమ సంబంధంతో పట్టుబడ్డ ఎఎస్పీ సునితారెడ్డి, సిఐ మల్లిఖార్జునరెడ్డిలు తెలంగాణలో అత్యంత సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసును ఒకప్పుడు దర్యాప్తు చేసిన వారే. ఓటుకు నోటు కేసు దర్యాప్తు సమయంలోనే వీరిద్దరి మధ్య శారీరక సంబంధం ఏర్పడినట్లు సమాచారం. సునితారెడ్డి, మల్లిఖార్జున రెడ్డిల ప్రవర్తనపై భర్త సురేందర్‌రెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో మల్లిఖార్జునరెడ్డిని ఎసిబి నుంచి తప్పించి శాంతి భద్రతల విభాగంలో నియమించినట్లు సమాచారం. కల్వకుర్తి సిఐగా పని చేస్తున్నప్పటికీ సునితారెడ్డితో తరచూ కలుస్తున్నాడని, ఆ తర్వాత బంధువులు కొంత మంది ఉన్నతాధికారుల వద్దకు పిలిపించి చివాట్లు పెట్టించగా సునితకు దూరంగా ఉన్నాడని, ఆ తర్వాత ఇద్దరూ కలిసి తిరు గుతుండటంతో విధిలేని పరిస్థితులలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సురేందర్‌రెడ్డి చెప్పారు.



అయిదేళ్ళుగా సునితతో పరిచయం ఉంది : సిఐ

ఎఎస్పీ సునితతో తనకు అయిదేళ్ళుగా పరిచయం ఉందని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ సిఐ మల్లిఖార్జునరెడ్డి మీడియాకు తెలిపారు. సునితారెడ్డి విడాకుల కోసం కేసు వేశారని, విడాకులు మంజూరైన వెంటనే ఇద్దరం పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నామన్నారు. ఆదివారం రాత్రి గదిలో లేమని, సునితను డ్రాప్ చేయడానికి వచ్చానని సిఐ తెలిపారు. ఆదివారం రాత్రి గొడవ జరిగిన తర్వాత సురేందర్‌రెడ్డికి సునితతో కలిసి విషయాలన్నీ చెప్పామని అన్నారు. మా ఇద్దరి మధ్య ఉన్నది ఇల్లిగల్ కాంటాక్ట్ కాదని, చట్ట ప్రకారం పెళ్ళి చేసుకుంటామన్నారు. చాలా కాలంగా తాను భార్యకు దూరంగా ఉంటున్నట్లు సిఐ వెల్లడించారు. త్వరలోనే సునితతో కలిసి మీడియా ముందుకు వచ్చి అన్ని విషయాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

మాదాపూర్‌లో సిఐపై కేసు నమోదు

పరాయి మహిళపై అక్రమ సంబంధం పెట్టుకున్నారన్న అభియోగంపై సురేందర్‌రెడ్డి ఇచ్చిన పిర్యాదుతో మాదాపూర్ పోలీసులు సిఐ మల్లిఖార్జునరెడ్డిపై కేసు నమోదు చేశారు. 447, 497, 506 సెక్షన్‌ల కింద కేసును నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. సిఐపై కేసు నమోదు విషయాన్ని నాగర్‌కర్నూల్ ఎస్‌పికి సమాచారం అందించారు. మరో వైపు ఎఎస్పీ, సిఐల అక్రమ సంబంధం వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు.

రేషన్ పరేషాన్

●ఈ-పాస్ విధానం ద్వారా రేషన్ పంపిణీ ●జోగులాంబగద్వాల జిల్లాలో 333 రేషన్ దుకాణాలు ●యంత్రాలు సక్రమంగా పనిచేయక లబ్ధిదారుల అవస్థలు ● బియ్యం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ●డీలర్లకు, లబ్ధిదారులకు తలనొప్పిగా మారిన ఈ-పాస్ విధానం ●పట్టించుకోని అధికారులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జోగుళాంబ గద్వాల జిల్లాలో 1,51,355 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. అయిజలో 22,330రేషన్ కార్డులు, అలంపూర్‌లో 9015కార్డులు, ధరూర్‌లో 1273, గద్వాలలో 26857, మల్దకల్‌లో 14,256, ఇటిక్యాలలో 11,517, గట్టులో 14218, కేటిదొడ్డిలో 9099, మానవపాడులో 8239, ఉండవెల్లిలో 7542, వడ్డేపల్లిలో 7455, రాజోళిలో 8754 కార్డులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 333రేషన్ దుకాణాల ఉండగా, ప్రతి ఒక్కరికి 6కిలోల చొప్పున జిల్లాలో ప్రతి నెలా 3350టన్నుల బియ్యం పౌర సరఫరాల శాఖ పంపిణీ చేస్తుంది. ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు రాయితీపై నిత్యావసర సరుకులను అందజేస్తోంది. ప్రధానంగా బియ్యం, కిరోసిన్, చక్కెర, గోధుమలు, పప్పులు, ఉప్పు, సబ్బులు తదితర వస్తువులు అందజేయాలి. కాని ఇందులో బియ్యం మాత్రమే అందుతుండగా, కిరోసిన్, చక్కెర, గోధుమలు, పప్పుల పంపిణీలో కోత విధించారు. అయితే బియ్యం సైతం లబ్ధిదారులకు సక్రమంగా అందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు వీటిని పర్యవేక్షణ చేయకపోవడంతో, బియ్యం పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో చౌకధరల దుకాణాల ద్వారా అందిస్తున్న రాయితీ సరుకులు పక్కదారి పట్టకుండా ఉండడానికి ప్రభుత్వం ఈ-పాస్ విధానం ద్వారా సరుకులను పంపిణీ చేయాలని నిర్ణయించింది.

వేలి ముద్రలు వేస్తేనే సరుకులు...

ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన ఈ విధానం ద్వా రా జిల్లాలోని లబ్ధిదారులు వేలిముద్రలు వేస్తేనే సరుకులు పొందే అవకాశం ఉంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో 1,51, 355కార్డులు ఉన్నాయి. జిల్లాలో అధికార యంత్రాంగం ఇప్పటి కే లబ్ధిదారుల ఆధార్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ ప్రక్రి య ద్వారా తీసుకున్న వేలిముద్రలను ఈ-పాస్ యంత్రాలకు అనుసంధానం చేశారు. దీంతో లబ్ధిదారులు వేలిముద్ర వేయ గానే, ఆధార్ లింకుతో ఉన్న యంత్రాల ద్వారా సమాచారం కార్యాలయాలకు చేరుతుంది. వెనువెంటనే డీలర్లు లబ్ధిదారు లకు సరుకులను అందజేస్తారు. చౌకధరల దుకాణాల్లో నమోదైన లబ్ధిదారుడే కాకుండా, రేషన్ కార్డుల్లో ఉన్నవారి కుటుంబ సభ్యులు ఎవరైనా వేలిముద్రలు వేసి, సరుకులు తీసుకునే విధంగా ఈ-పాస్ యంత్రాలను రూపొందించారు.



తలనొప్పిగా మారిన ఈ-పాస్ యంత్రాలు...

ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఈ-పాస్ విధానాన్ని జిల్లాలో జనవరి రెండవ వారం నుంచి అన్ని రేషన్ దుకాణాల్లో అమలు చేశారు. జనవరి నుంచి ప్రతి చౌక ధరల దుకాణాల్లో ఈ-పాస్ యంత్రాల ద్వారానే సరుకుల పంపిణీ జరుగుతుంది. అయితే జిల్లాలో ఈ-యంత్రాల ద్వారా సరుకుల పంపిణీ ఇటు డీలర్లకు, అటు లబ్ధిదారులకు తలనొప్పులను తెచ్చి పెడుతున్నాయి. రేషన్ బియ్యం కోసం రేషన్ షాపుకు వెళితే యంత్రంలో సిగ్నల్ రాక ఒకసారి, లబ్ధిదారుడి వేలిముద్ర పడక ఒకసారి సరుకుల పంపిణీ నిలిచిపోతుంది. వేలిముద్ర పడితేనే సరుకులు అందజేసే విధానం ఉండడంతో ఒక లబ్ధిదారుడికి బియ్యం అందించేందుకు గంట సమయం పడుతున్న సంఘటనలు ఉన్నాయి. జిల్లాలో ఈ-పాస్ యంత్రాల ద్వారా సరుకుల పంపిణీ చేపట్టి రెండు వారాలు అవుతున్నా ఇప్పటి వరకు పంపిణీ పూర్తి కాలేదు. అధికారుల నుంచి మాత్రం ఈ నెల 25లోపు బియ్యం పంపిణీ పూర్తి కావాలని ఆదేశాలు ఉండడంతో డీలర్లు రాత్రి 9గంటల వరకు షాపు తెరిచి బియ్యం పంపిణీ చేయాల్సి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రజలు కూలీ పనులకు వెళ్లే వారు ఉంటుండడంతో బియ్యం కోసం పనులు మానుకుని వేచిచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. పనులు మానుకుని ఉన్నప్పటికీ వారి వేలిముద్రలు పడకపోతే ఆ రోజుకు అంతే సంగతులు. కుటుంబంలోని ఎవరో ఒకరి వేలిముద్రలు వేయాల్సి ఉన్నప్పటికీ హామ్లెట్ గ్రామాల్లో రేషన్ దుకాణాలు లేకపోవడం, తప్పనిసరిగా గ్రామ పంచాయతీలకు వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సి ఉంటుంది. అయితే వెళ్లిన వ్యక్తి వేలిముద్ర పడకపోతే ఆ వ్యక్తి తిరిగి ఇంటికి వచ్చి మరుసటి రోజు ఇంట్లోని వారిని తీసుకెళ్లాల్సి వస్తుంది. దీంతో అక్రమాల సంగతి దేవుడెరుగు అధికారులు మాకు అవస్థలు పెట్టారుకదా అని ఆవేదన వ్యక్తం చేశారు.

పథకాలను ముందుకు తీసుకెళ్లడంలో..

అధికారులదే కీలకపాత్ర

గెజిటెడ్ అధికారుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో - ఎమ్మెల్యే శ్రీనివాస గౌడ్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రభుత్వ అధికారులు ముందున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వి.శ్రీనివాస గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం డైరీ మరియు క్యాలెండర్- 2018ను సచివాలయంలోని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గెజిటెడ్ అధికారుల సంఘం తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి కోసమే పుట్టిందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ మాట్లాడుతూ తెలంగాణ పోరాటంలో వీరోచితం ప్రదర్శించిన అధికారులు నేడు తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవడంలో అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. విద్యుత్, వైద్యం, విద్య, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఆసరా వంటి పథకాలు భారతదేశంలో అందరి దృష్టిని ఆకర్షించాయని ఇవన్నీ గెజిటెడ్ అధికారుల కృషి ఫలితమేనని ఆయన అభినందించారు. గెజిటెడ్ అధికా రుల సంఘం అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల స్నేహ పూర్వక ప్రభుత్వం అయినప్పటికీ కొన్ని సమస్యలు అపరిష్కృ తంగా ఉన్నాయ న్నారు. వాటిలో ముఖ్యంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. దీనివల్ల ముఖ్యంగా ఉద్యోగులు చాలా నష్టపోతున్నా రన్నారు. ఈ విషయ మై ఉద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారన్నారు. ఆంధ్రాలో పనిచేస్తున్న తెలంగాణ 4వ తరగతుల ఉద్యోగులను వెంటనే తెలంగాణకు తీసుకురావాలని ఆమె కోరారు. 11వ పీఆర్‌సీని వెంటనే ఏర్పాటు చేసి 2018 జూలై నుంచి కొత్త పీఆర్‌సీ అమలు చేయాలని, కొత్త జిల్లాల్లో ఆర్డర్ టూ సర్వే కింద ఉన్న ఉద్యోగుల ఫైనల్ అలర్ట్‌మెంట్ చేయాలని కొత్త జిల్లా కేంద్రాల్లో హెచ్‌ఆర్‌ఏను 20 శాతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని సమస్యలను ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

విద్యార్థి మృతికి సంతాపం

నారాయణపేట, ప్రభన్యూస్ : పట్టణంలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాకేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.సత్యభాస్కర్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు సంతాపం తెలిపి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి విద్యార్థి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పథకంలో భాగం గా మంజూరీ అయిన రూ. 1290 కోట్ల రహ దారుల పనులను త్వరితగతిన చేపట్టాలని ఆర్ అండ్ బి నిర్ణయించింది. ఈ మేరకు సోమ వారం ఇఎన్‌సి కార్యాలయంలోజరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో కీలక నిర్ణయాలను తీసుకున్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి కింద కేంద్ర గ్రాంటుగా రూ.2398 కోట్ల ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం తెలిపారు. ఆరంగడ్ నుంచి శంషాబాద్ వరకు 6వరుసల అభివృద్ధికి రూ. రూ.290 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. హైదరాబాద్ జాతీయ రహదారిని మెదక్-నరసాపూర్ నాలుగు వరుసల రహదారి అభివృద్ధికి రూ.472 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల స్థితిగతులను, జాప్యానికి కారణాలను ఈ సందర్భంగా మంత్రి తుమ్మల అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్, ఇతర భవనాల నిర్మాణాల అంశంపై ఈ సందర్భంగా సమీక్షించారు. 26 కలెక్టరేట్లకు టెండర్లు పిలిచారు. వీటిలో 21 జిల్లాల్లో అధికార నివాస గృహాల నిర్మాణాలపై సమీక్షిం చారు. మొత్తంగా మంచిర్యాల, సూర్యాపేటలో భూసేకరణ జరిగి నిర్మాణాలకు అనువుగా లేవని తేలింది.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంకండి

- కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి

ఖమ్మం, ప్రభ న్యూస్ సిటీ బ్యూరో : గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గారపాటి రేణుకా చౌదరి ఖమ్మం పార్లమెంటు స్థాయిలో 7అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి ఎన్నికల ఢంకా మోగించారు. సుమారు 3వేల మందితో ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయం ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లతో సమ్మేళనం నిర్వహించి పంచాయతీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో అంతటా కాంగ్రెస్‌ను గెలిపించి కాంగ్రెస్ జిల్లాగా నిరూపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యువనేత రాహుల్ గాంధీని స్ఫూర్తిగా తీసుకుని సైనికుల్లా పనిచేయాలని పేర్కొన్నారు.

మరో 20ఏళ్ళు టీఆర్ఎస్ పాలనే

- తెలంగాణ అభివృద్ధి దేశానికే ఆదర్శం
- కాంగ్రెస్ ప్రాజెక్టుల కల టీఆర్ఎస్ నిజం చేసింది
- కాళేశ్వరం పనులు 75 శాతం పూర్తి
- గౌరవెల్లి ప్రాజెక్టుతో 80వేల ఎకరాలకు సాగునీరు
- గౌరారం ప్రాజెక్టు పున:నిర్మాణ పనులకు

:మంత్రి హరీశ్‌రావు శ్రీకారం

సిద్దిపేట, ప్రభన్యూస్: దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ఆదర్శమని ప్రజలు టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారని, ఎవరు ఔనన్నా కాదన్నా రాష్ట్రంలో ఇక 20 ఏళ్ల టీఆర్ఎస్ ప్రభుత్వమే ఉంటుందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా, అక్కెనపేట మండలం గండిపల్లి గౌరారం ప్రాజెక్టు పునః నిర్మాణ పనులకు కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌లతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూనిర్వాసితులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇస్తే టీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాకు రూ.7లక్షలు చెల్లించి భూనిర్వాసితులకు అండగా నిలిచిందన్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో గత కాంగ్రెస్ ప్రభుత్వం 7ఏళ్ళ కాలంలో 52వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పని చేస్తే టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన మూడేండ్లలో 4.20క్యూబిక్ మీటర్‌ల కాంక్రీటు పనులను చేపట్టామన్నారు. ఎవ్వరు అడ్డుపడ్డా వచ్చే వానాకాలానికి కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్ళు హుస్నాబాద్‌కు వస్తాయన్నారు. గత కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టు నిర్మామంటే కల అని టీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టు నిర్మాణమని గంటపథంగా చెబుతామన్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణ పనులు 96పైసల వరకు పూర్తి అయ్యిందని గౌరవెల్లి పూర్తి కాకముందే ఎలాంటి ఎత్తిపోతలు లేకుండా 75కి.మీ.ల కాలువలో 73కి.మీ.లు పూర్తి అయ్యిందని మరో 2కి.మీ.లు పూర్తి చేసి వర్షకాలానికి సాగునీరు అందిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు చేపడుతున్నామని, ఇప్పటికే 75 శాతం పూర్తి అయ్యాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకులు రైతులకు నీళ్ళు ఇచ్చే ఉద్దేశంతో ప్రాజెక్టులు నిర్మించలేదని విమర్శించారు. ఎస్ఆర్ఎస్పీ నిండినా నిండకపోయినా వరద వచ్చినా రాకపోయినా కాళేశ్వరం ద్వారా ఈ ప్రాజెక్టు జీవకాలువగా మారుతుందన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్ సామర్థ్యం పెంపుతో ఎక్కువ ఆదాయ వనురుల గుడాడిపల్లి గ్రామస్థులకే దక్కుతుందని వెల్లడించారు. ప్రాజెక్టులు పూర్తి అయితే ఎన్నో కులవృత్తుల వారికి జీవనోపాధి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





ప్రాచీన ఆలయాలకు పునరుజ్జీవం

- శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సుదీర్ఘ చరిత్ర, ప్రాశస్త్యం కలిగిన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని శ్రీ పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద అభిప్రాయపడ్డారు. ఈ ఆలయ అభివృద్ధిలో తమవంతు భాగస్వామ్యం కూడా ఉంటుందని ఆయన స్పష్టంచేశారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు స్వామీజీ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి సభ్యులతో సమావేశమై అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్వామి పరిపూర్ణానంద మాట్లాడుతూ, దేశంలో రకరకాల శక్తులు హిందూత్వాన్ని దూషిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితుల్లో ధర్మపరిరక్షణకు హిందూ బంధువులంతా దీక్షతో ప్రతిన బూనాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే ప్రాచీన ప్రాశస్త్యం కలిగిన ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని స్వామీజీ పిలుపునిచ్చారు. ప్రతి ఏటా లక్షలాది మందితో అత్యంత వైభవంగా నిర్వహించుకునే ఉజ్జయిని మహంకాళి బోనాల పండుగకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉన్నదని తెలిపారు.



టీజీవో డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎస్ ఎస్.పి.సింగ్.



దొంగకేసులతో..ప్రాజెక్టులపై కుట్రలు

- విపక్షాలపై మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దొంగకేసులతో కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు విపక్షాలు కుట్రలు పన్నాయని, మిషన్ భగీరథపై కేసులు వేసి ఇంటింటికీ నీళ్ళురావొద్దని ప్రయత్నించాయని రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి జగదీష్‌రెడ్డి విప క్షాలపై విరుచుకుపడ్డారు. సోమ వారం నాగార్జునసాగర్ నియో జకవర్గానికి చెందిన నిడమనూరు ఎంపిపి దాసరి నరసింహాతో పాటు పలువురు సర్పంచ్‌లు, నాయకులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నుండి టిఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ డెడ్‌స్టోరేజీలోనూ నీళ్ళిచ్చి రైతాంగాన్ని కాపాడిన మహానేత కెసిఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు వేసిన కేసుల వల్లే 20వేల మంది ఉద్యోగులు అభద్రతకు నెట్టబడ్డారన్నారు. అడ్డంకులు అధిగమించి తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నదని, మేడిగడ్డ తెలంగాణ జీవ ధారగా మారుతున్నదన్నారు. కార్యక్రమంలో సాగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నోముల నర్సింహ్మయ్య, నాయకులు కోటిరెడ్డి, కెవి రామారావు, విజయభాస్కర్ రెడ్డి, వస్త్రపురి నర్సింహ పాల్గొన్నారు.

ప్రాజెక్టుల్లో అవినీతిపై సీవీసీ విచారణకు డిమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సాగు, తాగు నీటి ప్రాజెక్టుల్లో జరుగుతున్న అవినీతిపై సెంట్రల్ విజిలెన్స్ కమిటితో విచారణ జరిపించాలని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఇదే అంశంపై రాష్ట్రపతి, గవర్నర్, పీఏసీ కమిటికి ఫిర్యాదు చేయనున్నట్లు భట్టి తెలిపారు. ప్రాజెక్టుల పేరుతో తెలంగాణ ప్రభుత్వం సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరు ముందుగా అంచనా వ్యయం రూ. 38 వేల కోట్లు ఉండగా.. అందులో రూ. 10 వేల కోట్ల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసిందని ఆయన తెలిపారు. అయితే రూ. 28 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు అంచనా వ్యవయాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 80 వేల కోట్లకు పెంచడంలో ఆంతర్యమేమిటిని ఆయన ప్రశ్నించారు. అదనంగా రూ. 50 వేల కోట్లను ప్రజలపై భారం మోపిందన్నారు. ప్రాజెక్టుల పేరుతో దాదాపు రూ. లక్షన్నర కోట్ల అప్పులు చేశారని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులపై ఫ్యాకేజిల వారికి గవర్నర్ రివ్యూ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుతో ఉన్న ప్రాజెక్టుకు పేరు మార్చి కాళేశ్వరం పెట్టడంలోనూ కుట్రదాగుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపట్టిన పనులను టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేస్తున్నదని, కొత్తగా చేసిందేమి భట్టి తెలిపారు. తాము అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వాలన్నారు. మంత్రి హరీశ్‌రావులాగ మాకు నీచరాజకీయాలు చేయడం రాదని మల్లు భట్టివిక్రమార్క అన్నారు.

ఫిబ్రవరిలో కాంగ్రెస్ బస్సుయాత్ర

- ఇప్పటికిప్పుడే ఎన్నికలొచ్చినా 70 సీట్లు మావే
- కాంగ్రెస్‌లోకి నేతల క్యూ : టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వివిధ పార్టీలకు చెందిన చాల మంది సీనియర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, వారు తమతో టచ్‌లో ఉన్నారని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు, మూడు వారాల తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో పాటు క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం, కేడర్‌లో నూతనోత్తేజం నింపడం, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివ రించేందుకు టీ పీసీసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను చేపట్టనున్నట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్ల ఇబ్రాహీపట్నం నియోజక వర్గానికి చెందిన టీడీపీ నేతలు డీసీసీ అధ్యక్షుడు క్యామ మల్లేష్ అధ్యక్షతన కాంగ్రెస్ చేరారు. పార్టీలో చేరిన వారికి ఉత్తమ్, మల్లు భట్టివిక్రమార్క కాంగ్రెస్ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామని అన్నారు. రాష్ట్రంలో 30,600 పోలింగ్ బూతులకు గాను సగం బూతుల్లో కమిటిలు పూర్త యినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన శక్తియాప్ బాగా పని చేస్తుందని, పార్టీ సమాచారం ప్రతి ఒక్కరికి తెలిసేలా ఉంటుందన్నారు. పార్టీకి చెందిన 11 లక్షల మంది కార్యకర్తలకు నేరుగా కార్యక్రమాలు తెలిసేలా ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బస్సుయాత్ర పూర్తయ్యాక జూన్ 2న భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ హాజరవుతారని ఆయన తెలిపారు. టీ పీసీసీ చేపట్టే బస్సుయాత్ర కార్యక్రమంలో కూడా ఏదో ఒక చోట రాహుల్‌గాంధీ హాజరయ్యే విధంగా చూస్తున్నామని ఆయన వివరించారు. బస్సుయాత్ర ఫిబ్రవరి రెండో వారంలో చేపట్టినప్పటికి బడ్జెట్ సమావేశాల్లో యాత్రకు కొంత విరామం ఇచ్చాక, మళ్లీ రెండో విడత యాత్రను కొనసాగిస్తామని ఉత్తమ్ వివరించారు.

అభ్యర్థులను ముందే ప్రకటిద్దాం

- ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్
- పార్టీ అభ్యర్థులపై కసరత్తు
- ప్రజాకర్షక మేనిఫెస్టోపై మంతనాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీలో కీలక మార్పులు రాబోతున్నాయా..? వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులను ముందుగానే ప్రకటించి.. పార్టీ టికెట్లపై భరోసా ఇవ్వనున్నారా..? అంటే కాంగ్రెస్ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఎన్నికల ముందు హడావుడిగా పార్టీ టికెట్లు ఇవ్వడం వల్ల ప్రజల్లోకి వెళ్లడం ఇబ్బంది అవు తుందని, దాంతో ప్రచారంలో వెనుకబడి నష్టపో తున్నామనే అభిప్రాయానికి కాంగ్రెస్ నేతలు వచ్చినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ నియోజక వర్గాలకు ఇన్‌చార్జీలను నియమించి.. వారికే పార్టీ టికెట్‌లకు సబంధించిన కీలక అంశాలను అప్పగించాలని పార్టీ అధినాయకత్వం యోచిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రం లోని 119 అసెంబ్లీ నియోజక వర్గాలకు గాను 60 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోటీ చేసే నాయకులపై స్పష్టత ఉందని, మిగతా వారి విషయంలోనూ కసరత్తు చేస్తున్నట్లు పార్టీ ముఖ్యనేత ఒకరు అభిప్రాయపడ్డారు.

మరోవైపు నియోజక వర్గాల పెంపు జరిగితే ఎలా ముందుకెళ్లాలి అనే అంశంపై కూడా కాంగ్రెస్ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఇక కొత్త జిల్లాల ప్రకారం నియమించే పార్టీ జిల్లా అధ్యక్షుల నియామకంలోనూ కాంగ్రెస్ పార్టీ పెద్దగా ఆసక్తి చూపడం లేదని సమాచారం.

టీఆర్ఎస్ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేద్దాం

వచ్చే ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ పార్టీకి గట్టిగా షాకిచ్చేలా కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాల వారీగా ఆయా పార్టీల నుంచి నేతలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్‌ను వ్యతిరేకిస్తున్న అన్నిప్రజాసంఘాలు, పార్టీలతో కలిసి పనిచేసేందుకు కాంగ్రెస్ సుముఖంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ హైకమాండ్ దూతలు కూడా నేరుగా రంగంలోకి దిగి వివిధ వర్గాలు, ప్రజా సంఘాల నేతలతోనూ చర్చి స్తున్నారు. ముందస్తు ఎన్నికలు వచ్చినా..? లేదంటే సమయం ప్రకారమే నిర్వహించినా ఎన్నికలను ఎదుర్కొవడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధండా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు.

అన్నివర్గాలను ఆకట్టుకునేలా మేనిఫెస్టో

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాకర్షణ మేనిఫెస్టోను తయారు చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. అన్ని వర్గాల ప్రజలకు ఆమోద యోగ్యంగా ఉండే విధంగా మేనిఫెస్టోను రూపొందించేందుకు కసరత్తులు చేస్తున్నారు. మేనిఫెస్టోపై పార్టీ సీనియర్లతో పాటు మేధావుల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని యోచిస్తున్నారు.



బంకర్లు ఏర్పాటు చేయాలి

అధికారులకు సరిహద్దు గ్రామప్రజల వినతి

జమ్మూ : దేశ సరిహద్దు వద్ద టెన్షన్ వాతావరణ నెలకొంది. ఆ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి. ఈ సందర్భంగా గతంలో అధికారులు ప్రజలకు భద్రత కల్పించే విషయమై బంకర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు. మోర్టార్ షెల్స్‌తో పాకిస్థాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో సరిహద్దు వెంట నివసిస్తున్న వారిని పోలీసులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గురువారం జమ్మూ, ఖతువ, సాంబా, ఐబీ, ఎల్‌ఓసీ వద్ద పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో 12 మంది చనిపోయారు. 50 మందికిపైగా గాయపడ్డారు. గత నెలలో జమ్మూ డివిజన్‌లోని ఐబీ, ఎల్‌ఓసీ వద్ద 14,460 బంకర్లు నిర్మించడానికిగాను కేంద్ర ప్రభుత్వం రూ.415.73 కోట్లు మంజూరు చేసింది. 2015 ఎన్నికల ప్రచారంలో భాగంగా సరిహద్దు వద్ద 1361.25 చదరపు అడుగుల విస్తీర్ణంలో బంకర్లు నిర్మిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో బంకర్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. నాలుగేళ్ల నుండి పాక్ యథేచ్ఛగా కాల్పులు జరుపుతోందని, ఎన్నికల హామీలో భాగంగా వెంటనే బంకర్లు ఏర్పాటు చేయాలని భేగ్‌వారాచోగ నివాసి సుధేశ్‌కుమారి కోరారు.



రష్యాతో భారత్ కీలక ఒప్పందం

రూ.39వేల కోట్లతో రక్షణ సామాగ్రి కొనుగోలు

న్యూఢిల్లీ: భారత్-రష్యా మధ్య రక్షణ రంగంలో ఓ భారీ ఒప్పందం జరిగింది. రూ.39,000 కోట్లు (5.5 బిలియన్ డాలర్లు) ఖరీదు చేసే ఎస్-400 ట్రూమ్ఫ్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టంను భారత్, రష్యా నుండి కొనుగోలు చేయనుంది. ఇవి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో రూపొందించినవి కావడం గమనార్హం. శత్రులు ప్రయోగించిన బాంబులను, గూఢాచారి విమానాలు, క్షిపణులు, డ్రోన్లను గుర్తించి నాశనం చేయగల సామర్థ్యం ఉన్నవి కావడం గమనార్హం. 400 కి.మీటర్ల దూరం, 30 కి.మీ ఎత్తులో వీటిని గుర్తించే సామర్థ్యం ఎస్-400 ట్రూమ్ఫ్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టంకు ఉంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను భారత్ ఇదో పెద్ద డీల్‌గా అభివర్ణిస్తున్నది. ఐదు ఎస్-400 సిస్టమ్స్‌తో పాటు మీడియం రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్, క్రూయిస్ మిస్సైల్స్ 54 నెలల్లో భారత్‌కు అప్పగించేలా రష్యాతో ఒప్పందం చేసుకుంది.

శునకానికి గార్డ్ ఆఫ్ ఆనర్

ఉత్తర ప్రదేశ్ : అడవైనా.. నీళ్ళున్నా.. బహిరంగ ప్రదేశాలైనా ఆ శునకానికి లెక్కలేదు. కేటాయించిన పనిచేయడమే దాని లక్ష్యం. చకచకా తవ్వేస్తుంది. ఇచ్చిన పనిని సమర్థంగా పూర్తిచేస్తుంది. ఆ శునకం చేయలేని పని లేదు. ఏ సమయంలోనైనా చేయననీ మొరాయించదు. అందుకే ఆ శునకానికి ఘనమైన వీడ్కోలు లభించింది.



ఉత్తర ప్రదేశ్ పోలీసు విభాగంలో పనిచేస్తున్న శునకం.. పేరు టైగర్. నిన్న కన్నుమూసింది. తమ కుటుంబ సభ్యుడు చనిపోయినట్లు యావత్ పోలీసు యంత్రాంగం బాధపడింది. ఘనంగా అంత్యక్రియలు చేయాలని నిర్ణయించింది. జాతీయ జెండాలో శునకం దేహాన్ని చుట్టారు. సంప్రదాయంగా గార్డ్ ఆఫ్ ఆనర్ ఇచ్చారు. ఆ శునకంతో పాటు పనిచేసిన, ఇతర శునకాలు కూడా దానికి నివాళులర్పించాయి.

శునకం సేవలకు గుర్తింపుగా గార్డ్ ఆఫ్ ఆనర్‌ను ఇచ్చామని ఉత్తరప్రదేశ్ డిజిపి పబ్లిక్ రిలేషన్స్ అధికారి రాహుల్ శ్రీవాస్తవ చెప్పారు. 11నెలల వయసులో టైగర్ 2003లో ఉత్తర ప్రదేశ్ పోలీసు విభాగంలో చేరింది. 36 నెలల శిక్షణ అనంతరం నేరస్తుల ఆచూకీనీ, పేలుడు పదార్థాలను కనుగొనే విధి నిర్వహణను దానికి అప్పగించారు. మాదక ద్రవ్యాలను పసిగట్టడం కూడా దాని విధుల్లో భాగం. మధ్యప్రదేశ్‌లోని టెకన్‌పూర్‌లో ఉన్న ప్రతిష్ఠాత్మక నేషనల్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ డాగ్స్‌లో విధి నిర్వహణను ప్రారంభించింది టైగర్. తన సమర్థమైన విధినిర్వహణతో టైగర్ డిప్యూటీ సూపరింటెండెంట్ స్థాయికి ఎదిగింది. కాలవలో పడిపోయిన చిన్నారి మృతదేహాన్ని వెలికితీయడం, కీకారణ్యాలలో నేరస్థులను పట్టుకోవడం వంటి కీలకమైన కేసులను టైగర్ పరిష్కరించింది.

నేరాలకు ఆలవాలమైన రెండు జిల్లాల్లో పోలీసు విభాగం ఒకటిన్నర దశాబ్దాలపాటు టైగర్ సేవలందించింది. టైగర్ శక్తిసామర్థ్యాల దృష్ట్యా ఇతర జిల్లాలకూ కూడా పంపేవారు. ఎవ్వరూ వెళ్ళని ప్రాంతాలలోకి సైతం చొచ్చుకుని వెళ్ళేది. మొత్తం 150 కేసులను ఛేదించింది. ప్రమాదాలను నివారించింది.

ప్రపంచవ్యాప్తంగా శునకాలు మనుషులతో మమైకమై ఉంటాయి. కీలకమైన కార్యక్రమాల్లో భాగస్వాములవుతుంటాయి. అమెరికన్ ఆర్మీ పాకిస్తాన్‌లో దాగున్న ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌పై దాడికి దిగినప్పుడు ఆ భవనంపైకి కైరో అనే శునకాన్ని ముందుగా ప్యారాచ్యూట్ సాయంతో దింపారు. శునకాలు నిర్భీతికీ, తెలివితేటలకూ, నిస్వార్థ సేవలకు ప్రతిరూపాలు.

వన్యప్రాణులపై ప్రకృతి పాశం



- గుడ్లు తేలేస్తున్న గబ్బిలాలు
- ఆస్ట్రేలియాలో రికార్డు స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు
- ప్రమాదపు అంచున వన్యప్రాణులు
- నేలకొరుగుతున్న గబ్బిలాలు
- వందలు, వేల సంఖ్యలో మృత్యువాత

సిడ్నీ: వాతావరణ మార్పులు పెనువిపత్తుకు హేతువులవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా దీని పర్యవసానాలు ఇప్పుడిప్పుడే తీవ్రరూపం దాల్చుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు కొత్త రికార్డులకు చేరుతున్నాయి. జీవరాశుల మనుగడ ప్రమాదపు అంచులకు చేరుతోంది. వాతావరణ సమతుల్యత వేగంగా క్షీణిస్తోంది. ఒకవైపు గడ్డకట్టే శీతల గాలులు, హిమోత్పాలు.. మరొకవైపు చండ ప్రచండ భగభగలు మానవులతోపాటు, వన్యప్రాణులకు ప్రాణసంకటంగా మారుతోంది. అమెరికాలో మంచు ఉత్పాతం వణికిస్తుంటే, ఆస్ట్రేలియాను గరిష్ట ఉష్ణోగ్రతలు హడలెత్తిస్తున్నాయి. గత 80 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఈసారి ఎండ మంట రగులుతోంది. నిప్పుల కొలిమిని తలపించే ఉష్ణోగ్రతల ధాటికి తారు రోడ్లు కరుగుతున్నాయి. చిన్న చిన్న జీవులు ఉడికిపోయి మాంసపు ముద్దలు అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గబ్బిలాలు గుడ్లు తేలేస్తున్నాయి. వందల సంఖ్యలో విగత జీవులవుతున్నాయి. పచ్చిక మైదానాల్లో నిలువ నీడలేక, ఆశ్రయం కరవై మృత్యువాత పడుతున్నాయి. గత వారం 46 నుంచి 50 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో గబ్బిలాలు మాడిమసై పోతున్నాయి. సాధారణంగా 35 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను మించిన వేడిని ఇవి తట్టుకోలేవు. అలాంటిది గరిష్ట ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నాయి. పెద్ద గబ్బిలాలు ప్రత్యామ్నాయ వాతావరణాన్ని వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నాయి. పచ్చిక మైదానాలు, నీటిజాలు ప్రాంతాలను వెతుక్కుంటున్నాయి. ఎటొచ్చీ పిల్ల గబ్బిలాల పరిస్థితే విషమంగా ఉంటోంది. వాయువ్య సిడ్నీలోని క్యాంప్‌బెల్ టౌన్ కాలనీలో వందలాది గబ్బిలాలు నేలరాలాయి. న్యూసౌత్ వేల్స్‌కు చెందిన వన్యప్రాణుల సంరక్షణ సంస్థ ఒకటి ఈ మృత గబ్బిలాలను రాశులుగా అమర్చి ఫేస్‌బుక్‌లో పోస్టు చేసింది. పరిస్థితి తీవ్రతను చాటిచెప్పడం ద్వారా, ప్రభుత్వాన్ని, మానవతావాదులను చైతన్యం చేస్తోంది.

'దాదాపు 400 గబ్బిలాలను గుర్తించాం. మరికొన్ని చెట్ల పొదల్లో, చిటారు కొమ్మలకు వేలాడుతూ ఉండిపోయాయి. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వాటిని సంరక్షించే చర్యలు చేపట్టాం. పశ్చిక మైదానాలకు నీటి ట్యాంకర్లను తరలించాం. ఉష్ణ తీవ్రతను తగ్గిస్తూనే, వాటి దాహార్తిని తీరుస్తున్నాం. కొద్ది రోజులకిందట పుట్టిన చిన్న గబ్బిలాలను సంస్థ సభ్యులు చల్లని టవల్స్, పిల్లోస్‌లో చుట్టి సమీపంలో పార్కులకు తరలిస్తున్నారు. మా కాలనీని పరికిస్తే గుండె చెరువు కావడం ఖాయం. కాలనీపై మరిన్ని ఉష్ణనిరోధక కవర్లను కప్పాల్సిన అవసరం ఉంది. లేదంటే జీవరాశులు పూర్తిగా అంతమయ్యే ప్రమాదం ఉంది' అని సదరు సంస్థ ప్రతినిధి కాటేన్ ర్యాన్ తెలిపారు. చాలా చోట్ల పిల్ల గబ్బిలాలు చెదురుమదురుగా పడివున్నాయని, మరికొన్ని ప్రాణాపాయంలో ఉన్నాయన్నారు. కొన్నిటికి ఫ్లూయిడ్స్ ఇచ్చి ప్రాణాలు కాపాడే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, ఆస్ట్రేలియా వన్యప్రాణుల సంరక్షణ సంస్థలు ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వన్యప్రాణుల సంరక్షణకు స్వచ్ఛందంగా నడుంబిగించాయి. పెద్దఎత్తున సహాయక చర్యలను కొనసాగిస్తూ, మిగతా ప్రపంచానికి అప్రమత్తత సందేశాన్నిస్తున్నాయి.

బాసర ట్రిపుల్ ఐటీని అభివృద్ధి చేస్తాం

- ఉపముఖ్యమంత్రి కె.శ్రీహరి

బాసర, ప్రభ న్యూస్ : బాసర ట్రిపుల్ ఐటీని ప్రపంచ విద్యా సంస్థస్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా, బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించి కళాశాలలోని తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ స్థాయి విద్యనభ్యసించే ఏకైక యూనివర్సిటీ బాసరలో నెలకొల్పడం అభినందనీయమన్నారు. ఈ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తామన్నారు. కళాశాలలోని పెండింగ్‌లో ఉన్న అధ్యాపక పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌ఛాన్సులర్ అశోక్‌కుమార్ పలు సమస్యలను విన్నవించారు.

పొత్తుపై నిర్ణయం తీసుకోలేదు: సీపీఐ

హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు అంశంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సీపీఐ స్పష్టం చేసింది. లౌకిక వాదులతో ఏకం చేసి ఒకే వేదికగా పోరాటం చేయడమే తమ పార్టీ విధానమని సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల పొత్తుపెట్టుకోవాలా.. లేదా అంశంపై ఇంకా నిర్ణయంతీసుకోలేదన్నారు. త్వరలో ఈ అంశంపై పార్టీ నేతలతో చర్చిస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోకూడదని సీపీఎం తీర్మానించిన నేపథ్యంలో అందరి దృష్టి సీపీఐ స్టాండ్ పై ఉంది.

జమిలి ఎన్నికలు 2024 వరకు సాధ్యంకావు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించడం 2024 సంవత్సరం వరకు సాధ్యంకాకపోవచ్చని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని ఆయన తెలియజేశారు. దేశంలో ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలన్నఆలోచన మంచిదే అని..అయితే అందుకోసం కొంత కసరత్తు అవసరమని చెప్పుకొచ్చారు. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు ప్రతీకార రాజకీయ ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు కూడా తగ్గుముకం పట్టే అవకాశం ఉంటుందన్నారు.



ఫిలింనగర్ దైవసన్నిధానం చైర్మన్‌గా మోహన్‌బాబు

చిరంజీవి, నేను చిలకా గోరింకల్లా గొడవ పడతాం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : చిరంజీవి నేను చిలుకా గోరింకల్లా గొడవపడుతుంటా మని, పాత తరం హీరో కృష్ణంరాజుతో సరదాగా ఉం టానని సినీనటుడు మోహన్‌బాబు పేర్కొన్నారు. ఫిలిం నగర్ దైవసన్నిదానం చైర్మన్‌గా సినీనటుడు మోహన్‌బాబు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దైవసన్నిధా నంలో ధర్మానికి విరుద్ధంగా ఏ పనిచేయమని ఆయన తెలి పారు. బ్రాహ్మణుల మధ్య గొడవలొద్దని ఆయన సూచిం చారు. దేవుడి గుడికి చైర్మన్‌గా ఉండాలని ఎప్పుడూ కోరుకోలేదని, ఆరునెలలుగా సుబ్బిరామిరెడ్డి పట్టుబట్టడంతో దైవసన్నిధానం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించానన్నారు. భక్తుల కోసమే ఈ బాధ్యత తీసుకున్నా నన్నారు. కంచి పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి, దర్శకుడు రాఘవేందర్‌రావు, టి.సుబ్బరామిరెడ్డి, మురళీ మోహన్, చాముండేశ్వరి నాథ్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. స్వరూపానందేద్ర స్వామి 12 మంది పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రభుత్వ విధానాలను పక్కనబెట్టిన కేరళ గవర్నర్

తిరువనంతపురం: కేరళ గవర్నర్ పి. సదాశివం అసెంబ్లీ సమావేశాల ప్రారంభ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు పక్కనబెట్టారు. కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం రూపొందించిన ప్రసంగంలోని కొన్ని వాక్యాలను ఆయన చదవకుండా దాటవేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచురించిన లైన్లను చదవకుండా తన ప్రసంగాన్ని కొనసాగించారు. గవర్నర్‌కు అందించిన కాపీలనే శాసనసభ్యులు, మీడియాకు అందజేయడంతో ఈ విషయం బయటకు పొక్కింది . నెంప్రదాయంగా వస్తున్న సమన్వయ సమాఖ్యకు భంగం కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని పట్టించుకోకుండా..నేరుగా జిల్లాల యంత్రాంగం, స్థానిక సంస్థలతో టచ్ లో ఉంటోంది.

మధ్యప్రదేశ్‌లో అధికారం కోసం కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు

బోపాల్: దాదాపు 15ఏళ్ల పాటు మధ్య ప్రదేశ్ లో అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఎన్నికలకు ఏడాదికాలం ఉండగానే కసరత్తును ముమ్మరం చేసింది. బీజేపీని గద్దె దించేందుకు కలిసివచ్చే అన్ని పార్టీలోకి జతకట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవలేకపోతున్న స్థానాలను గుర్తించి ఆయా స్థానాల్లో గెలుపుగుర్రాలకే టికెట్లు కట్టబెట్టాలని భావిస్తోంది. ఇందుకోసం ముఖ్యమంత్రి అభ్యర్థిని ముందుగానే ప్రకటించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా జ్యోతిరాధిత్య సింధియా సహా పలువురు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే ఎన్నికలకు ఆరు నెలల ముందు సగానికి పైగాఅభ్యర్థుల పేర్లు ఖరారు చేస్తే సులువుగా అధికారాన్ని కైవశంచేసుకోవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది.

కనౌజ్ నుంచి పోటీచేస్తా: అఖిలేష్

లక్నో: వచ్చే ఏడాది జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో తాను కనౌజ్ లోక్ సభ స్థానం నుంచి బరిలోకి దిగనున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్‌యాదవ్ తెలిపారు. ప్రస్తుతం కనౌజ్ నుంచి అఖిలేష్ భార్య డింపుల్ ప్రాతినిధ్యం వహిసున్నారు. తన తండ్రి ములాయం సింగ్ యాదవ్ మెయిన్‌పురి లోక్ సభ స్థానం నుంచి బరిలోకి దిగనున్నట్లు అఖిలేష్ ప్రకటించారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో ములాయం ఆజాంగర్,మెయిన్ పురి నుంచి పోటీ చేయగా రెండు స్థానాల్లో గెలుపొందారు. అయితే ఆజాంగర్ నియోజకవర్గాన్ని బలోపేతం చేసేందుకు మెయిన్ పురిస్థానానికి ములాయాం రాజీనామా చేశారు. ఆతర్వాత మెయిన్ పురి నుంచి ములాయం మనవడు తేజ్ ప్రతాప్ యాదవ్ పోటీ చేసి గెలుపొందారు.



హోదా ఇస్తే బీజేపీతో దోస్తీ...!

- చంద్రబాబు అబద్ధాల రారాజు
- ప్రాజెక్టులు నిర్మించేసత్తా లేదు
- అమరావతి ఓ పెద్ద భూస్కామ్: జగన్ విమర్శలు


తిరుపతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాను కేంద్రం ప్రకటిస్తే తాను బీజేపీతో జతకట్టడానికి సిద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. ప్రజా సంకల్ప యాత్రలో పాదయాత్ర చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ఒక జాతీయ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, పై విషయాన్ని స్పష్టం చేశారు. ప్రధాని తలచుకుంటే ప్రత్యేక హోదాను ఒకే ఒక నిమిషంలో ఇవ్వగలరు... ఇది ఆయన చేతుల్లోని పనేనన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలకు ఏమాత్రం బలం లేదని, మా ప్రధాన ప్రత్యర్థి తెలుగుదేశమేనన్నారు. రాష్ట్రా నికి ప్రత్యేక హోదాను ప్రకటిస్తే బీజేపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో 900 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేశారు. శ్రీకాళహస్తి దేవాలయం సమీపంలో బహిరంగ సభ అనంతరం ఆయన ఒక జాతీయ చానెల్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎండ, దుమ్ము రహదారులలో సుదీర్ఘ పాదయత్ర చేస్తున్నప్పటికీ ఆయనలో ఏమాత్రం అలసట ఛాయలు లేవు సరికదా జనం నుంచి లభిస్తున్న స్పందనతో మరింత ఉత్సాహంగా కనిపిస్తున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన అబద్ధాల రారాజుగా అభివర్ణించారు. అమరావతి నిర్మాణం గురించి చంద్రబాబు నాయుడు ప్రపంచవ్యాప్తంగా గొప్పలు చెబుతున్నారని, ఇప్పుడు దావోస్ వెళ్లి గ్లోబల్ పెట్టుబడిదారులను ఫూల్స్‌ని చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎవరైనాసరే ఒక్కసారి అమరావతికి వెళ్లి పరికించి చూడాలని, గత నాలుగేళ్లుగా అక్కడ పిసరంత అభివృద్ధి కూడా జరగలేదన్నారు. అక్కడో పెద్ద నగరం నిర్మిస్తున్నట్టు చెబుతున్నారు కాని, అదో అతిపెద్ద భూకబ్జా కుంభకోణమని అన్నారు. అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించే విజన్ కాని, నిబద్ధత కాని చంద్రబాబునాయుడుకు లేవన్నారు. విభజనానంతరం సమయం చాలా తక్కువ ఉన్నా బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్‌లతో పోటీపడుతున్నట్టు చంద్రబాబునాయుడు చెబుతున్నారని, వాస్తవానికి మా యువత పొట్ట చేతపట్టుకుని బెంగళూరు, చెన్నయ్ నగరాలకు వలసపోతున్నారని చెప్పారు. వారికి ఆయన చేసిందేమీ లేదన్నారు. వాస్తవానికి బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల నిర్మాణానికి 50 ఏళ్లు పడుతుందని, కాని, చంద్రబాబుకు తలకిందులుగా తపస్సు చేసినా అది చేతకాదన్నారు. డప్పాలు చెప్పుకుంటున్న చంద్రబాబు స్థానంలో కనీసం మూగ ముఖ్యమంత్రి ఉన్నా ఇంతకంటే ఎంతో బాగా చేసేవారని జగన్మోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. సామాన్య జనం చంద్రబాబుతో విసిగివేసారి పోయారని, 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కనీస స్థానాలు కూడా గెలవలేదన్నారు. ఆయనకు తెలిసిందల్లా అబద్ధాలాడడం, జనాన్ని వంచించడమేనన్నారు. జీడీపీ విషయంలోనూ అదేవిధంగా అబద్ధాలు చెబుతున్నారన్నారు. రాష్ట్రం వెలుపల చంద్రబాబు నాయుడు పెద్ద డెవలపర్‌గా ప్రచారం జరుగుతోందని, అదంతా భ్రమేనన్నారు. ఆయన వ్యక్తిగతంగా మాత్రం అభివృద్ధి చెందుతున్నారని ఆరోపించారు. తనపై సీబీఐ కేసులన్నీ కాంగ్రెస్ కుట్రతో మోపినవేనన్నారు. దివంగత నేత వైఎస్సార్ ఆకస్మిక మృతి చెందే వరకూ తాను కాంగ్రెస్‌లో ఎటువంటి పదవుల్లోనూ లేనని, ఆయన మరణానంతరం ఆయన ఆశయాల సాధనకు మాత్రమే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అటువంటి తనపై కుట్రతో అవినీతి కేసులు మోపారని అన్నారు.

మోడీకి అహంకారం ఎక్కువ



ముంబై: ప్రధాని నరేంద్ర మోడీకి అహంభావం ఎక్కువగా ఉందని అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అన్నాహజారే ఆరోపించారు. ప్రధాని మోడీ తాను రాసిన లేఖలకు ఏమాత్రం స్పందించడంలేదన్నారు. సంగ్లీ జిల్లాలోని అట్పడి తెహసీల్‌లో జరిగిన బహిరంగ సభలో అన్నాహజారే ప్రసంగించారు. తాను గత మూడేళ్లలో ప్రధాని మోడీకి 30కిపైగా లేఖలు రాశానని అన్నాహజారే తెలిపారు. ఒక్కలేఖకు కూడా మోడీ స్పందించలేదన్నారు. ప్రధానమంత్రి అయ్యాక మోడీకి అహం బాగా పెరిగిందని అన్నా హజారే విమర్శించారు. లోక్‌పాల్, లోకాయుక్తా నియామకం, రైతులకు 5వేల పెన్షన్, పంటలకు అధిక రేట్లు తదితర డిమాండ్‌లతో అన్నా మరోసారి ఉద్యమం చేపట్టబోతున్నారు. ఈలోగా మూడు ర్యాలీలను నిర్వహిస్తాను అని చెప్పగా మొదటి ర్యాలీ సంగ్లీజిల్లాలోని అట్పడి తెహసీల్‌లో నిర్వహించారు. మార్చి 23 నుంచి ఢిల్లీలో మరో విడత ఆందోళన కార్యక్రమం ప్రారంభించనున్నట్టు ప్రకటించిన సంగతి విదితమే. అన్నాహజారే సభ్యుల అనర్హత విషయంపై స్పందించేందుకు అన్నాహజారే విముఖత వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌తో సయోధ్య ప్రసక్తే లేదు:దేవెగౌడ



మంగళూరు: కర్నాటకలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సయోధ్య ఉండబోదని మాజీ ప్రధానమంత్రి, జేడీఎస్ చీఫ్ దేవేగౌడ స్పష్టం చేశారు.గతంలో కాంగ్రెస్ తో పొత్తుకోవడం వల్లే మా చేతుల్ని మేమే కాల్చుకున్నట్లైందని ఇక మీదట అలాంటి పని చేయబోమని దేవేగౌడ పేర్కొన్నారు. ఒక వేళ కాంగ్రెస్ సహకారంతో అధికారాన్ని హస్తగతం చేసుకునే అవకాశం వచ్చిన తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోమని తేల్చిచెప్పారు. కాంగ్రెస్,బీజేపీ పార్టీలు ప్రజా సమస్యలను పక్కన బెట్టి మతరాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్ రాష్ట్రంలోని 224 అసెంబ్లీ స్థానాల నుంచి బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారు.

పాక్‌లో ఐరాస భద్రతా మండలి పర్యటన

న్యూఢిల్లీ: 26/11 ముంబై పేలుళ్ల సూత్రధారి హాఫీజ్ సయీద్‌పై చర్యలు తీసుకోవాల్సిందే అంటూ భారత్, అమెరికాతో పాటు అన్నీ దేశాలు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశంలో పాక్‌పై ఒత్తిడి తీసుకొస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి బృందం గురువారం పాక్ పర్యటనకు వెళ్తోంది. 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ పర్యవేక్షణ బృందం పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించనుంది. హాఫీజ్‌పై చర్యలు తీసుకోవాలని పాక్‌పై ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి పాక్ పర్యటన ప్రాధా న్యత సంతరించుకుంది.

బృందం పర్యటనను పాక్ ఓ సీనియర్ అధికారి అధికారికంగా ప్రకటిం చారు. నవంబర్‌లో పాకిస్థాన్ హాఫీజ్‌ను గృహ నిర్బంధం నుండి స్వేచ్ఛ కల్పించింది. ఉగ్రవాదులకు పాకిస్థాన్ స్వర్గధామంగా మారిందని అమెరికా బాహాటంగానే ఆగ్రహించింది. ఆర్థిక సాయాన్ని కూడా అమెరికా నిలిపివేసింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలితో పాక్ అధికారులు కేవలం అధికారిక అంశాల పైనే చర్చిస్తారని పాక్ సీనియర్ అధికారి చెప్పారు. జేయూడీ నేత హాఫీజ్ సయీద్ గురించి ప్రస్తావించబోరని, అలాంటి ఉద్దేశం ఉంటే వారిని ఇక్కడికి అనుమతించబోమని చెప్పారు.

ఆస్కార్ వ్యాఖ్యాతగా ప్రియాంకచోప్రా



ముంబై: ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాల కోసం నామినేషన్లను ప్రకటించే అవకాశాన్ని ప్రియాంక చోప్రాకు అందివచ్చింది. హాలీవుడ్ తారలు రొసారియో డాసన్, మిషెల్ రొడ్రిగజ్, రెబెల్ విల్సన్‌తో కలిసి ఆమె వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. బుధవారం నామినేషన్లను ప్రకటించనున్నారు. ప్రియాంక ప్రస్తుతం అమెరికన్ సీరిస్ క్వాంటికో షూటింగ్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఈ షూటింగ్ అమెరికాలో జరుగుతోంది. గతేడాది ప్రియాంక ప్రధాన పాత్రలో నటించిన హాలీవుడ్ సినిమా బేవాచ్ గత ఏడాది విడుదలైంది. అనంతరం ఆమె ఏ కిడ్ లైక్ జేక్, ఇజింట్ ఇట్ రొమాంటిక్ తదితర హాలీవుడ్ చిత్రాల్లో నటిస్తున్నారు. కేరళలో జరిగిన ప్రముఖనటి భావన, నవీన్ పెళ్లి సందర్భంగా ప్రియాంకా చోప్రా వారికి వీడియోలో శుభాకాంక్షలు తెలిపారు.

దావోస్‌లో భారతీయం

ప్రపంచ ఆర్థికగమనాన్ని శాసించే అగ్రదేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు దావోస్‌కు చేరాయి. ప్రపంచ ఆర్థిక ఫోరమ్ సదస్సుకు స్విస్‌లోని ఆల్పైన్ రిసార్ట్ వేదిక అయింది. నేటి నుంచి నాలుగు రోజులపాటు జరిగే ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. సదస్సులో తీసుకునే భవిష్యత్ కార్యాచరణ నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రపంచ నలుమూలల నుంచి నేతలు, రాజకీయ అధినేతలు, మేధావులు, పారిశ్రామిక వేత్తలు సమావేశంలో పాల్గొంటున్నారు. దాదాపు 3000 మంది హాజరు అవుతారని అంచనా.



రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని తొలిసారి ఈ సదస్సులో పాల్గొంటున్నారు.



ముఖేష్ అంబానీ, చందాకొచ్చర్, ఉదయ్ కొటక్ వంటి దిగ్గజాలతో కూడిన 100 సీఈవోల బృందం భారత్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నది.

11000 మంది జనాభా కలిగిన దావోస్ సదస్సులో 3000 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. వీరిలో 1200 మంది సీఈవోలు, 50కిపైగా రాజకీయ ప్రముఖులు ఉన్నారు.



ఈసారి బాలీవుడ్ ప్రవేశం లభించింది. షారుక్ ఖాన్, కరణ్ జోహార్ దావోస్ చేరుకున్నారు.



సంప్రదాయ వంటకాలు, యోగా దగ్గర్నుంచి ప్రపంచంలో ఇండియా భాగస్వామ్యం వరకు వివిధ అంశాలపై భారత్ కేంద్ర బిందువుగా వ్యవహరిస్తుంది.



దావోస్ సదస్సుకు అమెరికా నుంచి అత్యధికంగా 780 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తర్వాతి స్థానాల్లో బ్రిటన్ (266), స్విట్జర్లాండ్ (233), ఇండియా (129) ఉన్నాయి.

2000 సంవత్సరం తర్వాత, మొదటి సారి ఒక అమెరికా అధ్యక్షుడు ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సుకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా ట్రంప్-మోడీ మధ్య భేటీ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అమెరికా విధానాలను ప్రపంచానికి ట్రంప్ వివరిస్తారు. వాణిజ్య, పారిశ్రామిక, కార్మిక శ్రేయస్సుకు బాటలు వేసుకునే ప్రయత్నం చేస్తారు.

పెట్టుబడులే లక్ష్యంగా ముందుకు





దావోస్: అంతర్జాతీయ సమాజంలో భారతకీర్తిని చాటుతూ పెట్టుబడులే లక్ష్యంగా భారత ప్రధాని నరేంద్రమోడీ స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో అడుగుపెట్టారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరుకావడంతో ప్రపంచ దేశాల చూపు ఇప్పుడు ఇండియాపై పడింది. ప్రపంచ ఆర్థిక సదస్సులో మోడీ చేసే ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సదస్సులోని ఓపెనింగ్ స్పీచ్‌లో మోడీ ప్రసంగం ఆకట్టుకునే విధంగా ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో పెట్టుబడులే లక్ష్యంగానేడు ప్రధాని ప్రసంగం కొనసాగనుంది. పెట్టుబడులే లక్ష్యంగా ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా ప్రధాని మోడీ అంతర్జాతీయ బిజినెస్ కౌన్సిల్‌లో కూడా ప్రసంగిస్తారు. వివిధ దేశాలకు చెందిన సీఈవోలతోసమావేశమై భారత్ లో పెట్టుబడులపై చర్చిస్తారు. ఈఏడాది ప్రపంచ ఆర్థిక సదస్సు ఇతివృత్తం క్రియేటింగ్ ఎ షేర్డ్ ఫ్యూచర్ ఇన్ ఎ ఫ్రాక్చర్డ్ వరల్డ్ గా రూపొందించారు.

మోడీకి అపూర్వ స్వాగతం

సోమవారం స్విట్జర్లాండ్ లోని స్విట్జర్లాండ్‌లోని జురిచ్ చేరుకున్న ప్రధాని మోడీకి అపూర్వ స్వాగతం లభించింది. స్విస్ అధ్యక్షుడు అలియన్ బెర్సెట్ మోడీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం భారత దౌత్యవేత్తలు మోడీకి సాదర స్వాగతం పలికారు. ఆ తర్వాత ప్రపంచ దేశాలకు చెందిన 300 మంది సీఈవోలకు మోడీ విందు ఇచ్చారు. స్విట్జర్లాండ్ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ... స్విస్ ప్రధాని స్టీఫెన్ లోఫెన్ తో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుపుతారు. దావోస్ చేరుకోగానేమోడీ తన అనుభవాలను భారతీయులతో పంచుకున్నారు.ప్రపంచ దేశాలతో భారత్ బంధం మరింత మెరుగుపడిందని.. రాజకీయ, ఆర్థిక సంబంధాలను మరింతగా మెరుగుపరుస్తూ అన్ని దేశాల ప్రజల భద్రతతో పాటు అన్ని రంగాల్లోఅభివృద్ధిలో భాగస్వాములమౌతున్నామని తెలిపారు. దావోస్ సదస్సులో ఆర్థిక అంశాలతో పాటు అంతర్జాతీయ సమాజంతో భవిష్యత్ భారత సంబంధాలపై చర్చలు జరుపుతామన్నారు. 3వేలకు పైగా ప్రపంచ దేశాల నాయకులు, వ్యాపార వేత్తలు, రాజకీయ నాయకులు దావోస్ సదస్సుకు హాజరౌతున్నారని..వివిధ రంగాలకు చెందిన కళాకారులు కూడా ఈ సదస్సుకు వస్తున్నారని తెలిపారు.

భారత్‌నుంచి దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సుకు భారత్ నుంచి 130 మంది ప్రతినిధులు హాజరౌతున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. తెలంగాణ ఐటీ మంత్రి కే.తారకరామారావు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు దావోస్ సదస్సుకు హాజరయ్యారు.

వ్యవసాయ రంగానికి టెక్నాలజీ ఊతం

దావోస్ పర్యటనలో ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: వర్షపాతం తక్కువ వున్నప్పటికీ టెక్నాలజీ వినియోగం ఫలితంగా వ్యవసాయ రంగంలో రెండంకెల అభివృద్ధిని నమోదు చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగా పెట్టుబడులకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నామన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా మొదటి రోజు ముఖ్యమంత్రి బృందం జూరిచ్‌లో పయొనీరింగ్ వెంచర్స్ చైర్మన్‌తో చర్చించింది. రాష్ట్రంలోపెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలంటూ ఆహ్వానించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పెట్టుబడులకు తమ రాష్ట్రం అత్యంత అనుకూలమైనదని, అన్ని రాష్ట్రాలు, దేశాల దృష్టి ఇప్పుడు తమవైపు మళ్ళిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం అభివృద్ధికి తాము అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు లాభాన్ని పెంచి, పెట్టుబడిని తగ్గించే విధంగా పెద్ద ఎత్తున టెక్నాలజీని వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. హార్టికల్చర్ లో వివిధ పంటలను ప్రోత్సహించేందుకు పంటలవారీగా క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సెన్సార్లు, డ్రోన్లు కూడా వినియోగిస్తున్నామని చంద్రబాబు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జూరిచ్ టెక్నాలజీ వినియోగం వినూత్నతలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాలలో విప్లవాత్మకమైన మార్పుల కోసం అనేక ఆధునిక టెక్నాలజీలను వినియోగిస్తున్నామన్నారు. సరైన సమయంలో ఆంధ్రప్రదేశ్ , జూరిచ్ ప్రభుత్వాల మధ్య సిస్టర్ స్టేట్ ఒప్పందం జరిగిందని తెలిపారు.

వెయ్యి కోట్ల పెట్టుబడి: ఇప్పటికే ఇండియాలో వ్యవసాయ రంగానికి సంబంధించి వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టామని పయొనీరింగ్ వెంచర్స్ చైర్మన్ రోస్ పాల్ వెల్లడించారు. పండ్ల తోటలు, పాడి పరిశ్రమలో పెట్టుబడులు వున్నాయని గుర్తు చేశారు. వివిధ పండ్ల తోటలు, కూరగాయల రకాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. భారతదేశంలోని గ్రామాలలో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధంగా వున్నామని గుర్తు చేశారు.

చైన్ బిజినెస్‌లో పయొనీర్ మేటి: ఇదిలా వుండగా జూరిచ్ కేంద్రంగా పనిచేస్తున్న పయొనీరింగ్ వెంచర్స్ వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత సప్లై చైన్ బిజినెస్‌లో అగ్రగామిగా వుంది. వ్యాపార, ఉత్పత్తిరంగంలో ఇప్పటికే భారతదేశంతో మంచి సంబంధాలు కలిగివున్న ఈ సంస్థ మరిన్ని పెట్టుబడులను గ్రామీణ ప్రాంతాలలో పెట్టాలనే యోచనలోవుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కూడిన బృందం జరిపిన భేటీకి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. చంద్రబాబు బృందం జరిపిన భేటీ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఆ సంస్థ చైర్మన్ అంగీకరించారని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ మేరకు చైర్మన్ రోస్ పాల్ నిర్దిష్టమైన హామీని ఇచ్చారని తెలిపారు.

సిస్టర్ స్టేట్ ఒప్పందం: తమ పర్యటనలో భాగంగా చంద్రబాబు బృందం జూరిచ్ ప్రభుత్వంతో సిస్టర్ స్టేట్ ఒప్పందం కుదుర్చుకుంది. కార్మెన్ వాకర్‌జూరిచ్ ప్రభుత్వకౌన్సిలర్, డిప్యూటి మినిస్టర్ బ్రూనో సౌటర్, కోర్ని మేయర్ డైరెక్టర్ ఆఫ్ ఫారెన్ ఎఫైర్స్‌లతో చర్చలు జరపడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమక్షంలో సిస్టర్‌స్టేట్ ఒప్పంద పత్రాలను జూరిచ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు చెందిన అధికారులు మార్చుకోవడం జరిగింది. చర్చలతో పాటు జూరిచ్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పయొనీరింగ్ వెంచర్స్ చీఫ్ ఇన్వెస్టర్ ఆఫీసర్ సందీప్ రాజ్‌తో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, పంచాయతీరాజ్, ఐ.టి, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులు పాల్గొన్నారు.



గుజరాత్‌లో పేలుళ్ల సూత్రధారి..

భారత్ లాడెన్ అరెస్ట్

న్యూఢిల్లీ: ఇండియన్ ముజాహిదీన్‌కు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, గుజరాత్ వరస పేలుళ్ల సూత్రధారి అబ్దుల్ సుభాన్ ఖురేషిని (46) ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. భారత బిన్‌లాడెన్‌గా పేర్కొనే ఖురేషిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. అయితే కొంత కాలంగా ఖురేషి కాసిం అనేపేరుతో ఢిల్లీలో నివసిస్తున్నాడు. 2008 గుజరాత్ పేలుళ్ల సూత్రధారి, సిమి ఇండియన్ ముజాహి దిన్ ఉగ్రవాది అబ్దుల్ సుభాన్ ఖురేషి పదేళ్ల తర్వాత పోలీసుల కు చిక్కాడు. వేరుపేరుతో అజ్ఞాతంలో ఉంటున్న ఖురేషిని ఢిల్లీ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఢిల్లీ ఘాజీపూర్‌లోని ఓ ఇంట్లో నివసిస్తున్న ఖురేషీని ప్రత్యేక పోలీస్‌దళం అరెస్టు చేసింది. నిషేధిత సిమి సంస్థతో సంబంధాలు కలిగిన ఖురేషి 2008లో గుజరాత్‌లో చోటు చేసుకున్న వరుస పేలుళ్లలో ప్రధాన నిందితుడని పోలీసులు తెలిపారు. ఖురేషి బాంబులు తయారీలో దిట్ట. అహ్మదాబాద్, సూరత్‌లో దాదాపు 27బాంబులను ఉగ్రవాదులు వరుసగా పేల్చి మారణకాండ సృష్టించారు. ఈ ఘటనలో 56మంది ప్రజలు తమ ప్రాణాలు కోల్పోగా 200మందికిపైగా గాయపడ్డారు. 2006లో ముంబై సబర్బన్ రైళ్లలో జరిగినదాడిలో సుమారు 200మంది చనిపోయారు. మరో 700మంది గాయపడ్డారు. 2008 జూలై 26న అహ్మదాబాద్‌లో వరుసగా 21బాంబు పేలుళ్లు జరిగాయి. ఒక అమెరికన్ వైఫై నెట్‌వర్క్ ద్వారా మీడియాకు పంపించిన ఈమెయిల్స్‌లో పేలుళ్లకు తనే పాల్పడినట్టు ఖురేషి పేర్కొన్నాడు. దీంతో ఖురేషీ కోసం ఎన్ఐఏ అప్పటినుంచి విస్తృతంగా గాలిస్తోంది.



సాఫ్ట్‌వేర్ నుంచి ఉగ్రవాది

ఖురేషి ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఖురేషీ కుటుంబీకులు దశాబ్దాల కిందటే యూపీ నుంచి ముంబైకి వలసవచ్చారు. అతని విద్యాభ్యాసం ముంబైలోనే జరిగింది. కంప్యూటర్ ఇంజినీరింగ్ చదివిన ఖురేషీ పలుసంస్థల్లో టెకీగా పనిచేశాడు. ముంబై మత కలహాల నేపథ్యంలో ఉగ్రవాదంవైపు మరలి మొదట స్టూడెంట్ ఇస్లామిక్ మూమెంట్ ఆఫ్ ఇండియా (సిమి)లో చేరాడు. సాంకేతికంగా మంచి పట్టున్న ఖురేషి అహ్మదాబాద్ వరుస పేలుళ్లకు ఉపయోగించిన బాంబులను అతనే తయారుచేశాడని పోలీసులు తెలిపారు.

ఉప ఎన్నికలకు రెడీ

- ఆప్‌కు బీజేపీ రెబల్స్ వెన్నుదన్ను
- బీజేపీవి నీచ రాజకీయాలు: సిసోడియా

న్యూఢిల్లీ: లాభదాయక పదవుల వ్యవహారంలో అనర్హత వేటు ఎదుర్కొంటున్న 20 మంది ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నికల కమిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో గతంలో దాఖలు చేసిన పిటిషన్లను వెనక్కితీసుకున్నారు. ఈ వ్యవహారంపై నిపుణులతో చర్చించి తాజా పిటిషన్లు దాఖలు చేసేందుకు ఆప్ ఎమ్మెల్యేలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రపతి ఆమోద ముద్ర తర్వాత కూడావెనక్కి తగ్గకుండా.. న్యాయపోరాటం చేస్తామని ప్రకటించిన ఆప్ ఎమ్మెల్యేలు తాజా పిటిషన్ల దాఖలు చేసేందుకు గత పిటిషన్లను వెనక్కి తీసుకుంటున్నట్లు న్యాయమూర్తికి వివరించారు. ఎమ్మెల్యేల అభ్యర్థనకు అంగీకరించిన జస్టిస్ రేఖ పల్లి వారి పిటిషన్ల విత్ డ్రాను డిస్మిస్ గా పేర్కొన్నారు. లాభదాయక పదవుల వ్యవహారంలో తమ వాదనను ఎన్నికల కమిషన్ పరిగణలోకి తీసుకుపోవడంతో గతేడాది ఆగస్టులో ఎమ్మెల్యేలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

ఆప్ ఎమ్మెల్యేలకు సిన్హాల మద్దతు

సస్పెన్షన్ వేటు ఎదుర్కొంటున్న 20 మంది ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలకు బీజేపీ రెబల్ నాయకులు యశ్వంత్ సిన్హా, శత్రుఘ్న సిన్హా మద్దతు పలికారు. ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ ఈసీ చేసిన సిఫార్సును రాష్ట్రపతి ఆమోదించడం తుగ్లక్ రాజ్యాన్ని తలపిస్తోందని ఆరోపించారు. రాష్ట్రపతి నిర్ణయం సహజ న్యాయానికి విఘాతం కలిగించేలా ఉందని యశ్వంత్ సిన్హా ట్వీట్ చేశారు. వాదనలు వినకుండా.. హైకోర్టు ఆదేశాలు వచ్చే వరకు వేచి చూడకుండా చేయడమంటే తుగ్లక్ సామ్రాజ్యాన్ని తలపించడమే అని అభివర్ణించారు. బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ.. ఆప్‌పై రాజకీయ ప్రతీకారంలో భాగం గానే 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అని అభివర్ణించారు.

ఢిల్లీ ప్రజలకు సిసోడియా బహిరంగ లేఖ

ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపై ఆ పార్టీ నాయకుడు, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా తీవ్రంగా స్పందించారు. 20మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపై సిసోడియా ఢిల్లీ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. ఈలేఖను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అందజేశారు. బీజేపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని.. 20 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికల కోసమే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తమ ఎమ్మెల్యేలపై వేటు వేయించిందని , 20 మంది ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా కొనసాగిన కాలంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు, డబ్బుగానీ పొందలేదని సిసోడియా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ఎమ్మెల్యేలపై అన్యాయంగా వేటువేయించిందని ఆరోపించారు. వచ్చే రెండేళ్లలో ఢిల్లీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చూసి భయపడే బీజేపీ ఈ పని చేసిందని లేఖలో పేర్కొన్నారు.రాష్ట్రంలో అరవింద్ కేజ్రీవాల్ కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీజేపీ తమ ఎమ్మెల్యేలపై వేటు వేసేలా ప్లాన్ చేసిందనిఆరోపించారు.



లోయ మృతి కేసు సీరియస్

- ఈ కేసులో ఎవరికీ ఉద్దేశాలు ఆపాదించొద్దు
- నిష్పాక్షిక పరిశీలన చేస్తాం : సుప్రీంకోర్టు
- కోర్టులో ఇరుపక్షాల మధ్య తీవ్రవాదోపవాదాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : జస్టిస్ లోయ మృతికేసు చాలా సీరియస్ అంశమని, దీనిని నిష్పాక్షికంగా పరిశీలిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసుపై ఎవరికీ ఉద్దేశాలు ఆపాదించకుండా సంయమనం పాటించాలని కోరింది. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ కన్విల్కర్, జస్టిస్ చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం జస్టిస్ లోయ మృతి కేసును విచారించింది. నలుగురు న్యాయమూర్తుల తిరుగుబాటుకు కారణంగా భావిస్తున్న ఈ సున్నితమైన కేసును జస్టిస్ అరుణ్‌మిశ్రా బెంచ్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనానికి బదిలీ చేశారు. జస్టిస్ లోయ అనుమానాస్పద మృతి కేసును స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని పిటీషనర్లు తెహసీన్ పూనావాలా, బి.లోన్ అనే వ్యక్తులు పిటీషషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్లపై విచారణను సుప్రీంకోర్టు ప్రధాన ధర్మాసనం చేపట్టింది. విచారణ సందర్భంగా జస్టిస్ లోయ మృతికి సంబంధించిన కారణాలన్నింటిని విశ్లేషిస్తామని, డాక్యుమెంట్లను పరిశీలిస్తామని, ఆ తర్వాత దీనిపై ఓ నిష్పాక్షిక ముగింపునకు వస్తామని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు చాలా సీరియస్ అంశమని, దీనిలో అత్యంత జాగ్రత్తగా నిష్పాక్షికంగా వ్యవహరించాలని వెల్లడించింది. ఈ కేసులో మీడియా నోరు నొక్కుతారన్న భయాలు అక్కర్లేదని, అటువంటిదేమీ జరగదని భరోసా ఇచ్చింది. అలాగే నాగపూర్, బొంబాయి హైకోర్టుల్లో ఈ అంశంపై దాఖలైన కేసులను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. బొంబాయి లాయర్స్ అసోసియేషన్ తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, సామాజిక కార్యకర్త తరఫున ఇంటర్వెన్షన్ అప్లికేషన్ దాఖలుకు అనుమతించింది. ఈ విషయాన్ని నిష్పాక్షిక దృష్టితో పరిశీలిస్తామని, చాలా సీరియస్ అంశమని జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు.

కోర్టులో తీవ్ర వాదోపవాదాలు

వాదనల సమయంలో మహారాష్ట్ర తరఫున వాదిస్తున్న హరీష్ సాల్వే, ముకుల్ రోహత్గీపై సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆక్షేపణ వ్యక్తం చేసింది. కేసు విచారణ సందర్భంగా తీవ్రమైన వాదోపవాదాలు జరిగాయి. జడ్జీ మృతి అంశాన్ని విచారిస్తుండగా, ఈ కేసులో లేని వ్యక్తి గురించి మాట్లాడడం సరైంది కాదని, మనఃసాక్షి ప్రకారం నడుచుకోవాలని ఇరుపక్షాలను శాంతింపజేస్తూ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో తాము అందజేసిన వివరాలు బయటపెట్టకూడదని మహారాష్ట్ర ప్రభుత్వం తరఫు వాదిస్తున్న సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే న్యాయస్థానాన్ని విజ్ఞప్తి చేశారు. అయితే ఇది మీడియా నోరు నొక్కడమేనని పిటీషనర్ల తరఫు న్యాయవాది ఇందిరా జైసింగ్ అన్నారు. ఈ వాదనను సమర్థిస్తూ ఒక వ్యక్తిని కాపాడేందుకు మొత్తం వ్యవస్థ పనిచేస్తోందన్నారు. అయితే ఈ కేసులో ఇద్దరు న్యాయమూర్తుల స్టేట్‌మెంట్లు ఉన్నందున వాటిని బహిరంగపరిస్తే వారికి ఇబ్బందికరంగా ఉంటుందని సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వివరించారు. విచారణలో ఉన్న అంశాన్ని బయట ఎలా చర్చిస్తారని జస్టిస్ కన్విల్కర్ ప్రశ్నించారు. అయితే దీనిని ప్రజలు చర్చించకుండా ఆపలేరని పిటీషనర్ల తరఫు న్యాయవాది దవే అన్నారు. సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే అభ్యంతరం తెలుపుతూ,అమిత్‌షా పలుకుబడి కలిగిన రాజకీయ నాయకుడైనందువల్లే ఆయన పేరును ముందుకు తీసుకువస్తున్నారని, కేసుకు సంబంధం లేని వ్యక్తికి ఉద్దేశాలు ఆపాదించడం సరికాదని అన్నారు. ఈ అంశాన్ని శాంతియుతంగా, నిష్పాక్షికంగా విచారించినప్పుడే కేసు మూలాలు తెలుసుకోగలమని, ఎవరికీ ఉద్దేశాలు ఆపాదించొద్దని జస్టిస్ చంద్రచూడ్ సూచించారు. మీడియా గొంతు నొక్కుతారన్న న్యాయవాది ఇందిరా జైసింగ్ వ్యాఖ్యలపై చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు గురించి తాము ఒక్కమాట మాట్లాడకముందే అప్పుడే అంచనాకు ఎలా వస్తారని ప్రశ్నించారు. మీడియాను గొంతునొక్కే ప్రసక్తి లేదని గతంలోనే చెప్పామని, దీనిపై కోర్టుకు క్షమాపణ చెప్పాలన్నారు.

పద్మావత్‌కు తప్పని నిరసన జ్వాలలు

న్యూఢిల్లీ : ఈనెల 25న విడుదలకు సిద్ధం అవుతున్న వివాదాస్పద చిత్రం పద్మవత్‌కు కష్టాలు తప్పడం లేవు. కర్ణిసేన ఆధ్వర్యంలో రాజ్‌పుత్‌లు ఈ సినిమాకు వ్యతిరేకంగా జోరుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తాజాగా సోమవారం కర్ణిసేన సభ్యులు ఉజ్జయిని ప్రధాని రహదారిని మూసివేసి నిరసన తెలిపారు. రోడ్లపై టైర్లు కాల్చి సినిమా విడుదలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉజ్జయిని నుండి నగాడ, దేవస్ నుండి మకీస్, ఆగర్ నుండి కోట వెళ్లాల్సిన రోడ్లపై నిరసన తెలపడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో రంగంలోకి దిగిన ఎస్పీ సచిన్ అతుల్‌కర్ పరిస్థితి అదుపులోకి తీసుకురావాలని ఆదేశించారు. అప్పటికే నిరసన కారులు అగర్ నుండి కోట రహదారిపై ఉన్న పలు వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. అనంతరం నిరసన కారులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్పీకి అందజేశారు.

సుప్రీంను ఆశ్రయించిన రాజస్థాన్, ఎంపీ

18న సుప్రీం వెలువరించిన తీర్పుపై పలు రాష్ట్రాల్లో ఆందోళనలు చెలరేగాయి. తాజాగా ఈ నిరసనల మధ్య సినిమాను తమ రాష్ట్రాల్లో విడుదల చేయలేమంటూ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఈ సినిమా విడుదల నిలిపివేయాలంటూ రెండు రాష్ట్రాలు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. నేడు ఈ పిటిషన్‌పై విచారణ విచారణ నిర్వహించనున్నారు.

షట్‌డౌన్ ఎత్తివేత

81-18 ఓట్లతో నెగ్గిన ద్రవ్య వినిమయ బిల్లు



వాషింగ్టన్: గత మూడు రోజులుగా స్తంభించిన అమెరికా ఆర్థికవ్యవస్థ తిరిగి గాడిన పడింది. ఇమ్మిగ్రేషన్ విధానంపై ట్రంప్ సర్కార్‌ను నిలదీసిన డెమొక్రాట్లు చివరకు తమ పంతాన్ని నెగ్గించుకున్నారు. స్వాప్నికత అంశంపై చర్చకు ప్రభుత్వం అంగీకరించడంతో స్వల్పకాలిక వినిమయ బిల్లుకు డెమొక్రాట్లు అనుమతి ఇచ్చారు. దీంతో ఫిబ్రవరి 8 వరకు పాలన కొనసాగేందుకు వీలుకలిగింది. సోమవారం సాయంత్రం సెనెట్‌లో జరిగిన ఓటింగ్‌లో ద్రవ్య వినిమయ బిల్లు 81-18 ఓట్ల ఆధిక్యంతో సభ ఆమోదం పొందింది. అధ్యక్షుడు ట్రంప్ నుంచి సానుకూల సంకేతాలు రావడంతో విపక్షం ఓటింగ్‌కు సిద్ధమని ప్రకటించింది. షట్‌డౌన్ నేపథ్యంలో ట్రంప్ అధ్యక్ష వార్షికోత్సవ వేడుకలను రద్దుచేసుకోవాలని భావించారు. ప్రస్తుతం పరిస్థితి చక్కబడటం పట్ల ప్రజలు ఒకింత సాంత్వన చెందారు. ఉద్యోగుల్లో ఆందోళన తొలగింది. సెనేట్ లో ట్రంప్ ప్రాతినిధ్యం వహిస్తున్న రిపబ్లికన్ పార్టీకి బలం లేకపోవడం వల్లనే ఆర్థిక బిల్లులు ఆగిపోయాయి. అయితే,ఇది కొత్త విషయం కాదని అమెరికన్ మీడియా వాదిస్తున్నప్పటికీ, ఆర్థిక సంక్షోభం ట్రంప్ పరిపాలనకు మచ్చగా మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో సెనేట్ సభ్యులు పంతానికి పోతే సెనేట్ నిబంధనలు మార్చేస్తానంటూ ట్రంప్ హెచ్చరించడం కూడా డెమొక్రాట్లు మొండివైఖరి వీడేందుకు కారణమైందని రిపబ్లికన్లు పేర్కొన్నారు. విదేశీయులు అక్రమంగా దేశంలోకి చొరబడితే తనిఖీ చేయవద్దని డెమొక్రాట్లు కోరుతున్నారంటూ ఎదురు దాడికి దిగారు.

'నిర్భయ' కేసులో ఆలస్యం తగదు

న్యూఢిల్లీ : 2012, డిసెంబర్ 16న ఢిల్లీ గ్యాంగ్ రేప్ కేసుకు సంబంధించి నలుగురు నిందితుల్లో ఒకరి రివ్యూ పిటిషన్ విషయమై సుప్రీం కోర్టును ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయమై వెంటనే విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను కోర్టు ఆదేశించింది. ఈ విషయమై ఆలస్యం చేయవద్దని సూచించింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా మాట్లాడారు. గ్యాంగ్ రేప్ కేసులో నిందితుడైన అక్షయ్ కుమార్ సింగ్ క్షమాభిక్ష విషయమై మే 5న సుప్రీం కోర్టుకు విన్నవించాడని వివరించారు. నిర్భయ గ్యాంగ్ రేప్‌కు సంబంధించి నిందితులైన ముఖేష్ (29), పవన్ (22), వినయ్ శర్మ (23), అక్షయ్ కుమార్ సింగ్ (31)పై ఉన్న మరణ శిక్షను సుప్రీం నిలుపుదల చేసింది. అత్యంత హేయమైన చర్యగా సుప్రీం అభివర్ణించింది. సోమవారం విచారణ సందర్భంగా.. అక్షయ్ కుమార్ తరఫున రివ్యూ పిటిషన్‌ను ఎందుకు దాఖలు చేయలేదని అతని న్యాయవాది ఏపీ సింగ్‌ను సుప్రీం ప్రశ్నించింది. కొన్ని కుటుంబ కారణాల రీత్యా అక్షయ్ కుమార్ పిటిషన్ దాఖలులో ఆలస్యం జరిగిందని ఏపీ సింగ్ వివరించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 16కు వాయిదా వేసింది.

నర్సు చేతిలో 100 మంది హతం

బెర్లిన్ : రెండు హత్య కేసుల్లో జర్మనీ దేశానికి చెందిన ఓ నర్సు జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్నది. కానీ లోతుగా విచారించగా ఆమె సుమారు 100 హత్యలు చేసినట్టు వెలుగులోకి వచ్చింది. జర్మనీకి చెందిన ఓ వార్తా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. నీలిస్ హోజెల్ అనే నర్సుపై 97 హత్య ఆరోపణలు నమోదయ్యాయి. నార్త్‌వెస్ట్ జర్మనీలో 35 రోగులను పొట్టన పెట్టుకోగా, డెల్‌మెన్‌హోర్స్ట్‌లో సుమారు 62 మంది రోగులను చంపేసినట్టు నిర్ధారణ జరిగింది. గత కొన్నేళ్లుగా ఆమె ఈ హత్యలు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో నవంబర్‌లో అధికారులు ఆమెపై హత్య కేసు నమోదు చేశారు. నర్సు వ్యవహార శైలితో సుమారు 100 మంది ప్రాణాలు కోల్పోయినట్టు అధికారుల విచారణలో తేలింది. 2015, డెల్‌మెన్ హోర్స్ట్‌లో ముందుగా రెండు హత్యలు చేసినందుకుగాను ఆమెపై కేసు నమోదైంది. 1999 నుండి 2002 వరకు ఓల్డెన్‌బర్గ్ ఆస్పత్రిలో ఆమె పని చేసింది. డెల్‌మెన్ హోర్స్ట్‌లో 2003 నుండి 2015 వరకు పని చేసిందని విచారణ అధికారులు చెప్పారు.

క్రీడాప్రభ

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బోపన్న జోడి ఓటమి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్-2018 టోర్నీలో సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ మ్యాచుల్లో భారత ఆటగాడు రోహన్ బోపన్న ఫ్రాన్స్ ఆటగాడు ఎడ్వర్డ్ రోగర్ జోడీ, ఆలివర్ మరాచ్(ఆస్ట్రేలియా), మేట్ పావిక్ (క్రోయేషియా) జోడి చేతిలో 6-4, 6-7(5), 3-6 తేడాతో ఓటమి పాలయ్యింది. రెండు గంటలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో ఇండో-ఫ్రెంచ్ జంట రెండు బ్రేక్ పాయింట్ అవకాశాల్లో ఒక పాయింట్‌ను చేజిక్కుకుంది. కాగా వారి ప్రత్యర్థులు 12 బ్రేక్ పాయింట్లలో మూడింటిని కైవసం చేసుకుంది. కాగా మరో మ్యాచ్‌లో దివిజ్ శరణ్, రాజీవ్ రామ్(అమెరికా) జోడి లుకాజ్ కుబొట్(పోలండ్) వరల్డ్ నంబర్ వన్ ర్యాంకు ఆటగాడు మార్సెలో మెలో(బ్రెజిల్) చేతిలో 6-3, 6-7(4), 4-6 తేడాతో ఓటమి చెందింది. దాదాపుగా 2 గంటల 12 నిమిషాలవరకు సాగిని ఈ మ్యాచ్‌లో శరణ్, రామ్‌లు తమకు వచ్చిన ఆరు బ్రేక్ పాయింట్ల అవకాశాల్లో రెండింటిని తమకు అనుకూలంగా మలచుకోగా, లాకాజ్, మార్సెలో జోడీ నాలుగు బ్రేక్ పాయింట్ అవకాశాల్లో రెండింటిని తమకు అనుకూలంగా మలచుకున్నారు.



ప్రచార కర్తగా మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్



న్యూఢిల్లీ: ఐసిసిమహిళల క్రికెట్ ప్రపంచకప్-2017లో భారత్ ఫైనల్‌కు చేరడంలో కీలక భూమిక వహించిన హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రముఖ టైర్ల కంపెనీతో ప్రచారం ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా కౌర్ తన బ్యాట్‌పై సియట్ లోగోను ప్రదర్శించనుంది. రెండేళ్లు ఈ ఒప్పందం కొనసాగుతుంది. గతంలో ఇదే తరహాలో సియట్‌తో ఒప్పందం కుదుర్చుకున్న వారిలో రోహిత్ శర్మ, అజింక్యా రహానే, ఇషాన్ కిషన్‌లు ఉన్నారు. ఈ ఒప్పందంపై కౌర్ స్పందిస్తూ.. సియట్ ఇప్పటికే పలువురు ప్రముఖ క్రికెటర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. నాకు వారి సరసన నిలిచే అవకాశం సియట్ కంపెనీ ద్వారా లభించడం ఎంతో సంతోషం కలిగిస్తోంది. 2017లో భారత్ మహిళా క్రికెట్‌కు వచ్చిన ఊపు ఈ ఏడాది కూడా మరింతగా కొనసాగుతుందని ఆశిస్తున్నాను అని కౌర్ అన్నారు. కౌర్ మహిళా క్రికెట్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా సియట్ వైస్ ప్రెసిడెంట్ నితిష్ బజాజ్ ఈ ఒప్పందంపై మాట్లాడుతూ... భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుతంగా ఆడుతోంది. సియట్ తనవంతుగా క్రీడకు సహకరిస్తోందని తెలిపారు. మాతో ఒప్పందం కుదుర్చుకున్న తొలి మహిళా క్రికెటర్ కౌర్ అని అందుకు మేము గర్వపడుతున్నామని బజాజ్ అన్నారు.

ప్రొ రెజ్లింగ్‌లో పంజాబ్ రాయల్స్ గెలుపు



న్యూఢిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్ పోటీల్లో పంజాబ్ రాయల్స్ ఐకాన్ ఆటగాడు జెనో పెట్రియష్‌విల్లీ సూపర్ హెవీ వెయిట్ విభాగంలో 7-0 తేడాతో ముంబై మహారథికి చెందిన సతేందర్ మాలిక్‌పై విజయం సాధించాడు. దీనితో రాయల్స్, మహారథిపై 5-2 పాయింట్ల తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుంది.



ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఫెదరర్‌తో ఓటమి అనంతరం హంగేరీ క్రీడాకారుడు ఫుక్సోవిక్స్ హావభావాలు

క్వార్టర్ ఫైనల్లో ఫెదరర్, కెర్బర్





మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో రోజర్ ఫెదరర్ తన ప్రత్యర్థి ఫుక్సోవిక్స్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా, మహిళల సింగిల్స్‌లో మాజీ ఛాంపియన్ ఆంజెలిక్ కెర్బర్ కూడా తన ప్రత్యర్థిని ఓడించి చివరి 8 మంది పోటీ కూటమిలోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ ఆటగాడు డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్ హంగరీ దేశానికి చెందిన మార్టిన్ ఫుక్సోవిక్స్‌పై 6-4, 7-8(7/3), 6-2 సెట్ల తేడాతో విజయం సాధించాడు. 19 సార్లు గ్రాండ్ స్లామ్ విజేతగా నిలిచిన ఫెదరర్ మెల్‌బోర్న్ పార్క్‌లో ఇంతవరకు ఓటమిని ఎరగలేదు. అనంతరం ఫెదరర్ తన గెలుపుపై వ్యాఖ్యానిస్తూ మార్టన్ బాగా ఆడాడు. ఆడే సమయంలో వచ్చే ఐడియాను వేగంగా అమలు చేస్తేనే విజయం వరిస్తుందని అన్నాడు.

ఫెదరర్ వరుసగా సెమీస్‌లో నిలవడం ఇది 14వసారి. రెండవ ర్యాంకులో ఉన్న ఫెదరర్ క్వార్టర్ ఫైనల్లో చెక్ రిపబ్లిక్ ఆటగాడు బెర్డిచ్‌తో తలపడనున్నాడు. బెర్డిచ్, ప్రీ క్వార్టర్స్ మ్యాచ్‌లో ఇటలీకి చెందిన ఫాబియో ఫోగిన్నిపై 6-1,6-4, 6-4 వరుస సెట్లలో గెలిచాడు. బెర్డిచ్ గతంలో 2014, 2015లో ఆస్ట్రేలియన్ సెమీస్‌లకు చేరాడు. గత ఏడాది బెర్డిచ్ మూడవ రౌండ్‌లోనే ఓటమి పాలయ్యాడు. కాగా ఇంతవరకు 13 క్వార్టర్ ఫైనల్ మ్యాచుల్లో ఆడిన ఫెదరర్ మొత్తం మ్యాచులు గెలిచి ముందుకు దూసుకుపోయాడు. మహిళ సింగిల్స్‌లో జర్మనీ క్రీడాకారిణి కెర్బర్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. టాప్ క్రీడాకారిణులు కిందిస్థాయి రౌండ్లలోనే ఇంటిదారిపట్టడంతో టోర్నీలో నిలిచిన మహిళా క్రీడాకారిణుల్లో కెర్బర్ మాత్రమే గ్రాండ్ స్లామ్ విన్నర్‌గా కొనసాగుతోంది. సోమవారం జరిగిన సింగిల్స్ మ్యాచ్‌లో తైవానీస్ క్రీడాకారిణి హెచ్‌సీహ్ సువెయ్‌ను 4-6, 7-5, 6-2 సెట్ల తేడాతో ఓడించింది. 21 సీడెడ్ సువెయ్ పోరాట పటిమ చూపి తొలి సెట్‌ను కైవసం చేసుకుంది. రెండో సెంట్లో కూడా సువెయ్, కెర్బర్‌కు గట్టిపోటీనే ఇచ్చింది. ఇరువురి మధ్య నువ్వానేనా అన్నట్లు సాగిన సెట్‌లో చివరికి కెర్బర్ 7-5 తేడాతో గెలి చింది. ఆ తర్వాత సెట్లో సువెయ్‌నుంచి కెర్బర్‌కు ఎక్కువ ప్రతిఘటన ఎదురు కాలేదు దీంతో మూడు సెట్లలో రెండు సెట్లు కైవసం చేసుకున్న కెర్బర్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. అంతకు ముందు జరిగిన ప్రీ రౌండ్ మ్యాచ్‌లో కెర్బర్ రష్యా క్రీడాకారిణి మారియా షరపోవాపై గెలిచింది.

2016లో ఫైనల్లో సెరినా విలియమ్స్‌పై విజయం సాధించి ఛాంపియన్ గా కెర్బర్ నిలిచింది. వరల్డ్ నంబర్ వన్‌గా నిలిచిన కెర్బర్‌కు 2017 అంతగా కలిసిరాలేదు. కాగా తైవానీస్ క్రీడాకారిణి సువెయ్ ప్రపంచ ర్యాంకు 88. ఆమె ప్రపంచ నంబర్ మూడు క్రీడాకారిణి గార్బైన్ ముగురుజాను రెండవ రౌండ్లో, ప్రమాదకర క్రీడాకారిణి అగ్నీస్‌జ్కా రాద్వాన్‌స్కాను నాల్గవ రౌండ్లో ఓడించింది. క్వార్టర్ ఫైనల్‌లో కెర్బర్ అమెరికాకు చెందిన కీస్‌తో తలపడనుంది. మరో మ్యాచ్‌లో చెక్ క్రీడాకారిణి ప్లిస్కోవా తన దేశానికే చెందిన స్ట్రికోవాను 7-6, 3-6, 2-6 సెట్ల తేడాతో ఓడించింది. వీరిద్దరి మ్యాచ్ హోరా హోరీగా సాగింది. తొలిసెట్‌ను స్ట్రికోవా గెలుచుకోగా రెండోసెట్లో ప్లిస్కోవా గెలుచుకుంది. కీలకమైన మూడో సెట్లో గట్టిపోటీ ఇచ్చిన స్ట్రికోవా చివరికి 2-6 తేడాతో ప్లిస్కోవాకు దాసోహమంది. రొమేనియా దేశానికి చెందిన హలీప్ జపాన్ క్రీడాకారిణి ఒసాకాపై 6-3,6-2 వరుస సెట్లలో గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో ప్లిస్కోవా, రొమేనియా క్రీడాకారిణి హలీప్‌ను ఢీకొననుంది.క్వార్టర్ ఫైనల్‌కు చేరిన వారిలో బెల్జియంకు చెందిన ఎలైస్ మార్టిన్ ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలిస్ స్విటోలిస్‌ను ఢీకొననుండగా, స్పెయిన్‌కు చెందిన కార్లా సొరెజ్ నవరో, డానిష్ క్రీడాకారిణి కరోలిన్ వోజ్‌నియాకితో తలపడనుంది. క్వార్టర్ ఫైనల్స్ పురుషుల సింగిల్స్‌లో స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్, క్రొయేషియాకు చెందిన మారిస్ సిలిక్‌తో తలపడనుండగా, అమెరికాకు చెందిన టెన్ని సాండ్‌గ్లెన్ దక్షిణకొరియాకు చెందిన చుంగ్ హ్యోన్‌తో, బల్గేరియాకు చెందిన డిమిత్రివ్ ఇంగ్లండ్‌కు చెందిన ఎడ్మండ్‌తో తలపడనున్నారు.

పంజాబ్‌కు వరుసగా రెండో గెలుపు



కోల్‌కతా: ముస్తాక్ అలీ ట్రోఫీ-టీ 20 టోర్నీలో యువరాజ్ సింగ్ దూకుడు కొనసాగుతోంది. సోమవారం పంజాబ్, ముంబై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ మూడు వికెట్ల తేడాతో గెలిచింది. పంజాబ్ గెలుపులో కీలకంగా మారిన యువీ 34 బంతుల్లో 40 పరుగులు చేశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నాలుగు వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పంజాబ్ ఓపెనర్లు మనన్ వోహ్రా (31 బంతుల్లో 42 పరుగులు), మన్‌దీప్ సింగ్ (11 బంతులు 22 పరుగులు) బాగానే ఆడినప్పటికి 6.3 ఓవర్లలో పంజాబ్ 72 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయింది. యువరాజ్ సింగ్ బ్యాటింగ్‌కు వచ్చి ఆటను మలుపు తిప్పేశాడు. అప్పటికే క్రీజులో ఉన్న ఓపెనర్ మనన్ వోహ్రాతో కలిసి స్కోరును పరుగులెత్తించాడు. యువరాజ్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టి తన దూకుడును చెప్పకనే చెప్పాడు. తన ఇన్నింగ్స్‌లో మొత్తం ఆరు ఫోర్లు కొట్టాడు. 40 పరుగులు చేసి శివందూబె బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యుగా వెనుతిరిగాడు. అప్పటికి జట్టు స్కోరు 172/5. అనంతరం వచ్చిన పంజాబ్ బ్యాట్స్‌మన్లు విజయానికి కావాలసిన 27 పరుగులను 19.2 ఓవర్లలో సాధించారు. కాగా యువరాజ్‌కు రెండు సార్లు లైఫ్‌లు దొరికాయి. తన స్కోరు 8, 32 వద్ద ఉన్నప్పుడు యువరాజ్ ఇచ్చిన క్యాచ్‌లను ముంబై ఫీల్డర్లు వదలివేశారు. ఆదివారం కర్నాటకతో జరిగిన మ్యాచ్‌లో యువరాజ్ దూకుడుగా ఆడి పంజాబ్‌కు గెలిపించాడు.

సంతోష్ ట్రోఫీ ఫైనల్లో కేరళ



బెంగళూరు: సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ ఫైనల్లోకి కేరళ ప్రవేశించింది. గ్రూప్ బిలో భాగంగా సౌత్ జోన్‌లో తమిళనాడుతో డ్రా చేసుకున్న అనంతరం కేరళ ఫైనల్‌కు అర్హత సాధించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు, కేరళ మంచి ఆటను ప్రదర్శించాయి. అయితే ఇరుజట్లు గోల్ చేయటంలో సఫలతను పొందలేక పోయాయి. ఆట ప్రథమార్థం ముగిసే వరకు రెండు జట్లు 0-0 తో ఉన్నాయి. అనంతరం పరస్పరం గోల్ పోస్టులపై దాడులు జరుపుకున్న ప్పటికి ఫలితం లేకపోయింది. కేరళ ఆటగాళ్లు పలుమార్లు గోల్ చేయటానికి ప్రయత్నించి నప్పటికి తమిళనాడు డిఫెన్సివ్ ఆటగాళ్లు వారిని నిరోధించారు. చివరికి మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఫైనల్లో కేరళ, కర్నాటకను ఢీకొననుంది.

ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్‌లో నేటినుంచి సూపర్‌లీగ్ క్వార్టర్ ఫైనల్స్

క్రైస్ట్ చర్చ్: ఐసిసి అండర్-19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో సూపర్ లీగ్ క్వార్టర్ ఫైనల్ పోటీ దశ మంగళవారం ప్రారంభం కానుంది. ప్రతీ గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఇందులో పోటీపడతాయి. ఇందులో భాగంగా తొలి మ్యాచ్ ఇంగ్లండ్, మూడు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియా జట్ల మధ్య క్వీన్స్‌టౌన్‌లో జరుగుతుంది. రౌండ్ రాబిన్ లీగ్ నియమాల ప్రకారం గ్రూప్‌లో 3,4 స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేట్ క్వార్టర్‌లో ఆడతాయి. లీగ్ పోటీల్లో కెనడా, జింబాబ్వేలు ప్లేట్ సెమీస్‌కు చేరాయి. గ్రూప్ మ్యాచ్‌లో కెనడా పపువా న్యూగునియా(పీఎన్‌జీ)పై 80 పరుగుల తేడాతో విజయం సాధించగా, నమీబియాపై జింబాబ్వే గెలుపొందింది. కెనడా క్రికటర్ ఆకాశ్ గిల్ తన దేశం తరపున సెంచరీ చేసిన తొలి ఆటగాడుగా రికార్డుల్లోకి ఎక్కాడు. ఈ 12వ ఐసిసి అండర్-19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీల్లో సెంచరీ చేసిన 13 ఆటగాడు గిల్. సోమవారం నాటి మ్యాచ్‌లో గిల్ 12 ఫోర్లు, రెండు సిక్సర్లు బాదాడు. కెప్టెన్ అర్సలాన్ ఖాన్, అస్తాన్ దియోసమీ తలా 35 పరుగులు చేశారు. 50 ఓవర్లలో కెనగా 8 వికెట్ల నష్టపోయి 265 పరుగులు చేసింది. బదులుగా పీఎన్‌జీ 44.3 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌట్ అయింది. మరో మ్యాచ్‌లో జింబాంబ్వే, నమీబియాపై ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది.

ఖేలో ఇండియా పోటీలకు 3298 అథ్లెట్లు..

న్యూఢిల్లీ: ఈ నెల 31 ప్రారంభం కానున్న ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ (కేఐఎస్‌జీ)లలో మొత్తం 3298 అథ్లెట్‌లు పాల్గొన నున్నారు. ఇందులో ప్రపంచ జూనియర్ ఛాంపియన్ షూటర్ ఆనిష్ భన్వాలా, ప్రపంచ యూత్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ వెండి పతక విజేత జెరెమీ లాల్‌రినుంగా ఉన్నారు. కేఐఎస్‌జీ నిర్వాహకులకు ఇప్పటివరకు 3298 నామినేషన్లు వచ్చాయి. కాగా 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మొత్తం 4452 అథ్లెట్లు, అధికారులు ఈవెంట్‌లో పాలుపంచుకుంటారని అంచనా. మొత్తం 16 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తు న్నారు. భన్వాలా(15ఏళ్ల వయసు) గత ఏడాది జర్మనీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో 25 మీ. స్టాండర్డ్ పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకంను గెలుచుకున్నాడు. పూణెలో సైనిక బాలుర స్పోర్ట్స్ కంపెనీలో శిక్షణ పొందుతున్న మిజోరంకు చెందిన 15 ఏళ్ల జెరెమీ లాల్‌రిన్నుంగా గత ఏడాది ఏప్రిల్‌లో బ్యాంకాక్ జరిగిన ఐడబ్ల్యుఎఫ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సిల్వర్ మెడల్‌ను గెలుచుకున్నాడు. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన విలువిద్య కారుడు బొమ్మదేవర ధీరజ్ ఈ టోర్నీలో పాలుపంచుకుంటున్న మరో ప్రముఖ అథ్లెట్. ధీరజ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఐదు స్వర్ణ పతకాలు గెలుచుకున్నాడు. యూత్ ఒలింపిక్స్ క్రీడల అర్హతకు నిర్వహించిన ఆసియన్ కాంటినెంటల్ క్వాలిఫైయింగ్ పోటీల్లో వెండి పతకంను గెలుపొందాడు. ఈ క్రీడల్లో పాల్గొనడానికి అత్యధికంగా ఢిల్లీ నుంచి 341, మహారాష్ట్ర నుంచి 321, హర్యానా నుంచి 351 వచ్చాయి. ఈ క్రీడల్లో విజేతలకు 197 స్వర్ణ పతకాలు ప్రదానం చేస్తారు.

భారత్ మూడో టెస్టుకు సమాయత్తం



జొహెన్నెస్‌బర్గ్: రేపు ప్రారంభం కానున్న మూడో టెస్టుకోసం భారత క్రికెట్ జట్టు సీరియస్ ప్రాక్టీస్ చేస్తోంది. తొలి టెస్టు 72 పరుగుల తేడాతో, రెండో టెస్టును 135 పరుగుల తేడాతో కోల్పోయిన భారత్ మూడో టెస్టులోనైనా విజయం సాధించడానికి తన సర్వ శక్తులను ఒడ్డడానికి సమాయత్తమవుతోంది. స్థానిక వండరర్స్ స్టేడియంలో ప్రారంభం కానున్న ఈ టెస్టుకోసం ప్రాక్టీసులో భాగంగా కోహ్లీసేన పుట్‌బాల్ మ్యాచ్ ఆడింది. అనంతరం నెట్ ప్రాక్టీస్‌ను చేస్తోంది. సోమవారం స్థానిక ప్రముఖ రగ్బీ ఆటగాడు కూస్ జెన్సన్ కవల కుమారులు లెఫ్ట్ ఆర్మ్ పేసర్లుగా క్రికెట్‌లో రాణిస్తున్నారు. నెట్ ప్రాక్టీస్‌లో భాగంగా కోహ్లీ వారితో బౌలింగ్ చేయించాడు. కాగా భారత క్రికెటర్ల నెట్ ప్రాక్టీసులో కోచ్ రవిశాస్త్రి అంఫైర్‌గా వ్యవహరించి వారి లోటుపాట్లను తెలుపుతు సూచనలు ఇచ్చాడు.

తొలి టీ-20లో పాక్‌పై న్యూజిలాండ్ గెలుపు



వెల్లింగ్టన్: స్వదేశంలో న్యూజిలాండ్ జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగుతోంది. సోమవారం, పాకిస్తాన్‌తో జరిగిన తొలి టీ-20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ మూడు వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ బౌలింగ్‌ను ఎంపిక చేసుకుంది. పాకిస్తాన్ బ్యాటింగ్ పేలవంగా సాగింది. ఒక దశలో 38 పరుగులకు 6 వికెట్లు పోగొట్టుకుంది. పూర్తి ఇరవై ఓవర్లు కూడా ముగియకముందే 19.4 ఓవర్లలో 105 పరుగులకు ఆలౌట్ అయింది. టీ-20లో పాక్ అత్యల్ప స్కోరు 74. కాగా న్యూజిలాండ్ టీం తన దేశంలో ఆడిన 12 అన్ని ఫార్మాట్ మ్యాచుల్లో విజయం సాధించి మంచి ఊపుమీద ఉంది. మూడు సిరీస్ మ్యాచుల్లో భాగంగా న్యూజిలాండ్ 1-0 తేడాతో అధిక్యంను సంపాదించింది. పాక్ జట్టులో ఇద్దరు మాత్రమే డబుల్ స్కోరును దాటారు. బాబర్ హజం 43 పరుగులు చేయగా హసన్ అలీ 23 పరుగులు చేశాడు. న్యూజిలాండ్ బ్యాటింగ్ కూడా ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయింది. 8 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్ ఆ తర్వాత మూడో వికెట్‌కు 49 పరుగులు జోడించింది. 15.5 ఓవర్లలో న్యూజిలాండ్ 106 పరుగులు చేసి విజయం సాధించింది. 49 పరుగులు చేసి తన జట్టును విజయ పథంలో నడిపిన కొలిన్ మున్రో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును దక్కించుకున్నాడు. న్యూజిలాండ్ తన దేశంలో వెస్టిండీస్‌తో ఆడిన రెండు టెస్టులు, రెండు వన్డేలు, మూడు టీ-20 మ్యాచ్‌లు గెలువగా, పాకిస్తాన్‌తో వన్డే సిరీస్‌ను 5-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. తాజాగా సోమవారం మ్యాచ్ టీ-20 మ్యాచ్‌లో గెలిచి స్వదేశంలో తనకు ఎదురులేదని చాటింది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
Lively Interaction For Ever
లైఫ్
I
మంగళవారం 23 జనవరి 2018

నీ మనసులో ఏముందో దాన్ని పంచుకో ...అంటుంది ఫేస్ బుక్.. సెల్ఫీ దిగావా అయితే చూపించవూ... అని మారాం చేస్తుంది ఇన్‌స్టాగ్రామ్.. ఏదో ఒక బ్లాగు రాయొచ్చుగా... అని గోముగా అడుగుతుంది టంబ్లర్...నీ అభిప్రాయం ఘాటుగా..సూటిగా మూడు ముక్కల్లో చెప్పమని అరుస్తుంది ట్విట్టర్ పిట్ట..ఇవన్నీ బాగానే ఉన్నాయి.. కాని ఉద్యోగం.. ఉపాధి..మరి వీటికి సంబంధించిన నైపుణ్యాలు ఎక్కడ పంచుకోవాలి....ఎలా తెలుసుకోవాలి....అనే ప్రశ్న వేస్తే నేనున్నానోచ్... అంటూ ముందుకు దూసుకువస్తుంది... ప్రొఫెషనల్ నెట్ వర్క్ ప్లాట్ ఫామ్... లింక్డ్ ఇన్!





ప్రపంచంతో... LinkedIn

కెరీర్ అవకాశాలను కొల్లగొట్టండి

టెక్ టైమ్

2003లో ప్రారంభమైన లింక్డ్ ఇన్ అకౌంట్ హోల్డర్ల సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా రమారమి 50 కోట్లు. 5.2 కోట్ల ఖాతాదారులతో భారత దేశం ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచింది. మన దేశంలో గురుగ్రామ్, బెంగళూరు,ముంబై, ఢిల్లీలలో లింక్డ్ ఇన్ ఖాతాదారుల సంఖ్య అధికం. ఇక ప్రథమ,తృతీయ స్థానాలను అమెరికా, చైనాలు ఆక్రమించాయి. ఈ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్‌లో ప్రతి ఖాతాదారునికి సగటున 330 మంది ప్రొఫెషనల్స్‌తో కనెక్టివిటీ ఉంటుంది. 2016లో దీనిని మైక్రోసాఫ్ట్ 29 బిలియన్ డాలర్లుకు కొనుగోలు చేసిన తర్వాత లింక్డ్ ఇన్ రూపురేఖలు మారిపోయాయి.

ఆధునిక ప్రపంచంలో ప్రతి మనిషి ఒక బ్రాండ్! ఆధునిక మనిషి తన వ్యక్తిత్వాన్ని పెంచుకోవడంలో..ప్రొఫెషనల్ ఉనికిని చాటుకోవడంలో ..తన బ్రాండు వ్యాల్యూను పెంచుకోవడంలో లింక్డ్ ఇన్ కీలక పాత్ర పోషిస్తుందనడం... అతిశయోక్తి కాదు. అంతటి ప్రాముఖ్యత సంతరించుకుంది ఈ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్! కేవలం ఉద్యోగ అన్వేషణ కోసమే కాకుండా..ప్రొఫెషనల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్ ద్వారా కలిగే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం!

♦ లింక్డ్ ఇన్ ప్రొఫైల్ ఏ భాషలో ఉన్నా..200 దేశాల్లో 24 భాషల్లో రిజిష్టర యినందున..దాని ఖాతాదారులందరూ చూస్తారు.

♦ ప్రపంచంలో దాదాపు 80 శాతం ఉద్యోగాలు నెట్‌వర్కింగ్ వలన లభిస్తున్న తరుణంలో...రిక్రూటర్లు, హెచ్.ఆర్ మరియు హెడ్ హంటర్లు లింక్డ్ ఇన్‌లో యాక్టివ్‌గా ఉంటూ ఉద్యోగ అభ్యర్థులను ఈ నెట్‌వర్క్‌లో అన్వేషిస్తుంటారు.

♦ లింక్డ్ ఇన్‌లో ఖాతాలు మూడు రకాలుగా వర్గీకరించ బడతాయి. మీరు మైక్రోసాఫ్ట్ అధినేత సత్యానాదెళ్లకు కనెక్షన్ రిక్వెస్ట్ పంపి....ఆయన ఓకే చేస్తే మిమ్ములను ఫస్ట్ డిగ్రీ కనెక్షన్‌గా పరిగణిస్తారు. నాదెళ్ల కనెక్షన్‌లో గూగుల్ హెచ్.ఆర్. హెడ్ ఉంటే..అతను మీ సెకండ్ డిగ్రీ కనెక్షన్. అంటే ఇక్కడ సత్యానాదెళ్ల ..మీకు, గూగుల్ హెచ్ఆర్ హెడ్‌కు కామన్ కనెక్షన్..అందుకే గూగుల్ హెచ్ఆర్ హెడ్ మీ కనెక్షన్ రిక్వెస్ట్ ఆమోదించే అవకాశం ఉంది. ఇక అమెజాన్ టెక్నికల్ హెడ్‌ను మా ఖాతాలో యాడ్ చేసేందుకు మీరు రిక్వెస్ట్ పంపితే...ఆయనకు మీకు కామన్ కనెక్షన్ లేకపోతే..మీరిరువురు ఒకరికి ఒకరు థర్డ్ డిగ్రీ కనెక్షన్‌గా పరిగణిస్తారు.

♦ మీ సీవీ మరియు విద్యార్హతలు..ఉద్యోగాన్వేషణకు పాస్‌పోర్ట్ అయితే..ఉద్యోగ అవకాశాల కల్పన.. కేరీర్ డెవలప్‌మెంట్, ప్రముఖులతో పరిచయాలు తదితర అవకాశాలకు మీ లింక్డ్ ఇన్‌ప్రొఫైల్ వీసాలాంటిది. అందుకే పూర్తిగా నింపని, స్పష్టత లేని, ప్రొఫైల్ ఫొటో లేని లేదా ప్రొఫెషన్ ఫొటోకు బదులు..సెల్ఫీలాంటి ఫొటోలు ప్రొఫైల్ ఫొటోలుగా పెట్టిన ప్రొఫైల్‌తో మీరు కనెక్షన్ రిక్వెస్టు పంపితే.. అవతలి వ్యక్తి యాక్సెప్ట్ చేయరు. అంతేకాదు మీరు పంపిన రెక్వెస్టులు అధికంగా తిరస్కరిం చబడితే ..మీరు కొత్తగా ఇన్విటేషన్ పంపే లిమిట్‌ను కోల్పోతారు.

♦ మీ ప్రొఫైల్‌లో పొందుపరిచిన విద్యార్హతలు, పనిచేసిన కంపెనీల వివరాలు, అనుభవం ఇతరత్రా వివరాలకు, మీ సీవీలోని వివరాలకు వ్యత్యాసం ఉంటే రిక్రూటర్స్ మీ కాండిడేచర్‌ను వెనక్కు నెట్టేస్తారు. భవిష్యత్తులో కూడా మీ ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకోరు. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

♦ మీరు అనేక విషయాలపై వ్యాసాలు రాయడానికి లింక్డ్ ఇన్ తోడ్పడుతుంది. మీరు రాసిన వ్యాసాలను లింక్డ్ ఇన్ లో ప్రచురించే ముందు సంబంధిత 'కీ వర్డ్స్'కి ముందు హాష్ టాగ్ ఉపయోగించడం ముఖ్యం. ఫొటోలు వీడియోలు కూడా వ్యాసం కోసం ఉపయోగించవచ్చు. మీ వ్యాసం బాగుంటే మీ నెట్‌వర్క్ లోని వారే కాకుండా మొత్తం లింక్డ్ ఇన్లో ఎవరైనా 'లైక్ లేదా కామెంట్ పెడతారు లేదా తన నెట్‌వర్క్‌లో వ్యాసాన్ని షేర్ చేసుకొంటారు' ప్రచురిం పబడిన వ్యాసాన్ని ఎడిట్ లేదా డిలీట్ చేసు కోవ చ్చును. ఈ విధంగా మీ ప్రొఫైల్ నలుగురి దృష్టిలో పడి, ఆకట్టుకోవాలంటే మీరు కొన్ని వ్యాసాలు ప్రచురించడం ఒక మార్గం. మీ లింక్డ్ ఇన్ కనెక్షన్ల ద్వారా కాకుండా, మీ నెట్‌వర్క్ వెలుపల ఉన్న వ్యక్తులచే కూడా వీక్షించబడుతుంది.

♦ లింక్డ్ ఇన్లో పేరు గాంచిన కంపెనీల అధిపతులు, సిఇఒలు, టెడ్ స్పీకర్లు, లీడర్షిప్ పర్సనాలిటీలు, కోచులు, ప్రముఖ రచయితలు మొదలగు వారు అనుక్షణం క్రియాశీలంగా ఉంటూ వార్తలు, లీడర్షి ప్ వచనాలు, బిజినెస్ మరియు స్టార్టప్‌ల గూర్చి విశ్లేషణలు, కథ నాలు, మోటివేషనల్ ఆలోచ నలు లాంటి ఎన్నో మంచి విషయాలు తమ అప్డేట్లు లేదా వ్యాసాల ద్వారా పంచుకొం టుంటారు. వీళ్లే 'లింక్డ్ఇన్ ఇన్ఫ్లుయెన్సర్స్'గా వ్యవ హరింపబడతారు. ఎంత మంది ఇన్ఫ్లుయెన్సర్స్‌ని ఫాలో అయితే అంత ఉత్తమం.

♦ లింక్డ్ ఇన్‌లో చేరిన తరువాత మనకు ఆసక్తి అవసరమున్న కంపెనీల లింక్డ్ ఇన్ పేజీలను పరిశీ లించి ఆ సంస్థల గూర్చి క్షుణ్ణంగా తెలుసుకొని ఫాలో బటన్ నొక్కడం ద్వారా ఫాలో అవ్వొచ్చును. ఫాలో అయినప్పుడు ఆయా సంస్థల గురించిన వార్తలు, విషయాలు మరియు ముఖ్యంగా ఉద్యోగాల ఖాళీ జాబితా, భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ చూసి అప్లై చేయవచ్చును. మనకు తెలిసినవాళ్ళు, మన ఊరువాళ్ళు లేదా మనం చదివిన స్కూలు, విద్యాలయాల నుంచి చదువుకున్నవాళ్లు... ఎవరైనా ఆ సంస్థల్లో పని చేస్తున్నట్లయితే వారికి లింక్డ్ఇన్ ఆహ్వానం పంపడం ద్వారా నెట్‌వర్క్‌ని పెంచుకోవాలి.

♦ మీ చదువు, ఉద్యోగాలలో మీకున్న అనుభవం, స్కిల్స్‌ని బట్టి మీరెంత వేతనానికి అర్హులో ...అంటే మీ సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి 'లింక్డ్ఇన్ శాలరీ' అనే ఫీచర్ బాగా ఉపయోగపడుతుంది. ప్రస్తుత మీ జాబ్ టైటిల్ మరియు స్థానాన్ని బట్టి మీకెంత జీతం సంపాదించడానికి ఆస్కారం ఉంది. ఇంటర్వ్యూకెళ్లినట్లయితే మీరు ఎంత జీతం కోరుకోవచ్చు... లాంటి విషయాలను లింక్డ్ ఇన్... ఆస్తకికరమైన డేటాతో టైటిల్, లెవెల్, బ్రాండ్, విద్యాస్థాయి మరియు క్షేత్రము, పరిశ్రమ, కంపెనీ పరిమా ణాల ఆధారంగా తెలియజేస్తుంది. కాకపోతే ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలంటే...ముందు మీ ప్రస్తుత జాబ్ టైటిల్, జీతం వివరాలు నమోదుచేయాలి. లింక్డ్ఇన్ మీ జీతం వివరాలు గోప్యంగా ఉంచుతుంది. ఫేస్‌బుక్ మెసెంజర్, గూగుల్ చాట్ లాగే లింక్డ్ ఇన్లో చాటింగ్ చేయవచ్చును. లింక్డ్ ఇన్ చాట్లో, మీరు ఫొటోలను లేదా ఫైళ్లను కూడా పంపవచ్చును.

♦ మీ నెట్‌వర్క్‌లో ప్రముఖ సంస్థల డైరెక్టర్లు, మరియు ప్రఖ్యాత కంపెనీల ఉన్నతాధికారులు లేదా సిఎక్స్ ఒలు ఉన్నప్పుడు... మీ నెట్‌వర్క్‌లో కనెక్షన్లను ఎవరూ అన్వేషించకుండా లేదా మీ సహోద్యోగులు, క్లయింట్లు, మీ కాంపిటీషన్ కంపెనీలు మీ కనెక్షన్ల జాబితాను చూసి ఆ ప్రముఖ వ్యక్తులకు చేరువ అవకుండా ఉండాలని మీరనుకొంటే ...మీకు మాత్రమే కనపడేటట్టుగా మీ కనెక్షన్ల జాబితాను ప్రైవేట్‌గా ఉంచాలనుకొంటే సెక్యూరిటి సెట్టింగ్స్‌లో మార్చుకోవచ్చును.

♦ లింక్డ్ ఇన్‌లో మీరు పెట్టిన ప్రతీ అప్‌డేట్, ఆర్టికల్, వీడియో, ఫొటోలకి విశ్లేషణలు చూడగలరు, ఆ విశ్లేషణలను తెరిచి, మీ పోస్టులు ఎన్ని వ్యూస్ పొందింది, ఎంతమంది చదివారు, ఏ సిటీ, ఏ జాబ్ టైటిల్, ఏ కంపెనీలలో పనిచేస్తున్న వాళ్ళు అత్యధికంగా మీ పోస్టులు చదివారు లేదా చూశారు... ఇంకా మీ పోస్టులను చూసిన వ్యక్తుల స్థానం... 1వ, 2వ లేదా 3వ డిగ్రీ కనెక్షన్ల నుండి ...ఏ స్థానం...లాంటి విశ్లేషణ పొందవచ్చును.

> మీరే ఒక బ్రాండ్... మీ బ్రాండ్‌కి విలువ కల్పించి... గుర్తింపు పెంపొందించడానికి ప్రపంచంలోనే అతి పెద్ద ప్రొఫెషనల్ నెట్ వర్క్ లింక్డ్ఇన్...ఉపయోగపడుతుంది. ఇది మీ నైపుణ్యాలను, అనుభవాలను స్పష్టంగా నిర్వచించడంలో మీకు సహాయపడే ఏకైక వేదిక. ఇది మీకు వ్యక్తిగత, వృత్తిపరమైన బ్రాండుని నిర్మించడంలో తోడ్పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా మీ అనుభవాన్ని, అభ్యర్థిత్వాన్ని ప్రదర్శిస్తుంది. లింక్డ్ఇన్‌లో చురుకుగా ఉండటం వలన ఇవన్నీ సాధ్యమవుతాయి.

♦ ఎన్నో విషయాల మీద దాదాపు వందల లింక్డ్ఇన్ ఛానల్స్ ఉన్నాయి. వాటిని ఫాలో అవడం వలన కొత్త విషయాలను నేర్చుకొనవచ్చును.

♦ మీ లింక్డ్ ఇన్ హెడ్ లైన్‌లో 'నేను అత్యున్నతమైన కొత్త అవకాశం కోసం చూస్తున్నాను' లేదా 10,000 కనెక్షన్స్ అయ్యాయి. 15000వేలు నెక్స్ట్ టార్గెట్' లాంటివి పెట్టి మీ వాల్యుని క్షీణ పర్చుకోవద్దు.

♦ చిన్న కుటీర పరిశ్రమ నుంచి పెద్ద బహుళజాతీయ సంస్థ వరకు ప్రపంచమంతా ఈ రోజు ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ద్వారా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ల్లో లింక్డ్ ఇన్ కన్నా లక్షణమైన ప్లాట్‌ఫామ్ మరొకటి లేదు. అందుకే అన్ని ప్రముఖ సంస్థల ముఖ్య కార్యవర్గం, అధికారులు, మిగతా సోషల్ మీడియా ప్లాట్‌ఫారములలో ఉన్నా లేకపోయినా లింక్డ్ఇన్‌లో తప్పనిసరిగా నమోదు అవడమే కాకుండా యాక్టివ్‌గా ఉంటారు.

♦ లింక్డ్ ఇన్ కనెక్షన్ల ఫోన్ నెంబర్, ఇమెయిల్, కంపెనీ వివరాలు ఎక్సెల్ లేదా పిడిఎఫ్ ఫైలులో ఇంపోర్ట్ చేసుకోవచ్చును. మరియు మీ ఫోన్ కాంటాక్టులకి కూడా ఇంపోర్ట్ చేసుకోవచ్చును.

♦ చాలా మంది ఇతరులకు లింక్డ్ ఇన్ కనెక్షన్ రిక్వెస్ట్ పంపడంలోనే నిమగ్నులవుతారు. కానీ అన్నిటికన్నా ముఖ్యమైనది లింక్డ్ ఇన్ గ్రూప్స్. మీకు సంబంధించిన గ్రూపులలో జాయిన్ అయితే అక్కడ కొన్ని వేలమందితో ... మీ నెట్‌వర్క్‌లో లేని వారితోనూ... చర్చలు జరపవచ్చును, వాళ్ళ ద్వారా అమూల్యమైన విజ్ఞానం నేర్చుకొనవచ్చును. వాళ్ల కామెంట్లకు బదులు ఇవ్వవచ్చును. మీ వ్యాసాలు, పోస్టులు కూడా ఎన్నో సంబంధిత గ్రూపులలో పోస్ట్ చేయుటకు వీలుంది.

♦ ఇన్ మెయిల్' కనెక్షన్లతో నెట్ వర్క్‌తో పని లేకుండా మీకు కావాల్సిన ప్రముఖ వ్యక్తిని సంప్రదించాలంటే వాళ్ల ఇ-మెయిల్ లేదా ఫోన్ నెంబర్లు కావాలి. కానీ లింక్డ్ ఇన్‌లో 'ఇన్ మెయిల్' ద్వారా మీరు ఎంత పెద్ద వ్యక్తికైనా క్లుప్తంగా మెసేజ్ పంపవచ్చును. ఉదాహరణకు మీ స్టార్టప్ ఐడియా , ఫండింగ్ అవసరం లేదా మీరు అతని బిజినెస్/ కంపెనీ కోసం ఏ విధంగా ఉపయోగపడగలరో... ఒక వెంచర్ కాపిటల్ ఇన్వెస్టర్లకు, కంపెనీ వ్యవస్థాపకుడుకి ఇన్ మెయిల్ చేయవచ్చును.

♦ మీ వ్యాపారం లేదా వృత్తి... నెట్‌వర్కింగ్ ఆధారితమైనచో ' లింక్డ్ ఇన్ ప్రీమియం' సభ్యత్వం అవసరం, ప్రీమియం అకౌంట్లో ఉచిత అకౌంట్ కన్నా ఎన్నో అదనపు సదుపాయాలున్నాయి.

♦ లింక్డ్ ఇన్ సెక్యూరిటీ సెట్టింగ్స్‌లో మీ అకౌంట్‌కి సంబంధించి చాలా ఆప్షన్లున్నా యి. మీరు ఇంకొకరి ప్రొఫైల్ ఓపెన్ చేసి చూసినప్పుడు వాళ్లకు నోటిఫికేషన్ మీ పేరు బదులు అనానిమస్ (అజ్ఞాత వ్యక్తి) అని కనపడేట్లుగా మార్చుకోవచ్చు. మీ ప్రొఫైల్ అప్డేట్ చేసినప్పుడు అందరికీ నోటిఫికేషన్ వెళ్లకుండా, మీ కాంటాక్ట్ డీటెయిల్స్ ఎవరెవరికి కనపడాలి... ఎవరు మీకు కనెక్షన్ రిక్వెస్ట్ పంపొచ్చు... అందరూనా లేదా సెకండ్ డిగ్రీ/ లెవెల్ వాళ్ళు మాత్రమేనా... లాంటివి సెట్ చేసుకోవచ్చు.

♦ మీరు మీ ఉద్యోగం మారి మీ కాంపిటీషన్ సంస్థలో ఉద్యోగం స్వీకరిం చారనుకోండి...మీ పాత కంపెనీ ఉద్యోగులు లేదా మీ మాజీ బాస్ మీ లింక్డ్ ఇన్ పోస్టులు చూడడం మీకు ఇబ్బందికరం కావొచ్చు. అలాంటపుడు...సదరు వ్యక్తులను మీ నెట్‌వర్క్ కనెక్షన్ల నుండి తొలగించవచ్చును.

♦ మీ ప్రొఫైల్లో మీరు నిర్మించిన ప్రాజెక్ట్, వెబ్సైట్, బ్లాగ్, షార్ట్ మూవీ, ఇన్ఫోగ్రాఫిక్స్ లాంటి వాటి మీడియా... ఫొటోలు, వీడియోలు, వెబ్ లింకులు పొందు పర్చుకు న్నట్లయితే ఎంతో మంది రిక్రూటర్లను, సంస్థల హెచ్ ఆర్ డిపార్ట్‌మెంట్ వ్యక్తులను ఆకర్షించవచ్చును.

♦ మీ విద్యార్హతలు, పని చేసిన కంపెనీలు, మీరు సాధించిన ప్రగతి, పాజెక్టులు, మీకున్న అదనపు స్కిల్స్ లాంటి వివరాలతో వీడియో సి.వి.ని చిత్రీకరించి మీ లింక్డ్ఇన్ ప్రొఫైల్లో అప్‌లోడ్ చేయవచ్చు. ఈరోజుల్లో కంపెనీలు, రిక్రూటర్లు మరియు హెచ్. ఆర్... స్కైప్‌లోనూ ఇతర వీడియో కాల్స్ ద్వారానూ మొదటి రౌండ్ ఇంటర్వ్యూలను తీసుకోడానికి మొగ్గు చూపుతున్నారు.

♦ ఒక వార్తా పత్రిక మొదటి పేజీ హెడ్ లైన్ ఎంత శక్తిమంతంగా ఉంటుందో మీ లింక్డ్ ఇన్ ప్రొఫైల్ హెడ్ లైన్ అంత బాగా ఉండాలి. పరిమితమైన అక్షరాలు ఉపయోగించి మీ ప్రొఫెషన్‌కి సంబంధించిన విషయాలతో... అవకాశాలు కురిపించేలా 'కీ వర్డ్స్'తో మీ ప్రొఫైల్ హెడ్ లైన్ ని రాయాలి.



♦ 'లింక్డ్ఇన్ రికమెండేషన్స్' మీ ప్రొఫైల్ కు అదనపు హంగు, విశ్వసనీయత తీసుకొస్తాయి. మీరు ఇదివరకు పనిచేసిన సంస్థలోని ఉన్నతాధికారి లేదా మీ మాజీ బాస్... మీ పాత క్లయింటులాంటి వాళ్లు మీ పనితీరు, బిహే వియర్, ట్రైట్స్ మరియు స్కిల్స్... వంటివి చర్చించి మీ కోసం రాసిన రికమండేషన్ మీ ప్రొఫైల్‌కి క్రెడిబిలిటీ తెస్తుంది. మీరు ఒట్టి మాటల మనిషి కాదని చేతల ద్వారా మెప్పించగలరనే నమ్మకం కలిగిస్తాయి ఈ రికమెండేషన్లు.

♦ మీ జ్ఞానాన్ని ప్రదర్శించడానికి, అలాగే మీకు నైపుణ్యమున్న లేదా ప్రవేశమున్న అంశాల ద్వారా... ఇతరులకు సహాయపడే కంటెంట్, విషయాలు అందించడానికి లింక్డ్ఇన్ ఒక గొప్ప మార్గం. మీ నెట్‌వర్క్‌లో లేదా గ్రూపులలో ఒక పోస్టుని పంచుకొన్నపుడు సభ్యుల పరస్పర చర్చను ప్రోత్సహించేలా ప్రశ్న లేదా వ్యాఖ్యను చేర్చండి. మీరే ఒక బ్రాండ్... మీ బ్రాండ్‌కి విలువ కల్పించి... గుర్తింపు పెంపొందించడానికి ప్రపంచంలోనే అతి పెద్ద ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లింక్డ్ ఇన్...ఉపయోగపడుతుంది. ఇది మీ నైపుణ్యాలను, అనుభవాలను స్పష్టంగా నిర్వచించడంలో మీకు సహాయపడే ఏకైక వేదిక. ఇది మీకు వ్యక్తిగత, వృత్తిపరమైన బ్రాండుని నిర్మించడంలో తోడ్పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా మీ అనుభవాన్ని, అభ్యర్థిత్వాన్ని ప్రదర్శిస్తుంది. లింక్డ్ఇన్‌లో చురుకుగా ఉండటం వలన ఇవన్నీ సాధ్యమవుతాయి.



-సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్
నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్

మార్కెట్లోకి... హీరో హెచ్‌ఎఫ్ డాన్ బైక్!

హీరో మోటోకార్ప్ లిమిటెడ్ నుంచి 2018 మోడల్ హీరో హెచ్ఎఫ్ డాన్ బైక్ ఇండియా మార్కెట్లోకి వచ్చింది. ఇది ప్రస్తుతం ఒడిశా రాష్ట్రంలో మాత్రమే అందుబాటులో ఉంది. 100సీసీ ఇంజన్ సామర్థ్యం ఉన్న ఈ బైక్ ధర 37,400 రూపాయలు.(ఎక్స్ షోరూం ధర- ఒడిషా) త్వరలోనే ఈ బైక్ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా అందుబాటులోకి రానుంది. ఒడిషా మార్కెట్లో కూడా ఈ బైక్ .ఎరుపు,నలుపు కలర్లలో, అందుకు అనుకూలమైన గ్రాఫిక్స్‌తో లభిస్తుంది. ఇక బైక్ సీట్,ఇంజన్, ఇతర భాగాలు మాత్రం నల్లరంగులో ఉంటాయి. మొత్తం మీద కొత్త బైక్ యూత్‌ను ఆకట్టుకునేలా ఆకర్షణీయంగా డిజైన్ చేశారు.



ఏడు డివైస్‌లు... ఒక స్మార్ట్ రిమోట్

మన ఇంట్లో టీవీ,ఏసీ, ఆడియో సిస్టమ్.. ఇంకా పలురకాల ఇతర పరికరాలు ఉంటాయి. వాటిని ఆపరేట్ చేసుకోవడానికి ఒక్కోదానికి ఒక్కో రిమోట్ ఉంటుంది. ఏసీ ఆన్ చేయాలంటే దాని రిమోట్ దొరకదు. టీవీ రిమోట్ కని పిస్తుంది. అప్పుడు కాస్త చిరాకు వేస్తుంది. విసుక్కుంటాము. టీవీ, ఆడియో సిస్టమ్,ఏసీ..ఇలా అన్నింటిని ఆపరేట్ చేయడానికి ఒకే రిమోట్ ఉంటే బాగుండు అనిపిస్తుంది. అయితే పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమా అని అన్నింటినీ ఆపరేట్ చేసేవిధంగా స్మార్ట్ రిమోట్ మార్కెట్లోకి వచ్చింది.స్మార్ట్ రిమోట్ ద్వారా మనం కూర్చున్న చోటునుంచే కదలకుండా టీవీని, ఆడియో సిస్టమ్‌ను, ఏసీని..ఏది కావాలంటే దానిని ఆపరేట్ చేసుకో వచ్చు..



కాకపోతే ధర కాస్త ఎక్కువ. దీని ధర కేవలం 14,700 రూపాయలు మాత్రమే. ఈ రిమోట్ మూడు సెన్సార్ల సిస్టమ్‌ను కలిగి ఉంది. సెన్సార్లను గది లో అనువైన చోట అమర్చు కో వాల్సి ఉంటుంది. స్మార్ట్ రిమోట్ తో ఏడు రకాల డివైస్‌లను ఆపరేట్ చేసుకో వచ్చు. ఇది చిన్న పరికరం కదా ఇంట్లో ఏమూలనైనా పడి పోతే .. అన్న బాధ అవసరం లేదు. దీని చార్జింగ్ బేస్ వద్ద ఉన్న బటన్ దాని ఉనికిని కనిపెట్టడంలో సాయం చేస్తుంది.

వాట్సప్ నుండి నేరుగా యూట్యూబ్‌కి

మీకు మీ మిత్రుడు వాట్సప్ ద్వారా యూట్యూబ్ వీడియో లింక్ పంపాడా? దానిని మీరు చూడాలంటే తప్పకుండా వాట్సప్ యాప్‌నుంచి బయటకు వచ్చి చూడా ల్సిందే. మీరు ఐపోన్ వినియోగ దారులైతే ఇక మీదట మీకు అలాం టి సమస్య ఉండదు. ఐఫోన్ వినియోగ దారులు వాట్సప్ లోనే ఉండి నేరుగా యూట్యూబ్ వీడియోను తిలకిం చ వచ్చు. అయితే ఈ కొత్త ఫీచర్ ఐఓఎస్ వినియోగ దారులకు మాత్ర మే అందు బాటులోకి వచ్చింది. ఐఓఎస్ వినియో గదారులు యాపిల్ యాప్ స్టోర్ ద్వారా 2.18.11 వాట్సప్ వెర్షన్‌ను అప్ డేట్ చేసుకోవాలి. ఆండ్రాయిడ్, విండోస్ వినియో గదారులకు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందనే సమాచారం లేదు.



శరణాగతులకు పరమాత్మ అండ



ఎవరికీ అన్యాయం చేయాలని అనుకోకూడదు. ఎవరినీ బాధపెట్టాలనీ అనుకోకూడదు. ఎక్కడ ఎవరు తప్పుగా భావిస్తుంటారో వారిని భగవంతుడు చూస్తూ ఊరుకోడు. ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారు అన్న చందంగా ఎవరినైనా బాధపెట్టాలని చూస్తే వారే చివరకు బాధపడే స్థితి కలగవచ్చు.

పాండవులను ఇబ్బంది పెడదామని దుర్యోధనుడు ఘోషయాత్ర ప్రయత్నం చేశాడు. దాని వల్ల ఘోర అవమానం పాలయ్యాడు. దానితో బుద్ధి వస్తే బాగుండేది. మరోసారి అటువంటి ప్రయత్నమే చేశాడు. అయితే ధర్మాత్ములకు, తనను నమ్ముకున్న వారికి అపకారం జరగనివ్వడా పరమాత్మ. ఆ అపకారాన్ని అడ్డుకున్నాడు. అందరూ సంతోషంగా ఉండాలని అనుకోమని పెద్దలు చెబుతుంటారు. పాండవులకు నష్టం కలిగించాలని కౌరవులు తలపెట్టిన పన్నాగాన్ని, పరమాత్మ దానిని వమ్ము చేసి ధర్మాత్ములను ఎలా రక్షించాడో తెలిపే కథ సర్వ ధర్మాల సారమైన మహాభారతంలో ఉంది. అది బాగా ప్రచారం పొందిన కథే.

ఒకసారి ముక్కోపి అయిన మహర్షి దుర్వాసుడు తన శిష్యగణంతో దుర్యోధనాదుల వద్దకు వచ్చాడు. దుర్వాసునికి కోపం వస్తే శపిస్తాడు కనుక దుర్యోధనుడు ఆయనతో జాగ్రత్తగా మెసిలాడు. ఆయనను అతిథి సత్కారాలతో మంచి చేసుకున్నాడు. అతని ఆతిథ్యానికి సంబరపడిపోయిన దుర్వాసుడు ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. దుర్యోధనుడు వినయం నటిస్తూ 'స్వామీ! మీ దీవెన చాలా బలమైంది. దురదృష్టవశాత్తూ పాండవులు ద్యూతంలో ఓడిపోయి అరణ్యవాసం చేయాల్సి వచ్చింది. వారు ధర్మపరులు జూదంలో ఓడి ఆ నియమాల ప్రకారం అడవుల్లో ఉంటున్నారు కనుక మీరు వారున్న ప్రదేశానికి వెళ్లి ఆశీర్వదిస్తే చాలా సంతోషిస్తాను' అన్నాడు. దుర్యోధనుడు ఆ మాటలు మంచి మనసుతో అంటున్నాడని అనుకుని మరింత సంతోషించాడు దుర్వాసుడు. అందుకు అంగీకరించాడు. దుర్వాసుడు అడవికి వెడితే అరణ్యంలో ఉన్న పాండవులు ఆయనకు సరైన సత్కారాలు చేయలేకపోవచ్చని దానితో ఆయనకు కోపం వచ్చి శపించగలడని దుర్యోధనుని ఉద్దేశం.

మహాభారతంలో చిన్న కథలు

దుర్వాసుడు పాండవులు ఉన్న చోటికి వెళ్లాడు. ఆయన వెళ్లే సమయానికి భోజనాల సమయం దాటిపోయింది. పాండవుల భోజనాలు కూడా పూర్తయ్యాయి. దుర్వాసుడు శిష్యులతో కలిసి భోజనానికి వస్తానని చెప్పాడు. నదికి వెళ్ళి స్నానం చేసి శుచియై వస్తానని వెళ్లాడు. పాండవులకు అరణ్యవాసంలో ఆహారం ఇచ్చి ఆదుకుంటున్నది సూర్య భగవానుని అనుగ్రహంతో వచ్చిన అక్షయ పాత్ర. దానిలో ఆహారం అక్షయమై ఎంత మంది వచ్చినా సరిపోతుంది. అయితే ఒక సారి శుభ్రం చేసినాక ఆ పూటకు అది మళ్లీ పని చేయదు. ఆ సమయంలో దుర్వాసునికి, ఆయన శిష్యులకు ఎక్కడి నుంచి ఆహారం తేవాలని వారు ఆలోచనలో పడ్డారు. అందునా వచ్చింది దుర్వాసుడు. ఇటువంటి సమయాల్లో ఆదుకోగలిగింది తమకు అండదండ అయిన శ్రీకృష్ణుడే కనుక ద్రౌపదీ దేవి ఆయనను ప్రార్థించింది. తలచుకోగానే ఆయన వచ్చాడు. తనకు ఆకలి వేస్తోంది ఏదైనా పెట్టమని అడిగాడు. అవతల దుర్వాసుడు వచ్చాడు, ఆయనకే లేనిది నీకేమి ఇస్తానంది ద్రౌపది. పర్వాలేదు అక్షయ పాత్రలో ఏదో ఒకటి ఉండక పోదు అని ఆ పాత్ర తీసుకుని దానిలో అడుగున మిగిలిన ఒక మెతుకును తిని అక్షయమస్తు అన్నాడు. పరమాత్మ అక్షయం అని ఎవరి గురించి అన్నాడో అది వారికి అక్షయమయింది. తర్వాత భీముని కేసి చూసి దుర్వాసుని అతని శిష్యులను సాదరంగా తీసుకురమ్మన్నాడు. కృష్ణునికి శరణాగతి అయిన వారు, ఆయనపై భారం వేశారు. భీముడు వారిని తీసుకురావడానికి వెళ్ళాడు. అక్కడ స్నానాదులు చేసిన, చేస్తున్న దుర్వాసునికి, ఆయన శిష్యులకు అకస్మాత్తుగా కడుపులు నిండిపోయాయి. దుర్వాసుడు దీనికి కారణమేమిటని దివ్య దృష్టితో చూసాడు. దుర్యోధనాదుల పన్నాగం, తాను భోజనానికి రావడంతో పాండవుల ఆవేదన, కృష్ణుని అభయం ఇవన్నీ ఆయనకు అవగతమయ్యాయి. ఈలోగా భీముడు వచ్చి భోజనానికి రమ్మని పిలిచాడు. అయితే దుర్వాసుడు 'జరిగింది తెలిసింది. మాకు భోజనం తిన్నంత తృప్తి కలిగింది. ఇక ఇప్పుడు మేము భోజనాలు చేయలేం. మమ్మిలను క్షమించమని ధర్మరాజుతో చెప్పు. పాండవులందరికీ వాసుదేవుని కృప ఎల్లవేళలా ఉండాలని దీవిస్తున్నాను. మీ ధర్మాచరణ, సత్యపాలన మీకు విజయాన్ని ఇస్తుంది. సుఖ సంతోషాలతో ఉండండి' అని దీవించి భీముడిని పంపాడు.

అందుకే ఎప్పుడూ అందరూ బాగుండాలని, అందులో మనమూ ఉండాలని కోరుకోవాలి. వేదం కూడా సర్వే జనాస్సుఖినోభవంతు అనమంటుంది. దాన్ని మనం అనుసరిస్తే కష్టాలు కన్నీళ్లు మన చెంతకు రావు.

- అశ్విని

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

నిద్రాహార విహార నియతి



శ్రీ రమణాశ్రమం
6-4-47

నిన్న మధ్యాహ్నం ఒక భక్తులు భగవానుని సమీపించి, ''స్వామీ, తానెవరో తన ఆత్మను విచారించి తెలుసుకునేందుకు ధ్యానం చేయాలి గదా? ధ్యానానికి కూర్చుంటే నిద్ర వస్తుందే? అది రాకుండా ఉండే ఉపాయం ఏమిటి?'' అన్నారు. ''ప్రస్తుతం నీవు జాగ్రత్తలో జాగ్రత్తగా ఉండటం నేర్చుకో. వెనక నిద్ర సంగతి చూద్దాం. జాగ్రత్తలో ఎన్నో కలలు కంటాం. అవి లేకుండా జాగ్రత్త కలగాలి ముందు. ఈ చూచేదంతా స్వప్నమే. ఈ స్వప్న ప్రపంచంలో నుండి మేలుకోవా'' లన్నారు భగవాన్. ''ఆ జాగ్రత్త కలగటానికి సాధన కావాలి గదా? ఏదో ఒక నియతి యేర్పరచుకొని సాధన చేద్దామంటే, ఈ నిద్ర వస్తుందే? ఏవిధంగా దీన్ని పోగొట్టుకోవాలో భగవాన్ దయతో సెలవీయాలి'' అన్నారా పృచ్ఛకులు. ''ఆవరణ విక్షేపాదుల్లో మొదటి ఆవరణమే నిద్ర. సాధ్యమైనంతవరకు అది రాకుండా చూచుకోవాలి. అది ఏ కారణం వల్ల వస్తున్నదీ? అని విచారించి, ఆహార, విహారాదులు స్వచ్ఛంగా, మితంగా ఉండేట్లు నడుపుకొని, నిద్రరాకుండా చూచుకోవాలి గాని, వచ్చిన వెనక ఆపాలంటే లాభం లేదు. పుష్టిగా తింటే, సుష్టుగా నిద్ర రాదా మరి? ధ్యానానికి కూర్చుంటే తల ఊగుతుంది. కొందరు, వెంట్రుకలు, వెనక వైపు మేకుకు కట్టుకుంటారట. తల ఊగినప్పుడు మెలకువ రావటం తప్ప దాని వల్ల ధ్యానానికేం ప్రయోజనం? చిన్నప్పటి నా నిద్ర చరిత్ర ప్రసిద్ధమైనదే గదా. స్కూల్లో పాఠాలు చెపుతుంటే, కునికిపాట్లొస్తవని, వెనకగోడకు మేకొకటి కట్టి, తాడుకట్టి, జుట్టుకు ముడిపెట్టేవాణ్ణి. తల ఊగితే తాడు బిగిసి మెలకువ వచ్చేది. అట్లా కట్టు కోకుంటే, పంతులు చెవులు మెలిపి ఊపి లేపేవాడు'' అని నవ్వనారంభించారు భగవాన్.

''భగవానిదంతా కల్పించి చెప్పలేదు గదా?'' అన్నారు మురుగనార్. ''లేదు,లేదు. వాస్తవమే. పాఠం వినకుంటే పంతులు దండిస్తాడని అట్లా చేసేవాణ్ణి. అప్పటి స్థితి అది. ఇక్కడికి వచ్చిన మొదటి రోజుల్లో కళ్లు మూసుకొని ఒకే ధ్యానంలో ఉంటే, రాత్రేదో, పగలేదో తెలిసేది కాదు. ఎప్పుడైనా కళ్లు తెరచి చూస్తే, అప్పుడే ప్రొద్దుకుంకిందా? తెల్లవారిందా? అనిపించేది. ఆహారం లేదు. నిద్రలేదు. విహారం ఉంటే ఆహారం కావాలి. ఆహారం అంటే నిద్ర వస్తుంది. విహారం లేకుంటే ఆహారం వద్దు. ఆహారం లేకుంటే నిద్ర రాదు. ప్రాణాధారంగా ఏ స్వల్పాహారమో కుక్షిలో పడితే చాలు. నాకంతే అయ్యేది. కళ్లు తెరిచినప్పుడెవరో ఒకరు ద్రవరూపంగా ఏదో ఒకటి ఒక గ్లాసు ఆహారమిచ్చేవారు. అంతే, అయితే ఒకటి. ఒకే నిర్వికల్ప నిష్ఠలో ఉన్నప్పుడే తప్ప మనస్సు, శరీరం, వ్యవహారార్థం ఉపయోగించినప్పుడు ఆహార నిద్రలు విసర్జించుటకు వీలవుతుందా? అట్లా చేస్తే, శరీరం తూలుతుంది. అందువల్ల, మితసాత్వికాహార విహార నియతి ఆత్మోన్నతికి అత్యంతావశ్యకమని చెప్పవలసి ఉన్నది. ఉత్తములు తాము చేసే నిష్కామ్య సత్కార్యాచరణకు నిద్ర వల్ల కాలం వృథా పోరాదని, చాలాభాగం నిద్రను దూరం చేస్తారు. పదింటికి పడుకొని, రెండింటికి లేవటం మంచిదన్నారు కొందరు. అట్లాగైతే, నాలుగు గంటలు చాలును నిద్ర కన్నమాట. నాలుగు చాలదు ఆరుగంటలు కావాలన్నారు కొందరు. అంటే, ఆహార నిద్రలు అసలు మానటం మంచిది కాదు. అతిగానూ ఉండకూడదన్నారన్నమాట. నిజమే. ఏదైనా పూర్తిగా అరికట్టాలంటే మనస్సు దానిమీదికే పోతూ ఉంటుంది. అందువల్ల సాధకుడైన వాడన్నిటికీ మితంగా టయమివ్వాలి'' అన్నారు భగవాన్. భగవద్గీతలో చూడు

శ్లో: నాత్యశ్నతస్తు యోగో-స్తి, నచైకాంత మనశ్నత:
నచాతి స్వప్నశీలస్య జాగ్రతోనైనచార్జున . అ 6. శ్లో.16
శ్లో: యుక్తాహార విహారస్య, యుక్త చేష్టస్య కర్మసు,
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా అ.6. శ్లో. 17

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

వర్తమానంలో జీవించాలి




కాలం మూడు రకాలని అందరికీ తెలుసు. అవి భూత, వర్తమాన, భవిష్యత్తులు. భూత కాలం అంటే జరిగిపోయిన కాలం అని మనకు తెలుసు. వర్తమానం అనుభవిస్తుంటాము. భవిష్యత్తు ఎలా ఉంటుందో మనకు తెలియదు. అయితే ఆ కాలం కూడా ఉందని తెలుసు. కాలక్రమంలో ఎన్నో జరుగుతుంటాయి. సుఖాలు, దుఃఖాలు, కష్టాలు ఎన్నో ఉంటాయి. వర్తమానాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞులు చెబుతుంటారు. ఎందుకంటే భూత, భవిష్యత్తు కాలాలు మన అధీనంలో లేనివి. గతాన్ని గురించి ఇపుడు ఆలోచిస్తే ప్రస్తుతం ఆనందానికి దూరం అవుతాము. గతంలో సుఖం గురించి ఇపుడు తలచుకుంటే అది ఇప్పుడు లేదని దుఃఖం వస్తుంది. గతంలోని దుఃఖం ఇప్పుడు తలచుకుంటే ఎంత కష్టపడిపోయానో అని దుఃఖం వస్తుంది. కాబట్టి గతం ఒక భూతమే. భవిష్యత్తును గురించి ఇప్పుడు ఆలోచించడమెందుకు. ఆ సమయంలో పరిస్థితులు ఎలా ఉంటాయో ఇప్పుడు ఆలోచించినా మళ్ళీ ఆ సమయంలో ఆలోచించాల్సి వస్తుంది. దాని వల్ల ఈ సమయం వ్యర్థమవుతుంది కదా! గతాన్ని పరిశీలించుకుని భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని వర్తమానంలో వ్యవహరించడం తెలివైన పని. వర్తమానంలో జీవించాలి. ఈ క్షణం వ్యర్థం కాకుండా ప్రయత్నించాలి. ఈ క్షణం సద్వినియోగం చేస్తే వచ్చే ప్రతిక్షణం ఉత్తమంగానే ఉంటుంది. ప్రస్తుతాన్ని సద్వినియోగం చేసుకోమని చెప్పేదెందుకంటే ఏదైనా పనిని సమయం ఉన్నా ఎప్పుడో చేద్దామని వాయిదా వేసుకుంటే అది జరగకపోవచ్చు. మృత్యువు నీ జుట్టు పట్టుకుని తీసికెళ్ళడానికి సిద్ధంగా ఉంది కనుక ధర్మం చెయ్యి అని ఒక హితబోధ. అందువల్ల ధర్మం చేయడంలో ఆలస్యం వద్దు అనేది పెద్దల మాట. ఇక్కడ ధర్మాచరణకు సంబంధించి ఒక విషయం గుర్తు చేసుకోవడం ముఖ్యం. ఏదైనా దానం చేయదలచుకున్నపుడు దానిని వెంటనే చేయాలని, ఒక చేతి నుంచి మరో చేతికి మార్చుకునే లోగానే మనసు మారిపోయే ప్రమాదముందని చెబుతారు. అంటే ఎడమ చేత్తో దానం చేయమని కాదు సాధ్యమైనంత త్వరగా చేయమని

కాలం భగవత్స్వరూపం. అందువల్ల కూడా దానిని సద్వినియోగం చేసుకోవాలి. కాలేశ్వరుని పేరుతో శివుడు కొలువై ఉన్న క్షేత్రాలు కూడా ఉన్నాయి. ఇక కాశికాపురాధినాథుడు కాలభైరవుడున్నాడు. పరమాత్మ వలె కాలం అనంతమైనది. దాని ఆద్యంతాలు మనకు తెలియదు. ఆ కాల ప్రవాహంలో కొంత సమయం మాత్రమే మన అస్తిత్వం ఉంటుంది. మనకు ముందు కాలం ఉంది. మన తర్వాత కాలం ఉంటుంది. మానవులు ఉన్నా లేకున్నా కాలం మాత్రం ఉంటుంది. అది నిత్యం. సర్వానికి సాక్షీభూతం.

(డాక్టర్ సివిబి సుబ్రహ్మణ్యంగారి వ్యాసం ఆధారంగా)

పుష్కర ద్వీపం

దధి, మండ సముద్రానికి అవతల పుష్కర ద్వీపము శాఖ ద్వీపమునకు రెట్టింపు వెడల్పుతో వ్యాపించి ఉంటుంది. స్వాదుజల సముద్రముతో చుట్టూ ఆవరించబడి ఉంటుంది. ఈ సముద్రముపై పెద్ద పుష్కరం అనగా పద్మము వ్యాపించి ఉంటుంది. ఇది జ్వాలా శిఖలతో, స్వచ్ఛమైన బంగారు ఆకులతో రక్షతో వ్యాపించి ఉంటుంది. ఈ



పుష్కర ద్వీప ఊహా చిత్రం

ధర్మం-మర్మం



పద్మము చతుర్ముఖ బ్రహ్మకు ఆసనంగా కల్పించబడి ఉంటుంది. ఈ ద్వీపము మధ్యలో ఉన్న మానస సరస్సుకు ఉత్తరముగా మానసరోత్తరము అను పేరుతో పదివేల యోజనముల ఎత్తుతో, అంతే విస్తీర్ణముతో ఒకే పర్వతము ఉంది. ఈ పర్వతమునకు నాలుగు దిక్కులలో ఇంద్రాది నలుగురు లోకపాలకుల పురములు ఉంటాయి. ఈ పర్వతం పైనే సూర్యభగవానుని రథానికి సంవత్సర రూపమైన చక్రము మేరు పర్వతము చుట్టూ తిరుగుతూ దేవతలకు అహోరాత్రము కనిపిస్తుంటుంది.

- డా॥ కందాడై రామానుజాచార్య

భగవద్గీత

నిరంతర భక్తి నియుక్తుడు ఉత్తముడు



అధ్యాయం 7

శ్లోకం 17:

తేషాం జ్ఞానీ నిత్యయుక్త
ఏకభక్తిర్విశిష్యతే।
ప్రియో హి జ్ఞానినోత్యర్థమ్
అహం స చ మమ ప్రియః॥

తాత్పర్యం

వీరిలో సంపూర్ణ జ్ఞానము కలిగి సదా భక్తియుక్తసేవలో నియుక్తుడై ఉండేవాడు అత్యంత ఉత్తముడు. ఎందుకంటే నేనతనికి మిక్కిలి ప్రియుడను, అతడు నాకు మిక్కిలి ప్రియతముడు.

భాష్యం

ఈ నలుగురిలోకి ఎవరైతే భగవద్ జ్ఞానముతో 'నేను భగవంతుని' అని సేవలో నిమగ్నుడవుతాడో అతడు ఉత్తముడు, భగవంతునికి మిక్కిలి ప్రియతముడు. వారందరూ కూడా శుద్ధ భక్తుని సాంగత్యములో క్రమేణా శుద్ధ భక్తిని పాటించవచ్చునేమో గాని, ఇతనికి వేరే భౌతిక కోరికలు లేని కారణముగా అతని సాధన స్థిరంగా కొనసాగుతుంది. భగవంతుని దివ్య స్థితిని ఎరిగి ఉన్న కారణముగా అతడు భౌతిక సాంగత్యముచే ప్రభావితుడు కాక పూర్తి రక్షణతో కొనసాగుతాడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఏసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతి కూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభవ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

కులాసా

చలికాలంలో సైనసైటిస్ ముప్పే



సైనసైటిస్ అంటే ఏమిటి?

సైనసెస్ అంటే ముక్కు చుట్టూ కంటి వెనక భాగం వరకు గాలితో నిండి ఉండే ప్రదేశం. పుర్రెభాగాన్ని తేలికగా ఉంచడానికి, ముక్కు నుంచి పీల్చిన గాలిని తేమగా ఉంచడానికి ఇవి దోహదపడతాయి.

సైనస్ లక్షణాలు ఏమిటి? సైనస్ ఇన్ఫెక్షన్‌కి గురయ్యారా?

రెండు రకాల సైనసైటిస్‌లు ఉన్నాయి. ఒకటి తీవ్రమైన సైనసైటిస్. సర్వసాధారణంగా జలుబు ఉంటుంది. తల, కంటి చుట్టూ భాగంలో భారంగా ఉంటుంది. ముక్కు రంధ్రాలు మూసుకుపోతాయి. శ్లేష్మం బొట్టుబొట్టుగా జారుతూ గొంతు వెనకభాగం నుంచి క్రిందికి దిగుతుంది. దీనివల్ల గొంతు నొప్పి కూడా వస్తుంది.

రెండోది దీర్ఘకాలంగా ఉన్న సైనసైటిస్. ఇది వస్తే మాత్రం ఇన్ఫెక్షన్ ఉంటుంది. నెలల తరబడి కొనసాగే అవకాశం ఉంది. ఒకవేళ ఈ వ్యాధి తగ్గినా మళ్లీ తిరగబెడుతుంది.

సైనస్ ఇన్ఫెక్షన్ ఉంటే ప్రతీసారి యాంటీబయోటిక్స్ వాడాల్సిన అవసరముందా?

తప్పనిసరిగా వాడాల్సిన అవసరం లేదు. లక్షణాల తీవ్రతను బట్టీ ఈఎన్‌టి సర్జన్ యాంటీబయోటిక్స్ కోసం సిఫారసు చేస్తాడు. దీర్ఘకాలికంగా సైనసైటిస్ ఉంటే మాత్రం నాసికా రంధ్రాల ద్వారా స్టెరాయిడ్ స్ప్రే తీసుకుంటారు. కొన్నివారాల్లో లక్షణాలు తగ్గుముఖం పడతాయి. నాసికా రంధ్రాలు శుభ్రపడితే సైనసైటిస్ తగ్గుముఖం పడుతుంది.

నాసికా దూల వల్ల సైనసైటిస్‌కి దారితీస్తుందా?

చాలా కేసుల్లో నాసికాదూల సరిగ్గాలేని కారణంగా సైనసైటిస్ వస్తుంది. నాసికా అలర్జీల వల్ల కూడా సైనసైటిస్‌కి కారణంగా నిలుస్తుంది. నాసికలో ఉన్న మాంసపు కండ పరిమాణాన్ని బట్టి సైనసైటిస్ ఉంటుంది. వీటిని టర్బినేట్స్ అని కూడా పిలుస్తున్నారు.

ఎలాంటి పరీక్షలు అవసరమవుతాయి?

ఈఎన్‌టి సర్జన్ దగ్గరికి వెళితే సైనసైటిస్ సమస్య ఉన్నట్టు గుర్తిస్తే మాత్రం సీటీస్కాన్ కోసం సిఫారసు చేయొచ్చు. దీర్ఘకాలంగా మందులు వాడినప్పటికీ నయం కానప్పుడు ఈ పరీక్ష చేస్తారు. ఇన్ఫెక్షన్ వల్ల ఎటువంటి అవలక్షణాలు కలిగాయో సీటీస్కాన్ ద్వారా వెల్లడవుతుంది.

ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ అంటే ఏమిటి?

ఇది తక్కువ కోతల శస్త్రచికిత్స. ముక్కులోపలి భాగం నుంచి ఈ శస్త్రచికిత్స చేస్తారు. దీనివల్ల ముక్కు వెలుపల ఎటువంటి కోతలు, మరకలు ఉండవు. సైనస్ తెరచుకోవడానికి ఫైన్ ఎండోస్కోప్ వినియోగిస్తారు. దీనివల్ల స్రావాలు నాసికా రంధ్రాల ద్వారా కారిపోతాయి.

సైనస్ శస్త్ర చికిత్స వల్ల ప్రయోజనం ఉందా?

సైనస్ శస్త్రచికిత్స చాలా విజయవంతమయ్యింది. ఎందుకంటే రోగి జీవిత నాణ్యత మరింత పెంచుతుంది. సైనస్ శస్త్రచికిత్స సమర్థవంతంగా ఉండదని సర్వసాధారణ అపోహ. ఇటువంటి వార్త మీరు వినే ఉంటారు. నాసిక రంధ్రాల ద్వారా శ్వాసతీసుకోగలుగుతున్నారు. నాసికారంధ్రాల్లో ఉన్న పూడికలను తొలగిస్తుంది. సైనస్ శస్త్రచికిత్స అన్ని సమస్యలను పరిష్కరించలేదు. అలర్జీలు వంటివి తగ్గకపోవచ్చు. శస్త్రచికిత్సల వల్ల అనారోగ్యానికి గురవుతామని చాలామంది భావిస్తారు. వివిధ బ్యాక్టీరియా కారణంగా ఇన్ఫెక్షన్స్ వస్తుంటాయి. కాబట్టి ఏ శస్త్రచికిత్స అయినా ఇటువంటి సమస్యను పరిష్కరించలేదు. సైనస్ సర్జరీ అయిన తర్వాత కూడా జలుబు, వైరల్ యుఆర్ఐ అనేది మామూలు విషయం.



డాక్టర్ ప్రదీప్‌షింగ్
సీనియర్ కన్సల్టెంట్ అండ్ చీఫ్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈఎన్‌టి, హెడ్ అండ్ నెక్ సర్జరీ
కాంటినెంటల్ హాస్పిటల్స్

కఫ దోషం వల్లే




కఫ దోషం వల్ల సైనసైటిస్ వ్యాధి సంక్రమిస్తుంది. చల్లటి ఆహారాన్ని తీసుకోకూడదు. శీతలపానీయాల జోలికి, మంచు ఉన్న ప్రదేశాలకు వెళ్లకూడదు. చల్లటి నీటితో స్నానం చేయకూడదు. ముఖ్యంగా తలస్నానం పనికిరాదు. పగటి నిద్ర పనికిరాదు. ఏడెనిమిది గంటలకు మించి నిద్రపోకూడదు. నూనె పదార్థాలు, స్వీట్లు, ఉప్పు అధికంగా తీసుకోకూడదు. అరగని పదార్థాలను తీసుకోకూడదు. సీజనల్ పండ్లు తినాలి. దానిమ్మ, నారింజ, బత్తాయి, బొప్పాయి, యాపిల్, పియర్స్ వంటివి ఎక్కువగా తీసుకోవడం మంచిది.

పాలు,చక్కెర, కాఫీ, వేపుడు ఉత్పత్తులు, రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉన్న ఆహారపదార్థాలు తినడం వల్ల సైనసైటిస్ తిరగబెడుతుంది. ఫాస్ట్‌ఫుడ్ జోలికి అస్సలు వెళ్లకూడదు. కార్బోనేటెడ్ డ్రింక్స్, సిగరెట్లు, చాక్లెట్లు, మైదా, లిక్కర్, మాంసం, బ్రెడ్, జంక్ ఫుడ్ తినడం మంచిది కాదు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. నడక కూడా మంచిదే. అల్లంవెల్లుల్లి, ఉల్లిగడ్డలు మన ఆహారంలో భాగం కావాలి. వాత, కఫ దోషాల వల్ల సైనసైటిస్ వస్తుంది కాబట్టి జాగ్రత్తగా ఉండటం మంచిది. ఆహారం వేడిగా లేదా చల్లగా ఉండకూడదు. సులభంగా జీర్ణమయ్యే ఆహారం వేడివేడిగా ఉండాలి. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. సేంద్రీయ ఎరువులతో చేసిన పండ్లు, కూరగాయలు చాలా మంచిది. వంకాయ తినకూడదు. అలాగే అరటిపండు, టమాట, పెరుగు ద్వారాలకు అడ్డుగా నిలుస్తాయి. వేళకు ఆహారం తీసుకోవాలి. ఒకవేళ తీసుకోకపోతే జఠరాగ్ని లోపాలు తలెత్తి జీర్ణంకాదు. దాల్చిన చెక్క, మిరియాలు, పుదీనా, ఉల్లిగడ్డ, తులసి, వెల్లుల్లి, కొత్తిమీర,లవంగం, పసుపు, అల్లం వంటల్లో విరివిగా ఉపయోగించాలి. అలాగే కంటిఅద్దాలు సరిపోయే విధంగా ఉండాలి. ఒకవేళ అద్దాలు మీ ముక్కు రంధ్రాలను పట్టేసినట్లుగా ఉంటే మాత్రం సైనసైటిస్ వ్యాధి తీవ్రమయ్యే అవకాశం ఉంది. సిగరెట్ త్రాగకూడదు. వాయుకాలుష్యం వల్ల ఇది ఎక్కువవుతుంది.



డాక్టర్ బి సంగమేశ్వర్
ఆయుర్వేద వైద్య నిపుణులు
9440065764

హోమియోలో 'సిలీసియా'



సైనసైటిస్ వ్యాధికి హోమియో చికిత్స పరిష్కారం చూపిస్తుంది. శరీరం వ్యాధి నిరోధకశక్తిని తట్టుకునే విధంగా తయారు చేస్తుంది. దీర్ఘకాలికంగా ఉన్న ఈ వ్యాధిని కేవలం కొద్ది రోజుల్లోనే పూర్తిగా నయం చేయవచ్చు.

సిలిసియా

సిలిసియా అనే హోమియో మందువల్ల సైనస్ ఇన్ఫెక్షన్‌లను దూరం చేసుకోవచ్చు. అంతేకాదు తలనొప్పిని కూడా దూరం చేసుకోవచ్చు.

బెల్లడోనా

హోమియోపతి మందుల్లో బెల్లడోనా కూడా బాగా పనిచేస్తుంది. సైనస్ వల్ల వచ్చే తలనొప్పిని ఇది దూరం చేస్తుంది. తీవ్రమైన తలనొప్పి వచ్చినప్పుడు దీనిని వాడవచ్చు. తలపట్టేసినట్లుగా అనిపించినప్పుడు వినియోగించవచ్చు. ముఖం వాచినప్పుడు బాగా వేడి ఉన్నప్పుడు కూడా ఇది పనిచేస్తుంది. సైనస్ కారణంగా గొంతునొప్పి, దగ్గు వస్తే ఇది ఉపయోగకారి.

కాలిబిక్రోమ్ మందు కూడా చక్కగా పనిచేస్తుంది. సైనసైటిస్ వల్ల గొంతు వెనకభాగం నుంచి స్రావాలు క్రిందికి జారినప్పుడు ఈ మందును వాడాలి. ఈ స్రావాలు మందంగా, పసుపువర్ణంలో ఉంటాయి.

శరీరతత్వాన్నిబట్టీ ఈ చికిత్స అందించాల్సి ఉంటుంది.



డాక్టర్ టి. గీత
హోమియోవైద్యనిపుణులు
8019109109

ఐదువేల ఏళ్లక్రితమే ఆక్యుపంక్చర్



సైనసైటిస్ వ్యాధికి ఐదువేల ఏళ్ల క్రితమే చికిత్స ఉన్నట్టు గుర్తించారు. చైనీయులు ఈ చికిత్స గూర్చి కూలకశంగా తెలుసుకున్నారు. రక్తప్రసరణ ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండటానికి ఆక్యుపంక్చర్ దోహదపడుతుంది. సైనస్ సమస్యలు రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఊపిరితిత్తుల వేడి వల్ల కూడా ఇది వస్తుంది. సరైన ఆకుపాయింట్స్ మీద ఒత్తిడి ద్వారా అసలు విషయాలను ఆక్యుపంక్చరిస్ట్ తెలుసుకుంటాడు. ఇలా చేయడం వల్ల వ్యాధి ఎందుకు ఎలా వచ్చిందో కూడా తెలుసుకోవచ్చు.



హీలర్ కె. దిలీప్‌కుమార్
క్యాతన్ ఆక్యుపంక్చర్
హెల్త్ రీసెర్చ్ అండ్ సొసైటీ
హైదరాబాద్, విజయవాడ
9848828808

ఆస్థమాకి విరుగుడు

ఇన్‌హేలేషన్ థెరపీ

త్రన మెరిసే చిరునవ్వుతో 14 ఏళ్ల రియా ఇంటికి వేగంగా పరిగెత్తి వచ్చి డాన్స్ పోటీలో గెలుచుకున్న ట్రోఫీని చూపించింది. కొద్దినెలల ముందు ఆమెకి దాదాపుగా ఇది అసాధ్యమే. ఆమె ఊపిరితిత్తులపై కొద్దిపాటి ఒత్తిడి వల్ల ఊపిరితీసుకోవటానికి కష్టపడేలా చేస్తుంది.

ఆమె చాలాకాలంగా నోటి ద్వారా మందులు తీసుకుంటోంది. ఇతర పిల్లలకంటే తక్కువ శక్తి ఉంది. కొద్దిగా శారీరక శ్రమకి గురైనా కూడా ఆమెకి దగ్గు. పిల్లికూతలు ప్రారంభమవుతాయి. ఇంకా అధ్వాన్నం ఏమంటే మందుల వల్ల కడుపులో పుండ్లు, మానసిక ఒత్తిడి, కండరాల బలహీనత, చర్మం కందిపోవటం వంటి దుష్ప్రభావాలు సంభవించాయి. ఆమె సాధారణ జీవితానికి అడ్డంకులు వాటిల్లాయి. ఇప్పుడు ఆమె జీవిత నాణ్యత ఎంతగానో మెరుగుపడింది. నోటి ద్వారా తీసుకునే మందులు కాకుండా రియా ఇన్‌హేలేషన్ థెరపీ తీసుకుంది. దీర్ఘకాలంలో సురక్షితమైన, మరింత ప్రభావవంతమైన చికిత్సగా మారింది. డాన్స్ అంటే రియాకి ఎంతో ఇష్టం. ఇప్పుడు ఆమె ఎంతో ఆరోగ్యంగా ఉంది. ఆస్థమా తిరగబెడుతుందనే భయం లేకుండా స్వేచ్ఛగా తిరుగుతోంది.

ఈ పరిస్థితిలో పోరాడుతున్న రియా వంటి వారు చాలామందే ఉన్నారు. అయితే సరైన చికిత్సా విధానంతో సక్రమమైన నిర్వహణతో ఆస్థమా, సీఓపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మోనరీ డిసీజెస్), సిగరెట్ తాగటం, అలెర్జిక్ రైనిటిస్ వంటి శ్వాసకోశ వ్యాధుల నియంత్రణ సులభం.

ఇన్‌హేల్డ్ కార్టికోస్టిరాయిడ్ థెరపీ (ఐసీటీ) అనేది ఆస్థమాని నియంత్రించడానికి కీలకమైనది. ఏదైనా చికిత్సా విధానంలో ఉత్తమంగా మందులు అందచేయటం ప్రధానం.

మందుల వల్ల వాపుకిగురైన ఊపిరితిత్తులకి చికిత్స చేయడం అనివార్యం.

ఆస్థమా వ్యాధితో బాధపడే పిల్లలతో సహా అన్ని వయస్సుల వారికి ఐసిటి ఉపయోగించవచ్చని నేషనల్ ఆస్థమా ఎడ్యుకేషన్ అండ్ ప్రివెన్షన్ ప్రోగ్రాం సిఫారసు చేసింది.

ఆస్తమా అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిస్తున్న దీర్ఘకాలిక వ్యాధి. దీనితో బాధపడే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. డబ్ల్యూ హెచ్ ఓ ఫ్యాక్ట్ షీట్ ఎన్ 206 ప్రకారం అంతర్జాతీయంగా సుమారు 100, 150 మిలియన్ ప్రజలు



ఆస్థమాతో బాధపడుతున్నారు. భారతదేశంలో ఈ సంఖ్య 15 నుంచి 20 మిలియన్‌లకి చేరుకుంది.

ఆస్థమాని నిర్వహించటంలో ఇన్ హేల్డ్ కార్టికోస్టిరాయిడ్స్ ప్రధానమైనవి.


దురదృష్టవశాత్తు చైతన్యం లేకపోవటం వల్ల చాలామంది ప్రజలు ఈ థెరపీ తీసుకోవడానికి ఇష్టపడటం లేదు. చాలామందికి స్టిరాయిడ్ అనే పదం ఉండటం వల్ల ప్రతికూలంగా ఆలోచిస్తున్నారు. ఈ పదం కండరాల్ని నిర్మిస్తుంది అనే భావన కలిగిస్తోంది. వారు కార్టికోస్టిరాయిడ్స్‌ని అనబోలిక్ స్టిరాయిడ్స్‌గా భావించి గందరగోళానికి గురవుతున్నారు.

కార్టికోస్టిరాయిడ్స్ అనబోలిక్ స్టిరాయిడ్స్ ఒకటి కాదు. అర్థం చేసుకోవడం ప్రధానం. కండరాలను పెంచుకోవడానికి కొంతమంది అథ్లెట్స్ అనధికారికంగా అనబోలిక్ స్టిరాయిడ్స్ ఉపయోగిస్తారు. కార్టికోస్టిరాయిడ్స్‌ని ఆస్థమా చికిత్సలో ఉపయోగిస్తారు. అవి కండరాలను నిర్మించలేవు. మీ శరీరం సహజంగా ఉత్పత్తి చేసే హార్మోన్స్ ఇవి. డాక్టర్ మీకు ఇన్‌హేల్డ్ కార్టికోస్టిరాయిడ్స్ సూచిస్తే వాచిన మీ ఊపిరితిత్తుల్ని శాంతపరచడానికి చిన్న పరిమాణాల్లో ఇదే హార్మోన్ ఇస్తారు. కార్టికో స్టిరాయిడ్స్ ఎందరో జీవితాల్ని కాపాడే ఔషధాలు. ఎందుకంటే అవి ఊపిరితిత్తుల వాపుని నివారించడంలో లేదా ఆ ప్రక్రియను తిప్పి కొట్టడంలో సహాయపడతాయి.



డాక్టర్ వంశీధర్ ఖేదార్
కన్సల్టెంట్
పల్మోనాలజిస్ట్
లోటస్ చిల్డ్రన్ హాస్పిటల్

సీఓపీడీ ప్రాణాంతక వ్యాధి



వేగంగా కొట్టుకుంటున్న గుండెతో సుశీల్‌జైన్ తన అపార్ట్‌మెంట్ తలుపు వద్దకు చేరుకున్నాడు. తనకు క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మోనరీ డిజార్డర్(సీఓపీడీ) ఉందని నిర్ధారణ జరిగిన నాటి నుంచి తన ఆరోగ్యం ఎంతక్షీణించిందో గ్రహించాడు. సీఓపీడీ ఊపిరితిత్తుల లోపాల వాయుమార్గాల్ని దెబ్బతీసే వ్యాధి. ఈ ఊపిరితిత్తుల వ్యాధి వల్ల సరిగ్గా ఊపిరి అందకపోయేది. నిర్విరామంగా దగ్గు వచ్చేది. ప్రతీ శ్వాస ఎంతో కష్టంగా ఉండేది. శ్వాస తీసుకునే సమయంలో కళ్లు కూడా వెడల్పయ్యేవి. ఈ వ్యాధి దైనందిన జీవితం మీద ఎంతో కొంత ప్రభావం చూపిస్తుంది. సాధారణ సంభాషణ కూడా కష్టంగా ఉంటుంది. ఎందుకంటే ఈ వ్యాధి ఉన్న వ్యక్తి ఆలోచించేది తదుపరి శ్వాస గురించి మాత్రమే. సుశీల్‌కి మొదట ఈ లక్షణాలు కనిపించినప్పుడు వాతావరణంలో కాలుష్యం,పొగత్రాగడం వల్ల వచ్చే దగ్గుగా భావించాడు. కానీ క్రమేణా ఈ వ్యాధి మరింత ప్రమాదకరంగా మారింది. ఎక్కువగా దగ్గినప్పుడు అతను శక్తివంతమైన స్టిరాయిడ్స్ కూడా తీసుకోవాల్సి వచ్చింది. ముఖం వాపు, ఎముకల బలహీనత, అధిక రక్తపోటు వంటి వివిధ దుష్ప్రభావాల్ని కలిగించింది. సుశీల్ అనుభవిస్తున్న భాదల్ని ఈ ప్రపంచంలో ఎంతోమంది ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.సీఓపీడీ దాదాపు 210 మిలియన్‌ప్రజలపై ప్రభావం చూపిస్తోంది. భారతదేశంలో ఈ రుగ్మతతో అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉంది. 2016లో మన దేశంలో 22 మిలియన్ మంది ఉన్నారు. ఒక దశాబ్దం క్రితం సీఓపీడీ మరణానికి అయిదో ప్రధాన కారణంగా నిలిచింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా మరణానికి నాలుగో అతిపెద్ద కారణంగా అంచనావేయబడుతోంది. ప్రజల్లో చైతన్యం లేకపోవడం, ప్రారంభంలో లక్షణాల్ని నిర్లక్ష్యం చేయడం, వ్యాధి నిర్ధారణలో ఆలస్యం, ప్రభావవంతమైన వైద్య సహాయంఅందకపోవడం వంటి కారణాల వల్ల ఈ రుగ్మత మరింత విస్తృతమవుతోంది. సీఓపీడీ నిర్ధారించడానికి అత్యంత సాధారణంగా ఉపయోగించే శ్వాసపరీక్షల్లో ఒకటి స్పైరోమెట్రీ. ఇది బాధరహితమైన పరీక్ష. ఛాతీ ఎక్స్‌రే, రక్తంలో ప్రాణవాయువు శాతం కొలిచే పరీక్షలుంటాయి. సరైన సమయంలో రుగ్మతను గుర్తించడానికి ఈ పరీక్షలు దోహదపడతాయి.

పొగత్రాగడాన్ని వదిలేయడం, మంచి జీవనశైలి అలవాట్లు, ఇన్‌హేల్డ్ కార్టికోస్టిరాయిడ్స్ వంటి చికిత్సలను సీఓపీడీ ఉన్నవారికి అందించాలి. దీనివల్ల జీవిత నాణ్యత మరింత పెరుగుతుంది.

ఇన్‌హేల్డ్ కార్టికోస్టిరాయిడ్స్ నేరుగా దెబ్బతిన్న వాయునాళాల్ని చేరుకుంటాయి. నోటిద్వారా తీసుకునే కార్టికోస్టిరాయిడ్స్ మొదట రక్తంలో కలిసిపోతాయి. తర్వాత వివిధ అవయవాల ద్వారా ప్రభావానికి గురైె వాయుమార్గాల్ని చేరుకుంటాయి. ఈ ప్రక్రియలో మందు అవసరం లేనిచోట శరీరంలో వివిధ భాగాల ద్వారా మందు గ్రహించబడుతుంది. ఇది అంతర్ప్రవాహ దుష్ప్రభావాల్ని కలిగిస్తుంది.



డాక్టర్ బాలరాజు
మేనేజింగ్ డైరెక్టర్
ది చెస్ట్ క్లినిక్
గాయత్రి నర్సింగ్ హోం



భాగమతి ప్రీ రిలీజ్ వేడుక

అందాల తార అనుష్క శెట్టి నటిస్తున్న తాజా చిత్రం భాగమతి. థ్రిల్లర్ కథతో దర్శకుడు అశోక్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు మిగతా మూడు దక్షిణాది భాషల్లో భాగమతి తెరపైకి రానుంది. జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహించారు. నిర్మాత అల్లు అరవింద్, దర్శకులు మారుతి, రాధాకృష్ణ, మేర్లపాక గాంధీ, కథానాయకుడు నాని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అనుష్క మాట్లాడుతూ.... భాగమతి కథను 2012లో విన్నాను. అప్పటికే బాహుబలి, సింగం 3 చిత్రాలతో నా డేట్స్ ఖాళీగా లేవు. కథ నచ్చినా చేయలేని పరిస్థితి ఏర్పడింది. నేను చేయలేనని చెప్పినా...నా కోసం నాలుగేళ్లు వేచి చూశారు. నా హృదయానికి దగ్గరైన చిత్రమిది. ఇది నా చిత్రమే కాదు....మిగతా ప్రధాన నటీనటులు కథలో కీలకంగా ఉంటారు. వాళ్ల నట ప్రతిభ భాగమతిని మరో స్థాయికి తీసుకెళ్లింది. అని చెప్పింది. దర్శకుడు అశోక్ మాట్లాడుతూ....భాగమతి కథను ముందు ప్రభాస్ గారికి చెప్పాను. తనతో పాటు తన చుట్టూ ఉన్న అందరూ బాగుండాలని కోరుకునే వ్యక్తి అతను. ప్రభాస్ వల్లే భాగమతి ఇక్కడిదాకా వచ్చింది. అనుష్క ఏ పాత్రలోనైనా ఇమిడిపోగల నాయిక. అరుంధతి, రుద్రమదేవి, వేదంలో సరోజ, ఇప్పుడు భాగమతి... ఇలా విభిన్నమైన పాత్రల్లో ఒదిగిపోతుంది. అనుష్క ఒక శక్తి. సినిమా కోసం ఆమె తీసుకునే శ్రమ అద్భుతం. భాగమతి కోసం 45 రోజులు దుమ్ములో నటించారు. ఇక నిర్మాతలు వంశీ, ప్రమోద్, విక్కీ సినిమా కోసం ఎంతైనా శ్రమిస్తారు. ఐదేళ్లుగా ఈ నిర్మాతలతో ప్రయాణం చేస్తున్నాను. ఈ కథలో తామూ ఓ పాత్ర చేస్తున్నంత శ్రద్ధగా ప్రధాన సాంకేతిక నిపుణులు పనిచేశారు అన్నారు.

నాని మాట్లాడుతూ....భాగమతి ఇంటర్వెల్ చూసి అద్భుతంగా ఉందంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి చెప్పారు. ఈ ఏడాది అన్ని పురస్కారాలు అనుష్కకే దక్కుతాయని చెప్పారు. నాతో పిల్ల జమీందార్ రూపొందించిన అశోక్‌కు ఆ సినిమా పేరు ఇంటిపేరైంది. ఇకపై భాగమతి అశోక్‌గా పిలుస్తారు. అన్నారు. ఈ లోగా ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. గతంలో అనుష్క పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన చిత్ర యూనిట్ తాజాగా..మరో పోస్టర్‌ను బయటకు తీసుకొచ్చారు.

దర్శకుడు అశోక్ భాగమతి గురించి మాట్లాడుతూ...ఈ చిత్రం కోసం అనుష్క 18 కిలోల బరువు తగ్గింది. సినిమా అంతా అనుష్క పాత్ర చుట్టూనే తిరుగుతుంది. అయితే అనేక కీలక పాత్రలు కథలో ఉంటాయి. టైటిల్‌ను బట్టి చారిత్రక చిత్రం అనుకుంటారు గానీ ఇదొక మోడరన్ డే థ్రిల్లర్. నిజ జీవిత పాత్రల నుంచి స్ఫూర్తి పొంది ఈ కథను రాశాను. ఇందులో రెండు విధాలుగా అనుష్క పాత్ర ఉంటుంది. ఆమెతో పాటు మిగతా క్యారెక్టర్‌లను ప్రేక్షకులు తమతో పోల్చుకునేలా ఉంటాయి. అన్నారు. భాగమతిలో అనుష్క స్నేహితుడు ప్రభాస్ ఓ అతిథి పాత్రలో నటిస్తారని ఊహాగానాలు వినిపించాయి. తాజాగా విడుదల తేదీ దగ్గరకు వస్తుండటంతో...ఇందులో నిజం లేదని తెలుస్తోంది.

నువ్వు నాకు చాలా చాలా స్పెషల్



చాలా మంది సెలబ్రిటీలు వృత్తిపరంగా బిజీగా ఉంటూ వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతుంటారు. కెరీర్ ముఖ్యమని భావిస్తారు. కానీ సూపర్‌స్టార్ మహేష్‌బాబు కాస్త డిఫరెంట్. వృత్తితో పాటుగా కుటుంబానికి ప్రాధాన్యతనిస్తారు. తరచుగా కుటుంబంతో కలిసి విదేశీయాత్రలు చేస్తుంటారు. దీనివల్ల కుటుంబంతో మరింత ఎక్కువగా గడపవచ్చనేది ఆయన అభిప్రాయంలా ఉంది.

సోమవారం మహేష్ సతీమణి నమ్రత పుట్టినరోజు. వీరిది ప్రేమవివాహం అనే విషయం తెలిసిందే. తన భార్యకు బర్త్‌డే గ్రీటింగ్ చెబుతూ ఆమెపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. నువ్వు నాకు ఎందుకు చాలా చాలా స్పెషల్ అని చెప్పేందుకు ఇది మరో కారణం.... నా ప్రేయసి... నా బెస్ట్‌ఫ్రెండ్.. నా భార్య అయిన నీకు పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ ట్వీట్ చేశారు మహేష్. ఒక్క వ్యాఖ్యంలోనే తన ప్రేమను చాటుకున్నారు. అలాగే నమ్రత, కొడుకు గౌతమ్, కుమార్తె సితారతో కలిసి తను దిగిన ఫోటోను మహేష్ షేర్ చేశారు.

దైవసన్నిధానం చైర్మన్‌గా మోహన్‌బాబు



హైదరాబాద్ ఫిలింనగర్ దైవసన్నిధానం చైర్మన్‌గా మోహన్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. శ్రీ శారదా పీఠం అధిపతి శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారు మోహన్‌బాబుతో పాటు 12 మంది పాలక మండలి సభ్యులను ప్రమాణం స్వీకారం చేయించారు. మోహన్‌బాబు చైర్మన్‌గా నియమితులవగా....పాలక మండలి సభ్యులుగా గిరిబాబు, పరుచూరి గోపాలకృష్ణ కృష్ణంరాజు సతీమణి శ్యామల, చిరంజీవి సతీమణి సురేఖ, చాముండేశ్వరీనాథ్, వి. రామ్ ప్రసాద్ ఎంపికయ్యారు. దైవసన్నిధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సుబ్బిరామి రెడ్డి, రాజమండ్రి ఎంపీ మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ...గుడికి చైర్మన్ కావాలని ఎప్పుడూ అనుకోలేదు. మా విద్యా సంస్థలు, నటిస్తున్న, నిర్మిస్తున్న చిత్రాలతోనే తీరిక లేకుండా ఉంది. ప్రత్యేకంగా ఈ బాధ్యతలు ఎందుకు అనుకున్నాను. సుబ్బిరామి రెడ్డి గారి ద్వారా దైవుడే ఈ పదవికి పిలిపించాడని అనిపించింది. సన్నిధానంలోని పద్దెనిమిది దేవాలయాల దేవుళ్ల ఆశీస్సులతో మంచి కార్యక్రమాలు చేపడతానని ఆశిస్తున్నాను. దేవాలయాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి ప్రథమ కర్తవ్యం. బ్రాహ్మణోత్తములకు నా హృదయ పూర్వక నమస్కారాలు. ఎవరి పని వాళ్లు చేసుకుంటే అన్ని సక్రమంగా జరుగుతాయి. మేము ఇదే పద్ధతిలో విద్యా సంస్థలు నడుపుతున్నాము. దేవుడి డబ్బు పైసా తీసుకోకుండా...అవసరమైతే నా సొంత ఖర్చులతో ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాను. అన్నారు.



విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం

- జి నాగేశ్వర రెడ్డి

హాస్య చిత్రాలను రూపొందించి విజయాలు అందుకున్నారు దర్శకులు జి నాగేశ్వర రెడ్డి. ఇదే తరహా కథతో ఆయన దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం ఆచారి అమెరికా యాత్ర. మంచు విష్ణు, ప్రగ్యా జైశ్వాల్ జంటగా నటించారు. బ్రహ్మానందం మరో కీలక పాత్రను పోషించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఆచారి అమెరికా యాత్ర త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు జి నాగేశ్వర రెడ్డి చిత్ర విశేషాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ...మంచు విష్ణు, నేను కలిసి చేసిన గత రెండు చిత్రాలు దేనికైనా రెడీ, ఈడో రకం ఆడో రకం మంచి విజయాలు సాధించాయి. మాది హిట్ కాంబినేషన్‌గా పేరు తెచ్చుకుంది. ఆచారి అమెరికా యాత్ర కథను మూడేళ్ల కిందట మల్లాది గారు రాశారు. ఆ కథను పీడీ ప్రసాద్, నిర్మాత ఎంఎల్ కుమార్ చౌదరికి చెప్పారు. నేను మంచు విష్ణుతో మరో కథతో సినిమా చేద్దామనుకున్నాను. అయితే నిర్మాత ఈ కథ వినండి బాగుందని చెప్పారు. కథ విన్న నాకు నచ్చింది. ఇందులో హాస్యంతో పాటు అన్ని రకాల భావోద్వేగాలు ఉన్నాయనిపించింది. ఓ అమ్మాయిని కాపాడేందుకు బ్రాహ్మణ కుటుంబమంతా ప్రయత్నిస్తుంది. ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొని ఆ యువతిని వీళ్లంతా ఎలా కాపాడారన్నది కథాంశం. బ్రాహ్మణుల ఇతివృత్తంతో చేసిన గత చిత్రాలు కొన్ని వివాదాలకు కారణమయ్యాయి. మేము దేనికైనా రెడీ చేయకముందే...చాలా చిత్రాల్లో బ్రాహ్మణులను చులకన చేస్తూ చిత్రాలు రూపొందాయి. కానీ మా సినిమాకే ఎక్కువ వివాదాలు ఎదురయ్యాయి. ఈ సారి అలాంటి విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. సినిమా చూశాక బ్రాహ్మణులు గొప్ప అనుభూతి పొందుతారు. పతాక సన్నివేశాల్లో బ్రాహ్మణుల ఖ్యాతిని చెబుతూ సంభాషణలు ఉంటాయి. మంచు విష్ణుతో త్వరలోనే మరో సినిమా చేయబోతున్నాను. అన్ని చిత్రాల్లో హాస్యం ఉంటుంది. చిరంజీవి లాంటి మెగాస్టార్ కూడా కామెడీ చిత్రాలు చేశారు. హాస్య చిత్రాల దర్శకులు స్టార్ హీరోలతో సినిమాలు చేయలేరు అనేది సరికాదు.అన్నారు.



భావన ప్రేమ వివాహం

నటి భావన ప్రేమ, పెళ్లి గురించి కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రచారానికి ఫులిస్టాప్ పడింది. ప్రియుడు నవీన్‌తో భావన పెళ్లి జరిగింది. సోమవారం కేరళలోని త్రిసూర్‌లో జంట ఒక్కటయింది.

మళయాలరంగంలో కెరీర్ ప్రారంభించిన భావన ఆ తర్వాత దక్షిణాది భాషల్లో నటించింది. తెలుగులో మహాత్మ, ఒంటరి చిత్రాల్లో నటించింది. తన కెరీర్‌లో సుమారు 70 చిత్రాల్లో నటించిన భావన కన్నడ సినిమాలో నటిస్తున్నపుడు నవీన్ పరిచయం అయ్యారు. ఆయన నిర్మాత కూడా. అప్పుడే వీరిద్దరు ప్రేమలో పడ్డారు. కుటుంబపెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు.



నవీన్, భావన

తొలి అంతరిక్ష చిత్రం

జయం రవి, నివేదా పేతురాజ్ జంటగా నటించిన తమిళ చిత్రం టిక్ టిక్ టిక్. దర్శకుడు శక్తి సౌందర్ రాజన్ ఈ చిత్రాన్ని రూపొందించారు. భారతీయ వెండితెరపై తొలి అంతరిక్ష చిత్రంగా ఈ సినిమా చరిత్రకెక్కింది. టిక్ టిక్ టిక్ సినిమాను శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వరా ఫిలింస్ తెలుగులోకి తీసుకొస్తోంది. చదలవాడ పద్మావతి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న టిక్ టిక్ టిక్ చిత్ర విశేషాలను యూనిట్ తెలిపారు. నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ...ఇటీవల విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి వాళ్లు బాహుబలి సినిమా చూశామని చెప్పారు. మన సినిమా ఖండాలు దాటిందనే సంతోషం కలిగింది. ఇప్పటికీ హాలీవుడ్ చిత్రాలంటే మనకు ఎంతో ఇష్టం. ఆ స్థాయిలో రూపొందించిన చిత్రమే టిక్ టిక్ టిక్. ఇంతకు ముందు మేము విడుదల చేసిన బిచ్చగాడులో ఉన్న భావోద్వేగాలు ఈ చిత్రంలోనూ ఉంటాయి. ఆ సెంటిమెంట్ నచ్చే సినిమాను తీసుకున్నాం. అన్నారు. జయం రవి మాట్లాడుతూ... ఈ నిర్మాణ సంస్థ సినిమాలకు బాగా ప్రచారం చేస్తారని తెలిసి వాళ్లను అభినందించేందుకు ఇక్కడికి వచ్చాను. మన దేశంలో తొలి అంతరిక్ష చిత్రమిది. ఈ తరహా చిత్రాలు రూపొందించడం సులువు కాదు. అంతరిక్ష చిత్రాల్లో ప్రతి సన్నివేశానికి ఎంతో శ్రమించాలి. గతంలో వచ్చిన స్పేస్ చిత్రాలకు భిన్నంగా అంతకంటే బాగా రూపొందించాలి. మా అదృష్టం కొద్దీ గొప్ప నిర్మాణ సంస్థ దొరికింది. విభిన్నమైన సినిమాలు చేయాలంటే...ప్రతికూల అంశాలను సానుకూలంగా తీసుకోవాలి. నేనదే చేస్తున్నా. అన్నారు.

ఈ కార్యక్రమంలో చదలవాడ లక్ష్మణ్, దర్శకులు అజయ్, అల్లాణి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



జయం రవి

చెప్పుకోవడం మంచిదే

ఉన్నది చెప్పుకుంటే గొప్పంటారు గానీ...చెప్పుకుంటేనే కదా అందిరికీ తెలిసేది. నేను అద్భుతాలు చేయగలను అని మనసులో అనుకుంటే...అది అక్కడే ఆగిపోతుంది. ఎవరి గురించి వాళ్లు చెప్పుకోవడం అనేది రాజకీయాల తర్వాత ఎక్కువగా చిత్ర పరిశ్రమకు పనికొస్తుంది. ఇదే కావాల్సిన ప్రచారాన్ని కల్పిస్తుంటుంది. ఇందుకు ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు బాగా పనికొస్తున్నాయి. సోషల్ మీడియాలో నిత్యం తన ఫొటోలు పెట్టడం పని లేని వాళ్లు చేసే పని అనుకుంటారు గానీ...ఈ పోస్టులు బెంగళూరు భామ పూజా హెగ్డేకు ఓ సినిమానే తెచ్చి పెట్టాయి. ట్విట్టర్‌లో ఎప్పుడూ కనిపించే పూజా..తన ఫిట్‌నెస్‌కు సంబంధించిన పోస్టులు పెడుతుంటుంది. వీటిలో ఆమె అసాధారణ ఫోజులూ ఉంటాయి. శారీరకంగా ధృడంగా ఉండే పూజా...పలు రకాల పోరాట విద్యలు నేర్చుకుంది. వీటిలో ఆధునిక, సంప్రదాయ విద్యలున్నాయి. ఇక వీటి గురించి తెలుసుకున్న బాలీవుడ్ దర్శకులు మిలప్ జవేరి రూపొందిస్తున్న తాజా చిత్రంలో ఎంపికచేశారు. ఇందులో జాన్ అబ్రహాం ప్రధాన పాత్ర పోషిస్తుండగా...సమానమైన పాత్రలోనే పూజా కనిపించనుంది. ఈ చిత్రంలో నాయిక పోరాట సన్నివేశాలు చేస్తుంటుంది. వీటిలో మెప్పించాలంటే ఫిట్‌నెస్ ఉండాలని భావించిన దర్శకులు పూజాను తీసుకున్నారు. దీంతో తను క్రమం తప్పకుండా సామాజిక మాధ్యమాల్లో ఉండటం వృథాగా పోలేదని సంతోషపడుతోందీ భామ. ప్రస్తుతం బెల్లంకొండ శ్రీనివాస్‌తో సాక్ష్యం అనే చిత్రంలో నటిస్తున్న పూజా, రంగస్థలంలో ప్రత్యేక గీతంలో కనిపించనుంది. బాలీవుడ్‌లో రేస్ 3 సినిమాలో నటిస్తోంది.